Dwaraka

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్య మాసం, తిథి: బహుళ పంచమి రా. 10.50 వరకు, అనంతరం షష్ఠి; నక్షత్రం: మఖ ఉ. 7.50 వరకు, అనంతరం పుబ్బ; అమృతకాలం: రా. 1.10 నుండి 2.35 వరకు; వర్జ్యం: మ. 3.36 నుండి 5.09 వరకు; దుర్ముహూర్తం: ఉ. 6.00 నుండి 7.36 వరకు; రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు



సంపుటి:56 . సంచిక:266 . శనివారం 6 జనవరి 2018 . హైదరాబాద్ * పేజీలు:12+4 . వెల: 5.00 . Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

SBI

మినిమం బ్యాలన్స్ మూడు వేలు కాదు

ఇక వెయ్యే

ఫెనాల్టీ చార్జీలు కూడా తగ్గింపు? • ఎస్‌బిఐ పరిశీలనలో మార్పులు 6లో



29నుంచి పార్లమెంట్

ఫిబ్రవరి 1న బడ్జెట్ 11లో

పెట్టుబడి రాయితీ పథకం అమల్లో చిక్కులకు కొత్త పరిష్కారం...

కిసాన్ గిఫ్ట్ కార్డులు!

వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల సూచనప్రాయ నిర్ణయం

త్వరలో కేబినెట్ సబ్‌కమిటీలో చర్చ

ఆ తర్వాత సీఎం వద్ద తుదినిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కష్ట, నష్టాల్లో ఉన్న అన్నదాతలకు ప్రభుత్వం తరపున అందించే పెట్టుబడి మద్దతు పథకంలో కిసాన్ గిఫ్ట్ కార్డుల ద్వారా రాయితీ మొత్తాన్ని బట్వాడా చేయాలన్న కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. బ్యాంకు ఖాతాల్లో జమచేయడం, చెక్కులు, డీడీల ద్వారా లబ్ధి చేకూర్చడం, గ్రామ రైతు సమన్వయ సమితుల ద్వారా ఆ మొత్తాన్ని పంచడం లాంటి అనేక అంశాలు పరిశీలనలో ఉన్నప్పటికీ, అవేవీ సాధ్యపడే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం రుణ విముక్తి పథకాన్ని విజయవంతంగా పూర్తి చేసినప్పటికీ, గ్రామీణ, వాణిజ్య, జాతీయ, సహకార బ్యాంకుల్లో దాదాపు ప్రతి రైతు కుటుంబానికి ఎంతోకొంత అప్పు మిగిలి ఉంది. ఆ ఖాతాల్లో పెట్టుబడి రాయితీ మొత్తాలను జమచేస్తే అన్నదాతల అవసరాలు తీర్చే అవకాశాలు లేవు. ఈ పరిస్థితుల్లో గిఫ్ట్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తే సమస్యలు ఉండవన్న విషయాన్ని గుర్తించారు. అన్నదాతలు తమ అవసరాలకు తగ్గట్లుగా సంబంధిత మొత్తాన్ని ఏ ఏటీఎం సెంటర్ నుంచైనా విత్‌డ్రా చేసుకోవచ్చు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచే ప్రభుత్వం ప్రారంభించనున్న పెట్టుబడి రాయితీ పథకం 3వ పేజీలో...



మూసారాంబాగ్‌లో షటిల్ కోర్టుకు మంత్రి కేటీఆర్ ప్రారంభోత్సవం

రైతన్నకు అన్నివిధాల మద్దతు

కొంత సాధించాం.. ఇంకెంతో ఉంది



• ఈ ఖరీఫ్ నుంచే వరి, మొక్కజొన్న పంటలకు రూ.2వేల చొప్పున మద్దతు ధర • సీఎం కేసీఆర్ కీలక నిర్ణయాలు • ప్రగతి భవన్‌లో రోజంతా సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి, పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు ఆదేశాలిచ్చారు. ఇప్పటివరకు వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడంలో కొంత పురోగతి సాధించామని, మున్ముందు మరెంతో సాధించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. కష్టనష్టాల్లో అన్నదాతల్లో ధైర్యం నింపాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై 3వ పేజీలో...

నీటి కష్టాలకిక చరమగీతం

3 నెలల్లోగా అందుబాటులోకి రిజర్వాయర్లు

ఇంటింటికీ నీటి సరఫరా మా లక్ష్యం

గడువుకన్నా ముందే నీళ్లిస్తున్నాం

త్వరలో బస్తీ దవాఖానాలకు శ్రీకారం

పనిచేసే వారికే ప్రజలు పట్టం: కేటీఆర్

2లో

అది ఇసుక ట్రాక్టర్ కాదు

అతను వీఆర్‌ఏ కాదు


గడ్డాలు పెంచితే అధికారంలోకి రారు

కాంగ్రెస్ దుష్ప్రచారాలను ప్రజలు పట్టించుకోరు

తెరాసలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పిన మంత్రి కేటీఆర్

పోలవరానికి తొలగిన అడ్డంకులు

కాఫర్ డ్యాంకు ఓకే 10లో



చంద్రబాబుతో భేటీకి

మోడీ అంగీకారం 10

సమస్యల పరిష్కారానికి హామీ



దయ చూపండి శిక్ష తగ్గించండి 11లో

జడ్జికి లాలూ వేడుకోలు

రోగమొకటైతే... మందొకటా?!

జిల్లా ఆసుపత్రులకు ప్రయివేటు దెబ్బ!

ఎన్ఎంసీ చట్టమొస్తే ప్రభుత్వాసుపత్రులకు దుర్గతే

డాక్టర్ల కొరతకు హోమియో వైద్యులు పరిష్కారమా?

నైపుణ్య శిక్షణకు వసతులేవి?

సీట్లకు వైద్య సేవలకు లింకు సరికాదు

ప్రభుత్వాసుపత్రుల్లో పెరుగుతున్న సేవా దృక్పథాన్ని హరించొద్దు

తెలంగాణలో కేసీఆర్ కిట్ల పథకం ఓ ఆదర్శం



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి) వైద్యరంగంలో సమూల సంస్కరణల పేరిట కేంద్రం ప్రతిపాదించిన నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)2017 బిల్లు చట్టరూపం దాలిస్తే ఇంతవరకు ప్రభుత్వ నిర్వహణలో ఉన్న జిల్లా స్థాయి ఆసుపత్రులు కూడా సమీపంలోని ప్రైవేటు మెడికల్ కళాశాలలు లేదా కార్పొరేట్ సంస్థల అధీనంలోకెళ్ళే ప్రమాదాన్ని వైద్యుల సంఘాలు శంకిస్తున్నాయి. కొంతకాలంగా ప్రభుత్వాసుపత్రుల పనితీరు మెరుగవుతోంది. అప్పటికీ తరచూ ఈ ఆసుపత్రులు అనేక వివాదాలకు గురౌతున్నాయి. ప్రభుత్వ వైద్యులు సకాలంలో స్పందించరని, రోగుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, వైద్యశాలల్లో తగినన్ని మందులు, ఇతర వసతులు అందుబాటులో ఉండవన్న అపప్రద ఉంది. వీటి నుంచి ప్రభుత్వాసుపత్రుల్ని గట్టెక్కించి సేవాదృక్పథాన్ని పెంచాల్సిన ప్రభుత్వం ఇందుకు భిన్నంగా మొత్తం వ్యవస్థనే కుప్పకూల్చే ప్రయత్నానికి ఒడిగట్టే ప్రమాదాన్ని వీరు సందేహిస్తున్నారు. ఇప్పటికే ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అనుబంధ సంఘాల సభ్యులు ఆందోళన బాటకు సిద్ధమయ్యారు. రెండ్రోజుల క్రితం 12 గంటల పాటు ఔట్‌పేషంట్ విభాగాన్ని స్తంభింపజేశారు. కేవలం అత్యవసర రోగులకు మాత్రమే సేవలందించారు. దేశవ్యాప్తంగా ఈ బిల్లుకు వైద్యుల నుంచి నిరసన వ్యక్తమౌతోంది. ప్రతిపక్షాలు కూడా ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. తదుపరి సమావేశంలో ప్రవేశపెట్టేందుకు ఈ బిల్లును ఇప్పటికే సెలక్ట్ కమిటీకి పంపించారు. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే ఆరోగ్య పరిరక్షణ రంగంలో సమూల మార్పులు 3వ పేజీలో...



రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీ.కాంగ్రెస్ నేతలు

సర్కారుకు సహకరించండి

• గవర్నర్ సూచనతో టీ.కాంగ్రెస్ నేతల ఆగ్రహం • మాటల తూటాలు • సోనియా దయవల్ల గవర్నర్ అయ్యావు... ఫైరవీలు చేసి పబ్బం గడుపుకుంటున్నావు... గవర్నర్ పోస్టుకే అనర్హుడివి.. చిందులేసిన సర్వే ...సముదాయించిన ఉత్తమ్, జానా • కాంగ్రెస్ నేతల ఆరోపణలకు గవర్నర్ ఆక్షేపణ • ఇక రాజ్‌భవన్‌కు రాంరాం.. ప్రతిన బూనిన కాంగ్రెస్ నేతలు • సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగాయన్న రాజ్‌భవన్ వర్గాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌కు, తెలంగాణ కాంగ్రెస్ నేతలకు మధ్య శుక్రవారం అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు, ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చేపట్టిన దీక్ష అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను వివరించేందుకు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతల బృందం మధ్యాహ్నం గవర్నర్‌ను కలిసేందుకు రాజ్‌భవన్ వెళ్ళింది. ఈ నేపథ్యంలో గవర్నర్ నరసింహన్‌కు 9వ పేజీలో...



సంక్షేమమే ఎజెండాగా

భారీ బడ్జెట్

• కొత్త బడ్జెట్‌కు కసరత్తు షురూ • శాఖల వారీగా ప్రతిపాదనలు • ప్రీ బడ్జెట్ సమావేశాలకు షెడ్యూల్ • రూ.1.80 లక్షల కోట్ల బడ్జెట్‌కు అంచనాలు • శాఖల వారీగా ప్రతిపాదనల రూపకల్పనలో అధికారులు • పేరుకుపోతున్న బకాయిలు • తలసరి ఆదాయంలో జోష్ 9లో

25 వేల కోట్లతో

బీసీ సబ్‌ప్లాన్

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

బీసీలకు నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు

3వ వారంలో సీఎం చేతుల మీదుగా కొత్త పథకాలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేకంగా రూ. 25 వేల కోట్లతో సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేయనున్నారు. బీసీ విద్యార్థులు చదువుకోవడానికి అవకాశాలు ఎక్కువ కల్పించాలని కోరుతూ బీసీ సమస్యలపై నియమించిన కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కమిటీ సిఫారసులపై శుక్రవారం సచివాలయంలో మంత్రుల సమావేశం జరిగింది. బీసీ విద్యార్థులు చదువుకోవడానికి 119 బీసీ గురుకులాలను ఏర్పాటు చేయాలని, వాటితోపాటు 62 బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలని కమిటీ నివేదిక సిద్ధం చేసింది. వీటితోపాటుగా బీసీలకు జరుగుతున్న అన్యాయాలను సరిచేయడం కోసం రిజర్వేషన్లను ఇవ్వాలని ప్రతిపాదించింది. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం నుంచి 50 శాతం ఇవ్వాలని సిఫారసు చేసింది. ఎస్సీ, ఎస్టీ 3వ పేజీలో...



కండలు తిరిగిన రోబోలు

వాషింగ్టన్: హమ్మింగ్‌బర్డ్ పక్షి వేగం, ఏనుగంత బలం, అక్టోపస్ తాలూకు చురుకుదనాన్ని సంతరించుకున్న రోబోలను అమెరికా పరిశోధకులు అభివృద్ధి చేస్తున్నారు. జీవ వ్యవస్థలకు మరింత దగ్గరగా ఉండే సున్నితమైన పదార్థాలను వాటి రూపకల్పనలో వినియోగిస్తున్నారు. అత్యంత చవకైన పదార్థాలతో రూపొందుతున్న ఈ రోబోలు మానవుల తరహాలో కండరాలను కదిలిస్తాయి. వాటి కదలికలను నియంత్రించుకుంటాయి. అంతేకాక మానవులతో మమేకం కావడంలో ముందుంటాయి. సాఫ్ట్ రోబోటిక్స్‌లో పెను అభివృద్ధికి నిదర్శనం అన్నట్టుగా ఈ తరహా రోబోలు వాటికి ఏదైనా విద్యుదాఘాతం చోటు చేసుకున్నప్పుడు స్వయంగా సరి చేసుకుంటాయి. ఈ మేరకు సైన్స్ రోబోటిక్స్ జర్నల్‌లో ఒక అధ్యయనం ప్రచురితమైంది. దాని ప్రకారం సాఫ్ట్ రోబోలు కోరిందకాయ, కోడి గుడ్డు లాంటి అత్యంత పెలుసైన, తేలికైన వాటి నుంచి అత్యంత బరువైన వస్తువులను లేవనెత్తగలవు. వీటి రూపకల్పనలో మానవ కండరం తాలూకు సామర్థ్యాల నుంచి స్ఫూర్తి పొందాము అని కొలొరాడో యూనివర్శిటీకి చెందిన క్రిస్టోఫ్ కెప్లింగర్ తెలిపారు.



తిండిపోతులకు వరం

కొవ్వు కరిగించే కొత్త ఔషధం

హూస్టన్: దేహంలో పెరిగిపోతున్న కొవ్వును కరిగించుకోవడం కోసం కడుపు మాడ్చుకునే ఆహార ప్రియులకు శుభవార్త. ఆహార పరిణామం తగ్గించాల్సిన పనిలేకుండానే కొవ్వును కరిగించే సరికొత్త ఔషధాన్ని అమెరికా పరిశోధకులు కనిపెట్టారు. పరిశోధకుల్లో ఒకరు భారతసంతతికి చెందినవారు కావడం విశేషం. సదరు ఔషధాన్ని మామూలుగానే ఆహారం తీసుకుంటున్న ఎలుకలపై ప్రయోగించారు. కొద్దిరోజుల్లోనే ఆ ఎలుకల్లో శారీరక బరువు, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గిపోయిన వైనాన్ని గుర్తించారు. ఈ పరిశోధన బయోకెమికల్ ఫార్మాకొలజీ జర్నల్‌లో ప్రచురితమైంది. తెల్ల కొవ్వు కణాల్లో జీవప్రక్రియను నిరోధించే ఒక బ్రేక్‌ను అడ్డుకునే ఒక మాలిక్యూల్‌ను పరిశోధకులు కనుగొన్నారు. ఆ మాలిక్యూల్ కారణంగా కొవ్వు కణాల్లో జీవప్రక్రియ గణనీయంగా పెరిగింది. తద్వారా తెల్ల కొవ్వు నిల్వల పరిణామం తగ్గిపోయింది. దీని వలన స్థూలకాయం, సంబంధిత జీవప్రక్రియ వ్యాధుల మూల కారణానికి చికిత్స చేసే మార్గం కనిపించింది అని టెక్సాస్ యూనివర్శిటీకి చెందిన హర్షిణి నీలకంఠన్ తెలిపారు. అలాగే టైప్2 డయాబెటిస్, హృద్రోగాలు లాంటి దీర్ఘకాలిక వ్యాధులను నివారించే అవకాశం ఉందని చెప్పారు.



నిద్ర తగ్గితే కుంగిపోతారు..!

న్యూయార్క్: రోజూ ఎనిమిది గంటల కన్నా తక్కువ సమయం నిద్రపోయే వారు కుంగుబాటు లేదా వ్యాకులతకు గురయ్యే ప్రమాదం ఉందని అమెరికా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. అధ్యయనంలో పాల్గొన్న వ్యక్తులకు ఒక మోతాదు నుంచి అధిక స్థాయిలో ప్రతికూల ఆలోచనలు కలిగించడం ద్వారా వారు ఎంతసేపు కలత లేకుండా నిద్రపోతున్నదీ పరిశీలించారు. ఆ క్రమంలో భావోద్వేగ స్పందన రేకెత్తించే వేర్వేరు చిత్రాలను సదరు వ్యక్తులకు చూపించారు. వారి కంటి కదలికల ద్వారా పరిశోధకులు వారు ఏ మేరకు అప్రమత్తంగా ఉన్నదీ కనిపెట్టారు. ఈ ప్రతికూల ఆలోచనలు వ్యక్తులను కుంగుబాటు లేదా వ్యాకులత లాంటి మానసిక వ్యాధులకు గురి చేస్తాయని బింఘామ్‌టోన్ యూనివర్శిటీకి చెందిన మెరిడెత్ కోలెస్ తెలిపారు. తాము చేపట్టిన అధ్యయనంతో నిద్రలో ఒక అంతరాయానికి మరో అంతరాయానికి మధ్య ఎంత కాల వ్యవధి ఉన్నదీ పరిశోధిస్తున్నాం. తీవ్రమైన ప్రతికూల ఆలోచనలను నిర్లక్ష్యం చేయడంలో ఈ కనీస ప్రక్రియలు ఏ మేరకు సాయపడతాయనేది కనిపెడుతున్నాం అని కోలెస్ చెప్పారు. నిద్రపై చేపట్టిన అధ్యయనం బిహేవియర్ థెరపీ అండ్ ఎక్స్‌పెరిమెంటల్ సైకియాట్రీ జర్నల్‌లో ప్రచురితమైంది.



గర్భనిరోధక సూది మందుతో హెచ్ఐవీ!

జోహెన్నస్‌బర్గ్: ప్రసిద్ధి చెందిన గర్భనిరోధక సూది మందుతో హెచ్ఐవీ సోకే ముప్పు గణనీయంగా ఉందని దక్షిణాఫ్రికా పరిశోధకులు పేర్కొన్నారు. సహారా ప్రాంతంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి డిపోట్‌మెడ్రోక్సీప్రొజెస్టెరోన్ ఎసిటేట్ (డీఎంపీఏ) అనే గర్భనిరోధక సూది మందును ఎక్కువ మంది తీసుకుంటారని తెలిపారు. డీఎంపీఏ వాడకంతో హెచ్ఐవీ సోకే ముప్పు 40 శాతంఎక్కువగా ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇతర రకాల సూది మందులు ఎలాంటి ముప్పును సూచించడం లేదని వారు చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా హెచ్ఐవీ అత్యధికంగా సోకే ప్రాంతాల్లో నివసించే మహిళలు వారి స్తోమతకు తగిన గర్భనిరోధక మందులను వాడుకోవడం మంచిది అని కేప్‌టౌన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జెనెట్ పి హప్‌గూడ్ తెలిపారు. డీఎంపీఏ వాడకంతో గర్భకోశంలో రక్షణ కవచం పనితీరులో క్షీణత, వ్యాధినిరోధక శక్తి తగ్గిపోవడం లాంటి అనేక కారణాలతో మహిళలకు హెచ్ఐవీ సోకే శాతం పెరిగిపోయింది అని చెప్పారు. ఈ పరిశోధక సమీక్ష ఎండోక్రైన్ రివ్యూస్ జర్నల్‌లో ప్రచురితమైంది.

భరత్ భూషణ్‌కు తెలుగు వర్సిటీ విశిష్ట పురస్కారం



హైదరాబాద్, ప్రభ న్యూస్ : గత మూడు దశాబ్దాలుగా ఫొటోగ్రఫీలో, పెయింటింగ్‌లో తెలంగాణ ముద్రను వేసిన కళావేత్త జీ.భరత్ భూషణ్‌కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2016వ సంవత్సరానికి గాను విశిష్ట పురస్కారం ప్రకటించింది. ఈ పురస్కారం కింద లక్ష రూపాయల నగదును ఇవ్వనున్నట్టు విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లలిత కళారంగంలో ఆయన చేసిన కృషికి గాను ఈ అవార్డును ప్రకటించినట్టు తెలిపారు. ఈ అవార్డు వరుసగా సాహిత్యం, లలిత కళలు, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన వారికిస్తారు. గతంలో ఈ అవార్డును బీ.నర్సింగరావు, నందిని సిధారెడ్డి లాంటి తెలంగాణ ప్రతిభామూర్తులకు ఇచ్చారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, పండుగలు, జాతర్లు, ఆచార వ్యవహారాలను ఊరూరా తిరిగి తన కెమెరాలో బంధించిన భరత్‌భూషణ్ ఏడు వ్యక్తిగత ఫొటో ప్రదర్శనలు నిర్వహించారు. ఇంకా ఆరు ఆర్ట్ ప్రదర్శనల్లో కూడా పాల్గొన్నారు. భరత్ భూషణ్ తీసిన బతుకమ్మ ఫొటోలు ప్రపంచ ఖ్యాతిని సంపాదించాయి. ఈయన సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం 2015లో ఉత్తమ ఫొటో జర్నలిస్టు అవార్డును ఇచ్చి, లక్ష రూపాయల నగదుతో సత్కరించింది.

ప్రస్తుతం, మనకు అందుబాటులో ఉన్న తెలంగాణ సాయుధ పోరాట మహిళా యోధురాలు చాకలి ఐలమ్మ ఏకైక ఫొటోను, కాళోజి ప్రసిద్ధమైన ఫొటో తీసింది భరత్ భూషణేనని ఈ సందర్భంగా ఆచార్య ఎస్వీ సత్యనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఐటీ పార్క్

- మంత్రి కేటీఆర్ హామీ



హైదరాబాద్/మలక్‌పేట్, ప్రభన్యూస్: దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడానికి త్వరలోనే ప్రత్యేక ఐటీ పార్కును ఏర్పాటు చేస్తామని పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రకటించారు. గ్రేటర్‌లో నిర్మించే లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మూడు శాతం ఇళ్లను దివ్యాంగులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో దివ్యాంగులకు ప్రత్యేక పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

నల్గొండ ఎక్స్‌రోడ్డులోని లూయి బ్రెయిలీ ఫ్లైఓవర్ మధ్యలో నిర్మించిన దివ్యాంగుల జాతీయ ఉద్యానవనం, సెన్సోర్ బ్లాక్, ముసారాంబాగ్‌లో నిర్మించిన ఇండోర్ స్టేడియం, సాహెబ్ నగర్‌లో నిర్మించిన రిజర్వాయర్లను కేటీఆర్ ప్రారంభించారు. దివ్యాంగులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తా మని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. దేశంలో ఎక్కడాలేని విధంగా దివ్యాం గుల కోసం రూ.2.61 కోట్లు కేటాయించి ప్రత్యేక పార్కు, సెన్సోర్ బ్లాక్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. శంషాబాద్ సమీపంలో ఐటీ పార్కు కోసం రూ.5 కోట్ల నిధులు కేటాయించామని.. అది త్వరలోనే పూర్తి చేయడానికి అధికారులకు ఆదేశాలిచ్చామని ఆయన తెలిపారు. దీని వల్ల ఐటీ రంగంలో మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున దివ్యాంగులకు ఉపాధి అవకాశం ఏర్పాడుతుం దన్నారు. తెలంగాణలోని 5 లక్షల మంది దివ్యాంగుల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.33 కోట్లు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే తెలంగాణలోని ఆరు జిల్లా కేంద్రాల్లో దివ్యాంగుల పార్కులను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులు పార్కులో ఏర్పాటు చేసిన ఫిజియోథెరఫి, అడ్మిన్ బ్లాక్, సెన్సరీ బ్లాక్, చిల్డ్రన్స్ పార్కు, తదితర విభాగాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని రంగాల్లో తెలంగాణ ముందు ఉన్నదని ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి అనేక సంక్షేమ,అభివృద్ధి కార్య క్రమాలు అమలు చేస్తున్నామని, దాదాపు 50కిపైగా సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని ఆయన వివరించారు.

దేశంలో ఏకైక ప్రభుత్వం: డీప్యూటీ సీఎం

సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సమాన స్థాయిలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలో అమలు చేస్తున్న ఏకైక రాష్ట్ర ప్రభుత్వం అని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ కొనియాడారు. దివ్యాంగుల పార్క్ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం తదితర రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ మొత్తం దేశానికే ఆదర్శవంతంగా ఉన్న నేషనల్ పార్కు ఏర్పాటులో దివ్యాంగులకు ఆత్మస్థైర్యం కల్పించిందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ డా.బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో కేవలం దివ్యాంగులకు వెయ్యి స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోం దని కితావు ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వికలాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 10,50,000 మంది దివ్యాంగులు ఉన్నారని, వారిలో ఐదు లక్షల మందికి పైగా దివ్యాంగులు సామాజిక భద్రతా పింఛన్లు అందుకుంటున్నారని వివరించారు. దివ్యాంగుల వివాహానికి అందించే ఆర్థిక సహాయాన్ని రూ.లక్ష వరకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బల్దియా కమిషనర్ డా.బీ.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులందరికీ ప్రత్యేకంగా వికాసం గుర్తింపుకార్డులు జారీ చేయడం జరిగిందన్నారు. గుర్తింపు కార్డులు ఉన్న వారికి నగరంలోని అన్ని పార్కులలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రారంభ కార్యక్రమాలలో ఎమ్మెల్యే బలాల, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, దివ్యాంగుల కమిషనర్ బి.శైలజ పాల్గొన్నారు.

అది ఇసుక ట్రాక్టర్ కాదు అతను వీఆర్ఏ కాదు

- గడ్డాలు పెంచుకుంటే సన్యాసులే అవుతారు.. అధికారంలోకి రారు
- ఉత్తమ్‌పై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డిపై రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఫైర్ అయ్యారు. గడ్డాలు పెంచుకుంటే సన్యాసులే అవుతారని, అధికారంలోకి రారని ఆయన ఉత్తమ్ నుద్దేశించి ఘాటుగా మాట్లాడారు. గోల్‌మాల్ చేసే కాంగ్రెస్ చిల్లరగాళ్లను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ వివిధ పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి పోటి చేసినా అధికారంలోకి రాలేదన్న విషయం గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. ఇసుక ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన వ్యక్తి వీఆర్ఏ కాదనే విషయం తెలుసుకోవాలన్నారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేయడం దివాళాకోరు తనానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత బోజ్యానాయక్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్, కాంగ్రెస్ నేత తాన్‌సింగ్‌తో పాటు తదితరులు టీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కేటీఆర్ పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డిలో వీఆర్ఏ మృతి చెందారని వార్త పత్రికలు తప్పుడు వార్తలు రాశాయని, వాటిని సవరించు కోవాలన్నారు. సంచనాల కోసం వార్తలు రాయొద్దని, ప్రజలన్ని తప్పుదారి పట్టించొద్దన్నారు. రైతు పొలాల్లో నీళ్లు వస్తే కాంగ్రెస్ కిందికి నీళ్లు వస్తాయని ఆ పార్టీ నేతలు భయపడు తున్నారని ఆయన విమర్శించారు. సీఎం కేసీఆర్ కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకని మంత్రి కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ సమావేశాలు అంటేనే కాంగ్రెస్ నేతలు పారిపోతున్నారని ఆయన తెలిపారు. 50 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ నేతలు బాగా బలిసిపోయారని ఆయన విమర్శించారు. సీఎం కేసీఆర్, మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డికి రైతుల కష్టాలు తెలుసని, అందుకే ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు తెలిపారు. 9 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు వివరించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో గుజరాత్‌ను మించిపోయినట్లు తెలిపారు. కేసీఆర్ ఉన్న నమ్మకంతోనే వివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరుతున్నా రని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అప్పులు లేని రైతులు ఉండాలన్నదే సీఎం కృత నిశ్చయ మన్నారు.

నీటి కష్టాలకు చరమ గీతం

- ప్రతి ఇంటికీ నీరందించటమే ధ్యేయం
- ఓఆర్ఆర్ లోపల సీవరేజ్ డీపీఆర్‌కు రూపకల్పన
- మూడు నెలల ముందే అందుబాటులోకి..
- రిజర్వాయర్ల ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్



హైదరాబాద్/ఎల్బీనగర్, ప్రభ న్యూస్: రాష్ట్రంలోని ప్రతి ఇంటికి నల్లాల ద్వారా సురక్షిత తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తలపెట్టిన మిషన్ భగీరథకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇక ఎండాకాలం వచ్చిం దంటే మంచినీటి కోసం వేలాది మంది రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఉండదని పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తెలిపారు. గ్రేటర్‌తో పాటు శివారు ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.2వేల కోట్లతో రిజర్వాయర్లను నిర్మించామని.. అనుకున్న సమయానికి ముందే ప్రజలకు నీటిని అందిస్తు న్నామని వివరించారు.

శుక్రవారం సాహెబ్ నగర్‌లో మిషన్ భగీరథ పథకంలో భాగంగా రూ.325 కోట్ల హడ్కో నిధులతో నిర్మించిన రిజర్వాయర్లను ఆయన ప్రారంభిం చారు. ఎల్బీనగర్‌లో 7 రిజర్వాయర్లు పూర్తి చేసి 46 ఎంఎల్‌డీల సామర్థ్యంతో పంపిణీ ప్రారంభించామని తెలిపారు. ఎల్బీనగర్ శివారు ప్రాంత ప్రజలకు నీటి కష్టాలు తీరాయని అన్నారు. గ్రేటర్‌లోనే కాకుండా ఔటర్‌రింగ్‌రోడ్డు లోపల ఉన్న 74 గ్రామాలకు రూ.700 కోట్లతో తాగునీటిని అందించే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని తెలిపారు. శివారు ప్రాంత 10మున్సిపాలిటీలలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను సమూలంగా మెరుగుపర్చేందుకు రూ.3,100 కోట్ల నిధులు మంజూరు చేసి సంవత్సర కాలంలో సమస్యను రూపుమాపుతున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉన్నాయని అన్నారు. అతిత్వరలో మూసీ సుందరీకరణ పనులను కూడా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చామని... ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాలలో 4వేల ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అర్హులైన వారందరికీ దశల వారీగా అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదలకు రూ.18వేల కోట్లతో 2.70 లక్షల ఇండ్ల నిర్మాణం జరుగుతున్నాయని.. ఒక్కో ఇంటికి రూ.8.70లక్షల నిధులను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ సాహెబ్‌నగర్ కలాన్ సర్వేనంబర్ 200, నాగోల్ డివిజన్ సర్వేనెంబర్ 96,101, ఫత్తులగూడ సర్వేనెంబర్ 58, హస్తినాపురం సర్వేనెంబర్ 73జనార్దన్‌రెడ్డినగర్, రోషన్‌దౌలా, హయత్‌నగర్ డివిజన్‌లలో రిజిస్ట్రేషన్‌ల సమస్య పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి మహ్మద్ అలీతో చర్చించి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఉచిత డయాలసిస్ సెంటర్లు, ఐసియు కేంద్రాలను ఏర్పాటు చేశామని, త్వరలో బసి దవాఖాలను శ్రీకారం చుట్ట నున్నట్లు తెలిపారు. రైతులకు 24 గంటలు నిరంతర విద్యుత్ అందిస్తున్న సీఎం కేసిఆర్‌ను అభినందిం చాల్సింది పోయి విమర్శలు చేయడం ఎంతవరకు సమం జసమని ఆయన ప్రశ్నించారు. తెరాస ప్రభుత్వం వచ్చే నాటికి రాష్ట్రంలో విద్యుత్ స్థాపిత సామర్థ్యం కేవలం 4370 మెగావాట్లు మాత్రమేనని.. ప్రస్తుతం 14 వేలపైగా మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్న ఘనత కేసిఆర్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి దేశంలోనే రాష్ట్రం నంబర్-1గా దూసుకు పోతుందన్నారు. విద్యుత్ సరఫరాను మెరుగు పర్చేందుకు రూ.12వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు.

ప్రజలకు మంచి చేస్తే సంతోష పడాలి తప్పా కుసంస్కారంతో తట్టుకోలేని కొంతమంది రాజకీయ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజల హామీలను విస్మరిస్తే గొప్ప వారిని సైతం ప్రజలు ఓటమి పాలు చేశారని అన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పనిచేస్తూ వారి మన్ననలతో ప్రభుత్వం ముందుకు పోతుందని పనిచేసే వారికే పట్టంకడుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో రూ.200కోట్లతో ఇంటింటికి మంచినీటిని అందించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. తెరాస ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దూసుకు పోతుం దన్నారు. కార్యక్రమంలో మేయర్ మేయర్ డా.బొంతు రామ్మోహన్, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, ఆర్.కృష్ణయ్య, ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ బాబాఫసియుద్దీన్, జలమండలి ఎండీ దానకిషోర్,తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లలో 35 శాతం బీసీలకు ఇవ్వాలి



మంత్రి కేటీఆర్‌కు బీసీ సంఘం నేతల వినతి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో బీసీలకు 35 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీలకు 35 శాతం అమలు చేసేలా చూడాలని సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కె తారకరామారావుకు విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, నీలవెంకటేష్, కె సంజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు. జనాభాలో బీసీలు 50 శాతానికిపైగా ఉన్నారని వారు గుర్తు చేశారు. బీసీల్లో చాలా మంది ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఎంతో వెనుకబడి ఉన్నారని అటువంటి వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లో 35 శాతం రిజర్వేషన్లు అమలు చేసి వారికి ఇంటి సౌకర్యం కల్పించాలని కోరారు.


ఫ్లెక్సీలపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఫ్లెక్సీలపై రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ మరోసారి కన్నెర్ర చేశారు. హైదరాబాద్‌ను సుందరమైన నగరంగా తీర్చిదిద్దడంతో పాటు విశ్వనగరాన్ని చేయాలని ఒకవైపు ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం శ్రమిస్తుంటే....పార్టీ నేతలే నిబంధనలను ఉల్లంఘించడంపై తీవ్ర ఆగ్రహం...అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వారిపై పెద్దఎత్తున జరిమానాలను విధించాలని మంత్రి కేటీఆర్ హుకుం జారీ చేశారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు ఉరుగులు...పరుగులు మీద వాటిని తొలగించారు. ఈ సందర్భంగా నిబంధనలను అతిక్రమించిన కార్పొరేటర్ సునరితారెడ్డికి రూ. 50వేలు, మాజీ కార్పొరేటర్ అస్లాంకు రూ.25వేలు, స్థానిక తెరాస నాయకుడు శ్రీనివాస్‌కు రూ.25వేలు చొప్పున జరిమానా విధించాలని మంత్రి కేటీఆర్ స్వయంగా ఆదేశించారు. శుక్రవారం నగరంలోని మలక్‌పేట్ ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం పలుకుతూ.....పలువురు కార్పొరేటర్లు, స్థానిక తెరాస నేతలు పెద్దఎత్తన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్ పలుమార్లు మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ పలు సందర్భా లలో ఏర్పాటు చేసిన ఫెక్సీలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేటీఆర్ అయితే స్వయంగా తనకోసం ఏర్పాటు చేసిన వాటిని కూడా తొలగించారు. అయినప్పటికీ నాయకుల తీరు మారడం లేదు. పోటాపోటీగా వాటిని ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వారిపై మున్సిపల్ అధికారులు అడపా, దడ పా తగు చర్యలు తీసు కుంటున్నప్పటికీ....పూర్తిస్థాయిలో నియంత్రించ లేకపోతున్నారు. దీంతో నగరంలో తరుచూ ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. ఇక ప్రధాన మైన పండు గలు....అగ్రనేతల పర్యట నలు సందర్భంగా అధిక సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. కీలక ప్రాంతాల్లో వీటని ఏర్పాటు చేస్తున్నారు. కాగా మలక్‌పేట్‌కు కేటీఆర్ వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసన ఫ్లెక్సీలపై ఆగ్రహంవ్యక్తం చేస్తూ అధికారులకు క్లాస్ తీసుకోవడంతో పాటు వాటిని ఏర్పాటు చేసిన వారిపై జరిమానాలను విధించాలని ఆదేశించారు.

న్యాక్‌తో ఉపాధి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఏజెన్సీగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ను తీర్చిదిద్దాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రైవేటు సంస్థలను పిలిచి సమన్వాయం బాధ్యతలకే పరిమితం కాకుండా నేరుగా నిరుద్యోగ యువతీ, యువకులకు, శిక్షణ పొందిన వారికి దేశ విదేశాల్లో ఉద్యోగాలు కల్పించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. జాతీయ నిర్మాణ సంస్థ అధికారులతో మంత్రి సచివాలయంలో కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. న్యాక్‌లో శిక్షణ పొందిన వారు ఆయా రంగాల్లో అత్యుత్తమంగా రానిస్తారని ఉద్యోగాలు ఇచ్చే సంస్థలు భావించే విధంగా పని తీరు మెరుగుపర్చుకోవాలని అధికారులకు సూచించారు. సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ సంస్థగా న్యాక్ పేరుగాంచవలసి ఉందని తుమ్మల నాగేశ్వర రావు ఆకాంక్షించారు. జిల్లాల్లోని న్యాక్ కేంద్రాలను మరింత బలోపేదం చేయాలని ఆదేశించారు. జాతీయ నిర్మాణ సంస్థ 1997 నుండి 3.76 లక్షల మందికి శిక్షణ ఇచ్చింది. నిర్మాణ పరిశ్రమకు సంబంధించి రాష్ట్రంలో ఇప్పటి వరకు 40,174 మంది నైపుణ్య శిక్షణ పొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత న్యాక్ పనితీరు అద్భుతంగా ఉంది. 2017 -18 సంవత్సరానికి జాతీయ నిర్మాణ సంస్థ 7959 మందికి ఇప్పటి వరకు శిక్షణ ఇచ్చింది అని మంత్రి వెల్లడించారు. న్యాక్ 2017 - 18లో ఇప్పటి వరకు ఔట్ సోర్సింగ్ ద్వారా జీహెచ్ఎంసిలో సైట్ ఇంజనీర్లుగా పని చేయడానికి 350 మంది సివిల్ ఇంజనీర్లను ఎంపిక చేసి శిక్షణ, నియామకం జరిపింది.

ప్రతిపాదిత 15 అంతస్తుల దిగ్గజ భవనం కోసం ఆర్కిటెక్చర్ అండ్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సర్వీసెస్‌ను న్యాక్ అందిస్తుంది. దిగువ ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ టవర్స్ ప్రణాళికలు ఎస్సీ అభివృద్ధి శాఖ అమోదం కోసం సమర్పించింది. శిక్షణలో నాణ్యతను మరింత మెరుగుపర్చడం కోసం అనేక నిపుణుల సంస్థలు, శిక్షణా అభివృద్ధికి ప్రఖ్యాత ప్రైవేటు రంగ సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకోవడం జరిగింది. న్యాక్ ప్రాంగణంలో స్టేట్ ఆఫ్ ప్లంబింగ్ ల్యాబ్ ఏర్పాటు కోసం జాక్వార్ అనే సంస్థతో అవగాహన కుదుర్చుకుంది. విద్యుత్, పెయింటింగ్, సోలార్ ఎనర్జీ ల్యాబ్ కోసం శెండ్లర్, ఏసియన్ పెయింట్స్, శ్రీశక్తి పరిశ్రమలతో వరుసగా చర్చలు పురోగతిలో ఉన్నాయి. పనితీరును మెరుగుపర్చుకోవడానికి నిరంతం చర్యలు కొనసాగించడం జరుగుతుంది. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సుశీల్ శర్మ, న్యాక్ డైరెక్టర్ జనరల్ కె. బిక్షపతితో పాటుగా సంబంధిత అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

Dwaraka

టీ-హబ్‌కు ఫ్రెంచ్‌రాయబారి కితాబు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారత్ - ఫ్రెంచ్ దేశాల మధ్య శతాబ్దాలుగా సాంస్కృతికసంబంధాలు ఉన్నాయని, ఇప్పటికే చాలా మంది ఫ్రెంచ్ జాతీయులు హైదరాబాద్‌లో ఉన్నారని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. ఫ్రెంచ్ రాయబారి అలెగ్జాండర్ జీగ్లర్ శుక్రవారం కేటీఆర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మూడేళ్లలో తెలంగాణ రాష్ట్రం చాలా ప్రగతి కనబర్చిందని, రాష్ట్రం సాధించిన ప్రగతిపట్ల అలెగ్జాండర్ అభినందనలు తెలిపారు. భారత్‌లో ఇన్నోవేషన్ పురోగతి ఉందని, దీంతో పెట్టుబడులు పెట్టేందుకు ఫ్రెంచ్ కంపెనీలు సానుకూలంగా వస్తున్నాయని అన్నారు. ఈ రంగంలో హైదరాబాద్ ముందు వరుసలో ఉందని ఆయన కితాబి చ్చారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన టీ-హబ్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, ఇది స్టార్టప్‌లను, ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు ఉప యుక్తంగా ఉందని అలెగ్జాండర్ కొనియాడారు. తమ దేశంలోని బోర్డో నగరంతో హైదరాబాద్ అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. బోర్డో నగరంతో కలిసి హైదరాబాద్‌లో మొబిలిటీ అంశంపై పరస్పర సహకారం కుదిందని, ట్రామ్ రవాణా సౌకర్యం ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని రాయబారి చెప్పారు. త్వరలోనే 50 ప్రముఖ ఫ్రెంచ్ పెట్టుబడిదారుల ప్రతినిధి బృందం హైదరాబాద్ రానుందని తెలిపారు. ఫ్రెంచ్ కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుసంధానకర్తగా తాను పనిచేయడం సిద్ధంగా ఉన్నానని అలెగ్జాండర్ హామీ ఇచ్చారు. తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలు, ప్రభుత్వ విధానాలను రాయబారి అలెగ్జాండర్‌కు వివరించారు.





జిల్లా ఆసుపత్రులకు ప్రయివేటు దెబ్బ!

(మొదటిపేజీ తరువాయి)

వస్తాయంటూ కేంద్రం చెబుతోంది. ముఖ్యంగా వైద్యసేవల్లో మౌలిక వసతులు పెరుగుతాయని వాదిస్తోంది. మరింత మంది వైద్యులు అందుబాటులోకి వస్తారని వివరిస్తోంది. అయితే ప్రస్తుతం అల్లోపతి వైద్యవిధానాన్ని అభ్యసించిన ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్ల సంఖ్య అతితక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లో కూడా ప్రభుత్వ వైద్యశాలల్లో తగినంతమంది వైద్యులు అందుబాటులో లేకపోవడానికి ఇదే కారణం. ఈ సమస్యను అధిగమించేందుకు హోమియో, ఆయుర్వేద తదితర ఆయుష్ విభాగంలో వైద్యశాస్త్రాన్ని అభ్యసించిన విద్యార్థులకు ఒక పరీక్ష పెట్టి అందులో ఉత్తీర్ణులైతే అల్లోపతి వైద్యులుగా వారిని గుర్తించా లన్నది ఈ చట్టంలోని ఒక అంశం. అవసరమైన ఆసుపత్రుల్లో వీరిని వైద్యులుగా నియమించొచ్చుంటూ ఈ బిల్లు పేర్కొంటోంది. వీరికి తగిన శిక్షణ ఇచ్చి నైపుణ్యాన్ని కల్పించేందుకు అవసరమైన వసతులు, అధ్యాపకులు ఇప్పుడు అందుబాటులో లేరు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరతను అధిగమించేందుకు వీరిని నియమిస్తే ఆశించిన ఫలితం నెరవేరకపోగా కొత్తతరహా ఇబ్బందులు ఎదురౌతా యని ఐఎంఏ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్లోపతి వైద్యాన్ని ప్రాక్టీస్ చేసేందుకు ఖచ్చితంగా నిర్దిష్ట అధ్యయనం, నైపుణ్యం అవసరం. పైగా ఈ విధానంలో వినియోగించే మందులు చాలా త్వరగా ఫలితం చూపిస్తాయి. ఏమాత్రం తేడా వచ్చినా ప్రతికూల ప్రభావం కూడా అదే వేగంగా కనిపిస్తుందంటూ వీరు పేర్కొంటున్నారు.

దేశప్రజలందరికీ కనీసవైద్యసదుపాయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనంటూ రాజ్యాంగం నిర్దేశించింది. ఏడు దశాబ్దాలుగా ప్రభుత్వ వైద్యరంగం ఆచరణాత్మక విధానంలో విఫలమైంది. కొంతకాలంగా ప్రత్యామ్నాయ వ్యవస్థ ఆవశ్యకత ఉందంటూ ప్రభుత్వం, మేధావి వర్గాలు భావిస్తు న్నాయి. అంతమాత్రాన మొత్తం ప్రభుత్వాసుపత్రులను నిర్వహణ పేరిట ప్రైవేటు, కార్పొరేట్ వర్గాలకు అప్పగించే ప్రయత్నాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు వైద్యులస్వీయనియంత్రణాధికారాన్ని కలిగి ఉన్నారు. అయితే మెజారిటీ వైద్యులు ఈ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పైగా ఎంసీఐ నిబంధనలెప్పుడో రూపొందిద్దుకున్నవి. ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అవి అనుగుణమైనవి కావంటూ ప్రత్యేక పార్లమెంటరీ స్థాయి సంఘం ఇచ్చిన నివేదిక మేరకే నేషనల్ మెడికల్ కౌన్సిల్ బిల్లును ప్రభుత్వం రూపొందిద్దింది. ఎంసీఐలో వైద్యవిద్యపై కూడా నియంత్రణ కొరవడింది. ప్రైవేటు కళాశాలల్లోని 40శాతం సీట్లు మాత్రమే ఎంసీఐ అధీనంలో ఉంటున్నాయి. మిగిలిన 60శాతంలో పదిశాతం ఓసీ కేటగిరి పేరిట కన్వీనర్ కోటాలోనే లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారు. ఇక నీ కేటగిరిలోని 50శాతం సీట్లకు బహిరంగ మార్కెట్లో వేలం వేస్తున్నారు. దీంతో 60శాతం మంది అర్హతలకు అతీతంగా ఆర్థిక స్తోమతపరంగే వైద్యులవుతున్నారు. దీన్ని అరికట్టే లక్ష్యంతో రూపొందించిన ఎన్ఎంసీ బిల్లులో వైద్యవిద్యను పూర్తిగా ప్రైవేటు చేసే ప్రతిపాదన కూడా కనిపించింది. ఇది అమల్లోకొస్తే ఇక సూరుశాతం సీట్లు సంబంధిత కళాశాలల యాజమాన్యాలే భర్తీ చేసుకుంటాయి. ఇందుకు బదులుగా వాటికి అనుబంధంగా ప్రభుత్వం అనుసంధానించిన ఆసుపత్రుల నిర్వహణను అవి ఉచితంగా చేయాల్సి ఉంటుంది. సీట్లకు వైద్యసేవలకు లింక్ పెట్టినంతమాత్రాన ఈ ప్రైవేటు వైద్య సంస్థలు ఉచితంగా వైద్యసేవలు అందిస్తాయన్న విశ్వాసం ఎవరికీ ఉండదు. కన్సల్టెన్సీ వరకు ఉచితంగానే లభించినా సేవలకు రుసుంలు విధించరన్న గ్యారంటీ లేదు. అందుకు క రాడా ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేసే ఎక్స్‌రేలు, రక్తపరీక్షలు, స్కానింగ్‌లంటూ గుంజేసే ప్రమాదం లేకపోలేదు. వైద్యుల కొరత, వైద్యసేవల్లో లోపాలంటూ మొత్తం వ్యవస్థనే కుప్పకూల్చి ప్రైవేటు పరం చేసే ప్రయత్నాన్ని కేంద్రం విరమించాలన్న డిమాండ్ రోజురోజుకు పెరుగు తోంది. కమ్యూనిస్టులతో పాటు కాంగ్రెస్, యూపీఏలోని ఇతర పక్షాలు కూడా ఈ బిల్లును వ్యతిరేకిస్తు న్నాయి. ఇటీవల కాలంలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వాసుపత్రుల్లో ప్ర సవాల్ని ఇతోధికంగా ప్రోత్సహిస్తు న్నాయి. తెలంగాణ ప్రభు త్వం ఇస్తున్న కేసీఆర్ కిట్లతో దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. కొన్ని జిల్లాల్లో అయితే మొత్తం ప్రసవాల్లో 80నుంచి 90శాతం ప్రభుత్వాసుపత్రుల్లోనే జరుగుతున్నాయి. గతంలో పోలిస్తే ప్ర భుత్వాసుపత్రుల్లో సేవల పట్ల విశ్వసనీయత పెరుగుతోంది. ఉన్న లోపాల్ని సరిదిద్ది దీన్ని మరింత విశ్వాసం పెంచే ప్రయత్నాలు చేయకపోగా చేజేతులా ఓ ప్రణాళికా బద్ధంగా ప్రైవేటీకరణకు పాల్పడ్డం భవిష్యత్ తరాలకు జవాబుదారి కావాల్సిన స్థితి కల్పిస్తుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

కొంత సాధించాం.. ఇంకెంతో ఉంది

(మొదటిపేజీ తరువాయి)

ఉందని గుర్తు చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధి, సాధించిన ప్రగతి, లక్ష్యాలపై శుక్రవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మార్కెట్లోకి వచ్చిన వ్యవసాయో త్పత్తుల న్నింటినీ పూర్తిస్థాయిలో మద్దతు ధరలతో ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు.

ఇప్పటికే 24 గంటల ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాల కొరత, గోదాముల నిర్మాణం, విస్తరణాధి కారుల నియామకం, తదితర మౌలిక సదుపాయా లను అందుబాటులోకి తీసుకువచ్చా మన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి ఎకరాకు రూ.4వేల చొప్పున పెట్టుబడి రాయితీ, రైతులను సంఘటిత శక్తిగా మార్చ డం, వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని బలోపేతం చేయడం, పంట కాలనీలు ఏర్పాటు చేయడం, లాంటి కార్యక్రమాలు లక్ష్యంగా ముందడుగు వేయా లన్నారు. ''రాష్ట్రంలో 70శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆర్థికవేత్తలు చెప్పినా ఎక్కువ మంది ఆధారపడిన ప్రధాన రంగం వ్యవసాయమే. అయితే వ్యవసాయదారులు మాత్రం తీవ్ర నిరాశా నిస్పృహల్లో ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యల వల్ల కొంత మార్పు వచ్చింది. రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధర వచ్చేవిధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. వరి, మక్కల లాంటి దిగుబడు లకు ప్రస్తుతం కనీస మద్దతు ధర లభిస్తుంది. పత్తిలాంటి ఇతర పంటలకు మద్దతు ధర విషయంలో అనిశ్చితి నెలకొంటున్నది. అంత ర్జాతీయ మార్కెట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రభావం చూపుతు న్నాయి. సీసీఐ లాంటి సంస్థలు కొనుగోలు చేస్తున్నప్పటికీ కొన్ని ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. ఈ పరిస్థితిని నివారించే వ్యూహం రూపొందించాలి. రైతు సమన్వయ సమితిల ద్వారా ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి పంటలను కొనుగోలుచేసి, తిరిగి అమ్మాలి. ఇలాచేయడంవల్లఏమైనా నష్టం వస్తే కూడా ప్రభుత్వమే భరించాలి'' అని కేసీఆర్ అధికార యంత్రాంగానికి మార్గనిర్దేశం చేశారు.

రైతు సంక్షేమానికి నిధుల కొరత లేదు

రైతులను ఆదుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవ డానికి నిధుల కొరద లేదని సీఎం స్పష్టం చేశారు. ఈ ఏడాది నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడతామని ప్రకటించారు. రైతులకు పెట్టుబడిగా అందించే నిధులతో పాటు, మద్దతు అందించడం కోసం కొంత నిధిని కూడా బడ్జెట్‌లో కేటాయిస్తామని చెప్పారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి అయ్యే ఖర్చును ముందే అంచనా వేసి, బడ్జెట్‌లో పొందుపరుస్తామని, దీనివల్ల నిధుల సమస్య రాదని వెల్లడించారు.



కొత్తగా నియామకమైన మైనార్టీ కమిషన్ చైర్మన్ మహ్మద్ ఖమరుద్దీన్ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన దృశ్యం. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి మహ్మద్ అలీ

మద్దతు ధరలకు విధాన రూపకల్పన

రైతు సమస్యలకు ప్రధానమైనది మద్దతు ధరలే అయినందున రాష్ట్రంలో పండిన ప్రతీపంట మార్కెట్‌లోకి వచ్చేవిధంగా చర్యలు తీసు కోవాలి. వివిధ రాష్ట్రాల్లో వివిధ పంటలకు మద్దతు ధర ఇచ్చే విషయంలో ఎలాంటి విధానం పాటిస్తున్నారోత అధ్య యనం చేయడానికి అధికారులు మహారాష్ట్ర, కర్నాటక లాంటి రాష్ట్రాల్లో పర్యటించాలి. మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీష్‌రావు నాయకత్వం లో అధికారుల బృందం దేశవ్యాప్తంగా మద్దతు ధరలకు సంబం ధించిన విధానాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. అని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు.

క్వింటాలుకు రూ.2వేల మద్దతు ధర

''మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా మరింత ఉదారంగా వ్యవహరించాల్సి ఉంది. వరి, మక్కలకు ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధర పెరగాల్సి ఉంది. ఈ రెండింటికి రూ.2వేల మద్దతు ధర ప్రకటించాలి. దీనికోసం తెలంగాణ ప్రభుత్వంగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతాం. తెరాస పార్టీపరంగా పార్లమెంట్‌లో క రాడా ఈ విషయం ప్రస్తావిస్తాం'' అని కేసీఆర్ ప్రకటించారు.

అధికారుల కృషి అభినందనీయం

రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించే విషయం లో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ముఖ్య కార్య దర్శి పార్థసారథి నాయకత్వంలోని అధికారులు విశేష కృషి చేశారని సీఎం కేసీఆర్ అభినందించారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల పనులను శరవేగంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్న నీటి పారుదలశాఖ హరీష్‌రావు, అధికారులను ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో అత్యుత్తమ సేవలందించి కేంద్ర ప్రభుత్వం ద్వారా సిబిఐపి అవార్డు అందుకున్న జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండి ప్రభాకర రావును సీఎం అభినందించారు.

వ్యవసాయ కమతాల ఖాతాలు 71.75 లక్షలు

మొదటి దశ భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయినట్లు సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో 71, 75,096 వ్యవసాయ ఖాతాలు ఉన్నట్లు తెలిందని, 1,42, 12,826.17 ఎకరాల వ్యవ సాయోగ్యమైన భూమి ఉన్నట్లు లెక్కకొచ్చిందని సీఎం ప్రకటించారు. భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన డైరెక్టర్ వాకాటి కరుణ, రెవెన్యూ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, ఇతర సిబ్బందికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు. వీలైనంత తొందరలో రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందివ్వనున్నట్లు సీఎం వెల్లడించారు.

ఆహార పదార్థాల వినియోగంపై అధ్యయనం

రాష్ట్రంలో ప్రజలు వినియోగించే ఆహార పదార్థాలు ఎన్ని అనే విషయంలో ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ రంగసంస్థతో అధ్యయనం చేయిస్తున్నదని, దానికి అనుగుణంగా కాలనీలు నిర్ధారించి, పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. మంచి మార్కెట్ ఉన్న పంటలను, నాణ్యతా రకాలను ఎంపిక చేసుకుని సాగు చేయా ల్సిందిగా రైతులను కోరనున్నట్లు వెల్లడించారు. కల్తీ విత్తనాలను అరికట్టడంలో గత ఏడాది ఎంతో కృషి జరిగింది. ప్రభుత్వం పీడీ యాక్టు కూడా తెచ్చింది. ఈ ఏడాది కూడా ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం అధికారులను కోరారు. విత్తనాల తయారీదారులు, అమ్మకందారుల వివరాలు, ఫోటోలు ముందే సేకరించి పెట్టుకోవాలని, ఎక్కడా ఏ పొరపాటు జరిగినా వెంటనే స్పందించాలని సూచించారు.

ఎరువులు, విత్తనాలు, సదుపాయాల కొరతకు చెల్లుచీటి

ఎరువుల కొరత రాకుండా ముందే స్టాక్ పెట్టుకున్నారని, అయిన ప్పటికీ ఎక్కడ ఏ ఇబ్బంది రాకుండా చూసుకోవాలని, ఎప్పటి కప్పుడు పరిస్థితిని సమీక్షించుకోవాలని సీఎం కోరారు. రాష్ట్రంలో మార్కెటింగ్ శాఖ కొత్తగా గోదాముల నిర్మాణం జరుగుతుందని, దీంతో 22.50 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు అందుబాటులోకి వస్తాయన్నారు. వేర్ హౌజింగ్, ఎఫ్‌సిఐ గోదాములు కూడా కలుపుకుంటే రాష్ట్రంలో 53 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు ఉంటాయని, వీటిని ఎరువులు, విత్తనాలు నిల్వ చేసుకోవడానికి కూడా ఉపయోగించు కోవచ్చని చెప్పారు. పంటలకు చీడ, పీడలు రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలి. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులను చైతన్యపరచాలని సీఎం కోరారు. రాష్ట్రంలోని ఏ ఎకరంలో ఏ పంట వేశారనే లెక్కలు వ్యవసాయశాఖ వద్ద ఉండాలి. రెవెన్యూ శాఖపై ఆధార పడవద్దు. వ్యవసాయ విస్తరణ అధికారులతో సమాచారం తెప్పించుకోవాలని సీఎం కోరారు. ఈ సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, ఈటెల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు, జోగు రామన్న, మహేందర్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సలహా దారు అనురాగ్ శర్మ, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండి డి.ప్రభాకర రావు, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి, హార్టికల్చర్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి, వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు, సిసిఎల్ఎ డైరెక్టర్ వాకాటి కరుణ, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్‌రావు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు రఘునందన్‌రావు, ఎంవి రెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురు సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘం

రైతులకు వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం ఈ ఏడాది నుంచేఅమలవుతుందని సీఎం ప్రకటించారు. మే 15 నాటికి మొదటి విడత ఎకరానికి రూ.4వేల చొప్పున రైతులకు అందిస్తామన్నారు. వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకాన్ని ఎలా అమలు చేయాలి? రైతులకు డబ్బులు నేరుగా అందివ్వాలా? బ్యాంకుల ద్వారా అందివ్వాలా? సాగుచేస్తున్న భూములను గుర్తించడం ఎలా? ఏ ప్రాతపదికన పెట్టుబడి అందించాలి అన్న తదితర అంశాలను అధ్యయనం చేయడానికి వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. ఈ కమిటీలో మంత్రులు ఈటల రాజేందర్, టి.హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు, జగదీష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి సభ్యులుగా ఉంటారు.

కిసాన్ గిఫ్ట్ కార్డులు!

(మొదటిపేజీ తరువాయి)

అమల్లో ఎదురవుతున్న చిక్కులను అధిగమించేందుకు ఉన్నతాధికారులు సరికొత్త ఆలోచనతో ప్రత్యామ్నాయ మార్గాన్ని కనుగొన్నారు. గత కొన్ని నెలలుగా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రతి ఏటా రెండు పంటలు కలుపుకుని ఎకరాకు రూ.8వేల చొప్పున ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి మొత్తాన్ని అందించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు మార్గాలు అన్వేషించారు. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారులకు నేరుగా డబ్బులు ఇచ్చేందుకు నిబంధనలు అడ్డొస్తున్నాయి.

అలాగని బ్యాంకు ఖాతాల్లో జమచేస్తే పాత బకాయి కింద సర్దుబాటు చేసుకునే అవకాశాలు న్నందున అధికారులు పునరాలోచనలో పడ్డారు. తాజాగా శుక్రవారం ఇదే అంశంపై సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అయినప్పటికీ ప్రత్యామ్నా యంగా ఆలోచించిన కిసాన్ గిఫ్ట్‌కార్డుల అంశాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళలేదు. ఈ కార్డుల ద్వారా కూడా కొందరు మధ్యవర్తులు అమాయకరైతులను మోసగించేప్రమాదం పొంచి ఉన్నందున, సాంకేతిక పరిజ్ఞానంతో తగిన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలన్న అంశంపై దృష్టి కేంద్రీకరించారు.

సీక్రెట్ కోడ్ లేదా ఇంకేదైనా కొత్త విధానం ద్వారా సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభిస్తుందేమోనన్న కోణంలో సమాలోచనలు జరుపుతున్నారు. ఇదే అంశంపై లోతైన అధ్యయనం తర్వాత పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నియమించిన మంత్రివర్గ ఉపసంఘానికి ఈ ప్రతిపాదనను సమర్పించ నున్నారు. ఈ కసరత్తును ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తిచేసి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో తుదినిర్ణయం తీసుకోనున్నారు. మార్చిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ పథకానికి నిధులు కేటాయిస్తారు. ఏప్రిల్ మొదటివారం నుంచి లబ్ధిదారులకు నిధులను బట్వాడా చేస్తారు. మే నెల 15 నాటికి అర్హులందరికీ పెట్టుబడి మద్దతు మొత్తాన్ని అందేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. జూన్ మొదటివారం నుంచి ఖరీఫ్ పనులు ప్రారంభమవుతాయి.

హైకోర్టుకు సంక్రాంతి సెలవులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జస్టిస్ ఎస్‌వీ భట్, జస్టిస్ యు.దుర్గాప్రసాద్ రావులతో కూడిన హైకోర్టు డివిజన్ బెంచ్, జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు సింగిల్ బెంచ్‌లకు ఈ నెల 9 నుంచి 11 వరకుసంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ ఇక ప్రకటన విడుదల చేశారు.

పాక్‌కు ఆర్థిక సాయం నిలిపివేత

ఉగ్రవాదంపై అమెరికా ఆగ్రహం

వాషింగ్టన్ : పాకిస్థాన్‌కు 1.15 బిలియన్ డాలర్ల భద్రతాపరమైన సహాయం, మిలటరీకి ఆయుధాల సరఫరాను అమెరికా నిలిపివేసింది. ఉగ్రవాదులకు పాకిస్థాన్ స్వర్గధామంగా మారిందంటూ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్ర వాదాన్ని అదుపు చేయడంలో పాకిస్థాన్ ఘోరంగా విఫలమైందని, దీనికిగాను సాయాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. ఉగ్రవాద నిర్మూలన విషయమై పాకిస్తాన్ అబద్ధాలు చెబుతున్నదని, అందుకే ఈ చర్యలకు పూనుకుంటున్నట్టు ట్రంప్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. 15 ఏళ్లలో 33 బిలియన్ డాలర్లు ఉగ్రవాదులకోసం ఖర్చు చేసినట్టు అమెరికా తేల్చింది. 2017 ఆర్థికసంవత్సరానికి సంబంధించిన 900 మిలియన్ డాలర్ల సంకీర్ణ మద్దతు ఫండ్‌ను అమెరికా డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ పాకిస్థాన్‌కు ఇవ్వడాన్ని రద్దు చేసింది. పాకిస్థాన్ జాతీయ భద్రతకు అందించే సహాయాన్ని మాత్రమే తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని, ఆఫ్ఘన్ తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్ యాక్షన్ చేసుకోవడంలో విఫలమైందని రక్షణ శాఖ ప్రతినిధి హీతర్ నౌర్ట్ తెలిపారు. అమెరికా వ్యక్తిగత విషయాలను లక్ష్యంగా చేసుకోవడంతో పాటు మతపరమైన వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడు తున్నారని ఆమె తెలిపారు. అమెరికా చేస్తున్న నియం త్రణలపై ఇస్లామాబాద్ నుండి వెంటనే స్పందించాల్సిన అవసరం లేదని, ఈ విషయమై లోతుగా విశ్లేషించుకుంటామని, తరువాతే నిర్ణయం ప్రకటిస్తామని పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖుర్రామ్ దస్తగిరి అన్నారు. రక్షణ శాఖ కోసం అమెరి కా, పాకిస్థాన్‌కు సంవత్సరానికి 1 బిలియన్ డాలర్లు సాయం అందించేదని ఖుర్రామ్ తెలిపారు.

హజ్‌హౌస్‌కు కాషాయ రంగు

లక్నో: యూపీలో బీజేపీ సర్కారు లక్నో హజ్ హౌస్‌కు కాషాయరంగు వేయించింది. దీంతో ముస్లింలతోపాటు, విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. హజ్‌హౌస్‌ను హిందూమతానికి ప్రతీకగా వాడే కాషాయం రంగు వాడటంపై నిరసన వ్యక్తం చేస్తూంటే సర్కారులో ఉన్న ముస్లిం మంత్రి మొహసిన్ ఇందులో పెద్దగా అభ్యంతరం చెప్పాలసింది ఏముందనటం ప్రాధాన్యం సంతరించుకుంది. లక్నో నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికుల అవసరాలకోసం ఈ హజ్ హౌస్ పనిచేస్తోంది బీజేపీకి చెందిన ముస్లిం మంత్రి మొహసిన్ రజా కాషాయంరంగుధైర్యానికి చిహ్నం. ప్రతిపక్షాలు పసలేని అంశాలకు ప్రాధాన్య మిస్తున్నాయని మంత్రి మొహసిన్ రజా దుమ్మెత్తి పోస్తున్నారు.

బీసీ సబ్‌ప్లాన్

రూ.25 వేల కోట్లతో



(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులకు ఇస్తున్నట్టుగా బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలని ప్రతిపాదిం చారు. ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీల్లో చదివే బీసీ విద్యార్థు లకు కూడా ఫీజురీయిం బర్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. ప్రతి జిల్లా లోనూ బీసీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. రాష్ట్రంలోని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న స్కూల్, కాలేజ్ హాస్టల్స్‌కు సొంత భవనాలను నిర్మించాలని ప్రతిపాదించారు. హాస్టల్ వార్డెన్ పోస్టును గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదించారు. బీసీ పారిశ్రామిక విధానం నిర్ణయించి బిక్కిని ఏర్పాటు చేయాలని ప్రతి పాదించారు. రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లను రిజర్వు చేయాలని ప్రతిపాదించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి బీసీ కులానికి వారి జనాభా ప్రకారం భవ నాల కోసం ఎకరం నుంచి 10 ఎకరాల వరకు, భవనా ల నిర్మాణం కోసం రూ. కోటి నుంచి రూ. 10 కోట్ల వరకు కేటాయించాలని సూచించారు. భూమిలేని నిరుపేద బీసీలకు 3 ఎకరాల భూమి ఇస్తే వారు ఆర్థికంగా స్థిరపడే అవకాశం ఉంటుందని ప్రతిపాదిం చారు. కులాంతర వివాహం చేసుకునే వారికి ప్రస్తుతం ఇస్తున్న ఆర్థిక సాయాన్ని రూ. 10వేల నుంచి రూ. 2 లక్షలకు పెంచాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం 52 శాతం కేటాయిం చాలని సూచించారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో ఇస్తున్న రిజర్వేషన్లను 25 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని ప్రతిపాదిం చారు. బీసీ ఉద్యోగాల కోసం ప్రస్తుతం అమలు చేస్తున్న క్రిమీలేయర్‌ను ఎత్తేయాలని నిర్ణయించారు. నిధులు కేటాయించని ఫెడరేషన్లకు వెంటనే నిధులు కేటా యించి, వాటికి పాలక మండళ్లను నియమించాలని ప్రతిపాదించారు.

బ్యాంకులతో సంబంధం లేకుండా ఆర్థిక సాయం

బీసీ సంక్షేమం కోసం తీసుకునే చర్యలపై ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రులు, సంబంధిత అధికారు లతో శుక్రవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, తలసాని శ్రీని వాస్ యాదవ్, జగదీష్‌రెడ్డి, చందులాల్‌తోపాటు సం బంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. త్వర లోనే బీసీ సమస్యలపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావుకు నివేదికను సమర్పించనున్నారు.

ఇకపై పేదలకు ఇచ్చే ఆర్థికసాయం బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. ఇప్పటికే బీసీల్లోని గొల్ల కురుమలకు, మత్స్య కారులకు పెద్ద ఎత్తున ప్రభుత్వ సాయం అందుతోందని తెలిపారు. అదేవిధంగా బీసీల్లో ఉన్న కులాలకు ఏం చేస్తే బాగుపడతారనే అంశంపై ఇప్పటికే మంత్రి జోగు రామన్న అధ్యక్షతన 50 సార్లు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. స్పీకర్ కూడా బీసీలతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రా యాలు తీసుకున్నారని తెలిపారు. బీసీల అభివృద్ధికి నివేది కను సిద్ధం చేశామని త్వరలోనే సీఎంకు అందజేసా మని తెలిపారు. నాయి బ్రాహ్మణులు కొత్తగా షాపులు పెట్టుకోవడానికి, ఉన్న వాటిని ఆధునీకరించు కోవడానికి నిధులు ఇవ్వబోతున్నా మన్నారు. ముందుగా సంచార జాతులు, తరువాత రజక, నాయి బ్రాహ్మణ, విశ్వకర్మ లకు వృత్తుల వారీగా నిధులుం కేటాయించేందుకు నివేదిక సిద్ధం అయ్యిం దన్నారు. హైదరాబాద్‌లో రజకులు, నాయి బ్రాహ్మ ణులు ఆన్‌లైన్‌లో ఆర్థికసాయం కోసం ఆన్‌లైన్‌లో వెంటనే దరఖాస్తులు చేసుకునేలా ఏర్పాటు చేయాలని నిర్ణ యించారు. వీరికి ట్రేడ్ లైసెన్స్ ఇవ్వడానికి జీహెచ్ ఎంసీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు సం యుక్తంగా అవగాహన సదస్సు ను ఏర్పాటు చేసి వారికి ట్రేడ్ లైసెన్స్‌ను ఇవ్వ నున్నారు. ఇలా దరఖాస్తు చేసు కున్న వారిలో లబ్ధిదా రులను ఎంపిక చేసి జనవరి మూడో వారంలో ప్రగతి భవన్‌లో సీఎం కెసీఆర్ చేతుల మీదుగా ఆర్థిక సాయం చేయాలని భావిస్తు న్నారు. అలాగే సంచార జాతుల వారికి రూ. లక్షఆర్థికసాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సంక్రాం తి తరువాత బీసీల స్థితిగ తుల ను అధ్యయనం చేయడానికి ప్రణాళకను సిద్ధం చేశారు.

21న బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ

హాజరు కానున్న కేంద్ర మంత్రి హన్సరాజ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 21న బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈ నిరంజన్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లును పార్లమెంటులో ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు అమలు చేస్తున్న క్రిమీలేయర్‌ను ఎత్తేయాలన్నారు. జాతీయ స్థాయిలో ఓబీసీలను వర్గీకరించి బీసీలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రత్యేకంగా బీసీ కులాల జనగణన చేపట్టాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభకు కేంద్ర మంత్రులు హాన్స్ రాజ్ గంగారాం, రామ్ దాస్ అత్వాలేతోపాటు రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, జోగు రామన్న హాజరవుతారని చెప్పారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 6 జనవరి 2018

మొదట్లో వేడి... చివరిలో సౌహార్దం...!

ముమ్మారు తలాక్ రద్దు బిల్లును ఆమోదించకుండానే పార్లమెంటు శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించినప్పటికీ, రాజ్యసభలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రతిపక్షాలు సెలక్టు కమిటీకి పంపాలంటూ అడ్డుకోవడం, తగిన వ్యవధి లేకపోవడంతో ఈనెల29వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశం నాటికి వాయిదా వేశారు. శీతాకాల సమావేశాలు ఆరంభంలో వేడి పుట్టించినప్పటికీ చివరి ఘట్టం సజావుగానే ముగిసింది. ఎప్పటి మాదిరిగానే ప్రతిపక్షాల అభ్యంతరాలు, గందరగోళంతో ప్రారంభమైన ఈ సమావేశాల్లో రాజ్యసభలో ఈసారి విలక్షణత కనిపించింది. రాజ్యసభను నడిపించడంలో ఉపరాష్ట్రపతి, సభాధ్యక్షుడు ఎం.వెంకయ్యనాయుడు ముద్ర స్పష్టంగా కనిపించింది. డిసెంబర్ 15వ తేదీన ప్రస్తుత సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి పనిదినాల్లో ప్రశ్నోత్తరాల సమయం నుంచి వెంకయ్య సభకు హాజరు కావడం, సభ్యులందరికీ సమానంగా అవకాశం ఇవ్వడంతో వారి అభిమానాన్ని చూరగొనగలిగారు. సభ ప్రారంభం నుంచే గందరగోళ దృశ్యాలు ఈసారి కనిపించకపోవడం గమనార్హం. సభ మొత్తం 13 సార్లు సమావేశమై తొమ్మిది ప్రభుత్వ బిల్లులనూ, 19 ప్రైవేటు బిల్లులను ఆమోదించింది. చివరి రోజున ముగ్గురు సీనియర్ సభ్యుల పదవీ విరమణ సందర్భంగా వారి సేవలను ప్రశంసిస్తూ వెంకయ్యనాయుడు చేసిన ప్రసంగం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య కొంతకాలంగా ఏర్పడిన అగాధాన్ని పూడ్చే రీతిలో సాగింది. ఈ ముగ్గురు సీనియర్ సభ్యుల్లో మాజీ కేంద్రమంత్రి, కాశ్మీర్ రాజవంశీకుడు అయిన డాక్టర్ కరణ్‌సింగ్ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. తొలి ప్రధాని నెహ్రూ నుంచి, ప్రస్తుత ప్రధాని మోడీ వరకూ అందరితో కలిసిపని చేసే అరుదైన అవకాశం ఆయనకు దక్కింది. ఆరు దశాబ్దాల్లో పార్లమెంటు నిర్వహణలో వచ్చిన మార్పులను ఆయన వివరిస్తున్నప్పుడు అంతా మంత్రముగ్ధులై విన్నారు. ప్రస్తుతం తొంభైవ పడిలో ఉన్న కరణ్‌సింగ్ 36వ ఏట పార్లమెంటులో తొలిసారి ప్రవేశించారు. తనకున్న సుదీర్ఘ అనుభవం దృష్ట్యా, సభా సమయాన్ని వృధా చేసుకోవద్దని ప్రస్తుత సభ్యులకు సలహా ఇవ్వడం ఎంతో సముచితం. మరో సీనియర్ సభ్యుడు జనార్దన్ ద్వివేదీ కూడా పార్లమెంటుతో తన అనుబంధాన్ని గురించి భావోద్వేగంతో వివరించిన తీరు అందరినీ జలదరింపజేసింది. రిటైరైన ముగ్గురు సభ్యులకు వీడ్కోలు పలికేందుకు ప్రధానమంత్రి మోడీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రసంగాలతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మంత్రిగా సుదీర్ఘ అనుభవం ఉన్న వెంకయ్యనాయుడు రాజ్యసభను నడిపించడం ఇదే మొదటిసారి. ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌లు రద్దుకాకుండా సజావుగా సభను నడిపించి తొలి పర్యాయంలోనే ఆయన విజయంసాధించారు. పార్లమెంటు రాజకీయ ప్రత్యర్థుల దూషణలకు వేదిక కాదని చివరి రోజున ఆయన సున్నితంగా హెచ్చరించిన తీరు అమోఘం. మొత్తంమీద గత సమావేశాలతో పోలిస్తే, ఇవి ప్రయోజనకరరీతిలోనే సాగాయి. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌పై గుజరాత్ ఎన్నికల ప్రచారం సందర్భంగా చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కి తలొగ్గకపోయినా, చివరి రోజున రాజ్యసభలో మన్మోహన్ సింగ్ సీటు వద్దకు ప్రధాని మోదీ వెళ్ళి కరచాలనంచేసి ముచ్చటించడంతో సుహృద్భావం వెల్లివిరిసింది. ఈ సమావేశాల్లో లోక్‌సభలో 61గంటలు, రాజ్యసభలో 34 గంటలు వ్యర్థమయినప్పటికీ, ముఖ్యమైన బిల్లులు ఆమోదం పొందాయి. తలాక్ బిల్లుకు పార్లమెంటు ఆమోద ముద్ర లభించి ఉంటే ఇవి చారిత్రక సమావేశాలుగా గుర్తుండి పోయేవి.

పాఠకీయం

రోగం కన్నా చికిత్స ప్రమాదకరం

అవినీతికి, అసమర్థతకి ఆలవాలంగా మారిన జాతీయ వైద్య మండలి స్థానంలో ఉద్దేశించిన జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటు బిల్లు మరింత ప్రమాదకరంగా కనబడుతోంది. నియంత్రణ మండలిలో లోపాల్ని సరిదిద్ది, పట్టాలెక్కించడం మాని, వేరే రూపంలో మరిన్ని కోరలతో మరో నియంతృత్వ రూపాన్ని తీసుకురావడం వల్ల ప్రజలకు గానీ, వైద్య రంగానికి గానీ ఒరిగేదేమీ లేకపోగా మరింత నష్టం కలుగజేసేదిగా ఉంది. ఇది అవినీతి సుడిగాలి ఇంట్లోకి రాకూడదని కిటికీలు మూసి, తలుపులు బార్లా తెరవడం లాంటి ప్రక్రియ.

ప్రతిపాదిత కమిషన్‌లో 25 మందిలో ఐదుగురే వైద్యులుంటారు. మిగతా అంతా ప్రభుత్వం నియమించిన వారే. వైద్యరంగాన్ని దిశానిర్దేశం చెయ్యాల్సిన కమిషన్‌లో వైద్యులకు చోటు నామమాత్రం కావడం విచిత్రం. పైగా కేవలం ఏవో ఐదు రాష్ట్రాలకు మాత్రమే ప్రాతినిధ్యం ఉండడం రాష్ట్రాల హక్కులకు భంగకరం. నియంత్రణ మండలి వ్యవహారాలలో పారదర్శకత, జవాబుదారీతనం ప్రోది చెయ్యడం ద్వారా మాత్రమే అవినీతిని నిరోధించవచ్చు గానీ ప్రభుత్వ నామినీలను నింపడం ద్వారా కాదు. అది మరింత బరితెగింపుకి ద్వారాలు తెరిచినట్టే. పైగా ప్రయివేటు వైద్యకళాశాలలు తమ సీట్లు పెంచుకోడానికి, అరవై శాతం విద్యార్థుల ఫీజులు పెంచుకోడానికి పూర్తి స్వేచ్ఛని ఈ బిల్లు ప్రతిపాదిస్తుంది. ఆయా కళాశాలల నుండి ఉత్తీర్ణులైన వారి శాతం బట్టి గ్రేడింగులిస్తామని, జరిమానా విధిస్తామని అంటున్నారు. ఈ అస్పష్ట విధానాలు ముందుముందు వేలంవెర్రిగా కళాశాలలు పుట్టుకురావడానికి ఊతమిస్తాయి తప్పితే ఏవిధంగానూ అవినీతిని కట్టడి చెయ్యలేవు, వైద్యవిద్య నాణ్యత పెంచలేవు. ఏళ్లకేళ్లు వైద్యవిద్యనభ్యసించి మళ్ళీ ఎగ్జిట్ పరీక్ష రాయాల్సిరావడం వైద్యవిద్యార్థులకు అదనపు భారం. లోక్‌సభ ఈ బిల్లుని స్టాండింగు కమిటీకి పంపడం మంచి పరిణామం. మరింత అధ్యయనంతో మంచి చట్టాన్ని తీసుకురావాలి. ప్రస్తుత రూపంలోని బిల్లుని పూర్తిగా వ్యతిరేకిస్తున్న భారత వైద్య మండలి తగు సలహాల్ని అందివ్వాలి. ఎవరి గుప్పిట్లో ఏ అధికారాలుండాలని ఆలోచించడానికి బదులు ఏ రకంగా వైద్య రంగాన్ని మెరుగుపర్చగలమో, అందుకు తగ్గ వ్యవస్థని ఎలా తీసుకురాగలమో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

● డా.డి.వి.జి.శంకరరావు, మాజీఎంపీ, పార్వతీపురం

ఒక మంచి.. ఒక చెడు

కొత్త సంవత్సరంలో భారత్‌కు వినూత్న అనుభవం



'శంక'రాజీయం

-శంకర్ రాజ్, సీనియర్ పాత్రికేయులు

భారత్‌కు ఈ కొత్త సంవత్సరం మంచి చెడుల కలయికను తెచ్చిపెట్టింది. అది కూడా అమెరికా నుంచి. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా చిట్టచివరకు పాకిస్థాన్‌ను వెన్నుపోటు దేశంగా గుర్తించింది. మోసగిస్తోం దని నిర్ధారించుకుంది. ఒక అమెరికా అధ్యక్షుని నోటివెంట వినకూడని పరుషపదజాలం పాకిస్థాన్‌ను ఉద్దేశించి వెలువడింది. పాకిస్థాన్‌ను డోనాల్డ్ ట్రంప్ అబద్ధాలకోరు గానూ, మోసగత్తెగానూ అభివర్ణించారు. మా నుంచి బిలియన్లకొద్దీ డాలర్లను సాయంగా పొంది, తీవ్రవాదులకూ, అమెరికా వ్యతిరేక శక్తులకూ దేశాన్ని స్వర్గధామంగా మార్చిందని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పాకిస్థాన్‌కు అందించే అన్ని రకాల ఆర్థిక సాయాలనూ నిలిపివేశారు. పాకిస్థాన్‌ను నాలుగు రోడ్ల కూడలిలో నిలబెట్టి వలువలూడదీసినట్లు చేశారు డోనాల్డ్‌ట్రంప్.

వరుసగా ట్రంప్ హెచ్చరికల ట్వీట్స్ అనంతరం, అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ తీవ్రమైన చర్య చేపట్టింది. పాకిస్థాన్‌కు అందించే రక్షణ సహాయంలో ఎక్కువ భాగాన్ని నిలిపేసింది. తీవ్రవాదుల స్వర్గధామాలను ఏరేయాలనే సంకేతాలను పంపింది. బిలియన్లకొద్దీ డాలర్ల ఆర్థికసాయాన్ని పొందిన పాకిస్థాన్ మాకు అబద్ధాలు చెప్పింది. మోసగించిందంటూ ట్రంప్ మొదటి ట్వీట్ చేశారు. ఇది జరిగిన కొన్ని రోజులకు జనవరి 1న యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ పై చర్య తీసుకుంది. తాలిబాన్, హక్కానీ నెట్‌వర్క్, ఇతర మిలిటెంట్ గ్రూపులపై నిర్ణయాత్మకమైన చర్య తీసుకునే వరకూ సాయం అందబోదని ప్రకటించింది. అఫ్ఘనిస్థాన్‌లో హింసను రెచ్చగొడుతూ, వివాదాన్ని కొనసాగించడానికి కారణమవుతున్న ఈ గ్రూపులను నిర్మూలించాల్సిందేనని స్పష్టం చేసింది. అఫ్ఘనిస్థాన్‌లో అమెరికా సుదీర్ఘ కాలంగా తాలిబన్లతో యుద్ధ చేస్తోంది. 255మిలియన్ డాలర్ల సైనిక సాయాన్ని సైతం నిలిపేసింది. పాకిస్థాన్‌పై ఈ నిర్ణయం చూపే ప్రభావం అంతాఇంతా కాదు. దీర్ఘకాలంలో పాకిస్థాన్ చేపట్టిన తీవ్రవాద అనుకూల చర్యలను తగ్గించుకోక తప్పదు. సెప్టెంబర్ 11, 2011లో తీవ్రవాదుల దాడుల అనంతరం, పాకిస్థాన్‌పై అమెరికా కన్నేసింది.

అమెరికా చేపట్టిన చర్య పాకిస్థాన్‌పై తీవ్రంగానే ఉంటుంది. నిఘా విభాగంలో సహకారం, న్యూక్లియర్ సేఫ్టీ, అఫ్ఘనిస్తాన్‌లో యుద్ధం తదితర అంశాలపై ఇది ప్రభావం చూపుతుంది. ఈ చర్య ఛాందసవాదులకు, ఐఎస్ఐకీ స్వేచ్ఛను కల్పిస్తుంది. అమెరికా పాకిస్థాన్‌ను వాచ్ లిస్ట్‌లో చేర్చింది. మత సామరస్యాన్ని పరిరక్షించడంలో విఫలమైన దేశాలను ఈ జాబితాలో అమెరికా చేరుస్తుంటుంది. సహనాన్ని పాకిస్థాన్ పరీక్షిస్తున్నట్లుగా అమెరికా భావిస్తోంది. ఈ నిర్ణయం భారత్‌ను అమెరికాకు స్నేహంలో మరింత దగ్గర చేస్తుందన డంలో సందేహం లేదు. వాషింగ్టన్-న్యూఢిల్లీ మధ్య బంధాలను ఇది మరింత పటిష్టపరుస్తుంది. చైనా నుంచి ముప్పు పెరుగుతుండడంతో అమెరికాకు భారత్ అవసరం ఎంతో పెరిగింది. అందుకే పాకిస్థాన్‌పై తీవ్రమైన నిర్ణయానికి నడుం కట్టింది. ప్రపంచంలో సూపర్ కావాలని చైనా తహతహలాడుతుండడం అమెరికాకు నిద్రపట్టకుండా చేస్తోంది. చాలా కాలంగా అమెరికా సూపర్ పవర్ స్థానంలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితి నుంచి దిగజారాలని ఎవరూ అనుకోరు కదా.

పాక్ పట్ల అమెరికా వైఖరి మారడానికి ప్రధాన కారణమది. భారత్‌కు ఇది శుభవార్తగా పరిణమించింది.

వెన్వెంటనే చేదు వార్తను కూడా భారత్ వినాల్సివచ్చింది. అదీ హెచ్1-బి వీసాల రూపంలో. ట్రంప్ మంత్రివర్గం హెచ్1బి వీసాల గడువును పొడిగించరాదని నిర్ణయించింది. ఇది భారతదేశానికి అస్సలు మేలు చేయని ప్రతిపాదన. అమెరికాలో శాశ్వత నివాసం కోసం హెచ్1బి వీసాలను మంజూరు చేస్తారు. ఈ నిర్ణయం భారత్‌కు కంటకప్రాయమైనదే. ప్రతిపాదించిన మార్పులు భారత జాతీయులకు దెబ్బే. హెచ్1బి వీసాలలో సగం భారతీయులే కలిగి ఉండడం దీనికి కారణం. ఒక దశాబ్ద కాలంగా గ్రీన్ కార్డు కోసం అనేకమంది భారతీయులు వేచి చూస్తున్నారు. పది లక్షల మందిపైనే హెచ్1బి వీసాలున్నాయి. వీరంతా గ్రీన్‌కార్డు కోసం వేచి చూస్తున్నారు. వీరిలో భారతీయులే ఎక్కువ. హెచ్1బి వీసా ఉంటే అమెరికన్ కంపెనీలలో నైపుణ్యమున్న వారికి ఉద్యోగాలొస్తాయి. సాంకేతికంగా నైపుణ్యమున్న వారికి ఆయా కంపెనీలు ప్రాధాన్యతనిస్తుంటాయి. కాంగ్రెస్ తీర్మానం ప్రకారం ఏటా యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సిఐఎస్) ఏటా 65వేల వరకూ హెచ్1బి వీసాలను మంజూరు చేయవచ్చు. అమెరికన్ విశ్వవిద్యాలయం నుంచి సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమేటిక్స్ (స్టెమ్)లో ఉన్నత విద్యను అభ్యసించిన వారికి 20వేల వీసాలూ ఇవ్వవచ్చు. దురదృష్టవశాత్తు ఎక్కువమంది హెచ్1బి వీసాలను దుర్వినియోగం చేస్తారు. అమెరికాకు శాశ్వతంగా వలస వచ్చేందుకు ప్రయత్నిస్తారు. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే, 5లక్షల మంది నిపుణులు భారత్‌కు తిరిగి వస్తారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లకు ఈ దెబ్బ ఎక్కువే. ఈ రెండు రాష్ట్రాల నుంచే హెచ్1బి వీసాల గురించి ఎక్కువ మంది వేచి చూస్తున్నారు. బై అమెరికన్, హైర్ అమెరికన్ అనే ట్రంప్ ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చుకునేందుకు హెచ్1బి వీసాల అంశాన్ని ఉపయోగించుకుంటున్నామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఇన్ ది యుఎస్ వెల్లడించింది. ఈ విధానం వల్ల ఈ వీసాలను ఇకపై పొడిగించరు. ప్రస్తుత చట్టం ప్రకారం విదేశాల నుంచి అతిథి ఉద్యోగుల వీసాలను ఒకసారి మూడేళ్ళపాటు పొడిగిస్తారు. మొదటిసారి మూడేళ్ళ కాలపరిమితితో హెచ్ 1బి వీసాలను మంజూరు చేస్తారు. ఈ ఆరేళ్ళ తరవాత ఆ ఉద్యోగి గ్రీన్ కార్డ్ దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే హెచ్1బి వీసాకు ఇంచుమించుగా కాలఅవధిలేని పొడిగింపు లభిస్తుంది. ఈ వెయిటింగ్ లిస్టును ఏళ్ళ తరబడి పొడిగించవచ్చు. గ్రీన్ కార్డు దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. భారత్, చైనాల నుంచి లక్షలాదిమంది పది నుంచి 12 సంవత్సరాలు అమెరికాలో ఉన్నారు. ప్రస్తుత చట్టాల ప్రకారం వారు గ్రీన్ కార్డ్ దరఖాస్తు పరిశీలన పూర్తయ్యే వరకూ అమెరికాలో ఉండవచ్చు. ట్రంప్ తన దారిని తాను ఎంచుకుంటే ఈ విధానానికి తెరపడుతుంది. ట్రంప్ యంత్రాంగం ఆ దిశగా చాలా తీవ్రంగా ఆలోచిస్తోంది. ఆరేళ్ళ తరవాత గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పరిశీలన పూర్తయ్యేదాకా అమెరికాను విడిచిపెట్టి వచ్చేయడమే. అంటే సుమారు 5 లక్షల మంది భారత్‌కు తిరిగొచ్చి, గ్రీన్‌కార్డ్ దరఖాస్తు పరిశీలన ఫలితం తమకు అనుకూలంగా రావాలని భగవంతుని ప్రార్థిస్తూ కూర్చోవాలి.

సాంకేతికంగా చూస్తే, ట్రంప్ యంత్రాంగ చర్య సరైనదే. హెచ్1బి వీసాల వ్యవహారంలో నిబంధనలను సవరించే అధికారం అక్కడి చట్టానికి ఉంది. నైపుణ్యమున్న ఉద్యోగులను అద్దెకు తెచ్చుకోవడానికి ఈ వీసాలను మంజూరు చేస్తారు. ఈ వీసా వలసలకు ఉద్దేశించినది కాదు. ఈ వీసాలను వినియోగించుకుని లక్షలాదిమంది ముఖ్యంగా భారత్, చైనా దేశీయులు అమెరికాలో స్థిరనివాసానికి అర్హులు చాస్తున్నారు. అమెరికన్ పౌరులు కావాలని ఉవ్విళ్ళూరుతున్నాయి.



సత్యానాదెళ్ళ, సుందర్ పిచాయ్ కూడా ఇదే దారిలో అమెరికన్ పౌరులయ్యారు. భారత్‌లో జన్మించిన ఈ ఇద్దరూ మైక్రోసాఫ్ట్ గూగుల్ సంస్థలకు అధిపతులయ్యారు. అమెరికా టెక్ ఇండస్ట్రీకి వారు ఎంతో విలువను చేకూర్చిపెట్టారు. అందుకే సంబంధిత వీసా విభాగాన్ని టక్ ఇండస్ట్రీ మాత్రమే కాకుండా పాత పాత యంత్రాంగాలు కూడా సానుకూలంగా చూశాయి.

చరిత్ర పరిశీలనకు 2016కు వెళ్ళాల్సి ఉంటుంది. స్థానిక టెక్ ఉద్యోగులు తమకు రావాల్సిన ఉద్యోగాలను విదేశీయులు ఎగరేసుకుపోతున్నారని భావించారు. తక్కువ జీతాలకే వారక్కడ ఉద్యోగాలు చేస్తున్నారు. అమెరికా టెక్ వర్కర్స్‌కి ఉద్యోగాలు లేవనడం అవాస్తవమని ట్రంప్‌ను ఒప్పించగలిగారు. హెచ్1బి వీసా అమెరికాలో ఉద్యోగాలు సంపాదించుకొడానికి ఒక భాగమైపోయిందని ట్రంప్‌కు వివరించారు. కానీ ట్రంప్‌కు వీసా వ్యవస్థపై చాలా తక్కువ అవగాహన ఉంది. స్థానిక సమస్యకు ఇదే పరిష్కారమనీ, దీనినిసవరిస్తానని చెపిన స్థానిక ఓటు బ్యాంకును కొల్లగొట్టారు. అధ్యక్షునిగా ఎన్నికైన సమయంలో డోనాల్డ్ ట్రంప్ అంతరంగంలో హెచ్1బి వీసాలకు అనుకూలంగానే ఉన్నారని మైకేల్ ఊల్ఫ్ రాసిన ఫైర్ అండ్ ఫ్యూరీ పుస్తకంలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నెరవేర్చడానికి ఆయన ఇప్పుడు వీసా వ్యవహారానికి తెరదించడానికి నడుం బిగించారు.

హెచ్-1 బి వీసాల పై ట్రంప్ అజ్ఞానమేమిటో న్యూయార్క్ మ్యాగజైన్ లో ప్రచురితమైన ఒక పుస్తకంలోని కొన్ని భాగాలు తెలియజేస్తున్నాయి.అంతేకాకదు, మీడియా దిగ్గజం రూపర్ట్ ముర్డోచ్‌తో ట్రంప్ జరిపిన సంభాషణలో కూడా ట్రంప్ విషయ పరిజ్ఞానం ఏపాటిదో వెల్లడైంది.

అమెరికన్ కంపెనీలు విదేశీ ఉద్యోగుల సేవలను వినియోగించకోవడం క్లిష్టతరం చేయడానికి నిబంధనలను బిగించేందుకు ఇంతకుముందున్న ప్రభుత్వాలు కూడా ప్రాసెసింగ్ ఫీజులను పెంచడం వంటి చర్యల ద్వారా ప్రయత్నాలు సాగించినప్పటికీ, హెచ్-1 బి వీసాల డిమాండ్ యథాతథంగా కొనసాగుతోంది. అవసరమైన నైపుణ్యం కలిగిన స్టెమ్ గ్రాడ్యుయేట్లను అమెరికా తయారు చేయలేకపోవడమే ఇందుకు కారణం.

ప్రస్తుత హెచ్-1బి నిబంధనల్లో మార్పుల వల్ల ఇతరుల కన్నా భారతీయులకే ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. ఏటా 85, 000 హెచ్-1బి వీసాలను జారీ చేస్తున్నారు. వీటిలో 50 శాతం పైగా భారతీయ ఉద్యోగులకే దక్కుతున్నాయి.అంటే, గడిచిన ఆరేళ్ళలో హెచ్-1బీ వీసాలు పొందిన భారతీయుల సంఖ్య 2,55,000 అన్న మాట.

హెచ్-1బి వీసా దారుల్లో వేలాది మంది తిరిగి వెళ్తున్నారు. పదేళ్ళు పైగా గ్రీన్ కార్డు ప్రాసెసింగ్‌కోసం నిరీక్షిస్తున్నారు. అమెరికాలో ఉద్యోగాలు అమెరికన్లకేనన్న తన హామీని నిలబెట్టుకునేందుకు ట్రంప్ తీసుకుంటున్న చర్యల్లో ఇది మొదటి దెబ్బకాదు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్-4 ఈఏడీ కార్యక్రమాన్ని రద్దు చేయనున్నట్ట ట్రంప్ ఇదివరకే ప్రకటించారు దీని కింద హెచ్-1బి వీసాదారుని భార్య కూడా అమెరికాలో కొన్ని నిబంధనలకు లోబడి ఉద్యోగం చేసుకోవడానికి అనుమతి ఉంటుంది. వీసా విస్తరణ ఉపసంహరణ ఎన్నటికీ అమలుకాదని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది ప్రస్తుతంప్రతిపాదన దశలోనే ఉంది. ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా బలమైన వాదాలు వినిపిస్తున్నాయి.వీటిల్లో ముఖ్యమైనవి... యువతరం అమెరికాలో పుట్టిన నిపుణులు అమెరిక పన్నుల వ్యవస్థను వృద్ధి చేయడానికి తోడ్పడుతున్నారు. ఇలాంటి నిబంధనలు ప్రవేశపెడితే అత్యున్నతమైన నైపుణ్యం కలిగిన ఉద్యోగులు స్వదేశాలకు,లేదా ఇతర దేశాలకు తిరిగి వెళ్ళి ఫేస్‌బుక్‌లూ,ఊబర్లు ప్రారంభిస్తారని అమెరికన్ ప్రభుత్వాన్ని నిపుణులు హెచ్చరించారు. చైనాలో ఇప్పటికే జరుగుతోంది.

ఒకరికి జరిగిన నష్టం ఎప్పుడూ మరొకరికి లాభం అవుతుంది.కెనడా నిపుణులను ఆకర్షించడానికి ఇప్పటికే గ్లోబల్ స్కిల్ స్ట్రాటజీ పేరిట ఒక వ్యూహాన్ని రూపొందించింది.ముఖ్యంగా, సాంకేతిక రంగానికి వర్తించే వ్యూహాన్ని రూపొందించింది.నిపుణుల దర్యాప్తులను ఆహ్వానిస్తోంది. రెండు వారాల్లో స్పందన తెలపాలని కోరుతోంది.మూడు నెలల వ్యవధిలో కెనడా దాదాపు 2,000 విదేశీ నిపుణులను ఆకర్షించింది.ఈ వీసాల్లో సగం పైగా భారతీయులవే కావడం గమనార్హం. ట్రంప్ శకం ప్రారంభమైన నాటి నుంచి అమెరికాలో హెచ్-1బి వీసాల దరఖాస్తుల్లో కొద్దిగా తగ్గుదల కనిపించింది.అయితే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్,కెనడాలలో అమలులో ఉన్న వీసాలమాదిరిగా నమూనా విధానం బ్లూప్రింట్‌ని అమెరికా తయారు చేసింది. ట్రంప్ ప్రభుత్వం తేనున్న మార్పులు ఐటి కంపెనీలకూ, హెచ్-1బీ వీసాను వినియోగించే వారికి ఇబ్బందికర పరిస్థితులను సృష్టిస్తుందని సాఫ్ట్ వేర్ సంస్థ నాస్కామ్ హెచ్చరించింది.

రైతన్న సంక్షేమమే లక్ష్యం కావాలి!

హలంపట్టి పొలందున్నే రైతు అప్పుల్లో పుట్టి, అప్పుల్లో పెరిగి, అప్పుల్లోనే ఛస్తూ... ఆ అప్పులనే తన సంతానానికి...సంపదగా పంచియిస్తున్నారు... తరతరాలుగా...

అలనాడే జ్యోతిరావుపూలే అన్నారు... రైతులు విద్యావంతులైతేనే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని. ఈ దేశానికి బలం, భారత జాతికి కలిమి రైతుమాత్రమే కదా! అతని శ్రమతోనే దేశంలో దారిద్ర్యం తొలగిపోతుంది. అందుకే దేశానికి రైతు వెన్నెముక అన్నారు. ఆ వెన్నెముకను నేడు పాలకులు, కార్పొరేట్ శక్తులు కూడబలుక్కొని దేశ వెన్నెముకను ముక్కలు చేస్తున్నారు. ఇది ముందుతరాలకు ముమ్మాటికి ముప్పుగా పరిణమిస్తుంది. విజ్ఞులారా! బుద్ధిజీవులారా, యువకుల్లారా... మన కడుపు నింపి ఆకలితీర్చే రైతన్న సంక్షేమాన్ని కోరుకుందాం. గతితప్పుతున్న పాలకులను గాడిన పెట్టడానికి రైతు ఉద్యమాలను బలపరుస్తూ చేయూతనిద్దాం. పార్లమెంటు, శాసనసభలో వివిధ రంగాల నిపుణుల ప్రత్యేక రిజర్వేషన్ల ద్వారా ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటున్నారు. కానీ ఈ దేశానికి, మనందరికి పట్టెడు అన్నం పెట్టే రైతుకు మాత్రం చట్టసభలో స్థానం లేదాయే? రైతాంగ సమస్యలకు ప్రాతినిధ్యం లేనిది ఎలా ప్రతిబింబిస్తుంది. వారి కష్టనష్టాలు ఆలోచించాలి. ఈ దేశ ప్రజలకు బువ్వ నోటికి అందించడానికి రైతు కుటుంబం పడుతున్న శ్రమను, తూకం వేయడానికి తాసులేదు. బాట్లు లేవు, వెలకట్టలేనంత గొప్పది రైతు కష్టం. ఈ ఏడు పత్తికి మద్దతు ధర 4320 గా కేంద్రం నిర్ణయించింది. తేమ పేరుతో కోతలు పెడుతూ, చివరకు సగటున క్వింటాలుకు 3500 కు మించి రైతుకు దక్కడం లేదు. గత ఐదేళ్ళుగా ప్రభుత్వం పత్తికి మద్దతు ధరలు చూస్తే 2012 నుండి వరుసగా రూ.3900, 4000, 4050, 4100, 4320. వాస్తవ ఖర్చుల్లో రైతు కుటుంబం కోడికూత పొద్దునుంచి రాత్రివరకు పంట చేనులో చేసే రెక్కల కష్టాన్ని లెక్కల్లోకి తీసుకోవడం లేదు. మద్దతు ధర నిర్ణయంలో పాలకులు ఇన్ని రైతు ఆత్మహత్యలు జరిగినా స్వామినాథన్ సిఫారసుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు మరో 50 శాతం అధికం చేస్తేనే రైతుకు గిట్టుబాటు అవుతుందని చెప్పినప్పటికీ 4320 మద్దతు ధర ప్రకటించడం న్యాయమేనా!

దీనిని శాస్త్రీయ విధానం అంటారా! అకాల వర్షాలు, చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలు, తట్టుకొని రాత్రింబవళ్ళు కష్టపడి పండించిన పంటకు పెట్టుబడికి, పంట దిగుబడికి, రాబడికి పొంతనలేక అప్పులు తీర్చేదారిలేక ఎటూ పాలుపోక ఆత్మహత్యలు చేసుకున్నవారి సంఖ్య ప్రభుత్వ లెక్కలకు, రైతు సంఘాల లెక్కలకు పొంతన కుదరడం లేదు. ఇది నిజనిర్ధారణలో తేలాల్సి ఉంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ కారణంగా గత మూడు దశాబ్దాలుగా వివిధ సర్వేల అంచనాల ప్రకారం దేశవ్యాప్తంగా 4 లక్షల పైచిలుకు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు తెలుస్తుంది. భారతదేశానికి రైతే వెన్నెముక, అన్నదాతంటూ ప్రచారపటోపాలతో పల్లకి మోతలు మోస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయింపులో మాత్రం అరకొర వాటాలతో వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. పాలకులు మారినా, పార్టీలు మారినా రైతాంగానికి, వ్యవసాయరంగానికి పట్టిన దరిద్రాన్ని అంతమొందించలేకపోతున్నారు. గత ఏడాది మిర్చి పంటను వేసి, రైతాంగం పెట్టిన పెట్టుబడి రాక మిర్చి పంటను చేలల్లో మార్కెట్ యార్డుల్లో తగలబెట్టిన దీనస్థితిని చూశాం. నేడు వరిపంటను దోమపోటుతో పొలాల్లో తగలబెడుతున్నారు. పత్తిపంట చేతికందే సమయానికి అకాలవర్షాలు ఒకవైపైతే, కార్పొరేట్ విషకౌగిలిలో బహుళజాతి కంపెనీల ఘరానా మోసాలకు సుమారు 700 కోట్ల అక్రమ బీటి పత్తి విత్తన దందాతో రైతాంగం బలిపశువులయ్యారు. ప్రపంచవ్యాప్తంగా నిషేధించిన బోల్‌గార్డ్ -3 పత్తి విత్తనాలకు మన రాష్ట్రం అడ్డంగా మారింది. ఈ విత్తనాలు మానవాళినే కాదు పశుపక్ష్యాదుల మనుగడకు కూడా అత్యంత ప్రమాదకరమని



వ్యాపారం రహస్యంగా ఖరీఫ్ కాలంలో రాష్ట్రంలో 13 లక్షల ఎకరాల్లో ఈ విత్తనాన్ని వేయగా, దిగుబడి సగానికి సగం తగ్గడం మూలంగా, రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నష్టం విలువ సుమారు 2,600 కోట్లు ఉంటుందని అనధికారిక లెక్కల ద్వారా తెలుస్తుంది. బహుళజాతి కంపెనీల అక్రమ విత్తన వ్యాపారంలో స్థానిక విత్తన వ్యాపారులు, బ్రోకర్లు సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారు.

ఇంత జరిగినా వ్యవసాయశాఖ నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం వెనకాల చేతివాటాలే కారణమా అనిపిస్తుంది. మార్కెట్ యార్డులు దోపిడీ కేంద్రాలుగా మారాయి. సిసిఐ కొర్రీలతో పత్తి రైతుకు ధర గిట్టుబాటు కాక భోరున విలపిస్తున్నారు. వీరికి అండగా ఉండాల్సిన అధికారులు, వ్యాపారులు, అడ్తిదారులు నిర్లజ్జగా దోపిడీని చేస్తూనే ఉన్నారు. పత్తి పంటకు తెచ్చిన అప్పులు ఎలా తీరాలని యువ రైతులు ఆందోళనకు గురికావలసి వస్తుంది. వ్యవసాయానికి, రైతాంగానికి ఏ విధంగా చూసినా అటు సమయానికి వర్షాలు పడక ఒకవైపైతే, అరకొర పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాలు పడడం వలన అన్నదాత నోటిదగ్గరకొచ్చిన ముద్దను తన్నుకెళ్తున్నందువలన వీరి స్థితి దీనంగా మారింది. ప్రభుత్వాలు మద్దతు ధర నిర్ణయాలలో స్పష్టమైన విధానాలు లేక శాస్త్రీయంగా రైతు పెట్టుబడికి తగిన పంటకు మద్దతు ధర రాకపోవడం వలన తెచ్చిన అప్పులు తీర్చలేక రైతాంగం బతుకు అగమ్యగోచరంగా మారింది. ఇది ఎన్నో ఏళ్లుగా... ఈ తీరు కొనసాగుతోంది నిజం కాదా! దీనిని అరికట్టాల్సిన బాధ్యత పాలకులపైనే ఉందని భావించండి. వ్యవసాయ రంగంలో సంక్షోభం అనేది ఒక ప్రాంతానికో, రాష్ట్రానికో, రైతాంగం పండించే పంటల్లో ఏదో ఒక పంట వల్ల వచ్చిన సమస్యకాదు. భారతదేశవ్యాప్తంగా అన్ని రకాల పంటలు పండించే రైతులు ఏదోవిధంగా బాధలను ఎదుర్కొంటున్నారు. దీనిని పాలకులు ఎన్నికల వేళ ఏదో రైతాంగానికి బిచ్చం వేసినట్లు ఒకటి అర రుణమాఫీ అనో, మద్దతు ధరనో పథకాల ఆశచూపి కాలం వెళ్లదీస్తున్న తీరు మారాలి. ఈ రంగాన్ని గతంలో అధ్యయనం చేసిన, రాయల్, జయంతి ఘోష్ మరియు స్వామినాథన్ లాంటి కమిషన్లను సమీక్షించుకొని ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై శాస్త్రీయ అధ్యయనం చేసి పాలకులు రేపటి ఓటు కోసం కాకుండా, రేపటి తరం వ్యవసాయరంగం అంటే మక్కువ కలిగేలా చేయాలి. ఎంత బడ్జెట్ వెచ్చించైనా గాడిలో పెట్టి అభివృద్ధి పరచకపోతే, రేపటి తరానికి నేటి పాలకుల వలన కూటికి గింజ దొరకని వ్యవస్థకు కారకులవుతారని భావించడం ఖాయం. పాలకులూ... చరిత్ర హీనులు కాకండి.

ఆకలి రాజ్యానికి ఆజ్యం పోయకండి. రైతు ఉద్యమాలపై ఉక్కుపాదం మోపితేనో,జైల్లో వేస్తేనో, రైతాంగంపై కాల్పులకు దిగితేనో, బేడీలు వేస్తేనో.. కట్టడి చేయగలమనుకుంటే! ప్రతిఘటన అనివార్యం అవుతుంది. ఈ మధ్య జరిగిన మనదేశ రాజధాని ఢిల్లీలో కిసాన్ ముక్తి యాత్రల మూలంగా రైతాంగ పోరాటాలసారం కర్షకులంతా ఒక్కటవ్వాలనే అభిప్రాయం. దేశవ్యాప్తంగా ఉన్న రైతు సంఘాలు 184 ఒక వేదికమీదకు (వచ్చాయి) తెచ్చారు. జాతీయ శాంపిల్ సర్వే ప్రకారం పురుషులు 59 శాతం, మహిళలు 75 శాతం మంది వ్యవసాయరంగం పైనే ఆధారపడి జీవిస్తున్న దేశం మనది. దీనికి కూడా అనుబంధంగా కూలీలు, ఇతర వృత్తులకు ఇదే జీవనాధారం. ఇంతమంది ఆధారపడ్డ రంగాన్ని ఇలా జాలిగా గాలికి వదిలేస్తే ఎలా? వీరంతా ఎన్నికల్లో వరసలో నిలబడి ఓపికగా ఓట్లువేస్తేనే కదా అధికార పీఠం ఎక్కింది. ఓటు (పోలింగ్)కు దరిదాపులకు రాని కార్పొరేటు రంగానికి లక్షల కోట్లు రాయితీల పేరుతో బంగారు పళ్లెంలో పెట్టి ధారాదత్తం చేయడాన్ని ఎలా చూడాలి? ఇది నిజం కాదా! పాలకులు కోరుకునేది రైతు రాజ్యమా? కార్పొరేట్ వ్యాపార వర్గాల రాజ్యమా తెలుసుకోండి? పార్లమెంటులో రైతాంగం, వ్యవసాయంపై ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి, రైతుకు ఆపదలేని జీవితాన్ని అందించాల్సిన బాధ్యత పాలకులదేనని గమనించండి. ఢిల్లీలో కిసాన్ ముక్తియాత్ర ఐక్యత స్ఫూర్తిని... రైతాంగం పాలకులు దిగివచ్చే దాకా కార్మికులు, కర్షకులు పోరాటాలకదనరంగాన్ని కొనసాగించాలి. ప్రజాసంఘాలు, ప్రజల పక్షాన నిలిచే పత్రికలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాలు ముందుండి మానవీయ కోణంలో ఈ రంగానికి మద్దతు తెలపాల్సిన బాధ్యతను మరువరాదు. ఇది మన బాధ్యతేకాదు, హక్కుగా భావించండి.

ప్రభుత్వం ఖర్చుచేసే ధనం ప్రజల ధనమే. అందుకే ప్రభుత్వ (నిధులు) సేవల్లో రైతుకుటుంబానికి ప్రథమ ప్రాధాన్యత నివ్వాల్సిన బాధ్యత పాలకులది. రైతులు అసంఘటితంగా ఉండకుండా, సంఘటితమై వారికి చెందాల్సిన వాటాను పొందుటకు పోరాటమొక్కటే మార్గమని గమనిం చండి. ఓట్లు దండుకోవడానికి ప్రతి సాధారణ ఎన్నికల్లో రైతుల (మాట)బాట అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఊదరగొట్టి పాలన చేతికొచ్చినాక అన్ని పార్టీలు, అందరు నాయకులు ఏరు దాటాక తెప్పతగిలేసినట్లుగా వాగ్దానాల ఊసెత్తక పోతుంటిరి. పాలకులు అధికార పీఠానికై ఓటుకై ప్రేమఒలక పోస్తున్నారని, రైతాంగాన్ని ఆదుకోవాలనే చిత్తశుద్ధి లేదనే దానికి, రైతు ఆత్మహత్యలే నిదర్శనం. పాలకులు ప్రతిపక్షాలు చీకటి ఒప్పందాలతో, కూడబలికి వంతులవారీగా దంచుకు తింటున్నారు. శ్రమదోపిడీ, ఆర్థిక దోపిడీలను నివారించాలి. అప్పుడే ఆర్థికంగా, సామాజికంగా సమసమాజం ఏర్పడు తుంది.

నాకు అన్నంతింటూంటే, ఎక్కిళ్లు వస్తున్నాయి. నీళ్ళు తాగనందుకు కాదు. ఎక్కడో రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడనే అభద్రత భావన నుండి రైతులకు విముక్తి కలిగించాలి. నాటి స్వాతంత్ర్య పోరు, మొన్న తెలంగాణ సాయుధ రైతాంగపోరు, నిన్న మలిదశ తెలంగాణ పోరు నడిపినం... చరిత్రగతినే మార్చినం. ప్రపంచం మెచ్చింది. నేడు పాలనలో కో(వా)టాకై పాలకులను, పాలన స్థంభింపచేసి, మెడలు వంచి అనివార్యత ఏర్పరచుదాం. మట్టిని నమ్మిన ఓ మహాత్మా... మరణం కాదు! ఆమరణదీక్ష పూనితే పాలకులు దిగారారా! పాలన మనచేతికి ఎందుకురాదు? దేశం నడిబొడ్డున ఢిల్లీ వేదిక స్ఫూర్తితో కిసాన్ విముక్తియాత్ర వలన పాలకుల వెన్నులో వణుకు పుట్టింది. గమ్యం చేరేదాక పోరుదివిటీని చేబూని మడమతిప్పకుండా రణం చేద్దాం.ఈ దయనీయ స్థితి మారాలి.రెండునాల్కలు లేవు, పదితలలు అంతకన్నాలేవు. నిజాయితీగా చావుకు వెనకాడని సత్య శీలుడు. రైతాంగం (వ్యవసాయం)లో కష్టాలు, కడగళ్లు తొలిగి, ఆత్మహత్యలు ఆగిననాడే వారి మోములో నవ్వులు విర బూస్తాయి. రైతు నవ్వులే అందరికీ ఆనందమని గమనించండి. ఏ ఒక్కరైతు కుటుంబంలో దుఃఖం దరిచేరకుండా ఉండా లంటే, నిధులు పెంచడంతోపాటు, పాలనలో వాటా వస్తేనే రైతుల ఆవేదనలు తీరుతాయి. రైతే రాజనే మాటలు కాదు చేతల్లో చూపాలి. ఆనాడే ఈ దేశానికి నిండైన ఆనందాల పండుగ.

● మేకిరి దామోదర్, 9573666650

సమర్థులకే కీలక పోస్టులు

- ఐపీఎస్‌ల జాబితాను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్
- హైదరాబాద్ సీపీ పోస్టుకు తీవ్ర పోటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సీనియర్ పోలీసు అధికారుల బదలీ విషయంలో సిఎం కెసిఆర్ చేస్తున్న కసరత్తు కొలిక్కి వస్తున్నట్లు సమాచారం. సమర్థులైన అధికారులకు కీలకమైన స్థానాలను కట్టబెట్టాలన్న ఆలోచనతో ఉన్న కెసిఆర్ పలు దఫాలుగా అందుబాటులో ఉన్న అధికారులతో భేటీ అవుతున్నారు. జిల్లాల పర్యటనలు చేస్తున్న డిజిపి కూడా వీలున్న సమయాలలో సిఎంను కలిసి తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు రోజులలో సీనియర్లతో భేటీ కాబోతున్న సిఎం అంతకు ముందే కొంతమంది అధికారుల విషయంలో స్పష్టతకు వచ్చినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఈ వారాంతంలోగా బదలీలకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసే అవకాశాలున్నాయి.

కీలకమైన హైదరాబాద్ పోలీసు కమిషనర్ పోస్ట్ కోసం పలువురు అధికారులు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఆ స్థానంలో ఎవరిని నియమించాలన్న అంశంపై తుది నిర్ణయానికి వచ్చారని సమాచారం. సివిల్ సప్లై కమిషనర్‌గా పని చేస్తున్న సివి ఆనంద్‌ను కానీ, హోం శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న రాజీవ్ త్రివేదిని కానీ నియమించాలన్న నిర్ణయానికి వచ్చారని తెలిసింది. రామగుండం పోలీసు కమిషనర్‌గా పని చేస్తున్న వికె దుగ్గల్ హర్యానాకు డిప్యూటేషన్‌పై వెళ్తున్న నేపథ్యంలో హైదరాబాద్ పశ్చిమ మండలం డిసిపిగా పని చేస్తున్న వెంకటేశ్వరరావును నియమించాలని భావిస్తున్నారంటున్నారు. సిద్దిపేట పోలీసు కమిషనర్‌గా పని చేస్తున్న శివకుమార్ గత కొంత కాలంగా హైదరాబాద్‌లో పని చేస్తానని, తన తల్లి ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోవాల్సి ఉందని కోరుతున్నందున ఆయనను సిఐడిలో నియమించనున్నారని అంటున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పని చేస్తున్న అకున్ సబర్వాల్‌ను సైబరాబాద్ సిపిగా నియమించి అక్కడ పని చేస్తున్న సందీప్ శాండిల్యాను పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలను కట్టబెట్టనున్నారని తెలిసింది. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పని చేస్తున్న నవీన్ చంద్‌ను సైబరాబాద్ సిపిగా బాధ్యతలను కట్టబెడతారని వినిపిస్తోంది. హైదరాబాద్ దక్షిణ మండలం డిసిపిగా పని చేస్తున్న సత్యనారాయణను తప్పించనున్నట్లు సమాచారం. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిని, ఆరోపణలు ఎదుర్కుంటున్న వారిని వీలైనంత మేరకు అప్రాధాన్యత స్థానాలలో నియమించాలని సిఎం భావిస్తున్నారని అధికార వర్గాల సమాచారం.

ఖాళీలతో ఫ్రెండ్లీ పోలీసింగ్?



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పోలీసు శాఖకు కీలకమైన కానిస్టేబుళ్ళ భర్తీలో రాష్ట్ర ఆర్థిక శాఖ పెడుతున్న కొర్రీలపై పోలీసు ఉన్నతాధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ సౌకర్యాల కోసం భారీ ఎత్తున నిధులను ఉదారంగా కేటాయిస్తున్న తరుణంలో క్షేత్ర స్థాయిలో ప్రజలతో సత్సంబంధాలను నెరపాల్సిన సిబ్బంది నియామకం విషయంలో గణాంకాలను చూడటం సరైంది కాదని అంటున్నారు. జిల్లాల పెంపు, ప్రాంతాల వారిగా కమాండ్ కంట్రోల్ రూంలను నిర్మించాలని నిర్ణయించడం వల్ల సిబ్బంది నియామకం అత్యవసరమని అధికారులు అంటున్నారు. ఒకేసారి సిబ్బందిని నియమించడం వల్ల శిక్షణ కోసం విడతల వారీగా వెచ్చించే ఖర్చు తగ్గుతుందని అంటున్నారు. శాఖలో ప్రధానంగా సాంకేతిక నిపుణులు అవసరమని, కమాండ్ కంట్రోల్ రూంలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీరి సేవలు ముఖ్యమని పేర్కొంటున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలోనే దాదాపు 18 వేల కానిస్టేబుళ్ళ నియామకాలకు సిఎం సుముఖత వ్యక్తం చేశారని, ఆ తర్వాత దాదాపు 10 వేల కానిస్టేబుళ్ళు పదవీ విరమణ పొందారని అధికారులు పేర్కొంటున్నారు. సిబ్బంది కొరత లేకుండా నియామకాలకు సిఎం సుముఖంగా ఉన్నప్పటికీ ఆర్థిక పరమైన ఇబ్బందులంటూ నియామకాలను కుదించడం పట్ల అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక శాఖ కేవలం 14,400 పోస్టులకు మాత్రమే అనుమతించడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తాజా నియామకాలలో దాదాపు అయిదు వేల మంది సాంకేతిక నిపుణులు అవసరమని అధికారులు అంటున్నారు. హైదరాబాద్‌లో అత్యంత అధునాతనమైన కమాండ్ కంట్రోల్ రూం నిర్మాణం, వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలతో పాటు మరిన్ని చోట్ల కమాండ్ కంట్రోల్ రూంలను నిర్మించాలని నిర్ణయించిన నేపథ్యంలో నియామకాలను పూర్తి చేయడంతో పాటు సుశిక్షితులుగా తయారు చేయాల్సి ఉందని అంటున్నారు. వీరితో పాటు శాంతి భద్రతలు, ట్రాఫిక్ తదితర విభాగాలలో పని చేసేందుకు క్షేత్ర స్థాయి సిబ్బంది కొరత ఉందని వారు తెలిపారు. ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిన పోస్టుల భర్తీకి సిఎం నుంచి అనుమతి రాగానే నోటిఫికేషన్ జారీ చేసేందుకు పోలీసు నియామక బోర్డు సన్నద్ధమవుతోంది. ఒకవైపు నియామకాల ప్రక్రియను కొనసాగిస్తూనే మరిన్ని కొత్త పోస్టుల భర్తీకి అనుమతించాలని సిఎం వద్ద ప్రతిపాదనలను ఉంచాలని నిర్ణయించారు.

భర్తీ చేయాల్సినవి 30 వేలు...అనుమతించినవి 14 వేలు

జిల్లాల వారీగా శిక్షణ

గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 14,400 పోస్టుల భర్తీకి అనుమతి రానుండటంతో తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీతో పాటు జిల్లాలలో ఉన్న అన్ని పోలీసు శిక్షణా కేంద్రాలలో అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లా పోలీసు శిక్షణా కేంద్రాలలో రిట్రీట్ (పునశ్చరణతరగతులను) నిర్వహిస్తుంటారు. హైదరాబాద్ నగర శివార్లలోని పోలీసు అకాడమీలో అభ్యర్థులకు శిక్షణ ఇస్తుంటారు. ఈసారి ఏకంగా 14,400 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వాల్సి వస్తున్నందున అందుకు అనుగుణంగా జిల్లా శిక్షణా కేంద్రాలను వినియోగించుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా శిక్షణలోనూ కొత్త కోర్సులను ప్రవేశ పెట్టాలన్న ఆలోచనను కూడా అధికారులు చేస్తున్నారు. మానసిక వత్తిడి, మాబ్ కంట్రోల్ సమయంలో అనుసరించాల్సిన మెళకువలు, వివిఐపీల పర్యటన సందర్భంగా గంటల కొద్దీ మారుమూల ప్రాంతాలలో, ఒకే చోట విధులను నిర్వహించేందుకు సన్నద్ధులను చేయడం తదితర అంశాలను ప్రవేశపెట్టనున్నారు. ఇందు కోసం ఆయా రంగాలలో నిష్ణాతులైన వారితో కాంట్రాక్టును కుదుర్చుకోబోతున్నారు.

హైదరాబాద్ రేంజ్‌లో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు

హైదరాబాద్ రేంజ్‌లో పని చేస్తూ గత కొంత కాలంగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ముగ్గురితో పాటు మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదలీ చేస్తూ ఐజి స్టీఫెన్ రవీంద్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేంజ్ కార్యాలయంలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న షేక్ అహిల్ జమాను సూర్యాపేట సిసిఎస్‌కు, బి. రాజేష్‌ను సూర్యాపేట డిఎస్‌బికి, యు. శ్రీనివాసులురెడ్డిని కోదాడ టౌన్ ఎస్‌హెచ్‌ఓగా అక్కడ పని చేస్తున్న జి. రజితను ఆలంపూర్ సర్కిల్‌కు బదలీ చేశారు. మిర్యాలగూడ రూరల్ సర్కిల్‌లో పని చేస్తున్న జె. రవీందర్‌ను నాగారం సర్కిల్‌కు పంపిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

ముగ్గురు నక్సలైట్లు అరెస్టు



ఏటూర్‌నాగారం, ప్రభ న్యూస్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని వెంకటాపురం పరిసర ప్రాంతంలో శుక్రవారం ఏటూర్‌నాగారం ఏఎస్పీ రాహెల్ హోగ్డె ఆధ్వర్యంలో ముగ్గురు వ్యక్తులు అనుమానస్పద స్థితిలో తిరుగుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్పీ వివరాల ప్రకారం శుక్రవారం వెంకటాపురం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బెటాలియం సిబ్బంది ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో వారు మడివి పాండె అలియాస్ సుశీల అలియాస్ లక్ష్మీ, ఉత్తెం గ్రామం బైరంగడ్ బిలాక్, బీజాపూర్‌జిల్లాకు చెందిన వారిగా గుర్తించామన్నారు. ఈమె 2009 సంవత్సరం నుంచి సీపీఐ మావోయిస్టు పార్టీలో మిర్పుర్ ఎల్‌ఓఎస్, బైరంఘడ్ ఎల్‌జీఎస్, ప్లాటూన్ గంగలూర్ ఎల్‌ఓఎస్లో పనిచేసి 2014 సంవత్సరంలో ఏరియా కమిటీ సభ్యురాలిగా ప్రమోషన్ తీసుకుని 2015 నుంచి సీపీఐ మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ అయిన కటుకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ అలియాస్ దూలదాదాకి ప్రొటెక్షన్ టీం ప్లాటూన్ కమాండర్‌గా పనిచేస్తుందన్నారు. ఈమె భుజానికి తగిలిన గాయానికి చికిత్స నిమిత్తం భీమవరం గ్రామానికి చెందిన మిలిషియా సభ్యులు రమేష్, నందినీలతో కలిసి వెళ్లి చికిత్స అనంతరం ఛత్తీష్‌గఢ్ వెళ్తుండగా వెంకటాపురం వద్ద పట్టుకోవడం జరిగిందన్నారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపడం జరుగుతుందన్నారు.

కట్టుకున్నోడే కాలయముడు

- లొంగిపోయిన భర్త
- అనాథలుగా పిల్లలు




మృతిచెందిన పద్మ

ఇల్లెందు, ప్రభన్యూస్: గురువారం రాత్రి జగదాంబ సెంటర్లో ఇద్దరు స్నేహితులతో కలిసి బలవంతంగా భార్యను ఆటో ఎక్కించుకుని జన సంచారం లేని ప్రాంతానికి తీసుకెళ్లి హత్యచేసి చేతులు దులుపుకున్నాడు ఓ ప్రబుద్ధుడు. పట్టణ పరిధిలో నివాసముంటున్న పద్మ, కారెపల్లి మండల పరిధిలోని తొడిదలగూడెం గ్రామానికి చెందిన బండారి ప్రభాకర్ ఇరువురు ప్రేమించుకుని పది సంవత్సరాల క్రితం పెళ్ళి చేసుకున్నారు. పద్మ ప్రభుత్వ ఉద్యోగి. ప్రభాకర్ సైకోలాగా ప్రవర్తించేవాడని గ్రామస్తులు తెలిపారు. కొంతకాలం కాపురం చేసిన ప్రభాకర్ భార్యతో తరుచూ గొడవపడి విడివిడిగా ఉంటున్నారు. ఖమ్మం జెడ్పీ కార్యాలయంలో పద్మ క్లర్కుగా విధులు నిర్వహిస్తూ గురువారం రాత్రి ఖమ్మం నుంచి బస్సులో ఇంటికి వెళ్తున్న క్రమంలో కాపు కాసిన ప్రభాకర్ ఆమెను బలవంతంగా ఆటోలో ఎక్కించుకొని మండల పరిధిలోని సుభాష్‌నగర్ సమీపంలో మొట్ల గూడెం గ్రామానికి వెళ్లే రహదారి వెంట ఉన్న ముళ్ళ పొదల్లో తీసుకెళ్ళి మెడలో ఉన్న చున్నీతో గొంతు నులిమి హత్య చేశాడు. హత్య అనంతరం ప్రభాకర్ పోలీసులకు లొంగిపోయాడు. శుక్రవారం ఉదయం డీఎస్పీ ప్రకాశ్‌రావు, ఎస్సైలు సిబ్బందితో సంఘటనా స్థలానికివెళ్ళి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. డీఎస్పీ ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ఘటనను నిందితుడు తమకు వివరించాడని, ఆయనతో పాటు మరో ఇద్దరి సహకారం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పద్మ హత్యతో పిల్లలు జయేంద్ర, రిషిక అనాథలుగా మారారు.

బావ కోసం భర్త హత్య


- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు



అమరావతి, ఆంధ్రప్రభ : వావివరసలు మరచిపోయి అక్క భర్తతో అక్రమ సంబంధాన్ని కొనసాగించేందుకు భర్తను కడదేర్చిన కర్కశకురాలి ఉదంతం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం పొనుగుపాడు గ్రామానికి చెందిన నలబోతు నరేంద్ర పేరేచర్లలోని ఆంధ్ర సుగర్స్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డు. అతనికి నాలుగేళ్ల క్రితం మేనమామ కుమార్తె శ్రీవిద్యతో వివాహమయింది. శ్రీవిద్యకు, ఆమె అక్క భర్త, నరసరావుపేటకు చెందిన గొట్టిపాటి వీరయ్య చౌదరి అలియాస్ వాసుతో వివాహానికి ముందే వివాహేతర సంబంధం ఉంది. శ్రీవిద్య, వాసు కలుసుకోవడానికి భర్త అడ్డుగా ఉండటంతో అతన్ని అడ్డు తొలగించుకోవాలని వారు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో వాసు, శ్రీవిద్య వాసు స్నేహితులైన గుంజి బాలరాజు, పూజల చౌదయ్యలతో కలిసి నరేంద్రను అంతం చేసేందుకు పథకం సిద్ధం చేసుకున్నారు. పార్టీ చేసుకుందామంటూ పిలిచి గత నెల 19న రాత్రి 8.30 గంటల సమయంలో గుంటూరు-కర్నూలు హైవే రోడ్డులో కొత్తపాలెం దాటిన తర్వాత మార్కాపూర్ రోడ్ వద్ద మద్యంలో సైనెడ్‌ను కలిపి నరేంద్రతో తాగించి హత్య చేశారు. అనంతరం వాసు కారులో నాదెండ్ల మండలం, సాతులూరు గ్రామ పరిధిలోని పొనుగుపాడు కాలువ గట్టున పడేసి వెళ్లిపోయారు. ఈ హత్యపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం నిందితులైన వీరయ్య చౌదరి, గుంజి బాలరాజు, పూజల చౌదయ్యలను శుక్రవారం అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయి శ్రీవిద్య ఇంకా పరారీలోనే ఉంది.

పరివర్తన ఖైదీలకు క్షమాభిక్ష!

- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- రెండు మూడు రోజుల్లో జీవో



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సుదీర్ఘ నిరీక్షణ, నిర్వేదం తర్వాత జనవరి 26 (రిపబ్లిక్ డే) సందర్భంగా జీవిత ఖైదీల విడుదలపై ప్రభుత్వం దృష్టిసారించింది. తెలంగాణ ప్రభుత్వం సత్‌ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు కసరత్తు షురూ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత వివిధ కారణాలతో ఖైదీల విడుదల వాయిదా పడుతూ వచ్చింది. అనేక సందర్భాల్లో ఖైదీల విడుదలపై ప్రభుత్వం కసరత్తును చేసినా ఆచరణలోకి రాలేదు. ఈ నేపథ్యంలో సత్‌ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని పలు మార్లు పలు సంఘాల నుంచి విజ్ఞప్తులు వెల్లువెత్తిన సంగతి విదితమే.

పలు సందర్భాల్లో ఇదే విషయమై సంబంధిత అమాత్యుల వద్ద ఖైదీలు, వారి బంధువులు సైతం తమ గోడును వెళ్లబోసుకున్నారు. వచ్చేది ఎన్నికల ఏడాది కావడంతో దీనిపై ప్రభుత్వం దృష్టిసారించింది. వివిధ నేరాలకు పాల్పడి వివిధ కారాగారాల్లో శిక్షఅనుభవిస్తూ పరివర్తన చెందిన ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించాలని సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి రాజీవ్ త్రివేది, లా కమిషన్ ఛైర్మన్, తెలంగాణ జైళ్లశాఖ డీజీ వీకే సింగ్, ఐజీ ఆకుల నరసింహా నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖైదీల విడుదలపై చర్చించారు. మార్గదర్శకాలను రూపొందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో జీవోల విడుదల చేసేందుకు సన్నద్ధులవుతున్నారు. ఐదు సంవత్సరాల వాస్తవిక శిక్ష, రెండు సంవత్సరాల రెమిషన్ కలిపి గతంలో కంటే ఇప్పుడు మార్గదర్శకాలను మరింత సులభతరం చేయాలని భావిస్తున్నారు.

ఎంతో కాలంగా ఈ సమస్యపై ఖైదీల తరపున పలు ప్రజా, జీవిత ఖైదీల సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేస్తూ వచ్చాయి. గతంలో ఖైదీల విడుదల కోరుతూ ఆయా సంఘాలు హోంమంత్రిని కలిసి మొరపెట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం అందుకు అనువుగా ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఖైదీల విడుదలతో వారి కుటుంబాల్లో ఆనందం నింపాలని యోచిస్తోంది. దీంతో, ప్రభుత్వం జనవరి 26న ఖైదీల విడుదలకు దాదాపుగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకుందని సమాచారం. ఈ మేరకు పూర్తిస్థాయిలో కసరత్తు షురూ చేసింది. దీంతో ఎన్నాళ్లకెన్నాళ్లకు తమ విడుదలపై ప్రభుత్వం కనికరం చూపినా తాము విడుదలవుతున్నామన్న సంతోషాన్ని ఎందరో ఖైదీలు వెలిబుచ్చుతున్నారు.

అది ఇసుక మాఫియా హత్యకాదు

- కామారెడ్డి జిల్లా కలెక్టర్, ఎస్పీ వెల్లడి



ఘటనా స్థలంలో కలెక్టర్, ఎస్పీ

కామారెడ్డి, ప్రభ న్యూస్ : కామారెడ్డి జిల్లా, పిట్లం మండలంలోని కారేగాం సమీపంలోని కాకి వాగు వద్ద ఇసుక మాఫియా చేతిలో వీఆర్ఏ హత్యకు గురయినట్టు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేతా రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఘటనా స్థలానికి వెళ్లిన కలెక్టర్, ఎస్పీ అక్కడి ప్రత్యక్ష సాక్షులను విచారించిన అనంతరం రాత్రి కామారెడ్డి కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హత్యకు గురయినట్టు చెప్పబడుతున్న సాయిలు అసలు వీఆర్ఏనే కాదని, సాయిలు చిన్ననాన్న వీఆర్ఏ అని అది కూడా పక్క గ్రామమైన మార్తాండ గ్రామ వీఆర్ఏ నారాయణ అని అన్నారు. అసలు కాకివాగులో ఇసుక క్వారీ లేదని, అక్కడ రాళ్లతో కూడిన కొద్దిపాటి ఇసుక ఉందని అది కూడా ఇళ్ల నిర్మాణానికి పనికి రాదని కలెక్టర్ తెలిపారు. ఎస్పీతో కలిసి తాను పూర్తి స్థాయిలో సంఘటన స్థలంలో సాక్షులను విచారించినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని కిష్టాపూర్‌లో మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి పర్మిట్లతోనే ఇసుక రవాణా జరుగుతుంది తప్ప మరే చోట ఇసుక రవాణా లేదన్నారు.

ప్రదీప్‌కు మరో రెండు రోజుల గడువు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మద్యం తాగి కారు నడుపుతూ పోలీసులకు దొరికిపోయిన యాంకర్ ప్రదీప్ ఎవ్వరికీ కనబడకుండా ఉంటోన్న విషయం విదితమే. ప్రదీప్ కౌన్సిలింగ్‌కు హాజరు కావడానికి ఐదు రోజుల సమయం ఇచ్చామని, మరో రెండు రోజులు ఎదురు చూస్తామని ట్రాఫిక్ అదనపు డీసీపీ అమర్ కాంత్‌రెడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారందరికీ కౌన్సెలింగ్ ఇస్తామని, ప్రదీప్ రేపు లేక సోమవారం వస్తారని అనుకుంటున్నామన్నారు. గడువులోగా రాకపోతే చార్జిషీట్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

నేనెక్కడికి పారిపోలేదు: ప్రదీప్ స్పందన

తానెక్కడికి పారిపోలేదని ప్రదీప్ సోషల్ మీడియాలో ఓ వీడియో ద్వారా స్పందించారు. తాను తప్పు చేసినట్లు అంగీకరించిన ప్రదీప్.. ఇంకెవరూ తనలాగా తప్పు చేయకూడదంటూ పోస్ట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. డిసెంబర్ 31 అర్ధరాత్రి ఏం జరిగిందో అందరికీ తెలుసు. దాని తర్వాత జరిగే ప్రతి ప్రొసీడింగ్స్‌ను చట్ట ప్రకారమే ఫాలో అవుతాను. అయితే నేను ముందుగానే కమిట్ అయిన ప్రోగ్రామ్స్, ఇతర ఈవెంట్ల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నానన్నారు.

సహచర టీచర్‌కు వేధింపులు

మహాదేవ్‌పూర్, ప్రభన్యూస్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాదేవ్‌పూర్ మండల కేంద్రంలో కేజీబీవిలో సహచర ఉపాధాయురాలిని అదే పాఠశాల ఎస్ఓ నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు నమోదైంది. కంప్యూటర్ విద్యను బోధిస్తూ గోమాత ప్రేమలతను అదే పాఠశాల ఎస్ఓ నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడు. గత రెండు సంవత్సరాల నుంచి కంప్యూటర్ విద్యను బోధిస్తున్న ప్రేమలతను ఎస్ఓ చేసే ప్రతి తప్పుడు పనులకు సహకరించాలంటూ నిత్యం తనను వేధిస్తున్నారని, తమను మానసికంగా ఇబ్బందులు పెడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నది. ఆమె చెప్పిన పనులు చేయకపోవడం తోటి ఉపాధ్యాయుల ముందు దళితురాలి అయినందుకే తమను అంతా ఇబ్బందులు పెడుతున్నారని ఆమె వాపోయింది. దీనిపై ఎస్సై ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు చేసింది వాస్తవమే, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

బీజేపీ కార్యాలయ ముట్టడి

- ఎమ్మార్పీఎస్, విద్యార్థి సంఘాల నేతల అరెస్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎస్సీ వర్గకరణపై కేంద్ర ప్రభుత్వం వైఖరిపై తీవ్ర ఆగ్రహం...అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీస్‌తో పలు విద్యార్థి సంఘాలు నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు విఫలయత్నం చేశాయి. ఈ సందర్భంగా ఆందోళనకారులకు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ఆందోళనకారులు పోలీసుల చర్యలను తీవ్ర స్థాయిలో నిరసించారు. అలాగే కేంద్ర ప్రభుత్వంపై కూడా విరుచుకుపడ్డారు. ఎస్సీ వర్గీకరణకు భాజపా కట్టుబడి ఉందని చెప్పి నాలుగు సంవత్సరాలైనా పట్టించుకోకపోవడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. ఇప్పటికేనా కేంద్రం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదం లభించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కాగా పార్టీ కార్యాలయంలోకి చొచ్చుకుని వెళ్ళేందుకు యత్నించిన ఆందోళన కారులను పోలీసులు అరెస్టు చేసి బేగంపేట్ స్టేషన్‌కు తరలించారు.

అత్యాచారం కేసులో యావజ్జీవం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడేళ్ల క్రితం మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో ముద్దాయి అర్షామహల్‌కు చెందిన జహిరుద్దీన్‌కు యావజ్జీవ కారాగారశిక్షతో పాటు 5000 రూపాయల జరిమానాను విధిస్తూ ఎల్బీనగర్ మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారు.

ప్రియుడి మోజులో భర్త హత్య

- ప్రియుడు, నలుగురు నిందితుల అరెస్టు



విలేఖరులతో మాట్లాడుతున్న యాదాద్రి డీసీపీ రామచంద్రారెడ్డి. చిత్రంలో నిందితులు జ్యోతి, ఆమె ప్రియుడు కార్తిక్

చౌటుప్పల్, ప్రభ న్యూస్ : నల్గొండ జిల్లా, చౌటుప్పల్ మండలంలోని జిల్లెడుజెల్క గ్రామ సమీపంలోని చెట్ల పొదల్లో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కమ్మరి నాగరాజుదిగా పోలీసులు గుర్తించారు. నాగరాజును అతని భార్య జ్యోతే ప్రియుడి మోజులో పడి హత్య చేయించినట్లుగా హంతకుల ద్వారా వెలుగులోకి వచ్చింది. హత్యలో పాల్గొన్న నిందితులలో సిర్రప్ప నరేష్ అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించడంతో విషయం బయట పడింది. ఈ హత్యకు సంబంధించిన వివరాలను శుక్రవారం యాదాద్రి భువనగిరి డీసీపీ ఇ. రామచంద్రారెడ్డి చౌటుప్పల్ ఏసీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో వెల్లడించారు.

హైదరాబాద్ కర్మన్‌ఘాట్ తపోవన్ కాలనీలో కమ్మరి నాగరాజు, భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు నివసించేవారు. నాగరాజు కార్పెంటర్‌గా పనిచేసి రాత్రి ఇంటికి వచ్చేవాడు. భర్త తనను పట్టించుకోవడంలేదని భావించిన జ్యోతి (20) వివాహానికి ముందే పరిచయం ఉన్న నాచారం దుర్గానగర్ స్మితా ట్రావెల్ ఏజెన్సీలో పనిచేసే మహంకాళి కార్తిక్ (22)తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తమ సంబంధం విషయం భర్తకు తెలిస్తే గొడవలు అవుతాయని, అతన్ని చంపేస్తే సంతోషంగా ఉండవచ్చునని ప్రియుడికి చెప్పడంతో ఇద్దరు కలిసి నాగరాజు హత్యకు పథకం వేశారు. పథకంలో భాగంగా డిసెంబర్ 30వ తేదీన కార్తిక్ 10 మత్తు టాబ్లెట్లను తెచ్చి జ్యోతికి ఇచ్చాడు. వాటిని పాలలో కలిపి నాగరాజుకు తాగించమని, అతను మత్తులోకి వెళ్లాక చంపుతామని కార్తిక్ చెప్పాడు. నాగరాజు ఇంటికి వచ్చి భోజనం చేశాక ముందే సిద్ధం చేసుకున్న మత్తు టాబ్లెట్లను కలిపిన పాలను నాగరాజుకు ఇవ్వగా అతను తాగి మత్తులోకి జారుకున్నాడు. ఈ విషయాన్ని కార్తిక్‌కు చెప్పగా అతను మారుతీ సుజికీ రిట్జ్ కారులో నాచారంలో ఉండే తన మిత్రులు మహ్మద్ బిస్మిల్లా ఖాన్ (19), నదియాల్ గౌరవ్ (24)లతో పాటు లాలాపేట లక్ష్మీనగర్‌లో ఉండే సిర్రప్ప నరేష్ (23)ను తీసుకొచ్చి నాగరాజు ముఖంపై దిండుతో ఊపిరాడకుండ చేసి హత్య చేశారు. అదేరాత్రి మృతదేహాన్ని కారులో జాతీయ రహదారి వెంట తెచ్చి మండలంలోని జిల్లెడుజెల్క గ్రామ సమీపంలోని చెట్ల పొదల్లో పడేసి వెళ్లారు. ముందు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా భావించినప్పటికి పోస్టుమార్టం అనంతరం హత్యగా మారి ఆ తర్వాత భార్యయే ప్రియుడి మోజులో హత్య చేయించిన విషయం బయటపడటంతో నిందితులందరిని అరెస్టు చేసినట్లుగా డీసీపీ రామచంద్రారెడ్డి తెలిపారు. సమావేశంలో ఏసీపీ, సీఐ, ఎస్ఐ పాల్గొన్నారు.



త్వరలో కొత్త పది రూపాయల నోటు

న్యూఢిల్లీ: త్వరలో కొత్త పదిరూపాయల నోటును విడుదల చేయనున్నట్లు ఆర్‌బీఐ శుక్రవారం ఒక ప్రకటన చేసింది. ఈ కొత్త 10 రూపాయల నోటు మహాత్మాగాంధీ బొమ్మతో కూడిన కొత్త సిరీస్‌ను కలిగివుండి ఆర్‌బిఐ గవర్నర్ డాక్టర్ ఉర్జిత్ పటేల్ సంతకం ఉంటుంది. నోటుకు వెనుకవైపు భారత సంస్కృతిని ప్రతిబింబించే ఒడిశాలోని కోణార్క్ సూర్యదేవాలయం, చక్రం బొమ్మలు ముద్రించి ఉంటాయి. రంగు విషయానికివస్తే.. నోట్లు చాకొలేట్ గోదుమ వర్ణంలో ఉంటాయి. ఇవేకాక, జియోమెట్రిక్ పద్ధతులతోకూడిన డిజైన్లను ఈ నోట్లు కలిగివుంటాయి.


కొత్త నోటు ఫీచర్లు



పొడవు, వెడల్పులు 63మిల్లీ మీటర్లు 123 మిల్లీమీటర్లు ముందువైపు నోటు విలువ 10 సంఖ్యతో ప్రత్యేక సెక్యూరిటీ ఫీచర్‌ను కలిగిఉంటుంది,దేవనాగరి లిపిలో నోటు విలువ 10 అని ముద్రితమై ఉంటుంది. ముందువైపు మహాత్మా గాంధీ బొమ్మ మధ్యలో ఉంటుంది. సూక్ష్మ పరివాణంలో ఆర్‌బీఐ, ఇండియా, 10 అనికూడా ముందువైపు ముద్రితమై ఉంటాయి. అంతేకాక పారాదర్శకంగా కన్పించే సెక్యూరిటీ త్రెడ్ ఉంటుంది. ఆర్‌బీఐ గ్యారంటీ ఇస్తున్నట్లు రాతరూపంలో ఉంటుంది. గవర్నర్ సంతకం, ఆర్‌బీఐ చిహ్నం మహాత్మాగాంధీ బొమ్మకు కుడివైపు ఉంటుంది. ఆశోకా స్థూపం ముందు కుడివైపు ఉంటుంది. 10 సంఖ్యతోకూడిన ఎలక్ట్రోటైప్ వాటర్‌మార్క్ ఉంటుంది. వెనుకవైపు ఎడమపక్క ముద్రణ సంవత్సరం ఉంటుంది. స్వచ్ఛ భారత్ లోగో కూడా ఉయుంది.

మా సంస్కరణలు రాబోయే తరాలకు వరం

- కొత్త ఆర్థిక చరిత్రను రాశాం
- దీర్ఘకాలంలో సంస్కరణ ఫలాలు అందుతాయి
- రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: దేశ ఆర్థికాభివృద్ధికోసం మా హయాంలో తీసుకుంటున్న చర్యల ప్రభావం దీర్ఘకాలంలో కనిపిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. మేము సంస్కరణలు చేపట్టి భారత ఆర్థిక చరిత్రలో కొత్త చరిత్రను రాశాము. రాబోయే తరాలు వీటిని గుర్తుంచుకుంటారన్నారు. 2014లో తాము అధికారంలోకి వచ్చేనాటికి భారత్ దుర్బలమైన ఐదు దేశాల జాబితాలో ఉందని జైట్లీ తెలిపారు శుక్రవారం రాజ్యసభలో దేశ ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ అడిగిన ప్రశ్నకు జైట్లీ సమాధానమిస్తూ.. మోడీ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో నిర్మాణాత్మక సంస్కరణలకు మాత్రమే పరిమితం కాకుండా వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తాము చేపట్టిన కొన్ని సంస్కరణలను గత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలుచేయాలని ప్రయత్నించి విఫలమైందని జైట్లీ గుర్తు చేశారు. తాము ఇప్పుడు అవే సంస్కరణలు చేపడితే కాంగ్రెస్ విమర్శలు చేస్తున్నదని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక తీరు మందగించడంతో నెమ్మదించిందన్నారు. అయితే 2003లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బూమ్ వచ్చినప్పుడు భారత్ కూడా లబ్ధి పొందినదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ ముందు పలు సవాళ్లున్నాయని చెప్పారు. యూపీఏ హయాంలో కరెంట్ ఆకౌంట్ లోటు 4.5శాతం ఉండగా, ఆర్థికలోటు 6 శాతానికి పెరిగిందన్నారు. ప్రస్తుతం ఈ చిద్రాలు స్వల్పంగా ఉన్నాయని జైట్లీ వెల్లడించారు. గత మూడేళ్లుగా అంతర్జాతీయ ఆర్థికం నెమ్మదించింది దీని ప్రభావం భారత్‌పై కూడా పడింది. అంతేకాక, గత రెండేళ్లలో దేశంలో సంభవించిన కరవు కూడా వృద్ధి రేటుపై నకారాత్మక ప్రభావాన్ని చూపిందని మంత్రి అన్నారు. ఈ ఏడు ఆర్థిక లోటు 3.6 శాతంగా ఉండవచ్చన్నారు.

'గత మూడేళ్లలో తొలిసారిగా భారత్, ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందే ఆర్థికవ్యవస్థగా గుర్తింపు పొందింది. నాలుగ ఏడాదికూడా వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్ రెండో స్థానంలో ఉంటందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. దుర్బల దేశాల జాబితానుంచి భారత్ బయట పడింది. ఇంకా పరిస్థితిని మెరుగుపరిచేందుకు మనం కృషిచేయాల్సి ఉంది. మీరు భారత్‌ను 142వ స్థానంలో విడిచిపెట్టారు. మేము దాన్ని 100 వ స్థానంకు పెంచాము' అని జైట్లీసభలో చెప్పారు.

లోక్‌సభలో వినియోగదారుల రక్షణ బిల్లు

సాంకేతిక యుగంలో ప్రధానంగా ఈ-కామర్స్, నేరుగా విక్రయం (డైరెక్ట్ సెల్లింగ్), టెలీ-మార్కెటింగ్, తప్పుదోవపట్టించే ప్రకటనలు (మిస్‌లీడింగ్ యాడ్స్) నేపథ్యంలో వినియోగదారుల హక్కులకు భంగం కల్గకుండా రక్షణ కల్పించేలా కేంద్రం కొత్త చట్టం తీసుకొస్తోంది. ఇందుకు సంబంధించిన బిల్లు ప్రతిపాదనలను శుక్రవారం లోక్‌సభలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ ప్రవేశపెట్టారు. 31 ఏళ్ల నాటి చట్టం స్థానంలో సమూల మార్పులతో కొత్త చట్టాన్ని తీసుకువస్తున్నట్లు మంత్రి వివరించారు. నిబంధనలు అతిక్రమించిన సదరు ఉత్పాదక సంస్థపై రూ. 50 లక్షల వరకు అపరాధ రుసుం విధించడంతో పాటు ఐదేళ్ల వరకూ జైలు శిక్షపడే అవకాశముంది. ఈ బిల్లు వినియోగదారుల హక్కులను పూర్తిగా సంరక్షించనుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

జీఎస్‌టీ అమల్లో తొలుత కొన్ని అవాంతరాలు నిజమే

జీఎస్‌టీపై మంత్రి మాట్లాడుతూ.. తొలి మూడు నెలల్లో కొన్ని అవాంతరాలు వచ్చాయి. మధ్య, దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థ దీని ప్రయోజనాలను అనుభవిస్తుంది. నిర్మాణాత్మక సంస్కరణల గ్రాఫ్ అడుగున వుంది. కాలం గడిచిన కొద్దీ అది పైకి కదులుతుంది. ఇప్పటికే ఈ దిశగా కదులుతున్న సంకేతాలు మనకు కన్పిస్తున్నాయి అని జైట్లీ అన్నారు. ప్రభుత్వం ద్రవ్యోల్బణంను 4 శాతంలోపే ఉండేవిధంగా నియంత్రణ చేస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. దేశం 7 నుంచి 8 శాతం వృద్ధిరేటును నమోదు చేస్తోంది అయితే.. మేము దీనితో సంతృప్తి చెందలేము.. ఇంకా వృద్ధిరేటును పెంచేందుకు కృషి చేస్తాము అని మంత్రి చెప్పారు.

మా సంస్కరణల ఫలాలు కచ్చితంగా రాబోయే తరాలకు వరంగా మారుతాయని జైట్లీ ఉద్ఘాటించారు. ఎన్డీఏ ప్రభుత్వం కొత్త ఆర్థిక చరిత్రను రాసిందని వారు గుర్తుంచుకుంటారు అని జైట్లీ అన్నారు. ప్రతిపక్షాలు విమర్శలు మాని మా ప్రభుత్వ సంస్కరణలను గర్తించాలన్నారు.

ఎగిసిన మార్కెట్ సూచీలు

సెన్సెక్స్ 184 పాయింట్లు, నిఫ్టీ 54 పాయింట్లు లాభం



ముంబై: ఆసియన్ మార్కెట్లతో పాటు, ఇతర మార్కెట్లలో కొనుగోలు దారుల మద్దతుతో సెన్సెక్స్ తిరిగి 34,000 మార్కును శుక్రవారం దాటింది. గురువారం నాటి ముగింపుతో పోలిస్తే 184.21 పాయింట్లు లాభపడి 34,153.85 వద్ద ముగిసింది. పిఎస్‌యు, వినియోగ వస్తురంగం, ఆటో,లోహ ట్రేడింగ్ రంగాల షేర్లకు కొనుగోలు దారుల నుంచి మద్దతు లభించింది. ఈ రంగాల షేర్ల అమ్మకాలు 0.57శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి. కాగా జాతీయ స్టాక్ ఎక్స్చేంజీ నిఫ్టీ కూడా 29.45 పాయింట్లు లాభపడి 10,558.25 పాయింట్ల వద్ద ముగిసింది. విదేశీ నిధుల ప్రవాహం దేశంలోకి రావడంతో శుక్రవారం అటు బిఎస్ఈ సూచీ సెన్సెక్స్, ఇటు నిఫ్టీలు లాభాల బాటలోనే పయనించాయి. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ప్రభుత్వ రంగ బ్యాంకుల వసూలు కాని రుణాలకు సంబంధించి పునః పెట్టుబడి పెట్టడానికి రూ.80వేల కోట్లు కేటాయింపుకు ఆమోదం తెలపడం కూడా నేడు మార్కట్లకు కలసివచ్చింది. గురువారం ఎఫ్‌పీఐలు రూ.212.05 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. కాగా దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.325.24 కోట్ల షేర్లను కొన్నారు. కాగా, మీడియా, ఇన్‌ఫ్రా ప్రైవేట్ బ్యాంకులు, ఆటో, రియాల్టీ, పార్మా షేర్ల అమ్మకాలు నిలకడగా కొనసాగడంతో జాతీయ స్టాక్ ఎక్స్చేంజి నిఫ్టీ శుక్రవారం రికార్డు స్థాయి 10,558 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ ఉదయం నిన్నటి పాయింట్లు 10,504.25తో ప్రారంభమై ఇంట్రాడేలో 10,566.10 పాయింట్లకు చేరింది. సాయంత్రం వరకు ఒడిదుడుకులకు లోనయినప్పటికి చివరికి 54.05 పాయింట్ల లాభంతో ముగిసింది. అమెరికా స్టాక్ సూచీలు నిన్న ఆల్‌టై హై కొనుగోళ్లతో ముగియడంతో.. ప్రపంచ మార్కెట్లకు ఇది లాభించింది. డౌ సూచీ తొలిసారిగి 25000 మార్క్‌ను తాకింది.

గుజరాత్ ఫార్మా అసోసియేషన్‌పై పెనాల్టీ

SUPPORTED BY
Gujarat Chemical Association

న్యూఢిల్లీ: ఫార్మా వ్యాపారంలో అక్రమ పద్ధతులను అవలంభించిన గుజరాత్‌కు చెందిన గుజరాత్ స్టేట్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ సమాఖ్య, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ బరోడా(సిడిఎబి)లపై సిసిఐ రూ.12లక్షల పెనాల్టీ విధించింది. ఫార్మా పరిశ్రమలో జరుగుతున్న అక్రమ ధోరణిని అరికట్టాలని సిసిఐ ఈ రెండు గ్రూప్‌లకు సూచించింది. ఏకస్వామ్య ధోరణిని విడనాడి స్వేచ్ఛాపూరిత పోటీకి బాటలు వేయాలని పేర్కొంది. కాంపిటీషన్ చట్టం 2002 నిబంధనలను ఉల్లంఘించాయని.. సిడిఎబిపై రూ.1.08లక్షలు, గుజరాత్ ఫెడరేషన్‌పై రూ.11.11లక్షలు పెనాల్టీని సిసిఐ విధిస్తూ ఆదేశాలను శుక్రవారం జారీచేసింది. ఈ ఫెనాల్టీతోపాటు సడిఎబి అధ్యక్షుడు విటి షాపై రూ.34,048 ఫెనాల్టీని, గుజరాత్ ఫెడరేషన్‌పై రూ.62,144 పెనాల్టీని విధించింది. ఈ రెండు సమాఖ్యలు తమ ఏకస్వామ్య ధోరణులను విడనాడాలని పలుమార్లు నోటీసులు కూడా సిసిఐ ఇచ్చింది. అయినా వాటితీరు మారకుండటంతో తాజాగా పెనాల్టీ విధిస్తూ ఆదేశాలను జారీచేసింది. కాగా కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖ కూడా సిసిఐ చర్యలకు మద్దతు తెలిపింది. పలు పారిశ్రామిక ఉత్పత్తుల రంగాల్లో జరుగుతున్న ఇటువంటి అక్రమ వ్యాపార ధోరణలపై సిసిఐ నిఘా పెట్టాలని సూచించింది. ముఖ్యంగా మెడిసిన్‌లు/డ్రగ్‌ల పరిశ్రమ అత్యధిక ప్రజా ప్రయోజనాలకు సంబంధించినదని పేర్కొంది. ఇలాంటి అక్రమ పద్ధతులు చేపడుతున్న అసోసియేషన్లు, స్టాకిస్టులు, డిస్ట్రిబ్యూటర్లు, హోల్‌సేలర్లు,రిటైలర్లు, ఫార్మా కంపెనీలను ఉపేక్షించకూడదని ఆర్థిక మంత్రిత్వశాఖ సూచించింది.

బేయర్-మోన్‌సాంటో విలీనంపై సీసీఐ ప్రజాభిప్రాయ సేకరణ



న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన రసాయనాలు, ఫార్మా కంపెనీ బేయర్, అమెరికాకు చెందిన బయోటెక్ కంపెనీ మోన్‌సాంటో విలీనంపై (సిసిఐ)కాంపిటీషన్ ఆఫ్ ఇండియా ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా బేయర్ కంపెనీ 66 బిలియన్ డాలర్లతో మోన్‌సాంటోను కొనుగోలు చేస్తోంది. విలువైన ఈ విలీన ఒప్పందంతో ప్రపంచంలోనే అతిపెద్ద విత్తన,పురుగుమందుల కంపెనీగా అవతరిస్తున్న నేపథ్యంలో దీని ప్రభావం భారత కంపెనీలు, మార్కెట్ వ్యవస్థపై ఎంతమేరకు హానికర ప్రభావం పడుతుందో తెలుసుకోవటానికి సిసిఐ ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవాలని నిర్ణయించింది. ఈ విలీనంతో ప్రభావితమయ్యే ప్రతీ ఒక్కరూ తమ స్పందనలను తెలుపాలని పబ్లిక్ నోటీసులను శుక్రవారం జారీచేసింది. ఇందుకు 15రోజుల గడువును నిర్దేశించింది. విలీనాలు, కొనుగోలు ఒప్పందాలకు సిసిఐ ఆమోదం తప్పనిసరి. వ్యాపారంలో పారదర్శకత, నియంత్రణ చర్యలు చేపట్టే సిసిఐ ప్రాథమిక బాధ్యతగా ఈ అభిప్రాయ సేకరణ ప్రారంభించింది. అంతర్జాతీయ ఒప్పందంను సిసిఐ పరిశీలనలో ఉంది. జన్యు మార్పిడి పంట ఉత్పత్తులకు దేశంలో ఇప్పుడిప్పుడే ప్రజల ఆమోదం లభిస్తోంది. దేశంలో కూడా ఈ జన్యుమార్పిడి విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నారు. మోన్‌సాంటో, బేయర్ ఒప్పందం వల్ల దేశీయ మార్కెట్‌లో పోటీ పరిస్థితులు మారిపోతాయని కొన్ని దేశీయ కంపెనీలు వాదిస్తున్నాయి. అతిపెద్ద కంపెనీగా మారనున్న బేయర్-మోన్‌సాంటో దేశీయ మార్కెట్‌ను శాసిస్తుందని వీరు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే సిసిఐ దీని ప్రభావానికి గురవుతున్నామన్న వారందరినుంచి అభిప్రాయాలను కోరింది. ఈ రెండు కంపెనీలు ఇప్పటికే భారత్‌లో తమ జన్యువార్పిడి ఉత్పత్తులను అమ్ముతున్నాయి.

ఎన్‌సీఎస్ షుగర్స్‌పై సీబీఐ కేసు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మోస పూరి తంగా వ్యవహరించిన ఎన్‌సిఎస్ షుగర్స్‌పై సిబిఐ కేసు నమోదు చేసింది. విశా ఖప ట్టణంలోని పిఇసి లిమిటెడ్‌కు చెందిన రూ. 82 కోట్ల 11 లక్షల 44 వేల 273 ల విలువ చేసే చక్కెర నిలు వలను ఎన్‌సిఎస్ షు గర్స్ మోసపూరితంగా దక్కిం చుకుంది. ఈ మేరకు పిఇసి కంపెనీ ఇచ్చిన ఫిర్యాదును నమోదు చేసుకున్న సిబిఐ బషీర్‌బాగ్ మినార్ అపార్ట్ మెంట్‌లోని దక్కన్ టవర్స్‌లో ఉన్న ఎన్‌సిఎస్ షుగర్స్ లిమిటెడ్‌ను ఏ 1 గా, ఎండి ఎన్. నాగేశ్వరరావును ఏ 2 గా, డైరెక్టర్ కన్నబాబును ఏ 3 గా, మేనేజర్ డి. లక్ష్మణరావును ఏ 4 గా, కాకినాడలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ బి.బి. రాజేంద్రప్రసాద్‌ను ఏ 5 గా, విశాఖపట్టణంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సిడబ్ల్యుసి) లో పని చేసి పదవి విరమణ చేసిన పి. కృష్ణమోహన్‌రావులను నిందితులుగా గుర్తించింది. అనంతరం హైదరాబాద్‌లోని ఎన్‌సిఎస్ షుగర్స్ కార్యాలయం, విశా ఖపట్టణంలోని లక్ష్మణరావు, రాజేంద్రప్రసాద్, కృష్ణమోహన్‌రావుల నివాసాలలో సోదాలను నిర్వహించినట్లు సిబిఐ జారీ చేసిన ప్రకటన పేర్కొంది.

చైనా, జపాన్ కెమికల్స్ దిగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీ

న్యూఢిల్లీ: రబ్బరు పరిశ్రమలో అధికంగా ఉపయోగిస్తున్న రసాయనాల దిగుమతులపై ఆంటి డంపింగ్ డ్యూటీ విధించే యోచనలో ఉన్నట్లు ప్రభుత్వం శుక్రవారం ఒక ప్రకటన చేసింది. అయితే ఇది చైనా, జపాన్‌ల నుంచి దిగుమతవుతున్న రసాయనాలకే పరిమితమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విధింపు మూడేళ్ల పరిమితికి లోబడి ఉంటుంది. ఈ రెండు దేశాలు 'రెసోర్క్రినాల్' అనే రసాయనంను దాని సాధారణ విలువకంటే తక్కువకే దేశంలోకి ఎగుమతి చేస్తున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆంటి డంపింగ్, అల్లైడ్ సర్వీసెస్(డిజిఎడి) దర్యాప్తులో తేలింది.

ఎస్బీఐ ఖాతాదారులకు శుభవార్త

బ్యాలెన్స్ వెయ్యే!

- చార్జీలు తగ్గింపు
- నేడో రేపో అధికారిక ప్రకటన

State Bank of India

ముంబై: మినిమమ్ బ్యాలెన్స్ మొత్తం, పెనాల్టీ ఛార్జీలను సవరించే ఆలోచన చేస్తున్నట్టు ఎస్‌బీఐ శుక్రవారం తెలిపింది. బ్యాంకు ఖాతాదారులు వారి ఖాతాల్లో కనీస మొత్తం ఉంచని కారణంగా వారి నుంచి పెనాల్టీ రూపేణా రూ.1,771 కోట్ల భారీ లాభాన్ని మూటగట్టుకున్న ఎస్‌బీఐపై అంతటా విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో తాజా ప్రకటన వెలువడింది. దేశంలో అతి పెద్ద బ్యాంకర్‌గా నిలిచిన ఎస్‌బీఐకి మొత్తంగా 40.2 కోట్ల మంది పొదుపు ఖాతాదారులున్నారు. ఐదేళ్ళ సంవత్సరాల తర్వాత అన్నట్టుగా ఎస్‌బీఐ గతేడాది ఏప్రిల్‌లో మినిమమ్ ఏవరేజ్ బ్యాలెన్స్(ఎంఏబీ) ఛార్జీలను తిరిగి ప్రవేశపెట్టింది. తదనగుణంగా మెట్రో నగరాల ఖాతాల్లో రూ.5,000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,000 ను ఎంఏబీగా బ్యాంక్ డిమాండ్ చేస్తున్నది. అలా ఉంచని పక్షంలో పెనాల్టీ విధిస్తుంది. ఫలితంగా గతేడాది ఏప్రిల్, నవంబర్ మధ్య కాలంలో ఖాతాదారుల నుంచి ఎంఏబీ పెనాల్టీ రూపేణా రూ.1,771.67 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అది రెండవ త్రైమాసికానికి బ్యాంక్ పొందిన లాభం కంటే అధికమని ఆర్థికమంత్రిత్వ శాఖ డేటా నిర్ధారించింది.

ఇదే విషయమై ఎస్‌బీఐ రిటైల్ అండ్ డిజిటల్ బ్యాంకింగ్ ఎండీ పి.కె.గుప్తా శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏప్రిల్‌లో తాము ప్రవేశపెట్టిన ఎంఏబీపై నిరంతరాయంగా సమీక్ష జరుపుతున్నామని, ఆ క్రమంలో అక్టోబర్ మాసంలో దానిని కొంత తగ్గించావుని తెలిపారు. మరోసారి సమీక్షప్రక్రియను తాము చేపట్టినట్టు ఆయన చెప్పారు. ప్రస్తుతం మెట్రో, అర్బన్ ఖాతాలకు ఎంఏబీ రూ.3,000 గా ఉంది. అలా లేని పక్షంలో పన్నులను కలుపుకొని రూ.30 నుంచి రూ.50 మధ్య పెనాల్టీని బ్యాంక్ ఖాతాదారులకు విధిస్తున్నది. సెమీ అర్బన్, రూరల్ బ్రాంచీలకు ఆ మొత్తాన్ని వరుసగా రూ.2,000 మరియు రూ.1,000 గా నిర్ధారించింది. కాని పక్షంలో పన్నులు కలుపుకొని రూ.20 నుంచి రూ.40 మధ్య పెనాల్టీ వేస్తున్నది. అయితే ఖాతాదారుల నుంచి నిరసనలు ఎదుర్కోవాల్సి రావడంతో అక్టోబర్‌లో ఎంఏబీలపై పెనాల్టీలను కాస్త తగ్గించింది.

ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య కాలానికి మెట్రో ఖాతాలకు రూ.5,000 గా ఉన్న ఎంఏబీని ప్రతి ఖాతాకు రూ.3,000 చేసింది. అలాగే పెనాల్టీని కూడా రూ.50 -100 నుంచి రూ.20- 40కు తగ్గించింది. పన్నులు అదనం.

ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.5శాతం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017-18)లో జిడి పి (స్థూల దేశీయ ఉత్పత్తి) వృద్ధిరేటు తగ్గుతుందని సిఎస్ఓ(కేంద్ర గణాంకాల సంస్థ) ముందస్తు అంచనాల్లో వెల్లడించింది. 2011-12 ఆధార సంవత్సర స్థిర ధరల ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం నమోదైన 7.1 శాతం జిడిపి వృద్ధిరేటుతో పోలిస్తే ఈ ఏడాది 6.5 శాతానికి తగ్గుతుందని తెలుపుతుంది. అంతేకాక స్థూల విలువ కూర్పు(గ్రాస్ వాల్యూ అడిషన్-జివిఏ) కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో 6.1 శాతంగా ఉంటుందని పేర్కొంది. గత ఏడాది ఇది 6.6 శాతంగా ఉంది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ ఇతర సేవలు, ట్రేడ్, హోటల్లు, రవాణా, సమాచార సర్వీసులు, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఆర్థిక, రియల్ ఎస్టేట్, వృత్తి సేవలు ఈ ఆర్థిక సంవత్సరంలో 7 శాతం వృద్ధిని నమోదు చేసు కుంటాయని తెలిపింది. తయారీ రంగంలో వృద్ధి 4.6 శాతం, నిర్మాణ రంగం వృద్ధి 3.6 శాతం ఉంటుందని పేర్కొంది. వ్యవసాయం రంగం, అటవీ, మత్స్య రంగాల వృద్ధిరేటు 2.1 శాతం, మైనింగ్, క్వారీయింగ్‌లో వృద్ధి 2.9 శాతంగా ఉంటుందని తెలిపింది.

రికార్డు స్థాయిలో ఎఫ్‌పీఐలు

తొలి అర్ధ సంవత్సరంలో 15బిలియన్ డాలర్ల నమోదు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవ త్సరం లో దేశీయ మూలధన మా ర్కెట్‌లు రూ.2.2 ట్రిలియన్ల(35 బిలియన్ డాలర్లు)విదేశీ పెట్టు బడులను నమో దుచేసుకుం టాయని ఐసిఆర్ఎ తన అంచ నాల్లో పేర్కొంది. గత ఆర్థిక ఆర్థిక సంవ త్సరంతో పోలిస్తే ఇవి నాలుగు రెట్ల కంటే ఎక్కువ అని మూడీస్ అనుబంధ రేటింగ్ సంస్థ ఐసిఆర్ఎ తన నివేదికలో వెల్లడించింది. 2016లో ఎఫ్‌పీఐ (ఫారెన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టెమెంట్లు) రూ. 484 బిలియన్లు(7 బిలియన్ డాలర్లు) వచ్చాయని తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం రూ.1.8- 2.2 ట్రిలియన్‌లు (28-35బిలియన్ డాలర్లు) వస్తాయని అంచనా. ఈ ఏడాది తొలి అర్థ సంవత్సరంలో ఎఫ్‌పీఐలు రూ.956 బిలియన్లు(15 బిలియన్ డాలర్లు) వచ్చాయని నివేదిక వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ కాలంలో నికరంగా రూ.1.17 ట్రిలియన్ ఎఫ్‌పీఐలు దేశీయ రుణ విభాగానికి వచ్చాయని ఐసిఆర్ఎ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ శ్రీనివాసన్ తెలిపారు. జి-సెక్యూరిటీలు, కార్పొరేట్ రుణాల మార్కెట్‌లో ఎఫ్‌పీఐల పరిమితి ఉన్నప్పటికి వీటి రాక పెరిగిందని శ్రీనివాసన్ చెప్పారు. కాగా అగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నెమ్మదించిన స్థూల దేశీయ ఉత్పత్తి వృద్ధి కారణంగా ఈక్విటీ విభాగంలో ఎఫ్‌పీఐల నికర అవుట్ ఫ్లో కొనసాగిందన్నారు. వచ్చే కాలంలో జి-సెక్, కార్పొరేట్ బాండ్లను మరింత ఉపయోగించేందుకు ప్రస్తుతం ఊపుమీదున్న ఎఫ్‌పీఐల ఇన్‌ఫ్లో ట్రెండ్ దోహదకారిగా ఉంటుందని నివేదిక వెల్లడించింది. ఇటీవల అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్(యూఎస్‌ఫెడ్) డిసెంబర్-2017లో వడ్డీరేటును పెంచడం, ప్రభుత్వం పన్నురేటులో కోతలు, ఉద్యోగాల చట్టాలు చేయటం వంటి నిర్ణయాలు ఆదేశానికి లాభకరంగా మారాయి. ఈ నిర్ణయం భారత రుణ మార్కెట్లో రుణ సెక్యూరిటీలకు డిమాండ్‌ను పెంచింది. అంతేకాక, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించాయి అని ఐసిఆర్ఎ నివేదికలో పేర్కొంది.

ఇన్‌ఫ్రా రంగంలో హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు

క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రామ్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ నగరం అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్.రామ్‌రెడ్డి అన్నారు. ఐటి, హెల్త్‌కేర్ రంగంలో హైదరాబాద్ పెట్టుబడి కేంద్రంగా అభివృద్ధి చెందడంతో దేశ, విదేశీ కంపెనీలు పెట్టుబడులతో వసున్నాయని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు (జీఈఎస్)తో ఇక్కడ ఎలాంటి అంతర్జాతీయ సదస్సులైనా నిర్వహించగల స్థాయి ఉందని నిరూపించారని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ రంగంలో ఎన్నో కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయని, వినియోగదారులకు వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు క్రెడాయ్ హైదరాబాద్ మూడు రోజులపాటు ప్రాపర్టీ షో నిర్వహిస్తోందని శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన చెప్పారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మార్చి నెల 2 నుంచి 4వ తేదీవరకు ఈ ప్రాపర్టీ నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. నగరంలో ఆస్తులు కొనుగోలు చేసేవారికి సహాయ పడేందుకు అన్ని ప్రాజెక్టులను ఒకే వేదిక వద్దకు చేర్చేందుకే ఈ ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

పాతబకాయి వసూళ్లకు 'ఐవోబీ నేమ్ అండ్ షేమ్'

Indian Overseas Ban

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంకు (ఐవోబీ) బకాయిలు వసూలు చేసేం దుకు నేమ్ అండ్ షేమ్ కార్యక్రమాన్ని చేపట్టింది. శ్రీనగర్ కాలనీ రోడ్డు జంక్షన్ సమీపంలోని టిసిఐ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థ తమ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సంస్థ సిబ్బం ది ఆ కార్యా లయం ముందు గురు వారం నినా దాలు చేశారు. ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ముప్పనేని వెంకటేశ్ బ్యాంకుకు రూ.26.45 కోట్ల బకాయి పడ్డారు.

ఈ బకాయి చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిబ్బం ది చేపట్టిన కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ రీజినల్ మేనేజర్ శివకుమార్ చతుర్వేది నేతృత్వంలో ఏజీఎంలు లచ్చయ్య, వి.రామ్మూర్తి, వహిదుల్లాలు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ప్లాన్-429 కాలపరిమితి 71 రోజులకు కుదింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బిఎస్ఎన్ఎల్ ప్రీ పెయిడ్ ప్లాన్ 429 కాలప రిమితిని కుదిస్తున్నారు. ఈ నెల 10 నుండి 84 రోజుల కాలపరి మితిని 71 కోజులకు కుదించడం జరుగుతుందని తెలంగాణ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ వి. సుందర్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ నాటికి ప్లాన్ 429తో రీ ఛార్జీ చేయించుకునే వినియోగదారులకు 84 రోజుల కాలపరి మితి అమలు అవుతుందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్లాన్‌తో రీ ఛార్జీ చేసుకున్న వినియోగదారులకు ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమితమైన వ్యాయిస్ కాల్ సౌకర్యంతో పాటుగా రోజుకు వన్ జీబీ డాటా ఉచితంగా ఉంటుందన్నారు.

జూబ్లీహిల్స్ దారిదోపిడీ...
పోలీసుల అదుపులో నలుగురు!


ఫైల్ ఫొటో

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నగరంలో కలకలం సృష్టించిన జూబ్లీహిల్స్ దారిదోపిడీ కేసులో పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని ప్రశ్నిస్తున్నారు. బాధితుడి యాదగిరిని మాత్రమే వారు ఎందుకు టార్గెట్ చేశారు. అతడి నుంచి బైక్ ఎందుకు తీసుకెళ్లాడనే కోణంలో ఆరా తీస్తున్నారు. యాదగిరి స్నేహితుడు రాజేంద్రను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని ప్రశ్నిస్తున్నారు. గురువారం జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో సాగర్ సిమెంట్స్ ఎదురుగా ఈ దారిదోపిడీ జరిగింది. బైక్ స్నేహితుడికి ఇచ్చి బాధితుడు ఆఫీస్‌లోకి వెళ్లగానే దానిపై వున్న వ్యక్తిని బెదిరించిన ముఠా బైక్ తీసుకెళ్లిపోయింది. రద్దీ ప్రదేశంలో యాదగిరి, అతడి స్నేహితుడు వచ్చిన బైక్‌నే ముఠా టార్గెట్ చేసుకోవడంపై విచారణ చేపట్టారు. ఈ ముఠా బహదూర్‌పురాలోనూ దోపిడీకి యత్నించారు. దీంతో హైదరాబాద్‌ను వణికిస్తున్న ఈ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే తెలియజేయాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్, బహదూర్‌పురాలో దోపిడీకి దిగిన ఈ ముఠా ఓ బ్యాంకులో కూడా చోరీకి ప్రయత్నించిందని, ఆ ప్రయత్నం విఫలమైందని పోలీసులు తెలిపారు. గురువారం జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఈ ముగ్గురు సభ్యులుగాల గల ముఠా ఓ వ్యక్తిని కత్తితో బెదిరించి, చితకబాది అతని మోటార్‌బైక్‌ను ఎత్తుకుపోయిన సంగతి తెలిసిందే. అక్కడ్నించీ వారు పాతబస్తీకి చేరుకుని బహదూర్‌పురా వైపు వెళుతున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డయినట్లు పోలీసులు గమనించారు. ఆ ముగ్గురు వ్యక్తులు బహదూర్‌పురాలోని ఓ బ్యాంకులోకి వెళ్లి దోపిడీ ఫథకం వేశారని, వారు బ్యాంకులోకి వెళ్లడం, రావడాన్ని పోలీసులు సీసీ కెమెరాల్లో గుర్తించారు. బహదూర్‌పురా నుంచి కూడా వాళ్లు పరారయ్యారని, అయితే ఎటువైపు వెళ్లింది పరిశీలిస్తున్నట్లు సౌత్‌జోన్ పోలీసులు తెలిపారు.

హైదరాబాద్‌లో మళ్లీ డ్రగ్స్ కలకలం

- భారీ మొత్తంలో ఓపీయం డ్రగ్స్ స్వాధీనం
- నలుగురు నిందితుల పట్టివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌లో మళ్లీ డ్రగ్స్ కలకలం చెలరేగింది. టోలీచౌక్ విక్టోరియా వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల పేర్లు మొహమ్మద్ మసూద్ అహ్మద్(39)(కారు డ్రైవర్, రియల్‌ఎస్టేట్ బిజినెస్) (టోలీచౌక్) (స్వస్థలం : లక్సెట్టిపేట(వి), ఆదిలాబాద్ డిస్ట్రిక్ట్), అరిఫ్ ఖాన్(25)(కారు సీజింగ్ వర్క్, కారు డ్రైవర్),(టోలిచౌక్) షేక్ తాజ్(33)(ఏసీ టెక్నీషియన్),(బంజారాహిల్స్), సయ్యద్ హషీమ్ హుస్సేన్(42),(కారు డ్రైవర్). మొహమ్మద్ మసూద్ అహ్మద్ ఎస్ఎస్‌సి వరకూ చదువుకున్నాడు. జీవనోపాధి నిమిత్తం పది సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వచ్చాడు. ప్రస్తుతం కార్ డ్రైవర్. రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాడు. అరిఫ్ ఖాన్ స్వస్థలం హైదరాబాద్. పదవ తరగతి వరకూ చదువుకున్నాడు. గత ఐదు నెలలుగా తన బ్రదర్ ఫరీద్ ఖాన్ వద్ద పనిచేస్తున్నాడు. షేక్ తాజ్ స్వస్థలం హైదరాబాద్. పదవ తరగతి వరకూ చదువు కున్నా డు. తల్లి హౌస్ వైఫ్‌గా ఉంది. ప్రస్తుతం ఇక్కడే ఏసీ టెక్నీ షియన్‌గా వర్క్ చేస్తున్నాడు. సయ్యద్ హషీమ్ హుస్సేన్ స్వస్థలం హైదరాబాద్. అరిఫ్ ఖాన్ స్నేహితుడు మొహమ్మద్ మసూద్ అహ్మద్. అరిఫ్‌ఖాన్ కజిన్ బ్రదర్ షేక్ తాజ్. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న మొహమ్మద్ మసూద్ అహ్మద్‌కు ముషీరాబాద్‌కు చెందిన సత్యానంద్ వర్ధన్ అలియస్ సత్యమ్‌తో పరిచ యవే ర్పడింది. సత్యం స్వస్థలం : ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా, ఏపీ. ఈ క్రమంలో రెండు నెలల క్రితం తన వద్ద ఓపీఎం డ్రగ్ వుందని దానిని కొనేం దుకు కస్టమర్లను వెతకాలని కోరాడు. దీంతో ఆ ఇద్దరు కలిసి ఓపీఎం డ్రగ్‌ను కేజీకి నాలుగు లక్షలు అమ్మాలని డిసైడ్ అయ్యారు. అందులో భాగంగా 20 రోజుల క్రితం మొహమ్మద్ మసూద్ అహ్మద్‌కు సత్యం ఐదు కేజీల ఓపీఎం డ్రగ్స్ అందజేశాడు.

వీరంతా కలిసి తమ వద్దనున్న ఐదు కేజీల ఓపీఎం డ్రగ్స్‌ను విక్రయిం చేందుకు టోలీచౌక్‌లో యత్నిస్తుండగా పోలీసులకు చిక్కారు. అరెస్టయిన నిందితుల వద్ద నుంచి ఐదు కేజీల ఓపీఎం డ్రగ్స్‌తో పాటు వోక్స్ వ్యాగన్ వెంటో కార్ బి.నెం.టీఎస్ 13యూఏ 8389, మూడు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. ఐదు కేజీల ఓపీఎంను ప్రాసెస్ చేస్తే 300 గ్రాముల హెరాయిన్ పొందవచ్చు. ఈ కేసులో కీలక నిందతు డు సత్యం కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మ రం చేశారు. సత్యం దొరికితే ఈ కేసులో మరింత పురోగతి లభిస్తుందని పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ పి.రాధాకృష్ణ రావు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో ఓపీఎం డ్రగ్స్‌ను పట్టుకున్న సిబ్బందిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

ఐటీ సంస్థపై కేసు నమోదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మాదాపూర్ ఐటి కారిడార్‌లో ఉన్న ప్రముఖ ఐటీ సంస్థ వెరిజాన్ కంపెనీపై పోలీస్ కేసు నమోదైంది. అమానుషంగా, బౌన్సర్ల అండతో ఉద్యోగుల నుంచి బలవంతంగా రాజీనామాలను స్వీకరించిన నేపథ్యంలో కేసు బుక్ అయింది. కంపెనీ నుంచి తొలగించబడ్డ ముగ్గురు ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కదిలారు. వెరిజాన్‌పై సెక్షన్ 506(క్రిమినల్ తరహా బెదిరింపులు), సెక్షన్ 341(అమానుష ప్రవర్తన) కింద కేసు నమోదు చేశారు. మరోవైపు వెరిజాన్ చేసిన నిర్వాకం ఐటీ ఇండస్ట్రీలో కలకలం రేపుతోంది. ఏకంగా 200 మంది ఉద్యోగులను ఆ సంస్థ బలవంతంగా గెంటేసింది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితులు పలు విషయాలను పేర్కొన్నారు. ఉద్యోగులను భయపెట్టి, బలవంతంగా రాజీనామా చేయించారంటూ వారు వాపోయారు. డిసెంబర్ 12, 13 తేదీల్లో ఒక్కొక్కరిని మీటింగ్ రూమ్‌కు పిలిపించుకుని.. రాజీనామా చేస్తున్నామనే ప్రింటెడ్ పేపర్లను తమ ముందు ఉంచి, బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని పేర్కొన్నారు. ఆ గదిలో బౌన్సర్లు కూడా ఉన్నారని చెప్పారు. తమకు కొంత సమయం కావాలని విన్నవించినా అందుకు హెచ్‌ఆర్ మేనేజ్‌మెంట్ తిరస్కరించిందని ఉద్యోగులు తెలిపారు. సీట్లలో నుంచి లేచి బయటకు రాబోయిన తమకు బౌన్సర్లు కదలనీయకుండా అదిమిపెట్టారని చెప్పారు. భౌతికంగా హింసించి తమ చేత రాజీనామా పత్రాలపై సంతకాలు చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సొంత వస్తువులను తీసుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని.. కార్యాలయం నుంచి తమను గెంటివేశారని చెప్పారు.

అడవులను కాపాడుకుందాం
అటవీ సంరక్షణ ప్రధానాధికారి పీకే ఝూ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో అడవులను సంరక్షించి పర్యావరణ సమతుల్యను కాపాడుకునేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధానాధికారి పి.కె.ఝూ అన్నారు. శుక్రవారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల అటవీ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఝూ మాట్లాడుతూ అడవులు , వన్యప్రాణుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యత ఆధారపడి ఉందన్నారు. అందుకే నాలుగేళ్లకోసారి పులుల గణన కార్యక్రమాన్ని ప్రభుత్వం జాతీయస్థాయిలో నిర్వహిస్తుందన్నారు. ఈ నెల 22నుంచి దేశవ్యాప్తంగా పులులు , వన్యప్రాణుల గణన ప్రారంబమవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి పులుల లెక్కింపు జరుగుతోందన్నారు. సర్వేకు అటవీశాఖ సన్నద్ధత , మానవ వనరులు , సాంకేతిక సౌకర్యాలు తదితర అంశాలను ఈ సందర్భంగా జిల్లాల అధికారులతో సమీక్షించారు. సిబ్బంది కొరత ఉన్నచోట ఔత్సాహికులు , విద్యార్థులు , వలంటీర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. నైపుణ్యం ఉన్న అటవీ అధికారి పర్యవేక్షణలో సర్వే కొనసాగించాలని అదేశించారు. హరిత హారంలో భాగంగా ఈ ఏడాది నాటిన మొక్కల రక్షణ చర్యలను కూడా సమీక్షించారు. మొక్కలు బతికే శాతం పెంపుదలకు తీసుకుంటున్న చర్యలపై జిల్లాల వారీగా మఖ్యమంత్రి కార్యలయం సమీక్షిస్తుందన్నారు. నర్సరీల నిర్వహణలో కొన్నిచోట్ల నిర్లక్ష్యం కనిపిస్తోందని ,వచ్చే ఏడాది హరితహారం కోసం పెద్ద మొక్కలు పెంచాలని ఆదేశించారు.

పునరభ్యాసంతో కొత్తశక్తి: సీసీఎఫ్


హైదరాబాద్, ఆంధ్రప్రభ : విధి నిర్వహణలో భాగంగా పునరభ్యాసన శిక్షణ కార్యాక్రమాల్లో పాల్గొనటం ద్వారా కొత్త శక్తిని పొందవచ్చని రాష్ట్ర అటవీశాఖ వైల్డ్‌లైఫ్ విభాగం సీసీఎఫ్ మనోరంజన్ భాంజా అన్నారు . తెలంగాణ రాష్ట్ర అటవీశాఖకు చెందిన 53మంది సెక్షన్ అధికారుల మూడు నెలల పునరభ్యాస శిక్షణ ముగింపు సందర్భగా అటవీ అకాడమీలో శుక్రవారం ఏర్పాటు చేసి కార్యక్రమంలో మనోరంజన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరభ్యాస శిక్షణ ద్వారా వృత్తినైపుణ్యతలను పెంచుకోవచ్చన్నారు. అడవుల సంరక్షణలో సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కునేందుకు ఇటు వంటి శిక్షణ కార్యక్రమాలు ఉపకరిస్తాయన్నారు. అడవుల క్షీణత ద్వారా జంతు జాలం తగ్గిపోయి పర్యావరణం దెబ్బతింటుందని, ఆ పరిస్థితి రాకుండా అడవులను కాపాడు కోవాలన్నారు. అనంతరం శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు , పతకాలు బహూకరించి అభినందించారు.

మంత్రితో ఆరోగ్యశాఖ కార్యదర్శి భేటీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వ పథకాలను ముందుకు తీసికెళ్లి అర్హులకు లబ్ది చేకూర్చేలా కృషి చేస్తానని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం ఆమె మర్యాద పూర్వకంగా వైద్య ఆరోగ్య శాఖమంత్రి లక్ష్మారెడ్డిని కలిశారు. సచివాలయంలో బాధ్యతలు తీసుకున్న ఆమె సాయంత్రం మంత్రితో భేటీ అయి తాజా పరిస్థితులను చర్చించారు. ఈ శాఖలో అమలవుతున్న పథకాలు, వాటి తీరుతెన్నులను, ప్రాధాన్యతలను మంత్రి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా ఆమెకు వివరించారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీకి చిత్తశుద్ధిలేదు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోదామంటే ప్రధాన మంత్రి నరేంద్రమోడి సమయం ఇవ్వడం లేదని టీఆర్ఎస్ నేత నోముల నర్సింహ్మాయ్య అన్నారు. వర్గీకరణపై కేంద్ర ప్రభు త్వానికి చిత్తశుద్ది లేదని ఆయన వ్యాఖ్యానించారు. శుక్ర వారం ఆయన టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియా తో మాట్లాడారు. వర్గీకరణపై నిర్ణయం తీసుకునేది కేంద్రమేనని, అందుకు మంద కృష్ణ మాదిగ ఢిల్లీలోనే దీక్షలు, నిరసనలు చేయాలన్నారు. కేంద్రంపై పోరాటం చేస్తేనే ఫలితం ఉంటుందన్నారు. కాంగ్రెస్, టీడీపీ, వామపక్షాల నేతలు తమ రాజకీయ లబ్దికోసమే ఎస్సీ వర్గీకరణపై తమ ప్రభుత్వాన్ని తప్పుపడుతున్నాయన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామన్నారు. కాంగ్రెస్, టీడీపీలు అధికారంలో ఉన్నప్పుడు ఈ సమస్యను ఎందుకు పరిష్కరిం చలేదన్నారు. ఇప్పుడు మొసలీ కన్నీళ్లు కార్చడం సరికాదన్నారు.

సీఎం అవుతాననే ఊహలో జగన్

- ఓర్వలేకనే బాబుపై ఆరోపణలు : దినకర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి తానే ముఖ్యమంత్రిగా భావించుకుంటూ గాలిలో విహరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తూ పేదలకు సంక్షేమ కార్యక్రమాల అమల్లో తీరికలేకుండా పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడమే జగన్ పనిగా పెట్టుకున్నారని ఆయన మండిపడ్డారు. రాజధాని, పోలవరం నిర్మాణాలతో చంద్రబాబు ముందుకు వెళుతుంటే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న ఆందోళనతో వీటికి అవినీతి మరకలు అంటించే ప్రయత్నం చేస్తున్నారని శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మండిపడ్డారు. పోలవరానికి సంబంధించిన ప్రాజెక్టు పనులు, విద్యుత్ ప్రాజెక్టు పనులు తమకు దక్కలేదన్న అక్కసుతోనే వైకాపా ఎంపీలు ప్రాజెక్టును ఆపేందుకు కేంద్రానికి లేఖలు రాస్తున్నారని ఆయన ఆరోపించారు. జగన్ పాదయాత్రలో తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారని దినకర్ మండిపడ్డారు. జగన్ బంధువులకు కూడా రుణమాఫీ జరిగిందని, ఈ విషయాన్ని ఎందుకు చెప్పడం లేదని ఆయన ప్రశ్నించారు. జగన్ ఆదేశాలను కాదంటూ వైకాపా నేతలు కొందరు ప్రభుత్వం చేపడుతున్న జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. జన్మభూమి కార్యక్రమంతో చంద్రబాబు జనంలోకి వెళుతుంటే దాన్ని చూసి తట్టుకోలేని జగన్ తన మనషులను పంపించి వేదికలపై హల్‌చల్ సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమంలో వైకాపా కండువాలు కప్పుకుని వచ్చి అసత్య ప్రచారాలు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని చంద్రబాబు నెరవేరుస్తున్నారని, వైకాపా నేతలు ఎన్ని అవాంతరాలు సృష్టించినా సాగునీటి ప్రాజెక్టులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తవుతాయని దినకర్ ధీమా వ్యక్తంచేశారు.

ఇసుక మాఫియాకు ప్రభుత్వ అండ!

- తెదేపా తెలంగాణ అధికార ప్రతినిధి అనూషారామ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఇసుక మాఫీయా రెచ్చిపోతోందని, దీన్ని నివారించేందుకు ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి ఉప్పలపాటి అనూషారామ్ ఆరోపించారు. నేరెళ్ళలో ఇసుక దుర్ఘటన మరిచిపోక ముందే కామారెడ్డిలో ఇసుక మాఫియా మళ్ళీ రెచ్చిపోయిందని శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె అన్నారు. ఇసుక మాఫియాను నియంత్రించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ప్రభుత్వ ఉదాసీనతతోనే రెచ్చిపోతున్నారని ఆమె దుయ్యబట్టారు. నేరేళ్ళలో ఇసుక మాఫియా దాడిలో ఆరుగురు మరణించగా, ఎనిమిది మందిని అరెస్టు చేశారని ఆమె గుర్తుచేశారు. ఈ దారుణంపై నోరు మెదిపితే బాధిత కుటుంబాల మహిళలపై వ్యభిచారం కింద కేసులు పెడతామని పోలీసులు బెదిరిస్తున్నారని అనూషారామ్ ఆరోపించారు. అధికారుల బెదిరింపులకు భయపడిన బాధిత కుటుంబాలకు చెందినవారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజలనే హింసిస్తోందని అనూషారామ్ దుయ్యబట్టారు. ఇసుక అక్రమ రవాణాకు అధికారులే అనుమతులు ఇస్తూ మళ్ళీ వారే వాహనాలు సీజ్ చేస్తున్నట్లు నటిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇసుక అక్రమార్కులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

టెక్నాలజీతో నేరాలకు చెక్

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ :శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడని ధోరణితో పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్ బలోపేతమయ్యే తీరు ఇత్యాది అంశాలను పటిష్టంగా అమల వ్వాలని రాష్ట్ర పోలీసు బాస్ మహేందర్‌రెడ్డి జిల్లాల పర్యటన సందర్భంగా ఆయా జిల్లాల పోలీసు ఉన్నతాధి కారులకు దిశానిర్దేశన చేస్తున్నారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాతో తొలి పర్యటన చేసిన ఆయన అప్పట్నించీ వరుసగా ఆయా జిల్లాల పర్యటనలో నిమగ్నమయ్యారు. శాంతిభద్రతలు సజావుగా వుంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు తరలివస్తాయని ఆయన వివరిస్తున్నారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో అమలయ్యే సంస్కరణలను జిల్లాలకు విస్తరించనున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో సైబర్ నేరాలు ఓ సవాల్‌గా నిలుస్తాయన్నారు. సైబర్ నేరాలను అరి కట్టా లంటే టెక్నాలజీతోనే సాధ్యపడగలదన్నారు. ప్రభుత్వం పోలీసు శాఖ నుంచి ఏదైతే ఆశిస్తుందో ఆ దిశగా సిబ్బందిని కార్యోన్ముఖులను చేయాల్సిన బాధ్యత ఆయా జిల్లాల పోలీసు కమిషనర్లు, ఎస్పీలదేనని ఆయన చెప్పుకుంటూ వస్తున్నారు. నక్స లిజం సమస్య కూడా పెద్ద సమస్యేనని అన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న పోలీస్‌స్టేషన్లలో భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలను సైతం ఆయన జిల్లాల పర్యటనలో భాగంగా అక్కడి సిబ్బందికి వివరిస్తున్నారు. భద్రాద్రి- కొత్త గూడెం, ఖమ్మం జిల్లాల పర్యటన సందర్భంలో ఆయన ఈ సూచనలను అక్కడి సిబ్బందికి అందజేశారు. గురువారం మహబూబాబాద్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డి పర్యటించారు. ఓవైపు శాంతి భద్రతల పరిరక్షణ అంశాలతో పాటు ఆయా జిల్లాల్లో పోలీస్ ఫంక్షనింగ్ ఏ విధంగా జరుగుతుంది? సిబ్బందికి సమస్యలేమైనా ఉన్నా యా? ఇత్యాది విషయాలను సైతం అడిగి తెలుసుకుంటున్నారు. జిల్లాలకు కొత్త వాహనాలను సైతం సమకూర్చ నున్నామన్నారు. జిల్లాల పర్యటనలో ప్రప్రథమంగా అక్కడ వున్న జిల్లా ఎస్పీ కార్యాలయాలు



తదితరాలను ఆయన సందర్శిస్తున్నారు. అక్కడి ఏర్పాట్లన్నీ పరిశీలిస్తున్నారు. రానున్న టెక్నాలజీతోనే నేరాల నియంత్రణ దిశగా మనం పయనిం చాల్సి ఉంటుం దని చెబుతున్నారు. అందులో భాగంగానే 54 సర్వీసులతో హైదరాబాద్ కాప్ యాప్ సక్సెస్ అనంతరం టీఎస్ కాప్ మొబైల్ అప్లికేషన్‌ను జనవరి 1 నుంచి ప్రారంభించా మన్నారు. సదరు మొబైల్ అప్లికేషన్‌లో ఆయా ప్రాంతాలకు సంబంధించిన సిబ్బందికి వారికి అనుగుణమైన సర్వీసులను పొందుపర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా సిబ్బంది సకాలంలో క్రైమ్ స్పాట్‌కు చేరుకోవడం జరుగుతుందని, మరోవైపు క్రైమ్ స్పాట్‌కు చేరుకునేలోపే అందుకు సంబంధిం చిన వివరాలన్నీ ఈ టీఎస్ కాప్ మొబైల్ అప్లికేషన్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. తద్వారా సమయం ఆదా అవుతుం దన్నారు. మరోవైపు హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో పైలట్ ప్రాజెక్టుగా టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్‌ని ప్రారంబించుకో వడం జరిగిందని, ఇవి జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో సైతం ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాల పర్యటనలో అక్కడ ఉన్న పరిస్థితులను ఆయన పూర్తిస్థాయిలో ఆకళింపు చేసుకోవ డంతో సమస్యల పరిష్కారించడానికి సైతం ఆయన చొరవ చూపుతున్నారు. ముందుగా సిబ్బంది సమస్యలను పరిష్కారమైతే వారు కార్యరంగంలో మరింత ఉత్సాహంగా పనిచేస్తారని డీజీపీ మహేందర్‌రెడ్డి భావిస్తారు. ఈ దిశగా ప్రతి అంశంపై మహేందర్‌రెడ్డి నిశిత పరిశీలనతో పాటు ప్రభు త్వం ఆశించిన స్థాయిలో శాంతి భద్రతలు పూర్తిస్థాయిలో పరిరక్షించబడా లని.. అది ఒక్క హైదరాబాద్‌కే పరిమితం కా క ూ డదని మొత్తంగా రాష్ట్ర స్థాయిలో శాంతి భద్రతలు పరిరక్షించబడాలన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకనుగుణంగా జిల్లా స్థాయి పర్యటనలు ఆయన చేపట్టారు. అక్కడ ఉన్న పరిస్థితులేమిటి.. ఇత్యాది అంశాలను పరిగణనలోనికి తీసుకుంటున్నారు. ప్రజలతో మమేకం కావడం ద్వారానే శాంతి భద్రతల పరిరక్షణ పూర్తిస్థాయిలో సాధ్యపడగలదని డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రతి జిల్లా పర్యటన సందర్భంగా అక్కడి సిబ్బందికి దిశానిర్దేశనం చేస్తున్నారు. నేనుసైతం ప్రాజెక్టు ద్వారా జీహెచ్‌ఎంసీ పరిధిలో 10 లక్షల సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్య సాధనగా కృషి జరుగుతోందని, అలాంటిది జిల్లాల స్థాయిలో కూడా అమలవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌తో హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ పూర్తి కావస్తుందని, ఆ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా నేనుసైతం ప్రాజెక్టు ద్వారా కమ్యూనిటీ సాయంతో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు జిల్లా కేంద్రాలలో టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్‌ల స్థాపన జరగాలన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం నాటికి ఇవన్నీ పూర్తి కావాల్సి ఉందని తద్వారా వాటన్నింటినీ దానికి అనుసంధానం చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాంరభం రోజునుంచే పనిచేసే విధంగా ఉండాలని అన్నారు. ఆ దిశగా అధికారులు కృషిచేయాలని ఆయన సూచిస్తున్నారు.

సింగూరులో భగీరథ ట్రైయల్‌రన్ సక్సెస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ :మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా సింగూరు రిజర్వాయర్ వద్ద నిర్మించిన ఇంటేక్ వెల్ పంప్‌హౌజ్‌లో మోటర్ల ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం ఆర్‌డబ్ల్యుఎస్ విభాగం ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి ఈ పనులు స్వయంగా పరిశీలించారు. మెదక్ జిల్లాకు తాగునీటిని సరఫరా చేసే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. త్వరలో అన్ని పనులు పూర్తిచేసి గ్రావమాలకు తాగునీరందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జుక్కల్ సెగ్మెంట్‌లోని నిజామాబాద్ , బాన్స్‌వాడలకు నీటిని సరఫరా చేసేందుకు నిర్మిస్తున్న వాటార్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ,పంప్‌హౌజ్ పనులు పరిశీలించారు . ఎలక్ట్రో మెకానికల్ పనులు మొదలు పెట్టాలని సూచించారు. వారంలోజుల్లో మోటార్లు, పంపులు బిగించే పనులు పూర్తి చేయాలని హెచ్చరించారు. లేకుంటే కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరించారుఈ పర్యటనలో సీఈ విజయ ప్రకాశ్ , ఎన్‌ఆర్‌డిడబ్ల్యుపి కన్సల్టెంట్ నర్సింగ రావు , ఎస్‌ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీఎంపై లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశా: ఎంపీ అవినాష్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహజన్‌కు ఫిర్యాదు చేసినట్టు కడప ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి తెలిపారు. పులివెందులలో ఇటీవల నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి రౌడీషీటర్ల ను తీసుకువచ్చారన్నారు. తాను వేదికపై మాట్లాడు తుండగానే తన మైక్‌ను లాక్కునే ప్రయత్నం చేశా రన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రే తన చేతిలో ఉన్న మైక్‌ను లాక్కునే ప్రయత్నం చేశారని స్పీకర్ దృష్టికి తీసుకు పోయినట్టు వివరించారు.జరిగిన ఈ సంఘటనపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ సుమిత్రా మహజన్‌ను కోరినట్టు ఎంపి అవినాష్ రెడ్డి ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

ఇద్దరు మావోయిస్టులు మృతి



బీజాపూర్: చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ముదువండి- కవడ్‌గావ్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న భద్ర తా బలగాలకు, మావోయి స్టుల కు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ఓ మహిళా మావోయిస్టు కూడా ఉన్నారు. సీఆర్‌పీఎఫ్, కోబ్రా, చత్తీస్‌గఢ్ పోలీసుల సంయుక్తంగా ఈ కూంబింగ్‌లో పాల్గొన్నారు. ఘటనా స్థలం నుంచి పాయింట్ 303 రైఫిల్ ఒకటి, 12 బోర్ రైఫిల్ ఒకటి, భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం 7.30 గం.ల సమయంలో ఇరుపక్షాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లు నక్సల్స్ నిరోధక దళం స్పెషల్ డైరెక్టర్ జనరల్ డీ.ఎం. అవాస్థి తెలిపారు. నిఘా వర్గాల సమాచారం మేరకు కూంబింగ్ నిర్వహిస్తుండగా, మావోయిస్టులు ఎదురుపడి కాల్పులకు పాల్పడ్డారని, దీంతో భద్రతా బలగాలు ప్రతికాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారని ఎస్‌డీజీ అవాస్థి తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించాం, మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందన్నారు.

పాఠశాల బస్సు, లారీ ఢీ ఆరుగురు మృతి

భోపాల్: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లోని కనాడియా వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. పాఠశాల బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతిచెందారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారు ఐదుగురు విద్యార్థులు, బస్సు డ్రైవర్ చనిపోయారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తల్లిని చంపిన ప్రొఫెసర్

వడోదర: రాజస్థాన్‌లో దారుణ జరిగింది. ఓ ప్రొఫెసర్ తన తల్లిని చంపాడు. అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని ప్రొఫెసర్ నాలుగు అంతస్థుల భవనం పై నుంచి కిందకు తోశాడు. ఈ ఘటన సెప్టెంబర్‌లో చోటుచేసుకోగా, తాజాగా వెలుగులోకి వచ్చింది. స్థానికుడు ఒకరు పోలీసులకు లేఖ రాశాడు. దాంతో పాటు సీసీ కెమెరాలో నిక్షిప్తమై ఉన్న సీడీని అందజేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా... సీసీ కెమెరాలో తల్లిని కొడుకు తోసేసిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు.

కీచక అథ్లెటిక్ కోచ్‌పై కేసు నమోదు

బరేలి: కీచక అథ్లెటిక్ కోచ్ పై కేసు నమోదైన ఘటన ఉత్తర ప్రదేశ్‌లో జరిగింది. ఇద్దరు మైనర్ బాలికలపై అత్యాచార యత్నానికి ఒడిగట్టిన అథ్లెటిక్ కోచ్‌పై పోస్కో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మీరాగంజ్‌లో ఓ టోర్నమెంట్ సందర్భంగా కోచ్ ఆలం తనను లైంగిక వేధింపులకు గురిచేశారని, లైంగిక దాడికి యత్నించగా తాను ప్రతిఘటించానని మహిళా అథ్లెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు గతనెలలో నైనిటాల్‌లో జరిగిన మాన్‌సూన్ మారథాన్ సమయంలో ఆలం తనపై లైంగిక దాడికి యత్నించాడని మరో మైనర్ అథ్లెట్ ఫిర్యాదు చేశారు. తొలుత బాలికకు అభ్యంతరకర చిత్రాలు చూపి ఆపై లైంగిక దాడికి యత్నించాడు. నైనిటాల్ నుంచి తిరిగివచ్చిన తర్వాత ఈ విషయాన్ని బాధితురాలు తల్లితండ్రులకు వివరించగా, బాధిత బాలికలిద్దరూ తల్లితండ్రల సూచన మేరకు కోచ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేషన్ రీ సైక్లింగ్ దొంగల పట్టివేత

- వ్యాపారులపై క్రిమినల్ కేసులు
- బ్లాక్ లిస్టులో రైస్ మిల్లులు
- నాగర్‌కర్నూల్, సిరిసిల్లలో బియ్యం అక్రమాలు
- తీవ్రంగా స్పందించిన సి.వి. ఆనంద్
- గోదాం ఇన్‌చార్జీపై వేటు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రేషన్ బియ్యం రీ సైక్లింగ్ వైనంపై పౌరసరఫరాల కమిషనర్ సి.వి. ఆనంద్ స్వయంగా రంగంలోకి దిగి తనదైన శైలిలో రేషన్ బియ్యం దొంగలను రెడ్‌హైండెడ్‌గా పట్టుకొని గోదాం ఇన్‌ఛార్జీ పై వేటు వేశారు. ఈ మొత్తం వ్యవహారానికి ప్రధానకారకులైన రైస్ మిల్లర్ల పై కఠిన చర్యలు చేపట్టారు. అక్రమాలకు పాల్పడిన వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వ్యవహారం నాగర్ కర్నూల్‌లో చోటు చేసుకుంది. వెంటనే జిల్లాలోని మిల్లర్ల నుండి దొడ్డు బియ్యం, సన్న బియ్యం కొనుగోలును నిలిపివేశారు. పేదల బియ్యాన్ని దిగమింగడానికి ప్రయత్నిస్తే సహించబోమని పౌరసరఫరాల కమిషనర్ సి.వి. ఆనంద్ హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడే మిల్లర్ల పైన చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని, ఏ ఒక్క మిల్లర్‌ను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. మోసాలకు పాల్పడటాన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితిలో సహించబోదన్నారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ కోసం ఏటా 6 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని మిల్లర్ల నుండి కొనుగోలు చేస్తుంది. ప్రభుత్వ వసతి గృహాలు, మధ్యాహ్న భోజన పథకం కోసం మరో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని కూడా మిల్లర్ల నుండి కొనుగోలు చేయడం జరుగుతుంది. తనిఖీల్లో 50 కేజీల బరువు కలిగిన 1080 బియ్యం బస్తాలను గుర్తించారు. ఈ బియ్యం విలువ రూ. 15 లక్షల వరకు ఉంటుంది. నాగర్ కర్నూలు జిల్లాలోని శ్రీరాములుకు చెందిన శ్రీనివాస రైస్ మిల్, మల్లేష్‌కు చెందిన వెంకటేశ్వర రైస్ మిల్ నుండి రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అమ్మినట్టుగా అధికారులు గుర్తించారు. రీ సైక్లింగ్ చేసిన బియ్యాన్ని అత్యంత రహస్యంగా పౌరసరఫరాల సంస్థకు సరఫరా చేసే బియ్యంలో కలిసి అక్రమాలకు పాల్పడినట్టుగా అధికారుల తనిఖీల్లో వెల్లడయింది. మిల్లర్లను కమిషన్ కార్యాలయానికి పిలిపించగా హాజరు కాలేదు. రెండు మిల్లుల్లో కరెంటు బిల్లులు పరిశీలించగా ధాన్యం మిల్లింగ్ చేయనట్టుగా గుర్తించారు.

ఎయిమ్స్‌కు నిధులు విడుదలచేయండి

కేంద్ర ఆరోగ్య మంత్రికి భువనగిరి ఎంపీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణాలో నిర్మిస్తున్న ఎయిమ్స్‌కు త్వరగా నిధులు విడుదల చేయాలన్న భువనగిరి ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ విజ్ఞప్తిపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఆయన కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను కలిశారు. ఎయిమ్స్‌కు నిధుల విడుదలపై నడ్డాతో సుదీర్ఘంగా చర్చించారు. నిధుల విడుదల జాప్యానికి కారణమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి అరుణ్ జైట్లీతో చర్చించి వీలైనంత త్వరగా నిధుల విడుదల జరిగేలా చూస్తామని నడ్డా నర్సయ్యకు హామీ ఇచ్చారు.

8నుంచి12 వరకు దక్షిణ భారత సైన్స్ ఫెయిర్

- ప్రారంభించనున్న ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- ముగింపులో పాల్గొననున్న గవర్నర్ నరసింహాన్
- 6 రాష్ట్రా ల నుంచి హాజరుకానున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పాఠశాల విద్య సంచాలకులు కిషన్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: హైదరాబాద్ నగరంలో జనవరి 8 నుంచి 12 వరకు దక్షిణ భారత సైన్స్ ఫెయిర్ జరగనుంది. సెంట్ ప్యాట్రిక్స్ హైస్కూల్‌లో జరిగే ఈ సైన్స్ ఫెయిర్‌ను ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రారంభిస్తారని పాఠశాల విద్య సంచాలకులు జి కిషన్ తెలిపారు. 12న జరిగే ముగింపు ఉత్సవాల్లో తెలుగు రాష్ట్రా ల ఉమ్మడి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహాన్ పాల్గొంటారన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన హైదరాబాద్ డిఈవో సత్యనారాయణ రెడ్డి , ఎస్‌సీఈఆర్‌టి సంచాలకులు శేషుకుమారితో కలిసి శుక్రవారం మీడియాకు తెలిపారు.
సైన్స్ ఫెయిర్ కోసం పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్‌టి అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశాయని ఆయన కిషన్ తెలిపారు. సైన్స్ ఫెయిర్‌లో 6 రాష్ట్రా లకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రా లకు చెందిన వారు ఈ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారని చెప్పారు. ఇందులో 20 గ్రూప్ ప్రదర్శనలు, 15 వ్యక్తిగత ప్రదర్శనలు, 15 ఉపాధ్యాయ ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రతి రాష్ట్రం నుంచి 50 ప్రదర్శనలతో మొత్తం 300 ప్రదర్శనలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతి రాష్ట్రం నుంచి 350 మంది విద్యార్థులు, 300 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని... 200 మంది వాలంటీర్లతో ఏర్పాట్లను చేయనున్నట్టు చెప్పారు. మరోసారి నిర్వహించే దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌ను ప్రభుత్వ పాఠశాలలోగానీ, రెసిడెన్షియల్ పాఠశాలలో గానీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

2018-19లో ప్రైవేటు స్కూల్స్ ఫీజులు పెంచరాదు

ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందని, అయితే ఆ కమిటీ ప్రతిపాదించిన ఫీజుల పెంపును 2018-19లో అమలు చేయకూడదని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. 2017-18లోని ఫీజులనే వచ్చే ఏడాదిలోనూ కొనసాగించాలని ప్రైవేటు స్కూల్స్‌కు ఆదేశాలు ఇవ్వాలని డిఈవోలను ఆదేశించినట్టు చెప్పారు. ప్రైవేటు స్కూల్స్‌లో బ్యాగుల బరువుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నందున వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయిస్తామని చెప్పారు. వివిధ రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాలను అధ్యయనం చేశామని, వాటిలో ఉత్తమమైనదానిని అమలు చేయడానికి ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు, తల్లిదండ్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో పౌష్టికాహారం ఉండేలా మెనూలో మార్పులను పరిశీలిస్తున్నామని ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ప్రైవేటు స్కూల్స్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్లపై ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలతో చర్చించామని, వారు అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో తీసుకుని వాటిని పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌కు అప్‌లోడ్ చేస్తామని చెప్పారని తెలిపారు.

విదేశాలకు సమాచారం లీకేజీ వాస్తవమే

- ఏపీ, తెలంగాణాలో తగ్గిన పప్పుధాన్యాల సాగు
- రాజ్యసభలో ఎంపీ ప్రశ్నలకు కేంద్ర మంత్రుల జవాబులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: మొబైల్ డేటా ద్వారా విదేశాలక ు సమాచారం లీక్ అవుతున్న మాట వాస్తవమేనని టెలీ కమ్యూనికేషన్ల సహాయ మంత్రి మనోజ్ సిన్హా అంగీకరించారు. అయితే అది ఎలాంటి సమాచారమనేది తెలియదని ఆయన అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యులు విజయసాయిరెడ్డి శుక్రవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... మొబైల్ ఫోన్ల ద్వారా ఇతర దేశాలకు మన సమాచారం వెళ్తున్నట్టుగా కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయని మనోజ్ సిన్హా తెలిపారు. వార్తలపై స్పందించిన ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ రంగంలోకి దిగింది. సెల్‌ఫోన్ల భద్రత, రక్షణ కోసం వాటి తయారీ సంస్థలు ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నాయి... ఆయా ఫోన్ల ఆర్కిటెక్చర్, ఫ్రేమ్ వర్క్‌లు, తదితర వివరాలు సమర్పించాలని మొబైళ్ల తయారీ సంస్థలను కోరినట్టు కేంద్ర మంత్రి వివరించారు. మొబైల్ డేటా విదేశాలకు లీకవుతున్నట్టు వార్తలు వెలువడిన తర్వాత తమ మంత్రిత్వ శాఖ స్టాండర్డైజేషన్ టెస్టింగ్, క్వాలిటీ సర్టిఫికేషన్ విభాగం దీనిపై లోతుగా విచారణ జరిపింది. మొబైళ్ల నుంచి లీకవుతున్న డేటా సంకేత సంక్షిప్త సందేశం రూపంలో ఉంటున్నందున అది ఎలాంటి సమాచారమో కనిపెట్టడం కష్టమవుతోందని మనోజ్ సిన్హా అన్నారు. ఈ డేటా కేవలం తమ ప్రతిభాపాటవాలు, సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి మాత్రమే వినియోగిస్తున్నట్టుగా ఆయా ఫోన్ల కంపెనీలు చెప్తున్నాయని ఆయన వెల్లడించారు. మరోవైపు దేశవ్యాప్తంగా పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణత తగ్గినట్టుగా వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వెల్లడించారు. రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా



సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా 2016-17 ఖరీఫ్ సీజన్‌లో 143 లక్షల హెక్టార్లలో పప్పు ధాన్యాలు సాగవగా, 2017-18 ఖరీఫ్ సీజన్‌లో ఆ విస్తీర్ణం 132 లక్షల హెక్టార్లకు తగ్గిపోయిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందని ఆయన చెప్పుకొచ్చారు. వినియోగదారుల మంత్రిత్వ శాఖ ఆధీనంలోని ధరల స్థిరీకరణ నిధి నుంచి 20స లక్షల టన్నుల నిల్వల పప్పుధాన్యాలను సమకూర్చుకునే సౌలభ్యం ఉందని గజేంద్ర సింగ్ షెకావత్ జవాబులో తెలిపారు.

వాహనాల కాలుష్య పరీక్షలకు సరికొత్త విధానం

- అందుబాటులోకి రానున్న ఆధునిక సాంకేతికత
- కాలుష్య రహిత వాహనాలే లక్ష్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వాహన కాలుష్యాన్ని పరీక్షించడా నికి కేంద్రీకృత సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రాబోతుంది. ఈ మేరకు రవాణా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వాహన కాలుష్య పరిక్షా వాహనాలను కేంద్రీకృత సర్వర్‌కు అనుసంధానం చేయడంతో కాలుష్య పరీక్షల్లో అక్రమాలను అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. కేంత్రీకృత సర్వర్ ద్వారానే ధృవీకరణ పత్రం జారీ చేసే విధంగా సాంకేతికతను సమకూర్చుకునే విధంగా సంబంధి త సంస్థలతో ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. తెలంగాణలో 1.32 కోట్ల వాహనాలు ఉన్నాయి. అందులో సరకు రవాణా వాహణాలు 4.12 లక్షల వరకు ఉన్నాయి. ఆటో రిక్షాలు 3.73 లక్షల వరకు ఉన్నాయి. విద్యా సంస్థలకు సంబంధించిన వాహనాలు 24 వేల వరకు ఉన్నాయి. వీటన్నింటిలో అత్యధికంగా కాలుష్యం వెదజల్లే వాహనాలను నిరంతరం పరీక్షించవలసి ఉంటుంది. కాలం తీరిన వాహనాలు ఫిట్మెంట్ సమయంలోనే కాలుష్య పరీక్షలు చేయించుకుంటున్నాయి. ఇక మీదట ప్రతి వాహనానికి కాలుష్య పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోబోతున్నారు. ప్రతి వాహనం వివరాలు కేంద్రీకృత సర్వర్‌లో నిక్షిప్తం చేస్తారు. కాలుష్య పరీక్షనిర్వహించుకొ నేందుకు గడువు ముగిసే సమయంలో కేంద్రీకృత సర్వర్ నుండి వాహన యజమానికి సంక్షిప్త సందేశం పంపిస్తారు. సకాలంలో కాలుష్య పరీక్షలు నిర్వహించబడని వాహనాల వివరాలను వాహన తనిఖీ అధికారాలు కలిగి ఉన్న రవాణా అధికారులతో పాటుగా ట్రాఫిక్ విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు చేరవేయడం జరుగుతుంది. దీంతో వాహన పరీక్షలు పునరుద్దరించుకోకుండా రోడ్ల పై తిరిగే వాహనాలను గుర్తించి జరిమానా విధించడంతో కాలుష్య పరీక్షలు నిర్వహించేంత వరకు వాహనాలను నిలుపుదల చేసే విషయం కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. డీజల్ వాహనాలకపై అధికారులు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించబోతున్నారు. ద్విచక్ర వాహనదారులు వాహన కాలుష్య పరీక్షలు జరిపించడం చాలా తక్కువ అని అధికారులు పేర్కొన్నారు. ఇక మీదట ప్రతి వాహనం వెంట కాలుష్య పరీక్షలు నిర్వహించినట్టుగా ధృవీకరణ పత్రం తప్పనిసరి అని పేర్కొన్నారు. రోడ్ల పైన ఏర్పాటు చేసిన కాలుష్య పరీక్ష వాహనాలకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర సామాగ్రి, కాలుష్య పరీక్షా సాఫ్ట్ వేర్‌ను సమకూర్చబో తున్నామని తెలిపారు. ఈ విధంగా సంచార వాహనాల వద్ద వాహన కాలుష్య పరీక్షలు నిర్వహించుకొనే వారు ఇక మీదట నేరుగా ధృవీకరణ పత్రం పొందే వెసులుబాటు ఉండబోదన్నారు. వాహన కాలుష్య పరీక్షల వివరాలను అంతర్జాలం ద్వారా కేంద్రీకృత సర్వర్‌కు పంపించ వలసి ఉంటుందన్నారు. ఈ విధంగా సర్వర్‌కు అందిన సమాచారం మేరకు వాహనాలకు ధృవీకరణ పత్రం జారీ అవుతుందని. ఈ పత్రాలను సంచార కాలుష్య పరీక్షల వాహనదారులు డౌన్‌లోడ్ చేసుకొని వాహనదారునికి అందచేయవలసి ఉంటుందన్నారు. ప్రతి ఆర్టీఏ కార్యాలయం పరిధిలో అవగాహన కార్యక్ర మాలు నిర్వహించడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాహనాలను పరీక్షించడం, అధిక కాలుష్యం వెదజల్లే వాహనాలను మరమ్మతు చేయించుకొనే విధంగా యజమానులకు కొంత గడువు ఇవ్వడం లాంటి అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే 15 సంవత్సరాలు దాటిన వాహనాలను రోడ్లపై తిరగనివ్వరాదని సుప్రీంకోర్డు ఇచ్చిన ఆదేశాలను పరిగణలోకి తీసుకొని అధికారులు చర్యలు తీసుకుంటు న్నారు.

గజల్ శ్రీనివాస్‌కు నో బెయిల్

- ఆ వీడియోలు ఏవి?
- పార్వతి పరారీలో ఉందని ఎలా చెబుతారు?
- పోలీసులకు కోర్టు ఝలక్

హైదరాబాద్, ఆంధ్రప్రభ :గాయకుడు గజల్ శ్రీనివాస్ బెయిల్‌కు సంబంధించి నాంపల్లి కోర్టులో శుక్రవారం వాదనలు నడిచాయి. ఇరువురి వాదనల అనంతరం న్యాయస్థానం బెయిల్ పిటిషన్ కొట్టివేసింది. గజల్‌కు పలుకుబడి ఉందని, ఆయనకు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారన్న వాదనలతో ఏకీభవించి బెయిల్ ఇవ్వలేదు. గజల్ శ్రీనివాస్ తరపున ఉమామహేశ్వరరావు అనే లాయర్ వాదనలు వినిపించారు. గజల్‌కు బెయిల్ ఇవ్వాలని వాదించారు. మరోవైపు బెయిల్ వద్దని పోలీసులు వాదించారు. వాదనల సమయంలో పోలీసుల తరపు లాయర్‌పై న్యాయస్థానం ప్రశ్నల వర్షం కురిపిం చింది. సీడీలను కోర్టుకు ఎందుకు సమర్పించలేదని, ఎ2 నిందితురాలు పార్వతి పరారీలో ఉందని ఎలా చెబుతారని, కోర్టు అనుమతి లేకుండా సీడీలను ఎఫ్‌ఎస్‌ఎల్‌కు ఎలా పంపిస్తారని ప్రశ్నించింది. బాధితురాలిగా చెప్పుకుంటున్న యువతి స్టింగ్ ఆపరేషన్ చేసి, ఆ తర్వాత కుట్రపూరితంగా ఫిర్యాదు చేస్తే కేసు ఎలా నమోదు చేస్తారని గజల్ న్యాయవాది వాదనలు వినిపించారు. ఇదంతా ఓ కుట్ర పూరితం గానే జరిగిందని చెప్పారు. కేసులో ఇప్పటికే వీడియో లు సహా అన్ని ఆధా రాలు పోలీసులు సేకరించారని, మరిన్ని ఆధారాలు సేకరించాల్సిన అవసరం లేదని గజల్ తరపున లాయర్ చెప్పారు. కాబట్టి అతనికి బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మందుపాతర్లు, పేలుడు సామగ్రి స్వాధీనం

తిరువనంతపురం: మందుపాతరలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కేరళలోని మళప్పురం వద్ద రైల్వే బ్రిడ్జి క్రింద పెద్ద ఎత్తున మందుపాతరలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇది ఉగ్రవాద చర్య అని అనుమానిస్తున్నారు. రైల్వే బ్రిడ్జిని పేల్చేందుకు కుట్ర జరిగినట్లు భావిస్తున్నారు. బాంబు నిర్వీర్య దళం ఈ మందు పాతరలను నిర్వీర్యం చేసింది. దర్యాప్తు కొనసాగుతోంది. ఈ పేలుడు పదార్థాలు సైన్యం ఉపయోగించే ప్రమాణాలతో కూడినవని తెలుస్తోంది. వీటిని ఎవరు, ఏవిధంగా సంపాదించగలిగారనే అంశంపై కూడా దర్యాప్తు జరుగుతోంది.

450 గ్రాముల గంజాయి స్వాధీనం

మేడ్చల్, ప్రభన్యూస్: మేడ్చల్ జిల్లాలో 450 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒకరిని అరెస్టు చేశారు పోలీసులు. ఈ ఘటన మేడ్చల్ చెక్‌పోస్టు వదద ఓ వ్యక్తి నుంచి 450 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని సరఫరా చేస్తున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రగ్స్ కేసులో దక్షిణాఫ్రికా మహిళకు జైలు శిక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మాదక ద్రవ్యాల కేసులో దక్షిణాఫ్రికాకు చెందిన ఓ మహిళకు జైలు శిక్ష పడింది. మూడేళ్ల క్రితం ఎఫిడ్రిన్ సరఫరా చేస్తూ ఎన్‌సీబీ అధికారులకు దక్షిణాఫ్రికాకు చెందిన మహిళ చిక్కిన విషయం తెలిసిందే. ఇవాళ ఆ కేసుకు సంబంధించి విచారణ చేసిన రంగారెడ్డి జిల్లా కోర్టు నిందితురాలికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

భార్యపై భర్త, అతని స్నేహితులు దాడి

ఏలూరు, ప్రభన్యూస్: ఏలూరులో దారుణం జరిగింది. సబ్ జైలు వద్ద భార్యపై భర్త, అతని స్నేహితులు దాడి చేశారు. నాలుగైదు పెళ్లిళ్లు చేసుకొని మోసం చేశాడని గతంలో సంపత్‌పై భార్య ఫిర్యాదు చేసింది. దాన్ని మనసులో పెట్టుకున్న భర్త సంపత్.. రాజీ కోసం పిలిచి భార్యపై దాడి చేశాడు. గాయాలపాలైన భార్యను సమీప ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంపత్ కుమార్ ను అదుపులోకి తీసుకున్నారు.

బోయలను ఎస్టీలో చేర్చొద్దు

జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యురాలు చింతామన్‌కు వినతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యాపరంగా ఎంతో అభివృద్ధి చెందిన బోయ (వాల్మీకి) కులాన్ని గిరిజనుల్లో చేర్చవద్దని జాతీయ ఎస్టీ కమీషన్‌ను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం కోరింది. ఈ కులాన్ని మరో కులం దోపిడీచేసే అవకాశం లేదని, భాషా, సంస్కృతిపరంగా గిరిజనులతో ఎలాంటి సంబంధం లేదని సంఘం నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యురాలు చింతామన్‌ను శుక్రవారం ఎస్టీ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఇ.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ నేతృత్వంలో కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ కులాన్ని ఎస్టీలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదించిందని వారు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపితే గిరిజన తెగలకు తీవ్ర నష్టం జరుగుతుందని, దీన్ని వ్యతిరేకించాలని వారు కోరారు.గిరిజనులకు ప్రత్యేక భాష, భిన్నమైనన సంస్కృతి ఉంటుందని, ఇది ఇతర భాషల వారికి అర్థం కాదని వారు పేర్కొన్నారు. అలాగే గిరిజన ఆచారాలు, దుస్తులు,ఆవాసాలు కూడా ఇతరులకన్నా భిన్నంగానే ఉంటాయని, సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా ఎంతో వెనకబడ్డారని ఆ వినతిపత్రంలో వివరించారు. అగ్రవర్ణాల పెత్తనానికి గిరిజనులు దొపిడీకి గురవుతున్నారని, సమాజంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో 29 లక్షల జనాభాతో

35 కులాలు ఎస్టీ కులాలు ఉన్నాయని, అయితే వీరికి కేవలం 6.4 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న జనాభా ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో కనీసం 10శాతం రిజర్వేషన్ కల్పించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ గిరిజనుల్లో కేవలం 2 శాతం మంది మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని, 50 శాతం మంది ఎస్టీ రిజర్వేషన్లను అక్రమంగా అనుభవిస్తున్నారని చింతామన్‌కు ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసలైన గిరిజనులకు రిజర్వేషన్ ఫలాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

సంక్షేమమే ఎజెండాగా బడ్జెట్

- కొత్త బడ్జెట్‌కు కసరత్తు షురూ
- శాఖల వారీగా ప్రతిపాదనలు
- ప్రీ బడ్జెట్ సమావేశాలకు షెడ్యూల్
- రూ.1.80 లక్షల కోట్ల బడ్జెట్‌కు అంచనాలు • పేరుకుపోయిన బకాయిలు
- తలసరి ఆదాయంలో జోష్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మరో సంక్షేమ బడ్జెట్ సిద్ధమవుతోంది. వచ్చే ఆర్థిక యేడాది(2018-19)కి వార్షిక బడ్జెట్ కసరత్తు షురూ అయింది. ప్రస్తుత ఆర్థిక యేడాదిలో రూ. 1.49లక్షల కోట్లుగా ఉన్న బడ్జెట్ స్వరూపం తాజాగా రూ.1.80లక్షల కోట్లకు చేరే సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చే యేడాదికి ఏ శాఖకు ఎంత మేర బడ్జెట్ కావాలో కోరుతూ శాఖల వారీగా ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు.కాగా ఈ ఆర్థిక ఏడాదిలోనూ సంక్షేమం, అభివృద్ధి రంగాలకు పెద్దపీట వేస్తూ వాటికే కీలక నిధుల కేటాయింపులు జరగనున్నట్లుగా తెలిసింది. వచ్చేది ఎన్నికల యేడాది కావడంతో సంక్షేమ పథకాలు, ఇప్పటికే ప్రగతిలో ఉన్న అనేక ప్రతిష్టాత్మక పథకాలు, పనులను పూర్తి చేయాల్సిన అవసరం నెలకొంది. ఈ మేరకు ప్రస్తుత ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలు, సవరించిన అంచనాలు, వ్యయం, కేటాయింపులు, అంశాల వారీగా ఖర్చయిన నిధుల వివరాలను తాజాగా సేకరిస్తున్నారు. ఇప్పటికే నిధులు ఎంతమేర వినియోగం జరిగాయి...ఎంత మేర ఖర్చు కావాల్సి ఉంది...అనే కీలక అంశాలతో కూడిన ప్రతిపాదనలు ఆన్‌లైన్‌లో సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకే అన్ని శాఖలు నివేదికలను సిద్ధం చేస్తున్నాయి. ఆ తర్వాత శాఖల వారీగా ప్రీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించి ఏ శాఖకు ఎంత బడ్జెట్ కేటాయించాలనే అంశంపై ఒక అంచనాకు రానున్నారు.

సంక్షేమానికి తొలి ప్రాధాన్యత

గ్రామీణ వికాసం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం, వృత్తిదారుల రక్షణే లక్ష్యంగా 2017-18 బడ్జెట్‌ను రూ.4571 కోట్ల మిగులుతో ప్రవేశపెట్టారు. పేదలసంక్షేమం,కులవృత్తులకు పూర్వ వైభవం తెచ్చేలా కసరత్తు చేశారు. ఈ బడ్జెట్‌లో తొలిసారిగా ప్రణాళిక, ప్రణాళికేతర పద్దుల స్థానంలో ప్రగతి, నిర్వహణ పద్దులను ప్రవేశ పెట్టారు. ప్రగతి పద్దుకింద రూ. 88,038కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. వనవనరులను బలోపేతం చేసి వ్యయాన్ని సహేతుకంగా క్రమబద్ధీకరించడం ద్వారానే నిర్వహణ వ్యయం కంటే ప్రగతి పద్దు వ్యయం ఎక్కువగా సాధ్యమైంది.

నిర్వహణ వ్యయం రూ. 61,607 కోట్లుగా నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల వికాసానికి... మేకలు, గొర్రెలు, కోళ్లు, చేపల పెంపకందారులకు పెద్ద పీట వేసింది. చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేలా వారి సంక్షేమం కోసం రూ. 1200కోట్లను కేటాయించారు. అణగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. ఎస్సీ, ఎస్టీల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేసి నిర్దేశిత కేటాయించిన నిధులు ఒక ఏడాదిలో వ్యయం కాకపోతే వాటిని తదుపరి ఏడాదికి క్యారీ ఫార్వార్డ్ చేయాలని అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఖర్చు కాని నిధులు వచ్చే ఏడాదికి కొంత ఊతంగా నిలవనున్నాయి.

ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించింది. గ్రామీణ వృత్తులకు ఆర్థిక ప్రేరణ కల్పించేలా వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలోని 4లక్షల యాదవ కుటుంబాలకు 84 లక్షల గొర్రెలను పంపిణీ చేసేందుకు పథకాన్ని రూపొందించి బడ్జెట్ లో నిధు...

కీలక రంగాలకు భారీ నిధులు

ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం, సామాజిక పింఛన్లు, పెంపిన జీతాలతో కూడిన ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, రైతులకు రూ.8వేల పంట సాయం అందజేత వంటి వాటికి కీలకంగా నిధుల కేటాయింపులు అవసరం కానుంది. రాష్ట్రంగా ఖ్యాతి పొందుతున్న తెలంగాణ రాష్ట్రం ఆదాయ మిగులుతోనే ముందుకు సాగేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. జాతీయ తలసరి ఆదాయం 10.2 శాతం ఉండగా తెలంగాణలో అది 12.6 శాతంగా నమోదు కావడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను తేటతెల్లం చేస్తోంది. 2016-17లో తెలంగాణ తలసరి ఆదాయం 12.6శాతంగా రూ. 1,58,360కి చేరింది. జాతీయసగటు రూ. 1,03,828గా ఉండగా, 2011-12లో రూ. 91,121 తలసరి ఆదాయం తెలంగాణలో ఉండగా జాతీయ స్థాయిలో ఇది రూ. 63460 నమోదైంది. 2012-13లో తెలంగాణలో తలసరి ఆదాయం రూ. 1,00,979తో 10.8శాతానికి చేరుకుంది. జాతీయ స్థాయిలో రూ. 71,011తో 11.9శాతంకాగా, 2013-14లో తెలంగాణకు 1,12,328తో 11.2శాతం జాతీయ సగటు రూ. 79146తో 11.5 శాతం నమోదైంది. 2014-15లో తెలంగాణలో 1,25,832తో 12.0శాతం, జాతీయస్థాయిలో 86,513తో 9.3శాతం, 2016-17లో అది తెలంగాణ రాష్ట్రంలో 1, 58, 360తో 12.6 శాతంగా నమోదవగా, జాతీయ స్థాయిలో 1,03,818తో 10.2 శాతం గా ఉంది. రాష్ట్ర అవతరణ తర్వాత ఏనాడు వెనుదిరిగి చూడలేదు.

వ్యవసాయ అనుబంధ రంగాలు కీలకం

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టత తెచ్చేలా వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 46,946కోట్లను కేటాయించింది. సాగునీటి రంగానికి రూ. 25వేల కోట్లను కేటాయించి తన ప్రాధాన్యతను ... కేటాయించింది. కాగా ఈ ఏడాది నవీన క్షౌరశాలలకు పెట్టుబడిని సమకూర్చడం, రజకులకు వాషింగ్ మెషిన్లు, డ్రయర్లు, ఐరన్ బాక్సులను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఎంబీసీల ప్రత్యేక కార్పొరేషన్‌కు రూ. 1000 కోట్లను కేటాయించింది. ఈ ఏడాది దీనిని మరింత పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రూ. 5070.36 కోట్లను మరో 10శాతం పెంచే చర్యలు తీసుకునే అవకాశం ఉన్నది. కాగా గతేడాదినుంచి కళ్యాణలక్ష్మి పథకపు ఆర్థికసాయాన్ని రూ. 51వేలనుంచి రూ. 75,116కు పెంచిన సంగతి తెలిసిందే. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం, సన్నబియ్యం, గర్భిణీ దశలో ఉపాధి కోల్పోయే స్త్రీలకు అంతే మొత్తాన్ని అందిస్తుండగా ఈ ఏడాది ఈ పథకాలకు కేటాయింపులు మరింతగా పెరగనున్నాయి.

పేరుకు పోతున్న బకాయిలు

కాగా రాష్ట్ర ఆర్థికపరిస్థితిపై జీఎస్టీ ప్రభావపు ప్రతికూల ప్రభావం చూపుతోంది. కేంద్ర బకాయిలు కూడా పేరుకు పోయాయి. వివిధ పథకాలకు చేసిన కేటాయింపుల్లో భారీగా నిధుల కొరత నెలకొంటోందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్థిక ఆంక్షలు ఒకవైపు జటిలంగా మారాయి. కీలకమైన సాగునీటి రంగానికి రూ. 5600 కోట్ల మేర బకాయి పడినట్లుగా తెలిసింది. విద్యుత్ సంస్థలకు, ఈ రంగాలకు సుమారు రూ. 15వేల కోట్లు, ఫీజు రీ ఎంబర్స్‌మెంట్‌కు రూ. 2వేల కోట్లు, ఇతర రంగాలకు మరో రూ. 15వేల కోట్లుగా బకాయిలు పేరుకు పోయినట్లుగా సమాచారం.

ఎమ్మార్ కేసులో కోనేరు మధుకు ఊరట

సీబీఐ కేసును కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎమ్మార్ కుంభకోణం కేసులో 13వ నిందితుడిగా ఉన్న కోనేరు మధుకు హైకోర్టులో ఊరట లభించింది. కోనేరు మధుపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పును వెలవరించింది. ఎలాంటి నేరపూరితమైన ఉద్దేశం లేని, కుట్రలో ఏ పాత్ర లేని వ్యక్తిని , ఆతని బ్యాంకు ఖాతాలోని సొమ్ము చేరినంత మాత్రాన ఆ వ్యక్తిని నిందితుడిగా పేర్కొనడాన్ని చట్టం అనుమతించదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శివశంకరరావు శుక్రవారం ఈ మేరకు తీర్పును వెలువరించారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే తనపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని అభ్యర్థిస్తూ కోనేరు మధు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎమ్మార్ విల్లాస్ కుంభకోణానికి సంబంధించిన కొంత సొమ్ము తన దుబాయి బ్యాంకు ఖాతాలో చేరిందని, తన తండ్రి కోనేరు రాజేంద్రప్రసాద్ ఈ కుంభకోణంలో కీలకమైన నిందితుడని పేర్కొన్నారు. ఆతని బ్యాంక్ ఖాతాలో రూ.4.5 కోట్లు జమచేసినట్లు ఇద్దరు విల్లా కస్టమర్లు చేసిన ప్రకటన ఆధారంగా తనపై సీబీఐ కేసు నమోదు చేసిందని మధు పేర్కొన్నారు. తన బ్యాంక్ ఖాతాలో సొమ్ము జమ చేసినట్టు విల్లా కొనుగోలుదారులపై ఒత్తిడి తెచ్చినట్లు ఎలాంటి ఆధారాలు లేవని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఆ సొమ్ములో కొంత మొత్తాన్ని రుణంగా , మరికొంత మొత్తాన్ని వ్యాపారంలో పెట్టుబడి అని పిటిషనర్ పేర్కొన్నారు. అయితే ఆయనపై సీబీఐ కేసు నమోదు చేసిన వెంటనే రుణాన్ని పూర్తిగా చెల్లించినట్లు తెలిపారు. దుబాయిలో నివసించే మధు కుట్రలో పాలుపంచుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేవలం నిందితుడి కుమారుడైనంత మాత్రాన మధును కూడా నిందితుడిగా చేర్చలేమని న్యాయమూర్తి పేర్కొన్నారు. దీంతో కోనేరు మధుపై సీబీఐ నమోదు చేసిన కేసును న్యాయమూర్తి కొట్టేస్తూ తీర్పును వెలువరించారు.

నవభారత నిర్మాణానికి జిల్లాలే పునాదులు



అభివృద్ధి కాంక్షిత జిల్లాల కలెక్టర్‌తో ప్రధాని భేటీ

న్యూఢిల్లీ: నవభారత నిర్మాణాభివృద్ధికి వెనుకబడిన జిల్లాలే పునాదులు కావాలని ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షించారు. ప్రాంతీయ అసమానతలను ఇక ఏ మాత్రం సహించేది లేదని ఆయన అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి విజయగాథలు కీలక పాత్ర పోషిస్తాయని మోడీ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ కొత్త ఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో నీతిఆయోగ్ ఏర్పాటు చేసిన, కలెక్టర్లు, అభివృద్ధి కాంక్షిత జిల్లాల ఇన్‌ఛార్జి అధికారులతో శుక్రవారంనాడిక్కడ సమావేశమై వారితో ముచ్చటించారు.2022 నాటికి భారతదేశ రూపురేఖలు మార్చాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనికతకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వివిధ ప్రత్యేక అభివృద్ధి ప్రమాణాలను అందుకోలేక వెనుకబడి ఉన్న 115 జిల్లాలలో గణనీయమైన మార్పును తీసుకు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక విధాన పరమైన చొరవ చూపుతోంది.పౌష్టికాహారం, విద్య, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, నీటివనరులు, వామపక్ష తీవ్రవాదాన్ని తుదముట్టించడం, ఆర్థిక సమ్మిళితత్వం, నైపుణ్య వృద్ధికి సంబంధించి ఆరు గ్రూపులకు చెందిన అధికారులు తమ ప్రెజెంటేషన్స్ ఇచ్చారు.పలువురు కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు కూడా హాజరైన ఈ సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి, ఈ సమావేశం, డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరుగుతున్న తొలి సమావేశమని అందువల్ల దీనికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని అన్నారు.దేశంలోని కొన్ని ప్రాంతాలు ఇతర ప్రాంతాలతో పోల్చి చూసినపుడు వెనుకబాటులో ఉండడం ఆ ప్రాంత ప్రజలకు అన్యాయమేనని అన్నారు. ఈ నేపథ్యంలో, అణగారిన వర్గాల ప్రజల సముద్ధరణకు కృషిచేసిన డాక్టర్ అంబేడ్కర్ దార్శనికతకు అనుగుణంగా 115 వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి జరుగుతున్న ప్రయత్నంగా దీనిని అభివర్ణించారు.ఈ సందర్భంగా జన్‌ధన్ యోజన, శౌచాలయాల నిర్మాణం, గ్రామీణ విద్యుదీకరణల ఉదాహరణలను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి, మనకు గట్టి సంకల్పం ఉంటే ఈ దేశంలో సాధించలేనిదంటూ ఏదీ లేదని అన్నారు. భూసార పరీక్షల వంటి పూర్తిగా కొత్త అంశాల విషయంలోనూ సాధించిన విజయానికి సంబంధించిన ఉదాహరణలను ప్రధానమంత్రి ప్రస్తావించారు.

భారతదేశంలో ప్రస్తుతం అపరిమిత శక్తిసామర్థ్యాలు, అపరిమిత అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సులభతర వాణిజ్యంలో వచ్చిన మెరుగుదలను ఆయన ప్రస్తావిం చారు. ఈ ఘనత ప్రభుత్వ అధికారులు -టీం ఇండియా కే చెందుతుందని ఆయన అన్నారు.పై నుంచి కిందికి పరిష్కారాలు రుద్దే విధానం ఫలితాలనివ్వదని ప్రధాని అన్నారు. అందువల్ల, ఆయా రంగాలలో ఉన్న ప్రజలు పరిష్కారాలు సాధించేం దుకు తోడ్పడాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఇవాళ జరిగిన ప్రెజెం టేషన్లలో ఆలోచనల్లో స్పష్టత, నిబద్ధతపై అచంచల విశ్వాసం కనిపించాయని ప్రధానమంత్రి అన్నారు.ప్రాంతీయ అసమానతలు నిరంతరాయంగా పెరిగిపో తూ ఉండడాన్ని ఎంతమాత్రం సహించరాదని ప్రధానమంత్రి అన్నారు. అందు వల్ల వెనుకబడిన జిల్లాల అభివృద్ధి తప్పనిసరి అని చెప్పారు. ఈ వెనుకబడిన ప్రాంతాలలో వ్యతిరేక ఆలోచనలు, వ్యతిరేక భావనలలో మార్పు తీసుకురా వాలంటే విజయగాథలు కీలకమని ఆయన అన్నారు. వెనుకబడిన ప్రాంతాలలో నిరాశామయ స్థితి నుంచి ఆశావహస్థితికి మార్చడమే తొలి మెట్టు కావాలని ప్రధాని ఉద్బోధించారు. అభివృద్ధికోసం జరిగే ప్రజా ఆందోళనలకు సంబంధించి కీలక బృందంలో అవగాహన ఉండాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో మేథోమథనం జరగాలని ప్రధానమంత్రి సూచించారు.

ప్రాక్టికల్స్ ఫీజు చెల్లించొద్దు

ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇంటర్మీడియట్ సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్ కోసం అదనంగా ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్ స్పష్టం చేశారు. కాలేజీ యాజమాన్యాలు ప్రాక్టికల్స్ కోసం అదనంగా ఫీజు చెల్లించాలంటే జిల్లా ఇంటర్‌విద్యా శాఖాధికారి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులను ఇంటర్‌బోర్డులో ఏర్పాటు చేసిన 040-246001100 నంబర్‌కు కూడా చేయవచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్స్ పేరుతో దోపిడీ దందా పేరుతో ఆంధ్రప్రభలో శుక్రవారం కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. కథనానికి స్పందించిన ఇంటర్‌బోర్డు ప్రాక్టికల్స్ పేరుతో కాలేజీలు ఫీజులు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని లేదంటే కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా స్వీకరిస్తామని ప్రకటించారు.

విశాఖ- కొళ్లాం మధ్య 8 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : విశాఖపట్టణం - కొళ్లాం మధ్యన 8 ప్రత్యేక రైళ్లు నడిపించబోతున్నారు. ప్రత్యేక రైళ్లు విశాఖ నుండి ఈ నెల 10, 13, 17, 20 తేదీలలో బయలుదేరుతాయి. తిరుగు ప్రయాణంలో కొళ్లాం నుండి 12, 15, 19, 22 తేదీలలో బయలుదేరి మరుసటి రోజు విశాఖకు చేరుకుంటాయి.

కాల భైరవాలయంలో క్షుద్రపూజలు

శ్రీకాళహస్తి ఆలయం, ప్రభ న్యూస్: సస్పెన్షన్ కు గురైన శ్రీకాళహస్తీశ్వరాలయం సూపరింటెండెంట్ కె. ధనపాల్ పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం అర్థ రాత్రి శ్రీకాళహస్తీశ్వర ఆలయ అనుబంధ దేవాలయమైన కాలభైరవ ఆలయంలో ధనపాల్ క్షుద్ర పూజలు చేసినట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ విషయంగా శుక్రవారం ఆలయ ఈవో ను వివరాలు కోరగా గత ఐదు నెలలు క్రితం సస్పెండ్ చేసినా మళ్ళీ ఉద్యోగం చేరినా సూపరింటెండెంట్ తీరు మారలేదని డొనేషన్ కౌంటర్‌లో నగదు తీసుకోవడమే కాకుండా లడ్డు కౌంటర్‌లో తాజాగా మరికొంత నగదును తీసుకొని ఆలయ ఆదాయానికి గండి కొట్టే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. అదేవిధంగా వీఐపి లకు ఇచ్చే పట్టు చీరలు, పంచెలు, కండువాలు లాంటి వాటిల్లో లెక్కలు చూపకుండా భారీ స్థాయిలో నిధులను దుర్వినియోగం చేసారని తెలియడంతో సస్పెండ్ చేసామన్నారు.

ఇసుక మాఫియా రాజ్యమేలుతోంది

- మంద కృష్ణ పై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టడమేంటీ..?
- గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన టీ కాంగ్రెస్ నేతలు
- బంగారు తెలంగాణాలో అక్రమ ఇసుకను అడ్డుకుంటే చావాల్సిందేనా..?
- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌ఫైర్ • సామాన్యులకు అందుబాటులో లేని ఇసుక ధర: డీకే



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని , శాంతిభద్రతలు క్షిణించాయని టీ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్‌కార్యాలయంలో శాంతియుతంగా ఉపవాస దీక్ష చేస్తున్న మంద కృష్ణమాదిగను అరెస్టుచేయడమే కాకుండా అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టడమేంటని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. శుక్రవారం గవర్నర్ నరసింహన్‌ను టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి, మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ,మాజీ మంత్రి డీకే అరుణ, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, మల్లు రవి, దాసోజ్ శ్రావన్‌కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ శారద తదితర నేతలు కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుకను అడ్డుకున వీఆర్‌ఏను ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేశారని ఆరోపించారు. బంగా రు తెలంగాణాలో అక్రమంగా తరలిస్తు న్న ఇసుకను ప్రజలు అడ్డుకుంటే చావాల్సిందేనా..? అంటూ ఉత్తమ్ ఫైర్ అయ్యారు. రోజు ట్విట్టర్ స్పందించే మంత్రి కేటీఆర్..ఈ హత్యలపై ఎందుకు స్పందించరని ఆయ నిలదీశారు. ఇసుక తవ్వకం వల్ల భూగర్జజలాలు అడుగంటడమే కాకుండా పర్యావరణం కూడా దెబ్బతింటున్నదని వివరించారు. సిరిసిల్లలోనూ దళితులనే హత్యలు చేశారని ఆయన పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని గవర్నర్‌కు వివరించినట్లు ఉత్తమ్ తెలిపారు. వర్గీకరణ సాధన కోసం శాంతియుతంగా మంద కృష్ణమాదిగ దీక్ష చేస్తుంటే అడ్డుకోవడమే కాకుండా అక్రమ కేసులు పెట్టడం సరికాదని, ఈ వర్గీకరణ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకుపోవాలని సూచించినట్లు ఆయన వివరించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పామని ఆయన పేర్కొన్నారు. కృష్ణమాదిగ, ఎమ్మార్పీఎస్ నేతలపై పెట్టిన కేసులను ఉపసంహరిం చుకోవాలన్నారు. ఇసుక రేట్లు సామన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ ఇసుక ధర రూ. 1800 నుంచి 2 వేలు ఉంటే, ఈ ప్రభుత్వంలో రూ. 8 వేలకు చేరిందన్నారు. ప్రభుత్వ పనులకు ఇసుక దొరకడం లేదన్నారు.

'ట్రిపుల్ తలాక్‌పై తెరాస వైఖరేంటి'

ట్రిపుల్ తలాక్ బిల్లు విషయంలో టీఆర్ఎస్ వైఖరేంటో స్పష్టం చేయాలని మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు. ఈ బిల్లులో సవరణలు చేయాలని కాంగ్రెస్, టీడీపీతో పాటు దేశంలోని 17 పార్టీలు సూచించగా.. టీఆర్ఎస్ మాత్రం మౌనంగా ఉంటుం దని ఆయన ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తెరాస తో కలిసి పని చేస్తామన్న మజ్లిస్ పార్టీ కూడా సమాధానం చెప్పాలని షబ్బీర్ డిమాండ్ చేశారు.

గవర్నర్‌పై ఆగ్రహం నిజమే

కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

రాష్ట్రంలో నెలకొన్న ఇసుకు మాఫియా, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అక్రమ అరెస్టులపై ఫిర్యాదు చేయడానికి గవర్నర్ వద్దకు వెళ్లితే.. టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా వ్యవహారించడంతోనే తాము నిలదీశామని కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తెలిపారు. నెరెళ్లలో జరిగిన దళితులపై దాడులకు మంత్రి కల్వకుంట్ల తారకరామారావుకు ఏమి సంబంధమని, మంద కృష్ణమాదిగసమావేశాలు పెట్టి హంగామా చేస్తారని గవర్నర్ అనడంతోనే తమ పార్టీ సీనియర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే గవర్నర్ తీరును తామే కాకుండా సభ్య సమాజం మొత్తం హేవగించుకుంటుందన్నారు. ప్రజా సమస్యలను చెపి ్నప్పుడు వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పడం అనవాయితని, కానీ గవర్నర్ నరసింహన్ మాత్రం కొత్తసంవత్సరంలో ప్రభుత్వానికి సహకరించాల్సింది పోయి విమర్శలు చేయడమేంటి..? అంటూ పాఠశాలలో పంతులు బోధన చేసినట్లుగా మాట్లాడారని సంపత్ వివరించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో అసెంబ్లీలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాడులు చేసినప్పుడు మీరెవ్వరూ కూడా మాట్లాడలేదని గవర్నర్ అన్నారని ఆయన తెలిపారు. టీఆర్ఎస్ నేతలపైన ఉన్న కసితోనే సీఎం కేసీఆర్‌తో గవర్నర్ కాళ్లు మొక్కించుకుంటున్నట్లుగా తమకు అర్థమవుతోం దన్నారు.

నేడు గవర్నర్‌ను కలువనున్న కేసీఆర్

రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు శనివారం కలువనున్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు శుక్రవారం కలిసి ఇసుక మాఫియాను అరికట్టాలని కోరుతూ వినతి పత్రం సమర్పించడం, అనంతర పరిణామాల నేపథ్యంలో గవర్నర్‌ను కలవాలని సిఎం కెసిఆర్ నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కామారెడ్డి జిల్లాలో ఇసుక మాఫియా చేతిలో ఒక వ్యక్తి హతమవడం, తర్వాత తీసుకున్న చర్యలపై ఈ సందర్భంగా గవర్నర్‌కు సిఎం వివరించే అవకాశాలున్నాయి. అదే విధంగా రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై కూడా చర్చించనున్నారు.

సర్కారుకు సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ నేతలకు మధ్య తీవ్రస్థాయిలో మాటల తూటాలు పేలాయి. ఇసుక మాఫియా, ఎస్సీ వర్గీకరణపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిస్థితులను గవర్నర్‌కు వివరిస్తున్న సమయంలో ఆయన ఉత్తమ్‌తో పాటు ఇతర నేతలనుద్దేశించి కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని, ఇసుకు మాఫియా ఇప్పుడే కొత్తగా జరుగుతుందా..? గత ప్రభుత్వాల హయాంలోనూ జరిగింది కదా..? అంటూ గవర్నర్ వివరించబోయారు. దీంతో ఒక్కసారిగా కాంగ్రెస్ నేతలు ఆగ్రహానికి లోనై తాము ప్రధానమైన రెండు అంశాలపై చర్చించేందుకు వస్తే మీరు ఆ విషయాన్ని పక్కకుపెట్టి ప్రభుత్వానికి సహకరించాలం టూ కోరడం ఎంతవరకు సబబని ఆ నేతలు నిలదీసినట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు పెచ్చు పెరిగిపోయాయని, కామారెడ్డి జిల్లాలో గురువారం ఇసుక మాఫియా ఆగడాలకు ఓ ప్రభుత్వ ఉద్యోగి బలయ్యాడని గవర్నర్‌కు చెప్పినట్టు సమాచారం. ఓ వీఆర్‌ఏను ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపిన విషయాన్ని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పినట్టు సమాచారం. గవర్నర్ నరసింహన్‌ను వివరిస్తున్న సమయంలో ఆయన జోక్యం చేసుకుని ఇతర అంశాలను ప్రస్తావించే ప్రయత్నం చేయగా కాంగ్రెస్ నేతలు ఒక్కసారిగా ఊగిపోయినట్టు తెలుస్తోంది. తాము కొన్ని ముఖ్యమైన అంశాలను వివరించేందుకు వస్తే మీరు వాటిని పెడచెవిన పెట్టి ఏదేదో మాట్లాడుతున్నారంటూ కాంగ్రెస్ నేతల్లో ఆగ్రహం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. సిరిసిల్ల జిల్లా నేరెళ్ళలో దళితులపై దాడులు జరిగినపుడు కూడా ఇదే విధంగా వ్యవహరించారని గవర్నర్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. గవర్నర్‌తో ఉత్తమ్ కుమార్‌రెడ్డి చర్చిస్తున్న సమయంలో మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ తన స్వరాన్ని పెంచి సోనియా దయవల్ల గవర్నర్ పదవిని అధిష్టించారని పైరవీలు చేసుకుంటూ పదవిలో కొనసాగుతున్నారని మండిపడ్డారు. గవర్నర్ పదవికే కళంకం తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. గవర్నర్ పదవికి అనర్హుడంటూ నరసింహన్‌పై ఆయన మాటల దాడికి దిగారు. మాల, మాదిగలంటే మీకు ఇష్టం లేదని బడుగు, బలహీన వర్గాలపై దాడులు జరిగితే ప్రేక్షక పాత్ర పోషిస్తున్నా రంటూ మండిపడ్డారు. సర్వే సత్యనారాయణ ఒక్కసారిగా తన విశ్వరూపం ప్రదర్శించడంతో చెంతనే ఉన్న ఉత్తమ్, జానారెడ్డి ఆయనను సముదాయించారు. రాష్ట్రానికి గవర్నర్ కాకుండా అధికార పార్టీ కార్యకర్తగా, ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారంటూ గవర్నర్‌పై కాంగ్రెస్ నేతలు రంకెలేశారు. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతుందో తెలుసుకుంటున్నారా? అని గవర్నర్‌ను ప్రశ్నించినట్టు సమాచారం. తనపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై గవర్నర్ తీవ్ర ఆక్షేపణ వ్యక్తంచేసినట్టు సమాచారం.ఎస్సీ వర్గీకరణ కోసం అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీ తీసుకువెళ్ళాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ తన నివాసంలో ఉపవాస దీక్షకు దిగితే ఆయనను పోలీసులు ఎలా అరెస్టు చేస్తారని కాంగ్రెస్ నేతల బృందం ప్రశ్నించినట్టు గవర్నర్ తనదైనశైలిలో స్పందించారు. మందకృష్ణమాదిగ దీక్ష చేయడం సబబు కాదని ఇప్పటికే ఆయనకు న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిందని ఈ తరుణంలో ఆయన దీక్షకు ఎలా దిగుతారని ప్రశ్నించడంతో మరోమారు కాంగ్రెస్ నేతలు గవర్నర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డినట్టు ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ తెరాస ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుంటే వాటికి కాంగ్రెస్ పార్టీ ఆమోదం తెలపదని ప్రభుత్వానికి మీరు సర్టిఫికెట్ ఇస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని కాంగ్రెస్ నేతలు చెప్పినట్టు తెలుస్తోంది. గతంలో పలు అంశాలపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదులు, వినతిపత్రాలను ఏమాత్రం పట్టించుకోలేదని గవర్నర్‌తో మాటల సందర్భంగా కాంగ్రెస్ నేతల బృందం ప్రస్తావించినట్టు సమాచారం. ఇటు గవర్నర్, అటు కాంగ్రెస్ వర్గాల మధ్య దాదాపు 15 నిముషాల పాటు మాటామాట పెరగడంతో గవర్నర్ కార్యాలయం ఒక్కసారిగా వేడెక్కింది. గవర్నర్ దగ్గర నుంచి వెనుదిరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ, ఇక తాము రాజ్‌భవన్‌కు రానేరామని ఇదే చివరిసారి అని మరీ చెప్పి బయలుదేరినట్టు తెలుస్తోంది. చాలాకాలంగా గవర్నర్ నరసింహన్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నారు. ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు గవర్నర్‌పై ఇదివరకే తీవ్రస్థాయిలో మండిపడ్డ సంగతి తెలిసిందే. ఉదయం నిద్రలేచింది మొదలు నరసింహన్ గుళ్ళు, గోపురాల చుట్టూ తిరుగుతూ కాలం వెల్లదీస్తున్నారని, ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఇటువంటి గవర్నర్‌ను సత్వరమే పదవీవిచ్యుతులను చేయాలని డిమాండ్ చేసిన సంగతి విదితమే. రాజ్‌భవన్ వేదికగా కాంగ్రెస్ నేతలు మాటల తూటాలు పేల్చడంతో రాజ్‌భవన్ ఒక్కసారిగా దద్దరిల్లింది. కాంగ్రెస్ నేతలు గవర్నర్‌ను నిలదీసే సమయంలో ఆయన అక్కడి నుంచి మరో కార్యాలయంలోకి వెళ్ళినట్టు చెబుతున్నారు.

సుహృద్భావ వాతావరణంలో చర్చలు

గవర్నర్ నరసింహన్‌ను కలిసేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతల బృందంతో సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగాయని రాజ్‌భవన్ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ ప్రతినిధులు పంపించిన వినతిపత్రాన్ని గవర్నర్ పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. రాజ్‌భవన్ తన గౌరవాన్ని కాపాడుకుంటూనే హుందాగా వ్యవహరిస్తుందని ఆ వర్గాలు స్పష్టంచేశాయి. గవర్నర్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగిందని వార్తలు వచ్చిన నేపథ్యంలో రాజ్‌భవన్ ఈ మేరకు వివరణ ఇవ్వడం గమనార్హం.ఇదిలా ఉండగా, ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించడం పరిపాటి. ప్రతిపక్షాలు చెప్పిన సమస్యలను ఓపికగా విని ఆ వినతిపత్రాన్ని తీసుకుని పంపించడమే గవర్నర్ వ్యవహారశైలిగా చెప్పుకుంటారు. కానీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ప్రతిపక్షాలు ఇచ్చిన వినతిపత్రాలపై రాజ్‌భవన్ నుంచి వివరణ ఇవ్వడం గమనార్హం.



పోలవరానికి తొలగిన అడ్డంకులు..!

- కాఫర్ డ్యాం నిర్మాణానికి కేంద్రం అంగీకారం
- కొత్త టెండర్లకూ సూత్రప్రాయ ఆమోదం!

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోయింది. అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. తాజాగా కాఫర్ డ్యాం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అసలు కాఫర్ డ్యాం అవసరమే లేదన్న అభిప్రాయం వ్యక్తపరిచిన కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఒప్పించగలిగింది. అలాగే మరికొన్ని అంశాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు సఫలమయ్యాయి. శుక్రవారం ఢిల్లీలోని కేంద్ర జలవనరుల శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికారులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్, డ్యాం డిజైన్ కమిటీ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో తాజాగా నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్.హెచ్.పీ.సీ) సమర్పించిన నివేదికపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఇందులో పేర్కొన్న ప్రత్యామ్నాయాలను అమలు పరచడం సాధ్యపడదని డ్యాం డిజైన్ కమిటీ అభిప్రాయపడింది. దీంతో ఎన్.హెచ్.పీ.సీ నివేదికను పూర్తిగా పక్కనపెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పాత డిజైన్ ప్రకారమే కాఫర్ డ్యాంతో పాటు ఇతర నిర్మాణాలను కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. కాఫర్ డ్యాం నిర్మాణానికి పచ్చ జెండా ఊపుతూ, ఎత్తు ఎంత పెంచాలన్న విషయంపై మాత్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. తదుపరి సమావేశంలో ఎత్తుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మరోవైపు జెట్ గ్రౌటింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. అలాగే కాఫర్ డ్యాం, ఇతర కాంక్రీట్ పనుల కోసం పిలిచిన టెండర్ల ప్రక్రియను కొనసాగించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్టు తెలుస్తోంది. ఈ టెండర్ల ప్రక్రియంతా పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా కొనసాగించాలని కేంద్రం రాష్ట్ర జలవనరుల శాఖకు సూచించింది. పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం నిర్మాణ పనుల్లో 60(సీ) నిబంధన కింద కొన్ని పనులను వేరు చేసి రూ. 14.83.23 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ కొత్త టెండర్ల ప్రక్రియపై ఇప్పటికే టెండర్లు దక్కించుకుని పని చేస్తున్న ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ అభ్యంతరాలు వ్యక్తం చేసింది.

ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో ఈ విషయంపై స్పష్టత వచ్చే వరకు పోలవరం కొత్త టెండర్ల ప్రక్రియ నిలిపివేయాలంటూ కేంద్ర జలవనరుల శాఖ నాటి కార్యదర్శి అమర్‌జీత్ సింగ్ లేఖ రాయడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుత కాంట్రాక్టర్‌కు మరో అవకాశం ఇచ్చి చూద్దామని కూడా కేంద్ర ప్రభుత్వం భావించింది.

కొంత గడువిచ్చి పనుల వేగాన్ని పరిశీలించాలని నిర్ణయించింది. కానీ పనుల్లో ఏమాత్రం వేగం పెరగలేదని ఏపీ జల వనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ కేంద్రానికి లేఖ రాయడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చింది. శుక్రవారం జరిగిన సమావేశం తర్వాత కొత్త టెండర్ల ప్రక్రియ కు పచ్చ జెండా ఊపినట్టు తెలుస్తోంది. అయితే ఇప్పటికే టెండర్ల ప్రక్రియ నిలిపివేయాలంటూ ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకుంటేనే సాంకేతిక అడ్డంకులు తొలగిపోతాయి. ఈ క్రమంలో ప్రస్తుత కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్ స్టాప్ ఆర్డర్‌ను పక్కనపెట్టేందుకు అంగీకారం తెలిపారని జలవనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

బాబుతో భేటీకీ మోడీ రెడీ

- ఏపీ ఎంపీలతో సమావేశంలో పీఎం వెల్లడి
- విభజన సమస్యల పరిష్కారానికి సానుకూలం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దాదాపు ఏడాది కాలం తర్వాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీకి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అంగీకరించారు. శుక్రవారం తనను కలిసిన ఆంధ్రప్రదేశ్ ఎంపీలతో ఈ విషయం తెలిపారు. పార్లమెంటు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగుదేశం, బీజేపీ ఎంపీలు కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు, సహాయ మంత్రి వైఎస్ చౌదరి (సుజనా చౌదరి) నేతృత్వంలో ప్రధాని మోడీని కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి మూడున్నరేళ్లు దాటి నాలుగేళ్లు కావొస్తోందని, అయినా ఇంకా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మొత్తం 16 పేజీల మెమోరాండంను ప్రధానికి అందజేశారు. ఇందులో విభజన కారణంగా తలెత్తిన రెవెన్యూ లోటు, రైల్వే జోన్, ప్రత్యేక ప్యాకేజి, అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపు సహా అనేక ఇతర పెండింగ్ అంశాలను ప్రస్తావించారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు రూ. 7,500 కోట్లుగా లెక్క తేలిందని, అయితే కేంద్ర ప్రభుత్వం కేవలం రూ. 3,979 కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టు (ఈఏపీ)లకు రుణాల రూపంలో నిధులు ఇప్పించాలని కూడా కోరారు. వడ్డీలను కేంద్ర ప్రభుత్వమే చెల్లించాల్సి ఉన్నందున, పాత వడ్డీలు చెల్లించి కొత్త రుణాలకు మార్గం సుగమం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విభజన అనంతరం రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారిందని, ఈ క్రమంలో రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాల్సిందిగా విభజన చట్టంలోని సెక్షన్ 94(3) పేర్కొంటోందని గుర్తుచేశారు. ఇప్పటికే తాము హైదరాబాద్ నుంచి పరిపాలనను ప్రతిపాదిన రాజధానికి సమీపంలోని విజయవాడకు తరలించామని, ఈ క్రమంలో కొత్త రాజధాని నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు తగిన రీతిలో బడ్జెట్ కేటాయింపులు జరిపి నిధులు సమకూర్చాలని కోరారు. అలాగే ప్రత్యేక హోదా కల్పిస్తామని చెప్పిన హామీ అమలు కాకపోయినా, ఆ మేరకు ప్రయోజనాలు కల్పిస్తూ ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని కేంద్రం ఇచ్చిన హామీని ఎంపీలు, మంత్రులు గుర్తుచేశారు. ప్యాకేజీలో పొందుపరిచిన అంశాలన్నింటినీ త్వరితగతిన అమలు చేయాలని కోరారు. ఇక పోలవరం ప్రాజెక్టు గురించి కూడా ప్రధానికిచ్చిన మెమోరాండంలో ప్రస్తావించారు. కొత్త అంచనాల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణానికయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించాలని, ఆ మేరకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరగాలని కూడా కోరారు. ఇక షెడ్యూల్-8లో పేర్కొన్న 11 సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 9 సంస్థలను మంజూరు చేసిందని, మిగతా సంస్థలకు త్వరగా మంజూరు చేయాలని కోరారు. దీంతోపాటు ఢిల్లీలో ఉమ్మడి ఆస్తిగా కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ భవన్‌ను త్వరగా విభజించాలని కూడా మెమోరాండంలో పేర్కొన్నారు.

ప్రధానితో జరిగిన భేటీలో మొత్తం 14 మంది ఎంపీలు, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. వీరిలో కేంద్ర మంత్రులను మినహాయిస్తే తోట నర్సింహం, సీఎం రమేశ్, మాగంటి వెంకటేశ్వర్లు (బాబు), పండుల రవీంద్రబాబు, కేశినేని శ్రీనివాస్ (నాని), తోట సీతారామలక్ష్మి, గల్లా జయదేవ్, కొత్తపల్లి గీత, ముత్తంశెట్టి శ్రీనివాస్ (అవంతి) తదితరులు ఉన్నారు. అయితే బీజేపీ ఎంపీ కంభంపాటి హరిబాబు సమావేశం ప్రారంభంలో ఉన్నప్పటికీ, విమానాశ్రయానికి ఆలస్యం అవుతుందన్న కారణంతో త్వరగా వెళ్లిపోయారు.

అసెంబ్లీ సీట్లు పెంచాలి

చివరగా విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సీట్ల సంఖ్యను 175 నుంచి 225కు పెంచాలని పేర్కొన్నందున, అందుకు తగినవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు.

అయితే రాజకీయ నిర్ణయం తీసుకోనందున సీట్ల పెంపు వ్యవహారంలో ప్రతి ష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. ఒక దశలో అసెంబ్లీ సీట్ల పెంపు ఇక లేనట్టేనన్న సంకేతాలు ప్రధాని పలు సందర్భాల్లో ఇచ్చారు. అయితే తాజా గా ఏపీ ఎంపీలంతా ఈ విషయంపై మరోసారి పట్టుబట్టినట్టు తెలుస్తోంది. మెమోరాండం కాపీనీ అందుకున్న ప్రధాని, వాటిలో ప్రస్తావించిన అన్ని అంశాలపైనా చర్యలు తీసుకోవాలని తన కార్యా లయ అధికారులను వెంటనే సూచనలు చేసినట్టు తెలుస్తోంది. దీంతో సీట్ల పెంపు వ్యవహారంలో కదలిక వస్తుందన్న ఆశాభావంలో తెలుగు నేతలున్నారు.

ప్రధాని మెత్తబడ్డారా?

తెలుగుదేశం పార్టీతో గత కొన్నాళ్లుగా ఎడమొహం, పెడమొహం అన్న రీతిలో వ్యవహరిస్తున్న ప్రధాని కాస్త మెత్తబడినట్టే కనిపిస్తోంది. ఇందుకు కారణాలేంటన్న విషయంపై ఇప్పుడు దేశ రాజధానిలో చర్చ జరుగుతోంది. తాజాగా ముస్లిం మహిళల వివాహ హక్కుల రక్షణ కోసం రూపొందించిన త్రిపుల్ తలాఖ్ బిల్లును రాజ్యసభలో తెలుగుదేశం పార్టీ యధాతథంగా ఆమోదించేందుకు వ్యతిరేకించింది.

బిల్లులో సవరణలు చేయాల్సిందిగా కోరింది. ఈ పరిణామాల అనంతరం ప్రధాని తెలుగుదేశం ఎంపీలకు అపాయి ట్మెంట్ ఇచ్చారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడితోనూ భేటీకి సై అన్నారు. గుజరాత్ ఎన్నికల ఫలితాల తర్వాత మిత్రపక్షాల సహకారం లేనిదే 2019 ఎన్నికల్లో మెజారిటీ సాధించలేమన్న అభిప్రాయంలో బీజేపీ అధినేతలున్నారని తెలుస్తోంది. అందుకే మిత్ర పక్షాలతో ఇప్పుడు మరింత మైత్రిని కొనసాగించాలని భావించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మోడీ వైఖరిలో మార్పు వచ్చిందని ఎంపీలు భావిస్తున్నారు.



శాతవాహన వర్సిటీకి 12బి హోదా ఇవ్వండి

- కరీంనగర్‌లో జాతీయ ఉర్దూ వర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేయాలి : యూజీసీకి పాపిరెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: కరీంనగర్‌లో ఉన్న శాతవాహన విశ్వవిద్యాలయానికి 12బి హోదా కల్పించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ ధీరేంద్ర పాల్ సింగ్‌ను ఎంపి వినోద్‌కుమార్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి కోరారు. 12 బి హోదా కల్పించి యూనివర్సిటీ బలోపేతానికి అదనపు నిధులు ఇవ్వాలని శుక్రవారం ఢిల్లీలో కలిసి విన్నవించారు. అదేవిధంగా హైదరాబాద్‌లోనే ఉన్న జాతీయ ఉర్ధూ యూనివర్సిటీ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్ధూ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్‌కు అవకాశం కల్పించాలని కూడా కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యా కోసం చేపడుతున్న చర్యలపై యుజిసి ఛైర్మన్‌కు వివరించారు. యూనివర్సిటీ స్థాయి విద్య పూర్తికాగానే ఉపాధిఅవకాశాలను కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఉన్నత విద్యకు చేపడుతున్న చర్యలను యుజిసి ఛైర్మన్ అభినందించినట్టు పాపిరెడ్డి తెలిపారు.

చెన్నమనేనికి హైకోర్టులో ఊరట

- భారత పౌరసత్వం రద్దు ఉత్తర్వులను ఆరువారాలు సస్పెండ్ చేసిన హైకోర్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ కుహైకోర్టులో ఊరట లభించింది. భారత పౌరసత్వం రద్దు చేస్తూ కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు ఆరు వారాల పాటు సస్పెండ్ చేసింది. ఈ వివాదానికి సంబంధించిన మొత్తం రికార్డులను తమ ముందుంచాలని హైకోర్టు కేంద్ర హోంశాఖ కార్యదర్శిని ఆదేశించింది. విదేశాలకు వెళ్లి తన పనులను పూర్తి చేసుకొని తిరిగి భారత దేశానికి వచ్చి స్థిరపడేందుకు పిటిషనర్ కు అవసరమైన సమయాన్ని ఇవ్వాలని హైకోర్టు అభిప్రా యప డింది.పిటిషనర్ తన జర్మనీ పౌరసత్వాన్ని వదులుకున్నారు. భారత దేశంలో కూడా పౌరసత్వం ఇవ్వకపోతే పిటిషనర్ ఎక్కడికి వెళ్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఓ వ్యక్తి ఒక సారి, పది సార్లు విదేశాలకు వెళ్లి తిరిగి వచ్చినా పౌరసత్వం వదులుకున్నట్లు కాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ.భట్ శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేశారు. భారత పౌరసత్వం చెల్లదంటూ కేంద్ర హోంశాఖ గత సంవత్సరం ఆగస్టు 31న జారీ చేసిన ఉత్తర్వులు, ఆ తర్వాత గత డిసెంబర్ 13న జారీ చేసిన రివ్యూ ఉత్తర్వులను రద్దు చేయాలని అభ్యర్థిస్తూ వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

వలసలపై హస్తం గురి

- ఇతర పార్టీల బలమైన నాయకులతో కాంగ్రెస్ మంతనాలు
- దక్షిణ తెలంగాణలో స్వీప్ చేయాలంటే మరింత కసరత్తు అవసరమంటున్న నేతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సార్వ త్రిక ఎన్నికల సమయం ఏడా దిన్నర ఉండగానే కాంగ్రెస్ పార్టీ ఆశల పల్లకిలోకి వెళ్లినట్లుగా కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికా రంలోకి వస్తామని, దక్షిణ తెలం గాణలో మా త్రం కాంగ్రెస్ పార్టీ స్వీప్ చేస్తుం దని చెబుతున్నారు. ఉత్తర తెలంగాణా కంటే దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పరిస్థితి కొంత మెరుగ్గానే ఉందని పార్టీ వర్గాలు చెబుతు న్నాయి. అయి నప్పటికి ఇతర పార్టీల్లోని బల మైన నేతలను కాంగ్రెస్ గూటికి చేర్చు కుంటునే స్వీప్ చేయడం సాధ్యమ వుతుందనే అభిప్రాయం కాంగ్రెస్‌లోనే వినిపిస్తోంది. ఒకటి రెండు జిల్లాల మినహ హైదరాబాద్,పూర్వపు రంగారెడ్డి జిల్లాలోని పార్టీ పరిస్థితి ఆశించిన మేర లేదనే వార్తలు విని పిస్తున్నాయి. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలలో 29 అసెంబ్లీ, నాలుగు పార్లమెంట్ నియోజక వర్గాలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా విషయానికి వస్తే కొంత మెరుగ్గానే ఉన్న ప్పటికి.. హైదరాబాద్ విషయానికొస్తే కాంగ్రెస్ పరిస్థితి నిద్రావస్థలోనే ఉందనే చర్చ జరుగుతోంది. హైదరా బాద్‌లోని 15 నియోజక వర్గాలు ఉండగా గత ఎన్నికల్లో ఖాతా కూడా తెరవలేదు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి నెలకొన్న విషయం తెలిసిందే. మాజీ మంత్రులు దానం నాగేం దర్, ముఖేష్ గౌడ్‌లు ఎన్నికల తర్వాత పార్టీ కార్యక్ర మాలకు దూరంగా ఉండటమే కాకుండా కాంగ్రెస్‌ను వీడుతారనే ప్రచా రం జరిగింది. రంగారెడ్డి జిల్లాలో మాజీ హోం శాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి బలమైన నేతగా ఉన్నారు. ఈ జిల్లాలో పార్టీ పరిస్థితి కొంతమేరకు మెరు గ్గానే ఉన్నప్పటికి తూర్పు రంగారెడ్డిలోని కొన్ని నియోజక వర్గాల్లో పార్టీ బలహీనంగా ఉందనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాలలో పార్టీ బలంగా ఉన్నప్పటికి.. ముఖ్య నాయ కులు మధ్య సమన్వయం కొరవడిందని విమర్శలు వినిపి స్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా విషయం వచ్చే వరకు మాజీ మంత్రులు డీకే అరుణ, కేంద్ర మాజీ మంత్రి జైపా ల్‌రెడ్డితో ఇటీవలనే కాంగ్రెస్‌లో చేరిన రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్‌కు బలం మరింత పెరిగిందనే అంటున్నారు. జిల్లా లో ఉన్న 14 అసెంబ్లీ సీట్లను కైవసం చేసుకోవాలంటే బీజేపీకి చెందిన మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి, టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కొత్త కోట దయాకర్‌రెడ్డితో కాంగ్రెస్ నేతలు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. వీరు కాంగ్రెస్‌లోకి వస్తే మక్తల్ నుంచి కొత్తకోటను, మంత్రి జూపల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్ నుంచి నాగం జనార్ధన్‌రెడ్డిని బరిలోకి దింపాలనే ఆలోచనతో కాంగ్రెస్ నేతలు ఉన్నట్లు సమాచారం.ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ నేతలు వ్యూహాత్మకంగా ముందుకెళ్లితేనే విజయం సాధ్యమవుతుందని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు.

కార్యకర్తలకు నిరంతర పరిజ్ఞానం

- శిక్షణ తరగతుల్లో తెదేపా తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ సూచన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశంపార్టీ తెలంగాణ కార్యకర్తలకు నిర్వహించిన మొదటి విడత శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయి. మండల పార్టీ అధ్యక్షుడు, కార్యదర్శులకు రెండు రోజులపాటు వివిధ అంశాలపై పార్టీ నాయకులు, నిపుణులతో ఈ తరగతులు నిర్వహించారు. రెండవ రోజు శుక్రవారం సోషల్ మీడియాపట్ల అవగాహన, తెరాస హామీలు - వైఫల్యాలు, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమం - రిజర్వేషన్లు మిథ్యేనా?, జాతీయ రాజకీయాల్లో తెదేపా పాత్ర తదితర అంశాలపై పార్టీ కార్యకర్త లకు అవగాహన కల్పించారు.

మొదటి విడత నాయకత్వ శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా తెదేపా తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయాల్సిన శ్రేణులు నిరంతరం విషయ పరిజ్ఞానం పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. కార్యకర్తలకు పరిజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యంతోనే 1982లోనే ఎన్‌టి రామారావు శిక్షణా తరగతులను ప్రారంభించారని ఆయన గుర్తుచేశారు. ఆనాటి యువతరానికి ఆ శిక్షణా తరగతులు ఎంతగానో దోహద పడ్డాయని, ఆ పునాదులే తమను ఈ స్థాయికి తెచ్చాయని రమణ అన్నారు. రాజకీయాల్లో రాణించాలంటే నైతిక ప్రవర్తన, క్రమశిక్షణా, అంకిత భావంతో పాటు విషయ పరిజ్ఞానం కూడా అవసరమని ఆయన అన్నారు.

పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తెరాస ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు ఇస్తామని, కేటీ టు పీజీ ఉచిత విద్య, దళితులకు మూడెరాల భూమి ఇస్తామని చెప్పిన హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదని దుయ్యబట్టారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేసేం దుకు తెదేపా కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలని ఆయన కోరారు. దీనికి సంబంధించి త్వరలో కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని ఆయన చెప్పారు. ప్రజలను మోసంచేస్తున్న తెరాసకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉందన్నారు. రాష్ట్రంలో పోలీసు పాలన సాగుతోందని, తెరాస అక్రమాలను ప్రశ్నిం చిన వారిపై కేసులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు.ఈ కార్యక్రమం లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ.పెద్దిరెడ్డి, క్రమశిక్షణా కమిటీ సభ్యుడు బక్కని నర్సింహులు, ప్రధాన కార్యదర్శులు బండ్రు శోభారాణి, నన్నూరి నర్సిరెడ్డి, బుచ్చిలింగం, మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు భోట్ల శ్రీనివాస్, టిఎన్‌టియూసీ అధ్యక్షుడు బిఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ అగ్రదేశం కావాలి

- నేషనల్ ప్రేయర్ డేలో వక్తల ప్రార్థనలు
- క్రైస్తవులు శాంతికాముకులు : మంత్రి నాయిని



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రపంచంలో భారత్ అగ్రదేశం కావాలి....రాష్ట్రం బంగారు తెలంగాణగా మారాలని ఆకాంక్షిస్తూ నేషనల్ ప్రేయర్ డేలో వక్తలు ప్రార్థనలు చేశారు. దేశాభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలని....ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలు కార్యరూపం దాల్చాలని అభిలషించారు.

క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి క్రైస్తవ ప్రజలు భారీగా తరలివచ్చారు. దేశానికి, రాష్ట్రానికి, సమాజానికి సేవలు అందించడంలో క్రైస్తవ సంఘం ముందుండాలని వక్తలు కోరారు. పరిశుభ్రమైన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ ముందుకు తీసుకపోవాలన్నారు. కార్యక్రమంలో స్వాగతోపన్యాసం చేసిన బిషప్ నల్లా థామస్ మాట్లాడుతూ, సామాజిక సేవలను అందించడంలో క్రైస్తవ సోదరులు అందరికంటే ముందుండాలని పిలుపునిచ్చారు. అలాగే కేంద్రం చేపట్టిన స్వచ్ఛభారత్‌లోనూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బంగారు తెలంగాణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరయిన అమెరికాకు చెందిన క్రైస్తవ బోధకురాలు అన్నీగ్రహమ్ లట్జ్ మాట్లాడుతూ, నా తండ్రి బిల్లీ గ్రహంకు ఇండియా అంటే చాలా ఇష్టమన్నారు. ఆయన వల్లే తనకు భారతదేశంపై మమకారం, ప్రేమా, ఆప్యాయతలు ఎక్కువన్నారు. అందువల్లే భారత్ ఐదుసార్లు వచ్చానన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ, సంతోషాలతో వర్ధిల్లే విధంగా...ఆ దేవుడు చూడాలని ఆమె అభిలషించారు.

రాష్ట్రం హోంశాఖ మంత్రి నాయినీ నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ, క్రైస్తవ సోదరులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడు సిద్దమేనన్నారు. వారికి ఆపదవస్తే...అర్ధరాత్రి అయినా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. క్రైస్తవులు ధైర్యంగా తమ ప్రార్ధనలు చేసుకోవచ్చునన్నారు. మీపై దాడులు జరిగితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. ఈ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అప్పుడప్పుడు రాష్ట్రంలో కొంతమంది కలహాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని, వాటిని ప్రభుత్వం ధైర్యంగా ఎదుర్కొంటుందన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉండాలని నాయిని కోరారు. మనది సెక్యులర్ దేశమన్నారు. స్వచ్ఛభారత్ అంటే మనస్సులో కూడా స్వచ్ఛత ఉండాలన్నారు. క్రైస్తవులు శాంతికాముకులని, ప్రజాసేవలో గణనీయంగా పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు. అనంతరం గ్రేటర్ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ, అన్యమతాలపై దాడులు జరగకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలు, మతాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ, క్రిస్మస్‌ను రాష్ట్ర పండుగగా చేసిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. క్రైస్తవలు స్వేచ్ఛగా తమ ప్రార్ధనలు చేసుకోవచ్చునని సిఎం సూచించారని ఆయన గుర్తు చేశారు. ఆన్నీ గ్రహం ఇక్కడకు వచ్చి ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లారెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం రాజయ్య, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, జి. సాయన్నలతో పాటు క్రైస్తవ పెద్దలు జయవంత్ సామ్యేల్, విజేహెచ్ఎస్ నెల్సన్, విద్యాస్రవంతి, తుమ్మబాల తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయాలను గౌరవిస్తాం

గంగిరెద్దుల ఆటకు అండగా ఉంటాం: మంత్రి ఈటల

హైదరాబాద్, ఆంధ్రప్రభ :గంగిరెద్దుల ఆటలను పరిరక్షించితమకు న్యాయం జరిపించాలని కోరుతూ శుక్రవారం సచివాలయంలో గంగిరెద్దుల నేతలు పలువురు ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గంగిరెద్దులు ఆడించి పొట్టపోసుకుంటున్న తమను అడుక్కునే వాళ్లుగా పరిగణించి పోలీసులు అరెస్టు చేస్తున్నారని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. రానున్న సంక్రాంతికి గంగిరెద్దులను ఆడించడం కష్టంగా మారనుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టులు లేకుండా చూడాలని ఆయనను కోరారు. ఈ విషయాన్ని నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్లి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆర్థిక మంత్రి ఈటల హామీ ఇచ్చారు. భిక్షాటన మంచిది కాదని, కొందరు ప్రొఫెషనల్‌గా తయారై ఊర్లలోనుంచి కొందరిని తీసుకువచ్చి భిక్షాటనను వ్యాపారంగా చేస్తున్నారని ఆయన వెల్లడించారు. భిక్షమెత్తుతున్న వారిని గుర్తించి ఆదుకుంటామని, పని కల్పించడంతోపాటు, పునరావాసం కల్పిస్తామన్నారు. శరణాలయాలు పెట్టనున్నట్లు పేర్కొన్నారు. దిక్కులేని వారికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద దిక్కుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తల్లిదండ్రులుగా వారిని అక్కున చేర్చుకుంటుందని స్పష్టం చేశారు. గంగిరెద్దులవారికి, భిక్షాటనకు తేడా ఉందని, గంగిరెద్దులను ఆడించడం వారి వృత్తని ఆయన వెల్లడించారు. సాంప్రదాయాలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు.

ముగిసిన పార్లమెంటు శీతాకాల సమావేశాలు





16 బిల్లులు ఆమోదం

- రాజ్యసభలో 34గంటల సమయం వృథా
- ట్రిపుల్ తలాక్ బిల్లుపై ప్రతిష్టంభన
- విపక్షాల బెంచ్ వద్దకు వెళ్లి మన్మోహన్‌కు మోడీ పలకరింపు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందకుండానే, పార్లమెంటు శీతాకాల సమావేశాలు ముగిశాయి. రాజ్యసభ బిజినెస్‌లో శుక్రవారం బిల్లును పొందుపర్చడంతో ఇటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు తప్పనిసరిగా హాజరు కావాలని విప్ జారీ చేశాయి. అయితే తలాక్ బిల్లుపై అధికార, విపక్షాలు మెట్టుదిగకపోవడంతో రాజ్యసభలో ప్రతిష్టంభన నెలకొని, నిరవధికంగా వాయిదా పడింది . యథావిధిగా జీరో అవర్, ప్రశ్నోత్తరాల సజావుగా కొనసాగాయి. జనవరిలో రిటైరవుతున్న కాంగ్రెస్ ఎంపీలు కరణ్‌సింగ్, జనార్దన్ ద్వివేదీ, హష్మీ లకు రాజ్యసభ వీడ్కోలు పలికింది. డిసెంబర్ 15వ తేదీన ప్రారంభమైన సమావేశాలు మొత్తం 13 పనిదినాలు కొనసాగాయి. లోక్‌సభ 13 బిల్లులు, రాజ్యసభ 9 బిల్లులు పాస్ చేసింది. ఉభయసభల్లో కలిపి 12 బిల్లులు ఆమోదం పొందాయి. లోక్‌సభలో కార్యక్రమాలు 91.58 శాతం, రాజ్యసభలో కార్యక్రమాలు 56.29 శాతంగా పనిచేశాయి. ముఖ్యంగా నాబార్డు సవరణ బిల్లు, కంపెనీల సవరణ బిల్లు, ఐఐఎం బిల్లు, ఐఐపిఇ బిల్లును ఉభయసభల్లో పాసయ్యాయి. రాజ్యసభలో గందరగోళం కారణంగా 34 గంటల సమయం వృథా అయ్యింది. దీనిపై సభ్యులంతా ఆత్మపరిశీలన చేసుకోవాలని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు అన్నారు. మరోవైపు రిటైరైన ప్రముఖ ఎంపీ కరణ్‌సింగ్ సైతం ఆనాటి స్థాయిలో పార్లమెంటులో చర్చ జరగడం లేదని, అవాంతరాలు ఎక్కువయ్యాయని తన వీడ్కోలు ప్రసంగంలో ఆవేదన వ్యక్తం చేశారు.

తలాక్ బిల్లుపై పరస్పర నిందారోపణలు

రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లుపై నెలకొన్న ప్రతిష్టంభనకు మీరంటే మీరు కారణమని బిజెపి, కాంగ్రెస్ పార్టీలు పరస్పరం నిందించుకున్నాయి.ఏకంగా కేంద్రమంత్రులు, ఎంపీలు సభలో నిలబడి గందరగోళం సృష్టించారని ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ అన్నారు. ప్రస్తుతమున్న లోపభూయిష్టమైన బిల్లుతో ముస్లిం మహిళలకు న్యాయం జరగదని తెలిపారు. బీజేపీ కారణంగానే బిల్లుపై ప్రతిష్టంభన నెలకొందన్నారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాల్సిందేనని స్పష్టం చేశారు. ముస్లిం భర్తలను జైలుకు పంపితే వారి బాగోగులు ఎవరు చూసుకుంటారని ప్రశ్నించారు. పార్లమెంటును రబ్బర్‌స్టాంప్‌గా మారుస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ దీపేంద్రసింగ్ హుడా విమర్శించారు. ఆర్డినెన్స్‌లపై తప్పా, పార్లమెంటుపై ప్రభుత్వానికి విశ్వాసం లేదని అన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ వైఖరి వల్లే ట్రిపుల్ తలాక్ బిల్లు ఆగిపోయింది బీజేపీ విమర్శించింది. లోక్‌సభలో తలాక్ బిల్లుకు మద్దతు పలికిన కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో అడ్డుతగలడం ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమమని పేర్కొంది. ముస్లిం మహిళలకు న్యాయం చేస్తుంటే అడ్డుపడుతున్నారని ఆరోపించింది.

ఆత్మీయ పలకరింపులు..
ప్రతిపక్షాల వైపు మోడీ అడుగులు

వాడీవేడీగా సాగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల చివరి రోజు రాజ్యసభలో ఒక ఆసక్తికరమైన దృశ్యం ఆవిష్కృతమైంది. నిన్న, మొన్నటి వరకు ఢీ అంటే ఢీ అనుకున్న ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆత్మీయంగా పలకరించుకున్నారు. రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ వెంకయ్యనాయుడు ప్రకటించిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. ప్రతిపక్ష సభ్యులు సీట్ల వైపు అడుగులు వేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేతితో చేయి కలిపి ఆత్మీయంగా పలకరించారు. మన్మోహన్ కూడా చిరునవ్వుతూ మోడీని విష్ చేశారు. మన్మోహన్‌తో పాటు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరన్ సింగ్ తదితరులతో కూడా ప్రధాని కరచాలనం చేశారు. ఈనెల 27తో కరన్ సింగ్ రాజ్యసభ పదవీ కాలం ముగుస్తుండటంతో ఆయన్ని కూడా విష్ చేశారు. భారత మాజీ నేవి అధికారి కుల్ భూషన్ జాదవ్ కుటుంబానికి పాకిస్తాన్ చేసిన అవమానంపై అధికార, ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ఖండించడం.. ఆ తర్వాత భీమా- కోరెగావ్ అల్లర్లు తెరపైకి రావడంతో ఉభయ సభల్లో మోడీ వ్యాఖ్యల వివాదం తెరమరుగైంది. పాక్ అధికారులతో మన్మోహన్ సింగ్ భేటీ అయి.. గుజరాత్ రాజకీయాలపై చర్చించారని గుజరాత్ ఎన్నికల ప్రచారంలో మోడీ ఆరోపించారు. మోడీ వ్యాఖ్యలపై మన్మోహన్ కూడా ఘాటుగానే స్పందించారు. మోడీ వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని.. ఆయన చేసిన ఆరోపణలన్నీ అసత్యమన్నారు. తన గురించి దేశ ప్రజలకు తెలుసని.. తన ట్రాక్ రికార్డు చూస్తే ఎవ్వరు కూడా ఇలాంటి ఆరోపణలు చేయరని చెప్పుకొచ్చారు.

29 నుంచి బడ్జెట్ సమావేశాలు

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరార య్యాయి. 29 నుంచి ఏప్రిల్ 6వరకు సమావేశాలు జరపాలని కేంద్ర పార్లమెంటరీ క్యాబినెట్ కమిటీ నిర్ణయిం చింది. దీని ప్రకారం తొలి విడత బడ్జెట్ సమావేశాలు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరుగుతాయి. రెండోవిడత బడ్జెట్ సమావేశాలు మార్చి 5 నుంచి ఏప్రిల్ 6వరకు కొనసాగనున్నాయి. బడ్జెట్ సమావేశాల ప్రారంభమైన జనవరి 29వ తేదీన రాష్ట్రపతి ఉభయసభల నుద్దేశించి ప్రసంగిస్తారు. అదే రోజున ఆర్థిక సర్వేను పార్లమెంటు ముందు ఉంచుతారు. ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెడ తారు. రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని పట్టుబట్టిన విపక్షాలను మెత్తబరిచి, బడ్జెట్ సమావేశాల్లో బిల్లును పాస్ చేయించాలని ప్రభుత్వ వ్యూహకర్తలు భావిస్తున్నారు.

లోక్‌పాల్‌కు మోక్షమెప్పుడు?

- మోడీ సర్కారును నిలదీసిన రాహుల్

న్యూఢిల్లీ: చట్టం చేసి నాలుగేళ్ళు దాటినప్పటికీ లోక్‌పాల్ నియామకంలో నిరంతర జాప్యంపై మోడీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం నిలదీశారు. నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి కానీ లోక్‌పాల్ మాత్రం రాలేదు. అబద్ధాల రాగాన్ని మీరు ఎప్పటిదాకా ఆలపిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షకురాలా, జవాబుదారీతనానికి వైతాళికులారా.. వింటున్నారా అని నిలదీస్తూ రాహుల్ ట్వీట్ చేశారు. 2013లో కేంద్రంలో యూపీఏ కూటమి అధికారంలో ఉండగా గుజరాత్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న నరేంద్ర మోడీ పార్లమెంట్‌లో లోక్‌పాల్ బిల్లు ఆమోదం పొందడంలో కీలక పాత్ర పోషించారంటూ బీజేపీ ఎంపీలను ప్రశంసిస్తూ ఆయన చేసిన ట్వీట్‌ను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్తు చేశారు.

34 గంటలు కోల్పోయాం

- ఆత్మపరిశీలనకు ఇదే సమయం: ఎంపీలతో వెంకయ్య

న్యూఢిల్లీ: శీతాకాల సమావేశాల్లో సభ్యుల అంతరాయాలతో రాజ్యసభ 34 గంటల విలువైన కాలాన్ని కోల్పోయిందని ఎగువ సభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. సభా నిర్వహణలో వారి పాత్రపై సభ్యులు ఆత్మపరిశలన చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ సభలో ఉండగా చైర్మన్ వ్యాఖ్యానించారు. చైర్మన్‌గా తాను తొలిసారిగా పూర్తికాలం సమావేశాలు నిర్వహించానని వెంకయ్య తెలిపారు. పార్లమెంట్ ఒక రాజకీయ వ్యవస్థ అయినప్పటికీ అది రాజకీయాలకు కొనసాగింపు కాదని ఆయన అన్నారు. 19 మంది సభ్యుల ప్రైవేట్ బిల్లులను సభలో ప్రవేశపెట్టడం జరిగిందని, వాటిలో ఒకదానిపై సమగ్రంగా చర్చ జరిగిందని తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయం చేపట్టిన ఐదు రోజుల్లో 46కు పైగా నక్షత్రం గుర్తు ప్రశ్నలకు మాటపూర్వక సమాధానాలు వచ్చాయని, 51 మంది సభ్యులు జీరో అవర్‌లో ప్రస్తావనలు చేశారని, మరో 28 మంది ప్రత్యేక ప్రస్తావనలు చేశారని రాజ్యసభ చైర్మన్ చెప్పారు.

రాహుల్‌పై నోటీసుకు తగిన నిర్ణయం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి బీజేపీ ఎంపీ భూపేందర్ యాదవ్ ఇచ్చిన ఒక సభాహక్కుల నోటీసుపై అవసరమైన నిర్ణయం తీసుకుంటామని రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు శుక్రవారం తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఒక ట్వీటర్ సందేశంలో రాజ్యసభ నేత, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేరును ఉద్దేశ్యపూర్వకంగా, అగౌరవంగా వక్రీకరించారని ఆరోపిస్తూ 187 నియమం కింద యాదవ్ గత నెల 28న నోటీసు ఇచ్చారు. శీతాకాల సమావేశాలకు చివరి రోజైన శుక్రవారం జీరో అవర్‌లో తాను ఇచ్చిన సభా హక్కుల నోటీసు స్థితిగతులను యాదవ్ తెలుసుకొనగోరారు. దీనిపై వెంకయ్య స్పందిస్తూ.. మీ నోటీసు నా పరిగణనలో ఉంది. వెంటనే చర్య తీసుకుంటాను. కానీ అది రాజ్యసభ పరిధిలోకి రాదు. అది కడకు లోక్‌సభకు వెళ్లాల్సిందే. అవసరమైన నిర్ణయాన్ని సాధ్యమైనంత త్వరగా తీసుకుంటాం అని హామీ ఇచ్చారు.

సముద్ర గర్భంలో చైనా నిఘా

బీజింగ్: సముద్ర గర్భంలో సరికొత్త నిఘా నెట్‌వర్క్‌లో భాగంగా చైనా స్వతంత్రంగా అభివృద్ధి చేసిన అండర్‌వాటర్ గ్లయిడర్ హెయి హిందూ మహాసముద్రం, దక్షిణ చైనా సముద్రంలో తన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది. లక్ష్య ఛేదనలో జలాంతర్గాములకు సహాయపడేలా చైనా హెయిని రూపొందించిందనే కథనాలు వెలువడిన నేపథ్యంలో తాజా పరిణామం అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. హెయి అంటే చైనా పరిభాషలో సముద్ర రెక్కలు అని అర్థం. దేశవాళీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అండర్‌వాటర్ గ్లయిడర్ హిందూ మహాసముద్రంలో తొలిసారిగా తన శాస్త్రీయ పరిశీలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని ప్రభుత్వ వార్తా సంస్థ జిన్‌హువా పేర్కొంది. గత డిసెంబర్ 11 నుంచి ఈ నెల రెండవ తేదీ మధ్య కాలంలో భౌగోళిక వాతావరణ మార్పులు, సముద్ర స్థితిగతుల మధ్య అవినాభావ సంబంధాన్ని హెయి పరిశీలించిందని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఏఎస్)కు చెందిన షెన్‌యాంగ్ ఆటోమేషన్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన రీసెర్చ్ ఫెలో యు జియన్‌చెంగ్ వ్యాఖ్యానించినట్టు జిన్‌హువా ఉటంకించింది. యు జియన్‌చెంగ్ అండర్‌వాటర్ గ్లయిడర్‌ను అభివృద్ధి చేశారు.

సరిహద్దులో కాల్పులు

జమ్మూ: జమ్మూ కాశ్మీర్‌లో పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖవద్ద శుక్రవారం భారత్, పాక్ దళాల మధ్య హోరాహోరీగా కాల్పులు జరిగాయి. పాకిస్థాన్ సైన్యం షాపూర్‌లో భారీ స్థాయిలో కాల్పులు జరపటంతో ఇండియన్ ఆర్మీ అప్రమత్తమైందని పాక్‌కు దీటుగా భారత దళాలు ఎదురుదాడికి దిగాయని రక్షణమంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. మావైపు నుంచి ఎటువంటి నష్టం జరగలేదని అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. జమ్మూలోని ఆర్నియాలో అంతర్జాతీయ సరిహద్దులో పాకిస్థాన్ నుంచి జమ్మూ కాశ్మీర్‌లోకి చొరబడేందుకు తీవ్రవాదులు చేసిన ప్రయత్నాన్ని సరిహద్దు భద్రతాదళం (బిఎస్ఎఫ్) తిప్పికొట్టింది. గురువారం పాకిస్థాన్‌లోని రెండు మోర్టార్ పికెట్లను నాశనం చేసిన సంగతి విదితమే.

సీఆర్పీఎఫ్ వాహనం చోరీ

జమ్మూ కాశ్మీర్ రిజిస్ట్రేషన్తో ఉన్న సిఆర్పీఎఫ్ వాహనం చోరీకీ గురైంది. పారా మిలటరీ బలగాల కేంద్రం వెలుపల పార్కు చేసిన వాహనం చోరీకి గురవటంతో రక్షణశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తెల్లరంగు టాటా సుమోవెక్ట వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్ జెకె.02ఎ డబ్ల్యూ 5441 వాహనం గతవారం దక్షిణ ఢిల్లీలో పురం క్యాంపు వద్ద 12.30పిఎం సమయంలో చోరీకి గురైందని అధికారులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ముగ్గురు వ్యక్తుల బృందం చోరీ చేసినట్టు గుర్తించిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

హెచ్-1బీలో మార్పులొద్దు

- ట్రంప్‌కు కాంగ్రెస్ సభ్యుల షాక్
- నిపుణులను కోల్పోయే అవకాశం ఉంది : సభ్యులు

వాషింగ్టన్ : హెచ్-1బీ వీసాలో నిబంధనలు మార్పు చేయడం విషయమై ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చట్టరూపకల్పన సభ్యులతో పాటు సలహా సంఘం సభ్యుల నుండి ఈ విషయమై ట్రంప్ వ్యతిరేకత ఎదుర్కొన్నారు. హెచ్-1బీ వీసాలో మార్పులు చేస్తే అమెరికాలో సంక్షోభం నెలకొంటుందని, దేశ వ్యాప్తంగా సుమారు 5 నుండి 7.5లక్షల మంది అమెరికన్ భారతీయులు ఉన్నారని, నిబంధనలు సవరిస్తే వీరంతా ఇండియాకు వెళ్లిపోవాల్సి వస్తుందని దీంతో పనిలో నాణ్యత దెబ్బ తింటుందని సభ్యులు హెచ్చరించారు. దీంతో అమెరికాలో నివసిస్తున్న భారతీయులకు కాసింత ఉపశమనం లభించినట్టు అయ్యింది. అమెరికాను అన్ని రంగాల్లో ముందు ఉంచడంలో భారతీయుల హస్తం ఉందని, హెచ్-1బీ వీసా నిబంధనల్లో మార్పు చేయడంతో ఎంతో మంది మేధావులను తాము కోల్పోతామని, అదేవిధంగా మంచి భాగస్వామిగా ఉన్న భారత్‌తో మనస్పర్థలు వచ్చే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ డెమోకటిక్ సభ్యురాలు తులసీ గబ్బర్ తెలిపారు. హెచ్-1బీ వీసాలపై చాలా మంది భారతీయులు అమెరికాలో చిన్నపాటి కంపెనీలు కొనసాగిస్తున్నారని వివరించారు. దీంతో చాలా మందికి ఉపాధి లభిస్తుందని, అదేవిధంగా అమెరికా ఆర్థికాభివృద్ధి కూడా జరుగుతోందని అభిప్రాయపడ్డారు. ట్రంప్ చేస్తున్న సవరణలపై హిందు అమెరికన్ ఫౌండేషన్ (హెచ్ఏఎఫ్) నిరసన వ్యక్తం చేసింది. నిబంధనల్లో మార్పు చేయడంతో అమెరికా నుండి భారతీయులు వెళ్లిపోవడం తప్ప మరే దారి ఉండదని హెచ్ఏఎఫ్ చెప్పుకొచ్చింది. స్టెమ్ ఇండస్ట్రీకి వెన్నుముకగా వేలాది మంది భారతీయులు ఉన్నారని, మార్పుల ఎజెండాతో ముందుకు వెళ్లడమే అమెరికా ఎజెండానా..? అని శుక్లా ప్రశ్నించారు.




సవరణలు చేయడానికి చూస్తుండటంతో స్థానికంగా ఉన్న వారికి మెరుగైన శిక్షణ విషయమై కొన్ని అమెరికన్ కంపెనీలు హెచ్-1బీ వీసాతో ముడి పెడుతున్నాయని ఇండో-అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రాజా క్రిష్ణమూర్తి తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ విభాగం ఇప్పటికైనా ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని రాజా ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్-1బీ వీసాలో మార్పులకు పూనుకోవడం అంటే వలస వ్యతిరేక విధానాన్ని ప్రోత్సహించడమే అని కాంగ్రెస్ సభ్యుడు ఖన్నా అన్నారు. నా తల్లిదండ్రులు గ్రీన్ కార్డుపై అమెరికా వచ్చారు. కానీ వలస వచ్చిన వారు, వారి పిల్లలు అమెరికాలో ఉండటానికి వీల్లేదనడం బాధాకరం. మేం లేకుండా ఇక్కడ అభివృద్ధి అసాధ్యం అని ఖన్నా ట్విట్టర్ వేదికగా స్పందించారు.

ఆ పుస్తకం అబద్దాల పుట్ట

- ఫైర్‌అండ్‌ఫ్యూరీపై ట్రంప్ ఆగ్రహం

వాషింగ్టన్: మైఖేల్ రచించిన పుస్తకంలోని అన్నీ అంశాలు అబద్ధాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొట్టి పారేశారు. వైట్‌హౌస్ కార్యకలాపాల గురించి మైఖేల్ ఈ పుస్తకంలో రాశారు. ఈ పుస్తకాన్ని ట్రంప్ విడుదలకు నిరాకరించారు. పుస్తకం విడుదల నిలిపివేయడంలో వైట్‌హౌస్ న్యాయవాదులు విఫలం అయ్యారు. మైఖేల్ వోల్ఫ్ రచించిన 'ఫైర్ అండ్ ఫ్యూరీ : ఇన్‌సైడ్ ది ట్రంప్ వైట్ హౌస్' శుక్రవారం మార్కెట్‌లోకి వచ్చింది. మిడిమిడి జ్ఞానంతో పుస్తకాన్ని రచించారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేదిగా పుస్తకంలోని అంశాలు ఉన్నాయని అన్నారు. పుస్తకంలోని ముఖ్యమైన అంశాలు గార్డియన్, వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ ఆన్‌లైన్ మ్యాగజైన్‌తో పాటు ఇతర ప్రధాన పత్రికల్లో విడుదలకు ముందే ప్రచురితం అయ్యాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఎంతో నమ్మకంగా ఉన్నవాడు, వైట్‌హౌస్ ప్రధాన వ్యూహకర్తగా పేరొందిన స్టీవ్ బ్యానన్ ఈ పుస్తక రచయితకు వెల్లడించిన అంతర్గత విషయాలు అమెరికాలో చర్చనీయాంశంగా మారాయి. అధ్యక్ష ఎన్నికల ప్రచారం.. ట్రంప్‌ను గెలిపించేందుకు రష్యా జోక్యంపై ఆరోపణలు వంటి కీలకాంశాలు ఈ పుస్తకంలో ఉండటంతో ఇప్పుడు ఈ పుస్తక పఠనం హాట్ టాపిక్‌గా మారింది. ఈ పుస్తకాన్ని మార్కెట్‌లోకి రాకుండా వైట్ హౌస్ న్యాయవాదులు రెండు రోజులుగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ట్రంప్‌నుద్దేశించి అమెరికా సీనియర్ జర్నలిస్టు వోల్ఫ్ ట్విట్టర్ వేదికగా స్పందించారు.



పుస్తకం విడుదలైందని, దాన్ని కొనుక్కొని చదువుకోవాలని ట్రంప్‌నుద్దేశించి అన్నారు. ట్రంప్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఎన్నో అంతర్గత విషయాలు ఈ పుస్తకంలో పొందుపర్చబడ్డాయి. పుస్తకంలోని అంశాలన్నీ పుకార్లు అని వైట్‌హౌస్ అధికారులతో పాటు ప్రెస్ సెక్రెటరీ సర్హా సాండర్స్ కొట్టిపారేశారు. పుస్తకాంలో చాలా తప్పులు ఉన్నాయని, దాన్ని చదవడం సమయం వృథా అని, తమ అధికార బృందం దేశాన్ని ఆర్థికంగా అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేలా ఆలోచిస్తుంటుందని ఆమె చెప్పారు. బ్యానన్ అనే అతను ఎవరో కూడా ట్రంప్‌కు తెలీదని, అతనితో గోల్ఫ్ ఆడారని చెప్పడం అవాస్తవం అని ఆమె కొట్టిపారేశారు. ట్రంప్ గెలుపు సాధించలేరని, అతను గెలుపొందాలని ఇవాంకా అనుకోలేదని చెప్పడంలో నిజం లేదన్నారు. అమెరికా అధ్యక్షుడితో పాటు అతని కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేయడం బాధాకరమని ఆమె పేర్కొన్నారు.

దయ చూపండి.. శిక్ష తగ్గించండి

- న్యాయమూర్తికి లాలూ వేడుకోలు



రాంచీ: దాణాకుంభకోణంలో అరెస్టై జార్ఖండ్ లోని బిర్సా ముండా జైలులో ఉన్న ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కు నేడు శిక్ష ఖరారుకానుంది. శుక్రవారం లాలూ కేసులో వాదనలు పూర్తయ్యాయి. కేసు విచారణ సందర్భంగా లాలూ.. న్యాయమూర్తికి వేడుకోలు చేశారు. దాణా కుంభకోణంలో ప్రత్యక్షంగా తన పాత్ర ఏమీ లేదని..తనపై దయతలచి శిక్షను తగ్గించాలని వేడుకున్నారట. తన ఆరోగ్యం, వయస్సు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని శిక్ష తగ్గించాలని లూలూ వేడుకున్నట్లు సమాచారం. అయితే లాలూ వేడుకోలపై సీబీఐ న్యాయమూర్తి శివపాల్ స్పందిస్తూ.. లాలూజీ మీ వాళ్ల నుంచి నాకు చాలా కాల్స్ వస్తున్నాయి. కానీ శిక్ష విషయంలో నేను చట్టాన్ని,ధర్మాన్ని పాటిస్తాను అని స్పష్టం చేశారట. ఈ కేసులో లాలూకు మూడు నుంచి ఏడేళ్ల జైలు శిక్ష పడవచ్చని న్యాయనిపుణులు చెబుతున్నారు.

జడ్జికి మావాళ్లు ఫోన్ చేయలేదు : ఆర్జేడీ

తనకు ఆర్జేడీ నేతల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయని లాలూ కేసు విచారణ సందర్భంగా సీబీఐ జడ్జి శివపాల్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై ఆర్జేడీ స్పందించింది. న్యాయమూర్తికి తమ పార్టీవారెవరూ ఫోన్లు చేయలేదని ఆర్జేడీ సీనియర్ నాయకుడుశివప్రసాద్ తివారి ప్రకటించారు. సీబీఐ న్యాయమూర్తికి మా వాళ్ల నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయని విచారణ సందర్భంగా ఆయన చెప్పారు.

ఆర్జేడీ వ్యాఖ్యలు హాస్యాస్పదం : బీజేపీ

న్యాయమూర్తి ఫోన్ కాల్స్ అంశంపై బీహార్ బీజేపీ అధికార ప్రతినిధి సంజయ్ సింగ్ స్పందిస్తూ లాలూ జైలులో ఉండగానే ఆర్జేడీ నేతలు శిక్ష ఖరారు చేసే న్యాయమూర్తిపై ఒత్తిడి తెస్తున్నారు. అవినీతి కుంభకోణంలో చిక్కుకున్న తమ పార్టీ చీఫ్ లాలూను రక్షించుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

భార్య పక్కనుండగా బరితెగించిన భర్త

వాషింగ్టన్: విమానంలో నిద్రిస్తున్న తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఓ యువతి చేసిన ఆరోపణలపై ప్రభు రామమూర్తి అనే 34 సంవత్సరాల భారతీయుడిని మిచగాన్‌లో ఫెడరల్ అధికారులు అరెస్టు చేశారు. అమెరికాలో తాత్కాలిక వీసాపై ఉంటున్న రామమూర్తిని లైంగిక వేధింపుల అభియోగంపై ఫెడరల్ కోర్టులో హాజరుపరిచారు. ఆయనకు బెయిల్ ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. లాస్‌వేగాస్ నుంచి ఈ నెల మూడవ తేదీన స్పిరిట్ ఎయిర్ లైన్స్ విమానంలో డెట్రాయిట్‌కు రామమూర్తి చేరుకున్నారు. అభియోగం మోపిన 22 ఏళ్ళ యువతి విమానంలో కిటికీ పక్కన సీటులో కూర్చొగా, ఆమె పక్క సీటులో ఆయన కూర్చున్నారు. రామమూర్తి పక్క సీటులో ఆయన భార్య ఉన్నది. అయితే తాను నిద్రలేచి చూసేటప్పటికీ తన చొక్కా, ప్యాంటు బటన్లు తొలగించి ఉన్నాయని, అతడి చేయి తన ప్యాంట్‌లో ఉందని సదరు యువతి ఆరోపించింది. వెంటనే లేచి వెనక్కి వెళ్ళి విమాన సిబ్బందికి ఫిర్యాదు చేసిందని ఫెడరల్ ప్రాసిక్యూటర్ అమండా జవద్ తెలిపారు. 40 నిముషాల్లో విమానం దిగుతుందనగా ఉదయం దాదాపు ఐదున్నరకు ఏడుస్తూ వచ్చిన బాధితురాలు తాను లైంగిక దాడికి గురైనట్టు ఆరోపించిందని దర్యాప్తు అధికారులకు విమాన సిబ్బంది తెలిపినట్టు జవద్ వివరించారు. అయితే తాను మాత్ర వేసుకున్న తర్వాత గాఢంగా నిద్రపోయానని, తానేమీ చేయలేదంటూ రామమూర్తి లిఖితపూర్వక ప్రకటన చేశారు. అంతేకాక నింద మోపిన సదరు యువతి తన మోకాళ్ళపై నిద్రిస్తున్న వైనాన్ని తన భార్య తెలిపిందని ఆయన అందులో చెప్పారు. ఇది ఒక అత్యంత అసాధారణమైన కేసుగా పేర్కొన్న మెజిస్ట్రేట్ జడ్జీ స్టీవెన్ వాలెన్.. విచారణ పూర్తయ్యేంతవరకు రామమూర్తిని కస్టడీలో ఉంచాలని ఆదేశించారు.

ఒకే వేదికపై రజనీ, కమల్

న్యూఢిల్లీ: ఇటీవల తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన రజనీ, కమల్ ఒకే వేదికపై ఆశీనులు కానున్నారు. ఈ వారంతంలో తమిళ నటుల సంఘం ఆధ్వర్యంలో మలేషియాలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ ఘటన జరగనుంది. తమిళనాట సినీ రంగంలో ఇద్దరూ ఇద్దరేగా పేరుగాంచిన వీరు అనంతరం రాజకీయ రంగంలోనూ తమదైన శైలిలో ఆరంగేట్రం చేశారు. ఇద్దరూ త్వరలోనే క్రియాశీలక రాజకీయాల్లోకి రానున్నారు. రాజకీయ ప్రకటన అనంతరం వీరిద్దరూ ఒకే వేదికపైకి రావటం సినీ, రాజకీయరంగాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజకీయపరంగా చూస్తే కమల్, రజనీ భిన్న ధ్రువాలు ఒకరేమో ఆస్తికవాదానికి, మరొకరు నాస్తికవాదానికి ప్రతీకలుగా ఉంటారు. రజనీకాంత్ రాజకీయాలు ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తాయి. కాగా హేతువాది, నాస్తికుడైన కమల్ రాజకీయాలు రజనీకి భిన్నంగా ఉండే అవకాశం ఉంది. విజయ్‌కాంత్ కూడా నడిగర్ సంఘం అధ్యక్షుడిగా ఉన్నా అనంతరం దాన్ని వదిలేసి రాజకీయపార్టీ ప్రారంభించి ఒడుదొడుకులు మధ్య కొనసాగుతున్నారు. అనంతరం శరత్ కుమార్ అతని స్థానాన్ని భర్తీ చేశారు. తాజాగా విశాల్ నటుల సంఘం అధ్యక్షుడిగా శరత్ కుమార్ స్థానంలో కొనసాగుతున్నారు. వీరంతా రాజకీయరంగాలనూ ప్రభావితం చేసే స్థితిలో ఉన్నారు.



రజనీతో కమల్ (ఫైల్)

రజనీ అభిమానులకే పెటా విజ్ఞప్తి

జంతుహక్కుల పరిరక్షణ సంస్థ పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్మెంట్ ఆఫ్ యానిమల్స్ (పెటా) రజనీ అభిమానులకు జంతు బలిని నివారించాలని శుక్రవారం విజ్ఞప్తి చేసింది. రజనీ రాజకీయ ప్రవేశాన్ని పురస్కరించుకుని అలగార్‌కోవెలలో ఎటువంటి జంతుబలిని ఇవ్వకుండా ఆదివారం వేడుకలు జరుపుకోవాలని కోరింది.

కాబూల్‌లో ఆత్మాహుతి దాడి

20 మంది మృతి

ఆఫ్ఘనిస్తాన్ : కాబూల్ మరోసారి బాంబుల మోతతో దద్దరిల్లింది. ఈసారి మృత్యువు ఆత్మాహుతి దాడి రూపంలో వచ్చింది. ఈ ఘటనలో 20 మంది చనిపోగా, సుమారు 27 మంది పోలీసులు తీవ్ర గాయాలపాలయ్యారు. గురువారం రాత్రి సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పదుల సంఖ్యలో పోలీసులు, వ్యాపారస్తులతో రద్దీగా ఉన్న ప్రాంతంలో ఆత్మాహుతి దాడి జరిగింది. పేలుడు జరిగిన తరువాత వెంటనే శుక్రవారం ఉదయం కేవలం ఆరుగురు మాత్రమే చనిపోయినట్టు పోలీసు అధికారి జాన్ ఆఘా ప్రకటించారు. కానీ మృతుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఆత్మాహుతి దాడికి పాల్పడింది తామే అని ఎవరూ ఇంకా ప్రకటించలేదు.

అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి

- క్షిపణి ప్రయోగించిన ఉ.కొరియా
- సమీప పట్టణంలోనే కూలిన వైనం

లండన్ : అమెరికాపై మిస్సైల్ వేస్తామంటూ భయపెట్టిస్తున్న ఉత్తర కొరియా అనుకోని విధంగా షాక్ తగిలింది. ప్రయోగంలో భాగంగా ఉత్తర కొరియా హవాసాంగ్-12 పేరుగల మధ్యస్థ రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగించింది. కొద్దిసేపటికే సాంకేతి కారణాలతో ఉత్తర కొరియాలోనే ఓ పట్టణంపై పడిందని అమెరికా అధికారులు ప్రకటించారు. కిమ్ ఒకటి అనుకుంటే ఇంకోటైందని విమర్శించారు. ఈ ఘటన గతేడాది ఏప్రిల్ 28న చోటు చేసుకుంది. మిస్సైల్ టోక్‌చోన్ పట్టణంపై పడింది. ఈ పట్టణం ఉత్తర కొరియా రాజధాని అయిన ప్యోంగ్యాంగ్‌కు ఉత్తరాన 90 మైళ్ల దూరంలో ఉంది. సుమారు 2లక్షల మంది పట్టణ జనాభా ఉంది. మిస్సైల్ టోక్‌చోన్ పట్టణంపై పడటంతో కొన్ని పారిశ్రమలతో పాటు వ్యవసాయ భవనాలు కూలిపోయాయి. ఈ ఘటనను అమెరికా ఇంటలిజెన్స్ వర్గాలు శాటిలైట్ ద్వారా కొనుగొన్నాయి. పుక్‌చాంగ్ నుండి ప్రయోగించిన మిస్సైల్ 24 మైళ్లు ఉత్తరం, తూర్పు దిశలో వెళ్లింది. 43 మైళ్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించలేదని, ఇంజిన్ ఫెయిల్ కావడంతో అది కూలిపోయిందని అమెరికా అధికారులు ధ్రువీకరించారు. మిస్సైల్ కూలిపోవడంతో భారీ ఎత్తున పేలుడు జరిగిందని, ఉపగ్రహ చిత్రాలు ఈ ఘటనను బలపరుస్తున్నాయని వివరించారు.

Dwaraka

క్రీడాప్రభ



డు ప్లెసిస్ వికెట్ తీసిన సంబరంలో పాండ్య, అతని సహచరులు

తడబడ్డ బ్యాట్స్‌మెన్

- 28కే 3 వికెట్లు కోల్పోయిన భారత్
- భువీ.. భగ భగ
- దక్షిణాఫ్రికా 286 ఆలౌట్
- డివిలియర్స్, డు ప్లెసిస్ అర్థసెంచరీలు

ఆహా.. ఏం ఆరంభం...! దక్షిణాఫ్రికా పర్యటనలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ... తొలి టెస్టులో మొదటి రోజు శుక్రవారం భారత జట్టు పేస్ బౌలర్లు అదరగొట్టారు. కానీ బ్యాట్స్‌మెన్ తడబడ్డారు. టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. విజయ్ (1), ధావన్ (16), కోహ్లి (5) వెంటవెంటనే ఔటయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో 28 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోవడంతో భారత్ ఎదురీదుతోంది. టీమ్ఇండియా పేసర్లు పడిన కష్టాన్ని బ్యాట్స్‌మెన్ నేలపాలు చేశారు. తొలి రోజు ఆట ఆఖరుకు భారత్ 3 వికెట్లకు 28 పరుగులు చేసింది. కఠినమైన ఈ పర్యటనను భారత జట్టు నిజానికి ఆశావహంగా ఆరంభించింది. కేప్‌టౌన్‌లో తొలి రోజు పేస్‌కు అనుకూలించిన పిచ్‌పై భువనేశ్వర్ కుమార్ నిప్పులు చెరిగాడు. బ్యాట్స్‌మెన్‌కు దడ పుట్టించాడు. దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్‌ను కూలగొట్టాడు. అతని ధాటికి మొదటి ముగ్గురు బ్యాట్స్‌మెన్ రెండంకెల స్కోరైనా అందుకోలేకపోయారు. ఇతర పేస్ బౌలర్లు భువీకి తోడ్పాటునందించారు. తలో వికెట్ దక్కించుకున్నారు. స్పిన్నర్ అశ్విన్ కూడా రెండు వికెట్లు తీశాడు. అలవోకగా భారీ స్కోర్లు సాధిస్తారు... దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌కు కళ్లెం వేయడం కష్టమైన పని అనుకున్న అంచనాలను భారత పేసర్లు నిజం కాదని నిరూపించారు. దక్షిణాఫ్రికా పిచ్‌లపై మన పేస్ బౌలర్లు చెలరేగుతారన్న కెప్టెన్, కోచ్‌ల నమ్మకాన్ని నిలబెట్టారు. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేశారు. దక్షిణాఫ్రికా మూడో సెషన్లో 286 పరుగులకు ఆలౌటైంది. మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ డివిలియర్స్ (62), డు ప్లెసిస్ (62), డి కాక్ (43) ఆదుకోకుంటే దక్షిణాఫ్రికా ఆ మాత్రం స్కోరైనా చేయగలిగేది కాదు! టెస్టుల్లో అరంగేట్రం చేసిన బుమ్రా.. ప్రమాదకర బ్యాట్స్‌మన్ డివిలియర్స్ వికెట్ తీశాడు. టెస్టుల్లో అతనికిదే తొలి వికెట్.



ఎల్గర్‌ను ఔట్ చేసిన ఆనందంలో భువీ

కేప్‌టౌన్

భారత్ తొలి టెస్టులో ఎదురీదుతోంది. పుజారా (5), రోహిత్ (0) క్రీజులో ఉన్నారు. భారత్ ఇంకా 258 పరుగులు వెనుకబడి ఉంది. చేతిలో 7 వికెట్లున్నాయి. అంతకుముందు దక్షిణాఫ్రికాతో మొదటి టెస్టుకు పేసర్ భువనేశ్వర్ కుమార్ (4-87) అదిరిపోయే ఆరంభం ఇచ్చాడు. టాస్ గెలిచి తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆ జట్టును మొదటి ఓవర్లోనే భువీ దెబ్బ తీశాడు. మూడో బంతికి ఓపెనర్ ఎల్గర్‌ను ఔట్ చేశాడు. అతను పరుగులేమి చేయకుండానే వెనుదిరిగాడు. భువీ ఆఫ్ స్టంప్‌కు వెలుపల సంధించిన బంతిని ఆడబోగా అది కాస్తా బ్యాట్ అంచును తీసుకొని కీపర్ సాహా చేతిలో వాలింది. భారత్ ఆటగాళ్ల ఆనందానికి అవధుల్లేవు. స్కోరు బోర్డుపై పరుగులేమీ చేయకుండానే ఆతిథ్య జట్టు తొలి వికెట్ కోల్పోయింది. క్రీజులోకి ఆమ్లా వచ్చాడు. మూడో ఓవర్లో భువీ మరోసారి దక్షిణాఫ్రికాను దెబ్బతీశాడు. 10 బంతులాడి 5 పరుగులు చేసిన మర్‌క్రమ్‌ను భువీ.. మూడో ఓవర్లో పెవిలియన్ దారి పట్టించాడు. వికెట్లకు సూటిగా వేసిన బంతి మర్‌క్రమ్ ప్యాడ్లకు తాకింది. అతను సమీక్ష కోరుకుండానే మైదానాన్ని వీడాడు. భువీ ధాటికి 7 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి దక్షిణాఫ్రికా మరింత కష్టాల్లో పడింది. భువీ మరోసారి నిప్పులు చెరిగే బంతితో మిస్టర్ డిపెండబుల్ ఆమ్లా (3)ను కూడా ఔట్ చేశాడు. ఆఫ్ స్టంప్‌కు అవతల వేసిన బంతిని వెంటాడి ఆమ్లా.. కీపర్ సాహా చేతికి చిక్కాడు. దీంతో 12 పరుగులకే టాప్ ఆర్డర్‌ను కోల్పోయి ఆతిథ్య జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది.

ఆదుకున్న డివిలియర్స్, డు ప్లెసిస్

ఆ దశలో డివిలియర్స్(65, 84 బంతుల్లో, 11 ఫోర్లు)క ు జత కలసిన కెప్టెన్ డు ప్లెసిస్ (62, 104 బంతుల్లో, 12 ఫోర్లు) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు సాధికారికంగా ఆడుతూ సమయోచి తంగా బౌండరీలు బాది స్కోరును పరుగులు తీయించారు. వీరిద్దరు ఓవర్‌కు దాదాపు 4 పరుగులు చొప్పున రాబట్టడంతో దక్షిణాఫ్రికా స్కోరు బోర్డు వేగంగా కదిలింది. డివిలియర్స్, డు ప్లెసిస్ అర్థసెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఈ జోడీని విడగొట్టేందుకు కోహ్లి ఎన్ని బౌలింగ్ మార్పులు చేసినా తొలి సెషన్లో మరో వికెట్ పడలేదు. వీరిద్దరు కలిసి నాలుగో వికెట్‌కు 124 పరుగులు జోడించారు. ఎట్టకేలకు లంచ్ విరామం అనంతరం 33 ఓవర్ చివరి బంతికి అరంగేట్ర బౌలర్ బుమ్రా (1-73)కు డివిలియర్స్ రూపంలో తొలి వికెట్ లభించింది. ఆఫ్ స్టంప్ వెలుపల వేసిన ఫుల్ డెలివరీని డివిలియర్స్ ఆడబోగా.. అది బ్యాట్ వెలుపలి అంచును తాకి ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. సెంచరీ భాగస్వామ్యానికి తెరపడ డంతో భారత జట్టు ఊపిరి పీల్చుకుంది. రెండు ఓవర్ల తర్వాత పాండ్య.. డు ప్లెసిస్‌ను ఔట్ చేశాడు. డు ప్లెసిస్.. ఆఫ్ స్టంప్ అవతల పడిన గుడ్ లెంత్ డెలివరీని ఆడబోయి కీపర్‌కు చిక్కాడు. డు ప్లెసిస్ ఔటైన తర్వాత డికాక్ (43, 40 బంతుల్లో, 4 ఫోర్లు), ఫిలాండర్ (23), మహరాజ్ (35), రబాడ (26) ఓ మోస్తరుగా రాణించారు. డికాక్‌కు భువనేశ్వర్ ఔట్ చేయగా.. షమి వేసిన అద్భుతమైన బంతికి ఫిలాండర్ వెనుదిరిగాడు. ఆడాలో వద్దో తేల్చుకోలేని ఆ బంతి ఫిలాండర్ బ్యాట్, ప్యాడ్ మధ్య నుంచి దూసు కుపోయి సుతారంగా బేల్స్‌ను గిరాటేసింది.

స్కోరు బోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) సాహా (బి) భువనేశ్వర్0, మర్‌క్రమ్ (ఎల్బీ) (బి) భువనేశ్వర్ 5, ఆమ్లా (సి) సాహా (బి) భువనేశ్వర్ 3, డివిలియర్స్ (బి) బుమ్రా 65, డు ప్లెసిస్ (సి) సాహా (బి) పాండ్య 62, డి కాక్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 43, ఫిలాండర్ (బి) షమి 23, మహరాజ్ (రనౌట్) 35 రబాడ (సి) సాహా (బి) అశ్విన్ 26, స్టెయిన్ నాటౌట్ 16, మోర్కెల్ (ఎల్బీ) (బి) అశ్విన్ 2, ఎక్స్‌ట్రాలు6, మొత్తం (73.1 ఓవర్లలో ఆలౌట్) 286, **వికెట్ల పతనం:** 1-0, 2-7, 3-12, 4-126, 5-142, 6-202, 7-221, 8-258, 9-280, 10-286.

బౌలింగ్: భువనేశ్వర్ 19-4-87-4, షమి 16-6-47-1, బుమ్రా 19-1-73-1, పాండ్య 12-1-53-1, అశ్విన్ 7.1-1-21-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1, ధావన్ (సి అండ్ బి) స్టెయిన్ 16, పుజారా బ్యాటింగ్ 5, విరాట్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ బ్యాటింగ్ 0, ఎక్స్‌ట్రాలు 1, మొత్తం (11 ఓవర్లలో 3 వికెట్లకు) 28, **వికెట్ల పతనం:** 1-16, 2-18, 3-27 **బౌలింగ్:** ఫిలాండర్ 4-1-13-1, స్టెయిన్ 4-1-13-1, మోర్కెల్ 2-2-0-1, రబాడ 1-0-1-0.



బుమ్రా... ఆశ్చర్యకరంగా...!

న్యూఢిల్లీ: దక్షిణా ఫ్రికాతో కేప్ టౌన్ టెస్టు లో భారత పేస్ బౌలింగ్ విభాగంలో షమి, భువ నేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మ లేదా ఉమేశ్ యా దవ్ ఖాయమని అం దరూ భావిం చారు. కానీ టాస్ వేయ డానికి కొద్ది నిమిషాల ముందు టీమ్ ఇండి యా యాజమాన్యం తీసు కున్న నిర్ణయం భారత క్రికెట్ అభిమానులను ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. వన్డేల్లో అద్భుతంగా రాణిస్తున్న బుమ్రాకు తొలి టెస్టు క్యాప్ అందిస్తున్నట్లు బీసీసీఐ సోషల్ మీడియాలో ప్రకటించింది. టాస్ వేసే సమయంలో బుమ్రాను తుది జట్టులోకి తీసుకుంటున్నట్లు కెప్టెన్ విరాట్ కోహ్లి చెప్పాడు. 77 టెస్టుల అనుభవం ఉన్న ఇషాంత్‌ను కాదని బుమ్రాను తీసుకున్నారు. పేస్ విభాగంలో పెద్దగా సందిగ్ధత లేకపోవడంతో చర్చ అంతా ఆరో స్థానానికి పాండ్య, రోహిత్‌లలో ఎవరి తీసుకుంటారన్న అంశంపైనే సాగింది. జడేజా జ్వరంతో బాధపడుతుండడంతో స్పిన్నర్ల విషయంలో సైతం చర్చకు తెరపడింది. టెస్టు బౌలర్‌గా అరంగేట్రం చేయడానికి అన్ని అర్హతలున్నా బుమ్రా పేరు పెద్దగా చర్చల్లో చోటు చేసుకోలేదు.

టీ20ల్లో నెంబర్ వన్, వన్డేల్లో నెంబర్ 3 అయిన బుమ్రా పరిమిత ఓవర్ల క్రికెట్లో తిరుగులేని బౌలర్ అయినప్పటికీ తొలిసారి టెస్టుల్లోకి అడుగుపెట్టాడు. ఐతే 2017 జనవరిలో గుజరాత్‌ను రంజీ ట్రోఫీ ఫైనల్ చేర్చిన తర్వాత అతను ఎర్ర బంతితో బౌలింగ్ చేయలేదు. జట్టులో ఇపుడు 24 ఏళ్ల బుమ్రానే అత్యంత పిన్న వయస్కుడు. ఇషాంత్ శర్మను పక్కన పెట్టి బుమ్రాను తుది జట్టులోకి తీసుకున్నారు. భువనేశ్వర్, షమి, పాండ్య ఇతర ఫాస్ట్ బౌలర్లు కాగా.. అశ్విన్ ఏకైక స్పిన్నర్. గత ఏడాది టీ20ల్లో భారత్‌కు అనేక విజయాలు సాధించి పెట్టాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రసవత్తర పోరులో చివరి ఓవర్లో రెండు పరుగులకే 2 వికెట్లు నేల కూల్చాడు. దీంతో టీమ్ఇండియా 5 పరుగుల తేడాతో గెలిచింది. తదుపరి మ్యాచ్‌లో 14 పరుగులకే 3 వికెట్లు పడగొట్టడంతో సిరీస్‌ను భారత్ 2-1తో గెలుచుకుంది. ఆసీస్, కివీస్‌లపై కూడా భారత్‌కు తిరుగులేని విజయాలు కట్టబెట్టాడు. ఈ విజయాలే బుమ్రాకు దక్షిణాఫ్రికాతో కీలక సిరీస్‌లో టెస్టు బౌలర్‌గా పదోన్నతి కల్పించాయి. గత ఏడాది పరిమిత ఓవర్ల క్రికెట్లో అతను 20 మ్యాచ్‌లలో 35 వికెట్లు పడగొట్టాడు. బుమ్రా 26 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 25.33 సగటుతో 89 వికెట్లు పడగొట్టాడు.




ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సెరెనా దూరం

- ఆండ్రీ ముర్రే కూడా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు స్టార్లు ఒక్కొక్కరుగా దూరమవుతున్నారు. ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నుంచి తప్పుకుం టున్నట్లు తాజాగా అమెరికా దిగ్గజం, డిఫెండింగ్ చాంపియన్ సెరెనా విలియమ్స్ శుక్ర వారం ప్రకటించింది. తాను ఫామ్‌కు అత్యంత సమీపానికి వచ్చినప్ప టికీ... తొలి బిడ్డకు జన్మనిచ్చిన తానింకా అవసరమైన స్థాయిలో లేనని తెలిపింది. గత ఏడాది రెండు మాసాల గర్భవతిగా ఉన్న సెరెనా ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచింది. ఫైనల్లో అక్క వీనస్ విలియమ్స్‌ను ఓడించింది. తర్వాత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. రాడిట్ సహ వ్యవస్థాపకుడు అలెక్సిక్ ఒహానియన్‌ను వివాహమాడింది. ''అబుదాబి ఓపెన్‌లో ఆడిన అనంతరం నేను టోర్నీలకు అవసరమైన ఫామ్‌ను అందుకున్నానని గ్రహించాను. కానీ నేను కోరుకున్న స్థాయిలో లేను'' అని 36 ఏళ్ల సెరెనా తెలిపింది. ''నేను తిరిగి టెన్నిస్ ప్ర స్థానాన్ని ఆరంభించడానికి రెండు టోర్నీలు చాలని నా కోచ్, జట్టు ఎపుడూ చెబుతున్నారు. నేను పోటీపడగలను. కానీ కేవలం పోటీ పడాలని నేను కోరుకోవడం లేదు. అంతకుమించి చేయాలి. అందుకు మరికొంత సమయం కావాలి. నేను నిరాశకు గురైనప్పటికీ ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పోటీ పడరాదని నిర్ణయించుకున్నాను'' అని సెరెనా ఆ ప్రకటనలో తెలిపింది. అబుదాబిలో సెరెనాలో మునుపటి జోరు కనిపించలేదు. సర్వ్‌లో సమస్యలనెదుర్కొంది. బేస్‌లైన్ వద్ద ఎన్నో తప్పిదాలు చేసింది. బంతిని నెట్‌కు కొట్టింది.

ఏడు సార్లు విజేతగా నిలిచిన సెరెనా తిరిగి టెన్నిస్‌లోకి వచ్చేందుకు చేస్తున్న కృషిని ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ డైరక్టర్ క్రెయిగ్ టిలే ప్రశంసించాడు. ''నిజమైన చాంపియన్ సెరెనా మళ్లీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడేందుకు గత కొద్ది మాసాలుగా విపరీతంగా శ్రమిస్తోంది'' అని అన్నాడు. గాయాల కారణంగా ఈ గ్రాండ్ స్లామ్ ఈ ఏడాదికి తప్పుకుంటున్నట్లు మాజీ నెంబర్‌వన్ ఆండీ ముర్రే, జపాన్ ఆట గాడు కీ నిషికొరి కూడా గురువారం ప్రకటించారు. నడుం గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి తప్పు కుంటు న్నట్లు ముర్రే ప్రకటించాడు. గత ఏడాది గాయానికి గురైన ముర్రే వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్లో ఓడిన అనంతరం ఏటీపీ టూర్లో ఆడలేదు.



ముర్రే

స్మిత్ మరో రికార్డు

- వేగంగా 6వేల పరుగులు
- సెంచరీ చేరువలో ఖవాజా
- ఆసీస్ 193-2; ఇంగ్లండ్ 346

సిడ్నీ: కెప్టెన్ స్టీవ్ స్మిత్ (44 బ్యాటింగ్, 88 బంతుల్లో, 3 ఫోర్లు) మరో మైలురాయిని అందుకోవడంతో పాటు ఖవాజా (91 బ్యాటింగ్, 204 బంతుల్లో, 7 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మూడో వికెట్‌కు అజేయంగా 107 పరుగులు జోడించడంతో ఆస్ట్రేలియా పటిష్టస్థితిలో నిలిచింది. రెండో రోజు శుక్రవారం ఆట ఆఖరుకు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు నష్టపోయి 193 పరుగుల స్కోరు చేసింది. సిరీస్‌లో ఇంగ్లండ్‌కు కొరకరాని కొయ్యగా ఉన్న స్మిత్... టెస్టుల్లో వేగంగా 6 వేల పరుగులు పూర్తి చేసుకున్న రెండో బ్యాట్స్‌మన్‌గా రికార్డులకెక్కాడు. అతను (6018) 111 ఇన్నింగ్స్‌లో ఆరు వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లలో ఇంతవరకు స్మిత్ మూడు సెంచరీలు సాధించి ఇంగ్లండ్ యాషెస్ ఆశలకు గండికొట్టాడు.

మరో శతకం దిశగా అడుగులు వేస్తున్నాడు. స్మిత్ ఇప్పటివరకు 648 పరుగులు చేశాడు. ఓపెనర్ వార్నర్ (56, 104 బంతుల్లో, 6 ఫోర్లు)తో కలిసి ఖవాజా రెండో వికెట్‌కు 85 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను కుదుట పరిచాడు. వార్నర్ సిరీస్‌లో నాలుగో అర్ధసెంచరీ సాధించాడు. 32వ ఓవర్లో వార్నర్ ఔటైన అనంతరం ఖవాజా, స్మిత్ జోడీకి ఎదురేలేకపోయింది. అలీ బౌలింగ్‌లో సిక్స్ సాధించి ఖవాజా అర్థశతకం పూర్తి చేసుకున్నాడు. ఇంగ్లండ్ తరపున 90 ఏళ్లలో పిన్న వయస్కుడైన స్పిన్నర్‌గా అరంగేట్రం చేసిన మాసన్ క్రేన్ తన మణికట్టు మాయాజాలంతో స్మిత్, ఖవాజాలను ఇబ్బంది పెట్టాడు. అంతకుమ ందు ఉదయం ఇంగ్లండ్ ఓవర్‌నైట్ స్కోరు 233-5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించి 346 స్కోరు వద్ద లంచ్ విరామానికి ముందు ఆలౌటైంది. ఇంగ్లండ్ చివరి వరుస బ్యాట్స్‌మెన్ అలీ (30), కర్రన్ (39), బ్రాడ్ (31) రాణించడంతో ఇంగ్లండ్ మెరుగైన స్కోరు సాధించింది.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 346,

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: బాన్‌క్రాఫ్ట్(బి) బ్రాడ్ 0, వార్నర్ (సి) బెయిర్ స్టో (బి) అండర్సన్ 56, ఖవాజా బ్యాటింగ్ 91, స్మిత్ బ్యాటింగ్ 44, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం (67 ఓవర్లలో 2 వికెట్లకు) 193, **వికెట్ల పతనం:** 1-1, 2-86,

బౌలింగ్: అండర్సన్ 14-4-25-1, బ్రాడ్ 10-2-28-1, అలీ 17-3-51-0, కర్రన్ 8-2-26-0, క్రేన్ 17-0-58-0, రూట్ 1-0-4-0.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.








ఏ రంగంలో సెలబ్రిటీ అయినా...
జనహృదయాలే వారికి...గుళ్లు గోపురాలు
అందుకే దేవుళ్లతో పాటు పాఠక,ప్రేక్షక, ఓటరు దేవుళ్లూ వచ్చారు
జనాభిమానమే సెలబ్రిటీలను పైకెక్కించే మెట్లు...
జనానికి నచ్చని పని చేస్తే.. ఆ మెట్ల అవసరం కూడా లేకుండా
కిందకు పడదోస్తారు... అందుకే ఒప్పుకోలు తప్పనిసరి..

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ I
శనివారం 6 జనవరి 2018

సెలబ్రిటీలకు జన హృదయాలే కన్‌ఫెషన్ బాక్సులు

ఒప్పుకోలు...తప్పదు!




'పేరున్నవాళ్లు ఏం చేసినా, ఏం మాట్లాడినా చెల్లుతుంది'... చాలా సందర్భాల్లో సాధారణ జనం ఇలాగే అనుకుంటారు. అదే మనం చేస్తే ఊరుకుంటారా..అనే ధర్మాగ్రహాన్ని కూడా వ్యక్తం చేస్తారు. అయితే అన్ని సందర్భాల్లోనూ సెలబ్రిటీలు తప్పించుకునే వీలు లేదు...అలా దొరికిపోయినప్పుడు వారు తాము చేసిన తప్పులకు... సాధారణ జనం కంటే ఎక్కువగా విమర్శలు పడాల్సివస్తుంది. అంతపేరుండి...నలుగురికీ చెప్పే స్థితిలో ఉండి అదేం పని...అనే ఏవగింపుని ఎదుర్కోవాల్సి వస్తుంది. మరీ ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చాక జనం తమ అభిప్రాయాలను వెల్లడించడానికి వేదికలు పెరిగాయి. సెలబ్రిటీ ఎవరైనా...చిన్న పొరబాటు చేసినా...దానిపై జనగళం వెల్లువెత్తుతోంది. అప్పుడు చట్టం, కోర్టుల నుండయినా తప్పించుకోవచ్చు కానీ...జనాన్ని తప్పించుకోవటం మాత్రం అసాధ్యమన్న సంగతి అర్థమవుతుంది. తాగి డ్రైవ్ చేసిన కేసులో టీవీ యాంకర్ ప్రదీప్...తాను చేసింది తప్పేనని..ఇక ముందు అలా జరగకుండా చూసుకుంటానంటూ సోషల్ మీడియా ద్వారా తన తప్పుని ఒప్పుకున్నాడు. సెలబ్రిటీలకు జన హృదయాలే...నివాసాలు, గుళ్లు, చర్చిలు, మసీదులు అన్నీ. అందుకే అక్కడ తమ స్థానాన్ని పదిలంగా కాపాడుకోక తప్పదు. జారిన మాటకి, చేసిన తప్పుకి కన్‌ఫెషన్ తప్పదు.

సెలబ్రిటీలు తప్పులు చేస్తే...వాళ్లు కూడా మనుషులే కదా...అనే అభిప్రాయమూ వినబడుతుంది. అంతే స్థాయిలో విమర్శలూ వస్తాయి. 'మాకు నచ్చినట్టు మేము బతుకుతాం..ఎవరు పెంచుకోమన్నారు..అంత అభిమానాన్ని' అనడానికి వీలులేదు. ఎందుకంటే ఏ రంగంలో ఏ వ్యక్తి పేరు తెచ్చుకున్నా... అతని ఎదుగుదలలో పాపులారిటీ అనేది మొదటిమెట్టుగా నిలుస్తుంది. జనంలో పలుకుబడి పెరుగుతున్నకొద్దీ జనానికి నచ్చేలా బతకాల్సిన అవసరం కూడా పెరుగుతుంది. అది తెలుసుకాబట్టే..సెలబ్రిటీలు...తమ తప్పులకు బహిరంగంగా క్షమాపణలు చెబుతున్నారు.

ప్రదీపే కాదు..ఇంతకుముందు కూడా...

ఈ మధ్యకాలంలో మనం ఇలాంటి సందర్భాలను కాస్త ఎక్కువగానే చూస్తున్నాం. జనంలోకి వెళ్లే ప్రతిమాటని ఆచితూచి మాట్లాడాలని.. .కొంతమంది సెలబ్రిటీలు అర్థం చేసుకున్న సందర్భాలివి. నిన్నగాక మొన్న గజల్ శ్రీనివాస్ విషయంలో...అతను అలాంటి వాడు కాదే...అన్న మంత్రి మాణిక్యాల రావు... నాలుక కరుచుకుని...అతనిలోని ఈ కోణం గురించి నాకు తెలియదు... అనాల్సివచ్చింది. అలాగే మహిళలను గురించి తీవ్రమైన కామెంట్ చేసిన నటుడు చలపతిరావు కూడా...కాసేపు నా తప్పేమీ లేదంటూ బింకం చూపినా తరువాత క్షమాపణ చెప్పారు. ఇక ఆయనకు తందానా అన్న యాంకర్ రవి కూడా...తరువాత ఆయన ఏమన్నాడో తాను వినలేదని చెబుతూ చాలా సార్లు...చాలా సంజాయిషీలు ఇచ్చుకుని...తనలో ఎలాంటి దురుద్దేశాలు లేవని ప్రేక్షక జనానికి చెప్పుకోవాల్సి వచ్చింది. యాంకరింగ్ చేస్తున్న కొన్ని సందర్భాల్లో సినీ నటుడు అలీ కూడా ఇలాగే మాట తూలి విమర్శలు ఎదుర్కొన్నారు. మిగిలినవారివి మాటలు అయితే ప్రదీప్‌వి చేతలు. పైగా పద్ధతిగా బుద్ధిమంతుడిలా కనిపించే ప్రదీప్...ఒక్కసారిగా అలా పట్టుబడే సరికి అతని అభిమానులే కాకుండా ఇతర ప్రేక్షకులు సైతం కాస్త షాక్‌కి గురయ్యే అవకాశం కలిగింది. అనుకు న్నట్టుగానే విమర్శలు చెలరేగాయి. అయితే అతను చేసినది...ఈ రోజుల్లో అందరు యువత చేస్తున్నదేననే ఓదార్పులు సైతం ప్రదీప్‌కి సోషల్ మీడియా ద్వారా లభిస్తున్నాయి. కానీ ప్రదీప్...ఇప్పటివరకు తాను పొందిన పేరులో ఏ మాత్రం పోగొట్టుకోవటం ఇష్టంలేక వెంటనే చాలా స్పష్టమైన వివరణ ఇచ్చాడు. తానేమీ పారిపోలేదని..చట్టపరంగా పాటించాల్సిన విధానాలు ఏమున్నాయో వాటన్నింటికీ హాజరవుతానని...ఇక ముందు ఎప్పుడూ ఇలా జరగదని హామీ ఇచ్చాడు.

పత్రికలు కూడా...



మనుషులే కాదు...పత్రికలూ ఇలా పొరబాట్లు చేసి ఇరుకున పడిన సందర్భాలు ఉంటున్నాయి. ఐఎఎస్ అధికారి స్మితా సబర్వాల్ ని గురించి ఔట్‌లుక్ మేగజైన్... కించపరిచే వ్యాఖ్యలు చేసి చిక్కుల్లో పడింది. స్మితాసబర్వాల్ పత్రికపై కోర్టుకి వెళ్లారు. ఇక సినిమాల్లో ఏదో ఒక కులాన్ని, వర్గాన్ని కించపరచేలా డైలాగులు, చిత్రీకరణ చేయటం...ఆ తరువాత క్షమాపణ చెప్పడమైతే....ఈ మధ్యకాలంలో ఒక రివాజుగా మారింది. సినిమా సెలబ్రిటీలు చేసే పొరబాట్లు అవి. స్త్రీ వస్త్రధారణపై పలువురు రాజకీయ ప్రముఖులు ముందు ఏదోఒక నోటికొచ్చిన కామెంట్ చేసి.. ఆ తరువాత క్షమాపణ చెప్పే సందర్భాలూ తరచుగా మన కళ్లముందుకు వస్తున్నాయి. అలాంటి ఒక్క కామెంట్ బయటకు వస్తే...అది విస్తృతంగా జనంలోకి వెళ్లిపోవటంతో ప్రతిస్పందన చాలా వేగంగా వస్తోంది. అప్పుడు వారికి తమ తప్పు అర్థమై...తాము ఆ ఉద్దేశ్యంతో అనలేదని క్షమాపణలు చెబుతున్నారు.

తూటాల్లాంటి మాటలు...క్షమాపణలు

సుల్తాన్ సినిమాలో మల్లయోధుడి పాత్రలో నటించిన సల్మాన్ ఖాన్...ఆ పాత్రకోసం తీసుకున్న శిక్షణ గురించి చెబుతూ...తన పరిస్థితి రేప్‌కి గురయిన మహిళలా ఉందన్నాడు. ఆయన కామెంట్‌ని మహిళా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దాంతో తన కొడుకు అలా వ్యాఖ్యానించి ఉండకూడదని, అతను అన్నమాటలు తప్పే కానీ...అతని ఉద్దేశ్యంలో మాత్రం ఏ పొరబాటు లేదని చెబుతూ...సల్మాన్ తండ్రి సలీం ఖాన్ క్షమాపణ చెప్పాడు. ఇక వివాదాలతో ఎప్పుడూ వార్తల్లో ఉండే రామ్‌గోపాల్ వర్మ...ఈ ప్రపంచంలో ఉండే ప్రతి మహిళా సన్నిలియోన్‌లా మగవారికి ఆనందాన్ని ఇవ్వాలి...అనే అనాగరికమైన కామెంట్ చేసి...ఆ తరువాత తీవ్రమైన వ్యతిరేకతని ఎదుర్కొని క్షమాపణ చెప్పాడు. సినీ నటుడు పరేష్ రావేల్ ఒక సందర్భంలో బార్ వాలా కంటే చాయ్ వాలాయే నయమని వ్యాఖ్యానించాడు. అతని దృష్టిలో చాయ్‌వాలా అంటే నరేంద్రమోడీ... బార్‌వాలా అంటే సోనియా గాంధీ. ఆమె ఒకప్పుడు వెయిట్రెస్‌గా పనిచేశారనే ఉద్దేశ్యంతో అలాంటి కామెంట్ చేసి...ఆ తరువాత క్షమాపణ చెప్పాడు. రాజకీయ ప్రముఖుడు, రచయిత శశిథరూర్ సైతం ఇలాంటి అనుచిత వ్యాఖ్యలే చేసి ఆపై క్షమాపణలు చెప్పాడు. మన భారతీయ యువతి మానుషి చిల్లర్ మిస్ వరల్డ్‌గా ఎంపికైనప్పుడు ఆయన...బిజెపి ప్రభుత్వం అనవసరంగా దేశాన్ని నగదురహితం చేయాలని చూస్తోంది...కానీ...మన చిల్లర (మానుషి చిల్లర్) ప్రపంచానికే నచ్చేసింది... అనే కామెంట్ చేశారు. చివరికి జాతీయ మహిళా కమిషన్ క్షమాపణ కోరటంతో చెప్పాల్సివచ్చింది.

చేసిన తప్పుని ఒప్పుకోవటం...దీన్ని సాధారణ విషయంగా పరిగణించలేము. ఎందుకంటే తప్పుని ఒప్పుకోవటంలో ఎంతో ఆత్మ సంఘర్షణ ఉంటుంది. మార్పుకి సిద్ధపడాల్సి ఉంటుంది. అందుకే పశ్చాత్తాపానికి, ధైర్యంగా తప్పుని అంగీకరించినవారికి మన సమాజంలో మంచి విలువే ఉంది. మహాత్మా గాంధీ ఆత్మకథ ఈ విషయంలో ముందు వరుసలో నిలబడుతుంది. జీవితంలో సత్యంతో ప్రయోగాలు చేసిన మహామనీషి కనుక ఆయన అందులో భాగంగా...తన జీవితాన్నే తెరచిన పుస్తకంగా మార్చేశారు. తప్పులు ఒప్పుకోవటం ఆహ్వానించదగిన (చిత్తశుద్ధి ఉంటే) పరిణామమే. అయితే సెలబ్రిటీ హోదాలో ఉన్నపుడు సాధ్యమైనంత వరకు తప్పులు చేయకుండా మాట్లాడకుండా ఉంటేనే మంచిది. దీన్ని తమకు అందిన ప్రజాభిమానానికి ప్రతిఫలంగా వారు భావించాల్సిందే.

✍ వడ్లమూడి దుర్గాంబ

ఈ మొక్కలతో...

అందం...ఆరోగ్యం...అదృష్టం!

ఈ మొక్కలు ఇంట్లో ఉంటే అదృష్టం కలిసి వస్తుందంటారు కొందరు. మొక్కలు ఉంటే అదృష్టం కలిసి రావడం ఏంటీ?...అంతా ట్రాష్!... అంటారు మరికొందరు.ఎవరి అభిప్రాయాలు ఎలా ఉన్నా.. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడి అంతా అంగీకరిస్తారు. ఈ కోణంలో చూసినప్పుడు కొన్ని మొక్కలు మన ఇంటిలోనో... పెరట్లోనో... ఉంటే వాటి వల్ల మనకు కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తవు. ఎందుకంటే అవి మనం పీల్చేగాలని శుద్ధిచేస్తాయి కాబట్టి. అంటే పరోక్షంగా మనకు అదృష్టాన్ని ఇచ్చినట్లే కదా!



పీస్ లిల్లీ: తెల్లని పువ్వులతో ముదురు ఆకువచ్చ వర్ణంలో ఉండే ప్రకాశవంతమైన, అందమైన మొక్క పీస్ లిల్లీ. ఈ మొక్క ఇంట్లోఉంటే గాలిని శుద్ధిచేస్తుంది. స్వచ్ఛమైన గాలిని పీల్చడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండొచ్చు. ఇది తలనొప్పి, దీర్ఘకాలిక అనారోగ్యాలు క్యాన్సర్ లాంటివి రాకుండా నిరోధిస్తుంది. అంతే కాదండోయ్ ఇది ఇంటికి అందాన్ని కూడా ఇస్తుంది సుమా!



గులాబీలు: ...గులాబీలను ప్రేమకు సంకేతంగా భావిస్తారు. గులాబీలు అనేక రంగుల్లో ఉంటాయి. ఒక్కో రంగుకు ఒక్కో శక్తి ఉందని నమ్ముతాము. తెలుపు గులాబీలు మానసిక వికారాలను శుద్ధిచేస్తాయి. ఎరుపు గుర్తులు ఉన్న తెల్ల గులాబీలు భక్తికి సంకేతాలు. కనకాంబరంరంగు గులాబీని స్నేహానికి, శాంతికి, ఆధ్యాత్మికతకు చిహ్నంగా భావిస్తారు. ఎరుపు రంగు గులాబీ నిజమైన ప్రేమకు, పింక్ రంగు గులాబీ వైవిధ్య భరితమైన ప్రేమకు సంకేతం. ఇలా ఒక్కో రంగు... ఒక్కో ప్రత్యేకతను కలిగి ఉంది.



జెముడు(కాక్టస్): ..మధ్య మెక్సికో,చైనా దేశాల్లో కాక్టస్‌ను శుభప్రదమైన మొక్కగా భావిస్తారు. కాక్టస్ మొక్క పువ్వును అదృష్టానికి సంకేతంగా భావిస్తారు. మన పెరట్లో ఉండే కాక్టస్ మొక్క పుష్పించిందంటే ఇంటి యజమానిఏదో శుభవార్త వింటారనేది అక్కడి ప్రజల విశ్వాసం. ఇది కూడా గాలిని శుద్ధిచేసి పరోక్షంగా ఆరోగ్యాన్నిస్తుంది.



మల్లెపువ్వు: ఇది ఎందరో కవులకు కవితా వస్తువు. దీని తెల్లదనాన్ని వెన్నెల చల్లదనంతో పోల్చుతారు. అందం, ఆహ్లాదానికి మల్లె పెట్టింది పేరు. అంతేకాదు ఇవి కామోద్దీపన చేయగలవు. శృంగారాన్ని సజీవంగా ఉంచడంలో మల్లెలు సహాయపడతాయి.




తులసి: ఇది హిందువులకు మతపరమైన, పౌరాణిక పరమైన ప్రాముఖ్యత కలిగిన మొక్క. ఈ మొక్క ఇంటిలో ఉంటే గృహంలోని ప్రతికూల శక్తులను పారద్రోలుతుం దంటారు.అదృష్టం కలిసి వస్తుందనే నమ్మకమూ ఉంది. తులసిని దైవంగా భావించి పూజించడం తెలిసిందే! అదృష్టం, పవిత్రతలాంటి నమ్మకాల మాట ఎలా ఉన్న తులసి ఔషధగుణాలు పుష్కలంగా ఉన్న మొక్క. ఆయుర్వేద వైద్యంలో దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

✻ రంగవల్లిక ✻

21చుక్కలు
21 వచ్చే వరకు




ఆనెం అశ్విని
పెద్దాపురం,తూర్పుగోదావరి జిల్లా



20చుక్కలు
20 వరుసలు



-జాస్తి. భాగ్యలక్ష్మి శేషగిరిరావు
జయపురం,కృష్ణా జిల్లా



15చుక్కలు
15 వరుసలు

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ,
8-2-293/82/ఎ/75, ఫ్లాట్
నెం:75, రోడ్ నెం:9,
జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

ఆంతరిక ప్రశాంతతతో ఆత్మవిశ్వాసం

ఎంతటి వారికైనా వారి అన్ని కోరికలు నెరవేరవు. నెరవేరని వాటి గురించి బాధపడడమెందుకు? కష్టాల భారాన్ని మోయడం ఎందుకు? రామకృష్ణ పరమహంస ఇలాంటి సందర్భాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక చక్కని ఉదాహరణ చెప్పారు. 'కష్టాలనే కొలిమిలో మానవుడు అనేకమార్లు తపించి, లోకులు పెట్టే బాధలనే సమ్మెట దెబ్బలను బాగా తిని పవిత్రుడైతేనే గాని దైవదర్శనాన్ని పొందడానికి అర్హుడు కాదు'

ఉత్సాహంతో పరిశ్రమించే మానవులకు ఏదీ అసాధ్యం కాదు. లక్ష్యసాధనకు చేసే సర్వయత్నాలూ ఫలిస్తాయి. కట్టెలకు రాపిడి కలిగిస్తే అగ్నిపుడుతుంది. కష్టించి తవ్వితేనే భూమి జలాన్ని ఇస్తుంది. ఇది ఒక శ్లోక అర్థం. హితవచనం.

ఉత్సాహంతో పని చేసినందునే మంచి ప్రయోజనాలుంటాయి. కష్టేఫలి అన్న సామెత ఉంది. అయితే కష్టాల్లో ఉండేవాడికి దుఃఖమే కాని సంతోషం ఎక్కడిది? తన కష్టనష్టాలను తలచుకుంటూ మరిన్ని కష్టాలను కొని తెచ్చుకుంటాడు. అలాంటి వారిలో ఆత్మన్యూనతాభావం వస్తుంది. 'నేను అసమర్థుడిని' అని మాటిమాటికి తలపోసుకుంటాడు. మరి సుఖం ఎక్కడిది?

మనస్సులో బాధ ఉన్న వ్యక్తి విషాన్ని విరజిమ్ముతాడు. ఎగసిపడుతున్న మంటల నుంచి వచ్చే గాలి వేడిగానే ఉంటుంది. కాబట్టి మానసికంగా బాధపడుతున్న వ్యక్తికి మొదట అతని అంతరంగంలో ఉపశమనం కలుగజేయాలి. అప్పుడే అతని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. దానితో ఉత్సాహం వస్తుంది. ఆంతరిక ప్రశాంతత ముఖ్యం.

'మనకే ఎందుకు బాధలు కలుగుతున్నాయి. మనమే ఈ కష్టాలతో ఎందుకు బాధపడాలి' అని మనల్ని మనమే ప్రశ్నించుకోవాలి. ఇతరులతో పోట్లాడాలని, వస్తువులను పాడుచేయాలని, చిన్న చిన్న విషయాలకు రాద్ధాంతం చేయాలని ఎందుకనిపిస్తుంది? తీరని కోరికల వల్ల ఇలా జరగొచ్చు. అందువల్ల ఆ విషయం గురించి ఆలోచించాలి. ఆ ఆలోచన తీవ్రమైన పుండును శుభ్రపరచడంలాంటిది. అటువంటి పుండు విషయంలో వైద్యుడు దానిని కత్తితో కోసి లోపలి చెడు పదార్థాన్ని బయటకు లాగి, మందువేసి కట్టుకడతాడు. అప్పుడు కాని ఆ పుండు మానదు. అదే విధంగా బాధలు కూడా మానేలా చేయాలి. కొన్ని కఠిన సత్యాలను అంగీకరించాలి. ఎంతటి వారికైనా వారి అన్ని కోరికలు నెరవేరవు. నెరవేరని వాటి గురించి బాధపడడమెందుకు ? కష్టాల భారాన్ని మోయడం ఎందుకు?

రామకృష్ణ పరమహంస ఇలాంటి సందర్భాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక చక్కని ఉదాహరణ చెప్పారు. 'కష్టాలనే కొలిమిలో మానవుడు అనేక మార్లు తపించి, లోకులు పెట్టే బాధలనే సమ్మెట దెబ్బలను బాగా తిని పవిత్రుడైతేనే గాని దైవ దర్శనాన్ని పొందడానికి అర్హుడు కాదు'. ఇక్కడ దైవ దర్శనానికి మారుగా సుఖం లేదా సంతోషం అనుకోండి. కష్టాలు మానవులకు కాక మానులకు వస్తాయా? తల్లి గర్భం నుంచి బయటపడిన శిశువు ముందుగా ఏడుస్తుంది. ఆ తర్వాత జీవితంలో ఏడ్చే సందర్భాలు చాలా వస్తాయి. ఒక్కొక్కప్పుడు ఏకాంతంలోనో, అయిన వారి దగ్గరో బిగ్గరగా ఏడుస్తారు. కొన్ని సార్లు ఏడవలేక లోలోనే కుమిలిపోతారు. ఇక్కడ మానవుడిగా మనం అంగీకరించవలసింది ఒకటుంది. సూర్యోదయం కాగానే చీకట్లు మాయమవుతాయి. సూర్యాస్తమయంతో చీకటి ప్రవేశిస్తుంది. ఆ చీకటి ఎంతసేపు ఉంటుంది. అలాగే కష్టాలు కలకాలం కాపురం ఉండవు. సుఖం అనేది నిశ్చయంగా వస్తుంది. ఇది ప్రకృతి నియమం. బాధలలో ఉన్నవారిని మరింత బాధపెట్టేవారు ఉంటారు. ఎవరి వరకో ఎందుకు మన అపవిత్రమైన మనస్సు కూడా అలాంటిదే. సుఖ దుఃఖాలు ఎడ మొఖం పెడ మొఖం పెడతాయి. ఒకదానికొకటి బద్ధ శత్రువులు. ఒకదాని ఉనికి వేరొకటి చూడలేదు. అయితే కష్టాలలో ఉన్నవారు వాటిని తలచుకుని బాధపడక ఆత్మవిశ్వాసంతో ఉంటే ఆ కష్టాలనే చీకట్లు తొలగి సుఖాలనే వెలుతురు వస్తుంది.



ఒక వ్యక్తి రోజూ గుడికి వెళ్ళేవాడు. కాని భగవద్దర్శనం చేసుకోకుండా ఆ గుడి మెట్ల మీద కొంతసేపు కూచుని, లేచి ఉత్సాహంతో ఇంటికి వెళ్లిపోయేవాడు. అలాగతను చాలా రోజుల నుంచి చేస్తూ ఉంటే చూసిన పూజారి విస్తుపోయేవాడు. ఎవరైనా గుడికి వచ్చేది దైవదర్శనం చేసుకునేందుకు తన కష్టాలు తొలగించమనో, కోరికలను తీర్చమని అడగడానికో అవుతుంది. ఇతడలా చేయటంలేదెందుకని అనుకునేవాడు. ఉండబట్టలేక ఒకరోజు పూజారి అతనిని సమీపించి, 'అయ్యా మీరు రోజూ ఈ వేళకు క్రమం తప్పకుండా గుడికి వస్తారు. వచ్చినపుడు మీలో దిగులు, దుఃఖం నేను చూస్తున్నాను. కొంతసేపు ఆ మెట్ల మీద కూర్చుని దర్శనం చేసుకోకుండానే, మీ బాధలు చెప్పుకోకుండానే వెళ్ళిపోతున్నారు. ఆయన అనుగ్రహం పొందాలని మీకు లేదా? అని ప్రశ్నించాడు. దానికి ఆ వ్యక్తి, 'మీకు ఈ సందేహం రావడం సహజమే. నేను కష్టాలతో పోరాడుతున్నాను. ఆ కష్టాలను అధిగమించిన రోజున నేను దేవునికి కృతజ్ఞతలు చెప్పడానికి గుడిలోనికి వస్తాను' అని జవాబు చెప్పి తన వేళ అయిపోగానే ఉత్సాహంగా వెళ్ళిపోయాడు. అతను పిచ్చివాడని మొదట పూజారి అనుకున్నాడు. తర్వాత అతని అంతరంగాన్ని అర్థం చేసుకున్నాడు. అతనిలో ఆత్మ విశ్వాసం పుష్కలంగా ఉందని గ్రహించాడు.


కష్టాలను ఎదిరించకుండానే సుఖాలను పొందలేము. కష్టాల దారిగుండా వెళితేనే సుఖాల భవంతి తలుపు తట్టగలం. అయితే ఈ సత్యాన్ని చాలా మంది నమ్మరు. ఆ కారణంగా ఎవరి మీదనో ద్వేషం పెంచుకుంటారు. ఆత్మ విశ్వాసం ఉన్న వ్యక్తి తన కష్టాలకు వేరొకడిని బాధ్యుడిని చేయడు. ఎప్పుడైతే మనం అసహాయులమని అనుకుం టామో అప్పుడే ఎవరి సహాయమైనా అర్థిస్తాం. చివరకు దేవుడు కూడా గుర్తొస్తాడు. దేవుడున్నాడనే ధైర్యం కొంత మందికి ఆలంబనగా పని చేస్తుంది. అయితే ఆత్మ విశ్వాసం ఉన్నవారు తమ అపవిత్ర మనస్సుకు తామే ప్రశాంతత అనే ఔషధంతో చికిత్స చేసుకుంటారు. కష్టాలే లేకుంటే మనకు ముందుకు (పురోభివృద్ధి సాధించే) మార్గం అయోమయమవుతుంది. దారిని వెతకడంలో మనం నిష్ఫలమవుతాం. అయితే రాబర్ట్ హెచ్ శూలర్ ఇంకా ముందుకు వెళ్లి ఇలాగన్నాడు. 'ఇబ్బందుల వల్ల ఎప్పుడూ ఓడిపోతారు. కాని వాటితో పోరాడితే, ఆ పోరాటం మనం నిలబడడానికి దోహదం చేస్తుంది, అందుకు ఆత్మ విశ్వాసమనేది ముఖ్యం'.

- గుమ్మా ప్రసాదరావు
భిలాయ్ నుంచి
09755110398

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

గురుస్వరూపం



శ్రీ రమణాశ్రమం

26-2-47

ఈ మధ్యాహ్నం తమిళ్ యువకుడొకడు భగవాన్ సోఫాకు సమీపంగా జరిగి కూర్చుని, ''స్వామీ! నిన్న ఉదయం ఆ గుజరాతీ యువతికి త్యాగమంటే అంతరత్యాగమని సెలవిచ్చారే? అది ఏ విధంగా లభ్యమౌతుంది? అసలు అంతరత్యాగమంటే ఏమిటి?'' అని ప్రశ్నించాడు.

''అంతరత్యాగమంటే వాసనలన్నీ అణగిపోవాలి. 'అది ఏవిధంగా లభ్యమౌతుంది' అంటే, సాధన వల్ల లభ్యమౌతుంది'' అన్నారు భగవాన్. ''సాధనకు గురువు కావాలి గదా?'' ''అవును కావాలి'' అన్నారు భగవాన్. ''సద్గురువును ఏవిధంగా నిర్ణయించుకోవాలి? గురుస్వరూపం ఎటువంటిది?'' అన్నాడా పృచ్ఛకుడు. 'ఎవనియందు నీ మనస్సు లగ్నమౌతుందో, వాడే గురువు'. 'సద్గురువు ఇతడని నిర్ణయించటం ఎట్లా? వారి స్వరూపం ఎటువంటిది?' అంటే శాంత శమదమాదులతో కూడి, సూదంటు రాయి వలె దృష్టిచేతనే ఆకర్షింపగల శక్తి సంపన్నత, సమత్వం ఎవరి యందు స్థిరంగా ఉంటవో వారే గురుస్వరూపులు. గురుస్వరూపం తెలుసుకోవాలంటే, తన స్వరూపమేదో తెలుసుకోవాలి ముందు. తన స్వరూపమేదో తెలియనప్పుడు, గురుస్వరూపమే విధంగా తెలుస్తుంది? గురుస్వరూపం చూడాలంటే, లోకాన్నంతా గురురూపంగా చూడాలి. ప్రతి జీవియందూ గురుభావాన్నే ఉంచాలి. ఈశ్వరునైనా అంతే. అన్నిటినీ ఈశ్వర రూపంగా చూడాలి. తానెవరో తెలియనివాడు ఈశ్వరరూపంగాని, గురురూపం గాని ఎట్లా చూడగలడు? ఎట్లా నిర్ణయించగలడు? అందువల్ల, ముందు, నీ యథార్థ స్వరూపమేదో తెలుసుకో'' అన్నారు భగవాన్.

''అది తెలుసుకునేందుకు మాత్రం గురువు కావద్దా?'' అన్నాడా యువకుడు. ''అది నిజమే. లోకంలో, ఎందరో మహనీయులున్నారు. నీ మనస్సు ఎవరి యందు లగ్నమౌతుందో, వారిని గురువుగా నమ్ముకో, గురియే గదా గురువు?'' అన్నారు భగవాన్. ఆ యువకుడంతటితో తృప్తిచెందక, సమకాలికులగు పెద్దల పేర్లు కొన్ని ఏకరువు పెట్టి, ''వారికీ లోపం ఉంది, వారే విధంగా గురువులౌతారు? వీరేవిధంగా గురువు కాగలరు?''అని ఆక్షేపించుట కారంభించాడు.

భగవాన్ తమ్మెవ్వరెంత నిందించినా సహిస్తారుగాని, ఇతరులను నిందిస్తే రవంతైనా సహించలేరు. ఆవేశస్వరంతో ''ఓహో, నిన్ను నీవు తెలుసుకోమంటే వినక వారికా లోపం, వీరికీ లోపం అని నిందించటం సాగించావా? నీ లోపం నీవు దిద్దుకుంటే చాలును. వారి లోపాలు వారు చూచుకోగలరు. ఇకముందు నీ సర్టిఫికెట్ తీసుకొననిది మోక్షం పొందరాదన్నమాట. పాపం. నీ సర్టిఫికెట్ కొరకే వారంతా ఎదురుచూస్తున్నారు. మహాగొప్పవాడవు. నీవు మెచ్చుకోకుంటే, వారికి గతి ఉన్నదా మరి? ఇక్కడ వారిని నిందించావు. మరొక చోట మమ్ము నిందిస్తావు. నీవన్నీ తెలిసినవాడవు. మేము ఏమీ తెలియనివారము. నీకు అణగి ఉండవలసిందే. ఉంటాము. 'రమణాశ్రమానికి వెళ్లాను. ఆయన్ను ప్రశ్నించాను. ఏమీ చెప్పలేకపోయినాడు, ఆయనకేమీ తెలియదు''అని ప్రకటించు బాబూ'' అన్నారు భగవాన్.

ఆ యువకుడు తిరిగి అదే ధోరణితో మాటాడబోతే, ఒక భక్తుడు వారించాడు. భగవానది చూచి ''ఉండండయ్యా, మీరు. ఎవరూ మాట్లాడకండి. వారి చిత్తమొచ్చినంతసేపు మాట్లాడనీయండి. వారు తెలిసినవారు. మనమంతా వారికి తగ్గి ఉండాలి. చూస్తూనే ఉన్నా, వచ్చినప్పటి నుంచీ, ఇదంతా మూటకట్టుకొని, మూలకూర్చున్నారు. రోజుకు రోజు కాస్త, కాస్త జరిగి దగ్గర కొచ్చారు. నిన్న ఆమె ప్రశ్నించింది చూచి, నేనూ ఒకణ్ణున్నానని మూట విప్పారు' అన్నారు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

అవతార ప్రయోజనాలెన్నెన్నో!



(గత సంచిక తరువాయి)

హరిమయము విశ్వమంతయు
హరివిశ్వమయుడు సంశయము పని లేదా
హరిమయము గాని ద్రవ్యము
పరమాణువు లేదు ...

విష్ణువు ధర్మపక్షపాతి, వేదం ధర్మం ఎక్కడ ఉంటే అక్కడే ఉంటాడు. హిరణ్యకశిపుని సంహారానికి కారణభూతం కావాలి. ఆ కారణం ఎవరు..?విష్ణుభక్తులలో అగ్రగణ్యుడు ప్రహ్లాదుడు. ఆ ప్రహ్లాదుని ద్వారా విష్ణుతత్వాన్ని హిరణ్యకశిపునికి తెలియజేస్తూ అతడు శత్రుత్వంతో నిరంతర నామస్మరణ చేసేలా చేసి అతనికి మోక్షం ఇవ్వటం గొప్ప లక్షణం.

''శంభుండో హరియో పయోజభవుడో చండాంశుండో వహ్నియో''....అన్నపద్యం తెలుగు సారస్వత వాఙ్మయంలో చిరకీర్తి పొందిన పోతన భాగవతం లోనిది. దీనిలో వామనావతార లక్షణం చెబుతారు. బలి చక్రవర్తికి మోక్షాన్ని కలిగించడానికి స్వయంగా అదితి కశ్యపుల సంతానంగా జన్మించి వటువుగా దానాన్ని కోరి బలిచెంతకు చేరి మూడు అడుగుల నేలను దానంగా కోరి పాతాళానికి బలిని ప్రభువుగా చేసిన ధర్మాశ్రయ ధీరుడు శ్రీ మహావిష్ణువు.

క్షత్రియాంశ లక్షణాలైన క్రోధ మద మత్సరాలతో బ్రాహ్మణ సంజాతునిగా జన్మించి తన తండ్రిని అవమానించిన క్షత్రియ కులాన్ని సమూలంగా నాశనం చేయడానికి 21 మార్లు దండయాత్ర చేసిన పరుశురాముడు భూ భారాన్ని తగ్గించటమనే ఆంతర్యాన్ని కలిగి ఉద్భవించినవాడు. జమదగ్ని ఆజ్ఞతో తన కన్న తల్లిని తెగ నరికిన పితృవాక్య పరిపాలకుడు ఆయన. అయితే క్రోధాగ్నిని సంయమించలేక శ్రీ రాముడితో వైరం బూని సీతారామ కళ్యాణ సందర్భంగా రాముని వద్దకు వెళ్ళి, తన శక్తిని కళ్యాణ రాముడికి అప్పగించి అవతార పరిసమాప్తి చేసినవాడు పరశురాముడు.

''కౌసల్యా సుప్రజారామ పూర్వా సంధ్యా ప్రవర్తతే!
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్!!

సర్వావస్థలయందు, సర్వకాలాలయందు కీర్తింపబడుతున్న శ్రీరామ అవతారం విన్నా, కన్నా ముక్తిదాయకం. అంతర్లీనంగా రావణాసుర వధ కోసం అన్నట్లుగా ఉన్నా ఒక వ్యక్తి జీవించవల్సిన విధానం, రుజువర్తనం, ధర్మపరాయణత్వం, ఎటువంటి పరిస్థితిలోనైనా సడలని మనో నిబ్బరం, ధర్మం కోసం తన బహిః ప్రాణమైన సీతాదేవిని కూడా పరిత్యజించి ప్రజల కోసం ఏదైనా చేసే రాజర్షిగా నిలబడటం మనం నేర్చుకోవల్సిన అంశాలు. ధర్మాన్ని తన ఆత్మగా చేసుకుని ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమైన రాముడు, రామతత్త్వం అందరికీ శిరోధార్యం.





సమస్త భూ మండలం పాపాత్ములతో, వంచితులతో, అధర్మవర్తనులతో నిండిపోయి భూదేవి ఆ భారాన్ని మోయలేక క్రుంగిపోతున్న సమయంలో తన బుద్ధి కుశలతతో 18 అక్షౌహిణుల సైన్యాన్ని భారత యుద్ధం ద్వారా మట్టుపెట్టించి భూ భారాన్ని తగ్గించిన అవతారమూర్తి శ్రీకృష్ణుడు. ఆ అవతార లక్ష్యం కూడా అదే.

''యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత'' అంటూ ఆపత్కాలంలో భూమి మీద ధర్మం తప్పినపుడు ప్రతి యుగంలో తాను అవతరిస్తానని భగవద్గీతలో చాటిన గీతాకారుడు ప్రతి దశలో తాను నిర్మించిన నిర్మాణాన్ని తానే ఇతరులచేత కూల్చి వేయించాడు. హరిః కర్తా. అన్నీ చేసేవాడు ఆయనే. నిర్మాత ఆయనే, కూల్చివేయించేవాడు ఆయనే. శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేసేందుకు అవతరించిన అవతారం శ్రీ కృష్ణుడు.

ఇలాగే దశావతారాలకు అంతరార్థాలు కనిపిస్తాయి వాటి ద్వారా మనం తెలుసుకోవల్సిన ధర్మం శ్రీ మహావిష్ణువు సర్వాంతర్యామి, హరి ఒక్కడే పాలకుడు అనే విషయం.

శుభం భూయాత్

- అట్లూరి వెంకటరమణ
9177237945

భగవద్గీత

సర్వానికి మూలం, ప్రళయం పరమాత్మే



అధ్యాయం 7

శ్లోకం 6 :

ఏతద్యోనీని భూతాని
సర్వాణీత్యుపధారయ।
అహం కృత్స్నస్య జగతః
ప్రభవః ప్రళయస్తథా ॥

తాత్పర్యం

సృజింపబడిన సర్వజీవులకు ఈ రెండు ప్రకృతులే కారణములై ఉన్నాయి. ఈ జగత్తులో భౌతికము, అధ్యాత్మికము అయిన సర్వానికి మూలము, ప్రళయము నేనే యని నిశ్చయముగా నెరుగుము

భాష్యం

ఈ ప్రపంచంలో మనం చూసేదంతా జీవము, భౌతిక పదార్థాలతోనే కూడి ఉంటుంది. సృష్టికి జీవుడు కారణం కాగా, భౌతిక పదార్థములు జీవుని వలన సృష్టించబడినవి. కొందరు భౌతిక మూలకములు వృద్ధి చెంది జీవమునకు కారణమైనవని తప్పుగా వాదిస్తారు. కానీ మనం అనుదినం జీవము ఉండుటవలన వ్యక్తి బాలునిగా తర్వాత యవ్వనునిగా వృద్ధి చెందుటను చూస్తూ ఉంటాము. ఇలా భగవంతునిలో ఒక శక్తియైన జీవుడు ఒక గొప్ప నగరాన్నో, వంద అంతస్తుల భవనాన్నో సృష్టించగలడేమో గాని ఒక విశ్వాన్ని సృష్టించలేడు.

శ్రీకృష్ణుని విస్తార రూపమైన పరమాత్మ మాత్రమే దానిని చేయగలడు. ఈవిధముగా జీవుడైన చిన్న ఆత్మకు, పరమాత్మకూ మూలమైన శ్రీకృష్ణుడే సర్వానికి మూలమని ఉపనిషత్తులు సైతం కొనియాడుతున్నాయి.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

android | Google play | iOS | iTunes

దినఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభపరిణామాలు చోటు చేసుకొంటాయి.ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభరాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగిస్తాయి. స్థిరాస్తి విషయాలు అనుకూలం. మానసిక ధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగుతారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ఆశించిన ఫలితాలు పొందగలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు ఉపకరిస్తాయి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. శ్రమ పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు/ లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవిచూస్తారు.

కుంభరాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విదేశీ ప్రయాణాలు కలసివస్తాయి. శుభవార్తలు వింటారు. అవకాశాలను సద్వినియోగ పరచుకోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



సుమతి శతకము

లావుగల వాని కంటెను
భావింపగ నీతిపరుడు బలవంతుడౌ
గ్రావంబంత గజంబును
మావటివాడెక్కినట్లు మహిలో సుమతీ

తాత్పర్యం: కొండంత ఏనుగు కంటే దానిని తెలివితేటలతో వశం చేసుకుని దానిపై ఎక్కి తిరుగువాడు బలవంతుడు కదా. అలాగే శరీరము కలవాడి కంటే నైతికబలము కలవాడు బలవంతుడు.

బాలప్రభ

పొడుపు కథ

పచ్చని పాముకు
తెల్లని చారలు

వినయం



కథ

సుధాముడికి లేకలేక కలిగిన సంతానం ప్రథముడు. అతిగారాభం వల్ల తలపొగరు ఎక్కువైంది. దానివల్ల పెద్ద, చిన్న అన్న మర్యాదలేకుండా చాలా నిర్లక్ష్యంగా ప్రవర్తించడం, మాట్లాడటం అలవాటైంది. ఆ అలవాటును గద్దించి మానిపించాల్సిందిపోయి అది పిల్లవాడి ముద్దుల చిలిపి చేష్టగా నలుగురితో చెప్పి మురిసిపోయేవాళ్లు సుధాముడు, అతని భార్య.

అది చూసి మరింతగా రెచ్చిపోతూ అల్లరి ఎక్కువ చేయసాగాడు ప్రథముడు. చదువు నేర్పించడానికి బడికి పంపితే గురువులను, తోటి విద్యార్థులను కూడా అగౌరవ పరుస్తూ ఆనందించేవాడు. వాళ్లు అతని తల్లిదండ్రులకు చెప్పి చూసి ప్రయోజనం లేదని తెలుసుకున్నారు.

ఇలా వుండగా ఆ బడికి కొత్తగా వచ్చిన పంతులమ్మ వేదవతికి క్లాసుకి రాకముందే అతని గురించి తెలియవచ్చింది. అందువల్ల ఆమె మొదటినుంచి అతన్ని పట్టించుకోవడం మానేసింది. ఒక రోజు తరగతిలో గణితం నేర్పుతుండగా కొందరు పిల్లలు సందేహాలు అడుగుతుంటే తీర్చుతోంది. ఇంతలో ప్రథముడు కూడా తన సందేహం అడిగాడు. ఆమె అతని మాటలు వినిపించుకోలేదు. అలాగే, మరొకసారి పిల్లలందిరికీ తన పుట్టిన రోజని చాక్లెట్లు పంచి ప్రథముడికి ఇవ్వలేదు.

అప్పుడు చాలా కోపం వచ్చిన ప్రథముడు హెడ్ మాస్టర్ దగ్గరికెళ్లి టీచర్ తనతో పక్షపాతంగా వ్యవహరిస్తోందంటూ ఫిర్యాదు చేశాడు.

ఆయన వేదవతిని పిలిచి "పిల్లలందరినీ ఒకటిగా చూడాలి కాని, వారిని బాధపెట్టేలా నడుచుకోకూడదు" అన్నాడు.

గురువు విద్యార్థిని పట్టించుకోకపోవడాన్ని చిన్నతనంగా భావించిన ఇతడు పెద్దలను,గురువులను వినయ విధేయతలతో కాకుండా పొగరుగా పెడసరంగా మాట్లాడి తన తల్లిదండ్రుల గారాబంతో రెచ్చిపోవటం మాత్రం మంచిదా? వినయవిధేయతలు లేని విద్యార్థుల పట్ల నేను ఇలాగే ప్రవర్తిస్తాను. వీలు కాదంటే నేను బడినుంచీ వెళ్లిపోతా" అంది.

విషయం తెలుసుకున్న తోటి గురువులు, మిగిలిన పిల్లలంతా కూడా కలిసికట్టుగా వచ్చి "వేదవతిగారు ఇక్కడే ఉండాలి. కావాలంటే ప్రథముడిని బడికి రానివ్వకుండా పంపేయండి. పొగరుమోతు, మాకెవ్వరికీ నచ్చని వాడు అంటూ హెడ్ మాస్టర్ ప్రాధేయపడ్డారు. అది చూసి తోటి పిల్లలు, గురువులందరు తనను ఎంతగా వద్దనుకుంటున్నారో తెలిసివచ్చి అవమాన భారంతో తలదించుకున్న ప్రథముడు "నేనే రేపటి నుండి బడి మానేస్తాను మీరు ఇక్కడే వుండండి టీచర్. నన్ను క్షమించండి" అని చెప్పాడు. అలా ఏమి కాదు నీవు కూడా బడి మానకుండా రావాలి. కానీ పొగరుమోతులా కాకుండా పెద్దలను వినయంతో చూడాలి. తోటిపిల్లలను స్నేహంతో చూసేవాడిగా ఉండాలి. నీ ప్రవర్తనను ఒక విధంగా సమర్ధించి పెంచిన నీ తల్లిదండ్రులదే అసలు తప్పు. కాబట్టి ఇకపైనా అందరితో సఖ్యంగా వుండు. అందరి అభిమానాన్ని పొంది మంచిపేరు తెచ్చుకో" అంది వేదవతి.

ఆ మాటలతో మిగిలిన టీచర్లు, పిల్లలు కూడా అవును అతని పొగరు మాటలు, అల్లరి తప్ప అతనంటే మాకే ద్వేషం లేదు అన్నారు. అప్పటి నుంచి మంచి నడవడితో పెద్దలను గౌరవిస్తూ వేదవతి నుంచే కాకుండా అందరి మన్ననలూ పొందాడు.

-డేగల అనితాసూరి



హాయ్ ఫ్రెండ్స్! ఎలా ఉన్నారు. మళ్లీ మీకు సంక్రాంతి సెలవులు దగ్గరపడుతున్నాయి. ఏం చేద్దామనుకుంటున్నారు. అందమైన ప్రాంతాలకు వెళ్లడానికి ప్రణాళిక సిద్ధం చేసుకోండి. నేను మీకు న్యూజిలాండ్‌లోని కొన్ని ప్రదేశాలు పరిచయంచేద్దామని అనుకుంటున్నాను. అందుకు ముందు మాటగా మీకు ప్రకృతికి సుబంధించిన అంశాలను చెబుతాను. కేవలం ప్రకృతిని చూసి ఆనందించడానికి ఇక్కడికి పర్యాటకులు వస్తుంటారు. భారతదేశంలో కేరళకు, ఊటికి ఎలా వెళుతుంటారో అదేవిధంగా ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన వారు ప్రకృతి అందాలను చూడటానికి, ఆస్వాదించడానికి, అనుభవించడానికి ఇక్కడికి వస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఇక్కడి

అందమైన ప్రకృతి

ప్రభుత్వం అందుకు అనుగుణంగా సౌకర్యాలను కల్పిస్తుంది. ఎక్కడికి వెళ్లినా రైళ్లు, విమానాలు, బస్సుల సౌకర్యం ఉన్నా.. ఎక్కువశాతం తమ సొంత కార్లపైనే వెళుతుంటారు. ఇక్కడ ఉద్యోగులందరికీ శని, ఆదివారాలు సెలవు. అందులోనూ డిసెంబర్, జనవరి మాసంలో చాలా సెలవులుంటాయి. ఎందుకంటే ఇక్కడ ఈ సమయంలో వేసవికాలం ఉంటుంది. మనకు మే నెలలో సెలవులు ఉంటాయి కదా.. అదే విధంగా ఇక్కడ ఇప్పుడు సెలవులు, క్రిస్మస్, జనవరి ఒకటో తేదీ కూడా వీరికి పెద్ద పండుగలు... సరే ఈ రోజుల్లో దూరప్రాంతాలకు లాంగ్ డ్రైవ్ పేరుతో ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో మేము ఈ మధ్య ఇటీవల మూడు రోజులపాటు మేం ఉన్న ఆక్లాండ్ నుంచి ఐదు వందల కిలో మీటర్ల దూరం మూడు కార్లలో వెళ్లాం.

ఆ అందమైన ప్రకృతిలో వెళుతుంటే ఎంతో అందమైన అనుభూతి... రోడ్డుకు రెండువైపులా కొండలు.. కనీసం ఒక్క గజం కూడా ఖాళీ లేకుండా పచ్చని తివాచీ వేసినట్టు గడ్డి.. ఆకాశాన్ని అందుకునేలా పోటీ పడుతున్నట్టు నిటారుగా ఉండే చెట్లు అన్నీ ఒకే ఎత్తులో అటు ఇటు సైనికులు కాపలా కాస్తున్నట్టు ఉంటాయి. ఇక కొండల నిండా చెట్లే.. ఎంత అందంగా ఉంటాయో ప్రతి కార్లు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించాలి. తక్కువ వేగం ఉంటే వెనుక వాహనం ఢీకొంటుంది. అంతకంటే వేగం పెంచితే పోలీసులకు నియంత్రణ ఉంటుంది. అంటే నిరంతరం మనపై ఒక నిఘా ఉంటుంది. ఐదు వందల కిలోమీటర్ల దూరాన్ని ఖచ్చితంగా ఐదుగంటల్లో చేరుకుంటాం. మనకు మధ్యలో సేదతీరడానికి కూడా ఏర్పాట్లు ఉంటాయి. మనం రోడ్డుపై వెళుతుంటే ఎక్కడ కావాలంటే అక్కడ కారు నిలుపుకునే అవకాశం ఉండదు. మనం కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా ప్రత్యేకమైన సౌకర్యాలు ఉంటాయి. అక్కడికి వెళ్ళాలి. ఇలాంటి ప్రదేశాలు మనకు ఎంత దూరంలో ఉంటాయో రోడ్డుపై సూచనలతో కూడిన బోర్డులుంటాయి. ఎంత వర్షం కురిసినా రోడ్డుపై ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఏ గ్రామం పల్లెటూరిలా ఉండదు. అన్ని ఒకే మోస్తారుగా ఉంటాయి. మరో విశేషం ఏమంటే మనం వెళ్లేదారిలో కొండలపై, మైదానాల నిండా గొర్రెలు, ఆవులు మందంగా మందలుగా కనిపిస్తుంటాయి. ఎందుకంటే ఇక్కడ పాడిపరిశ్రమ ఎక్కువ. రెండు మూడు కిలోమీటర్లకు ఒక ఇల్లు.. వారికి వందల ఎకరాలస్థలం. అందులో పశుసంపద. ఫలితంగా ప్రశాంతమైనజీవనం.. ఏ కోరికలు వారికి వెంటాడవు. పిల్లలు, పెద్దల ముఖాల్లో ఆనందం తొణికిసలాడుతుంది. అందరూ ఆరోగ్యంగా ఉంటారు. అందుకోసం మన మంతా ప్రకృతిని ప్రేమించాలి. దానితో ఆనందించాలి. మీరంతా మొక్కలను నాటడమే కాదు వాటి పెంపకంలో కూడా శ్రద్ధ చూపాలి. ప్రభుత్వాలకు కూడా ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలి. నిరంతరం వాటి సంరక్షణకు నడుం బిగించాలి. పిల్లల పాఠ్యాంశాల్లో కూడా తోటపని ఒక అంశంగా బోధించాలి. ఇక ఇక్కడి ప్రాంతాలను కొన్నింటిని కూడా మీకు పరిచయం చేస్తా.. సరేనా..

టి. వేదాంతసూరి



అంతరిక్షంలో మంట

మంట అనేది కెమికల్ రియాక్షన్. భూమి మీద మంట ఆకారం కన్నీటి చుక్క ఆకారంలో ఉంటుంది. కొవ్వొత్తు అయినా కావచ్చు మరేదైనా కావొచ్చు ఆకారంలో మాత్రం తేడాలేదు. భూమి గురుత్వాకర్షణ శక్తి వల్ల మంట ఆకారం ఈ విధంగా ఉయుంది. అదే అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి చాలా తక్కువగా ఉంటుంది. మంటలు మాత్రం గోళాకారంలో ఉంటాయి. గోపురం లేదా గుండ్రని ఆకారంలో కనిపిస్తుంది. అంతరిక్షంలో ఆక్సిజన్ కూడా తక్కువగా ఉంటుంది. కాబట్టి మంట తక్కువగా ఉంటుంది.

కాకమ్మ కథలు

పుస్తకాల తోట



ఏమర్రాపిల్లలు ఏమీ చేస్తున్నారు? శనివారం వచ్చే పుస్తకాలతోట కోసం ఎదురు చూస్తున్నాము అంటారా! ఔను మరి ఈ వారం మనం పుస్తకాలతోటలో ఒక చక్కని పుస్తకం గురించి తెలుసుకుందామె!

చెన్నయ్‌కి చెందిన బెల్లంకొండ నాగేశ్వరరావు తాతయ్య వ్రాసిన కాకమ్మ కథలు పుస్తకం గురించి తెలుసుకుందాం. దీనిలో మొత్తం 28 కథలున్నాయి. కథలన్నీ ఎక్కడో చదివినట్టుగా అనిపిస్తూనే కొత్తకొత్తగా భలే భలే సాగిపోతాయి.

ఒకప్పుడు చక్కని అందమైన రూపంతో వంపులేని ముక్కుతో అందంగాఉన్న కాకులు ఒక విపత్కర చర్యవల్ల వాటికి నేడున్న నల్లరంగు వచ్చింది. దానికిగల కారణం తెలుసుకోవాలంటే "కాకికి శాపం" కథ చదవాల్సిందే మరి! చేసిన తప్పు ఒప్పుకోవడం వల్ల కలిగే ప్రయోజనం పాశ్చాత్తాపంలోని పరమార్ధం వివరించే చక్కని కథ "పైవాడికి తెలియాలి" దొంగలో వచ్చిన మార్పు గురించి ఎంచక్కా చెబుతుంది ఈ కథ. మనిషికి పాండిత్యంతో పాటు ప్రాపంచిక జ్ఞానం కూడా అవసరం అని తెలిపిన కథ "జ్ఞానోదయం" కాగా విద్యార్థుల మానసిక స్థితిగతులకు అద్దంపట్టే రేపటి దీపాలు, మొక్కగా వంగనిది చిటారు కొమ్మన, శిష్యునితెలివి, జీవితపాఠం, మొదలైన కథలు ఇందులో ఉన్నాయి. అద్భుత రసాన్ని అందించడంతో పాటు చారిత్రక సామాజిక, విషయాలను పంచిపెట్టిన ఈ కథల సమాహారంలో మనం అర్ధం చేసుకునే తీరును బట్టి ప్రతి కథ ఒక అణిముత్యంలా అనిపిస్తుంది. ఈ చక్కని కథల పుస్తకం పేజీలు: 56 కాగా ధర 36/- రూపాయలు. చిరునామా: బెల్లంకొండ నాగేశ్వరరావు, సెల్: 9884429899, శైలి ప్రచురణలు, 7-52, మేడపైన, మండపాకరోడ్డు, పైడిమర్రు, తణుకు, ప.గో జిల్లా

ముువ్వన్నెల జెండా

పిల్లలూ! జనవరి 26 వతేదీన రిపబ్లిక్ డే జరుపుకుంటున్నాం. అలాగే స్వాతంత్ర్య దినం రోజున కూడా మన పాఠశాలల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు తెలుసు కదా! అప్పుడు మాత్రమే ఎందుకు ఎగరేస్తారు? అసలు దాని చరిత్ర ఏమిటి? తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే ఇది చదవండి. మన దేశ జాతీయ పతాకాన్ని ఆగస్టు 15న, జనవరి 26న మాత్రమే ఎగరవేస్తారు. కారణం ఒకటి మనకు స్వతంత్ర్యం వచ్చిన రోజు. రెండు గణతంత్ర దినోత్సవం అంటే రాజ్యాంగాన్ని ఆమోదించుకున్నర రోజు. కానీ జాతీయ పతాకాన్ని తయారు చేయడంలో ఎగరవేయడంలో సరైన పద్ధతులు, సంప్రదాయాలు పాటించాలని రాజ్యాంగం చెబుతోంది. మన జాతీయ పతాకంలో పైన కాషాయం, మధ్యలో తెలుపు, కింద ఆకుపచ్చ రంగులుంటాయి.

చాలా చిన్నగా ఉండే ప్లాస్టిక్ జెండాను ఇక మీదట తయారు చేయకూడదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



రంగులెందుకు....

కాషాయం: ధైర్యానికి, త్యాగనిరతికి సంకేతం. మన నాయకులు తమ సౌలభ్యాన్ని విడిచిపెట్టి తమ కర్తవ్యాన్ని అంకితం కావాలని ఈ రంగు సూచిస్తుంది.

తెలుపు: శాంతికి, సత్యానికి గుర్తు. మన ప్రవర్తనను నిర్దేశించే వెలుగు కూడా తెలుపే.

ఆకుపచ్చ: విశ్వాసం, పరక్రమానికి చిహ్నాం. అంతేకాదు, వ్యవసాయానికి, ఆకుపచ్చని చెట్లకు, సస్యశ్యామలానికి గుర్తు.

✶ ఈ త్రివర్ణపతాకంలో తెలుపు రంగు మధ్య భాగంలో ముదురు నీలం రంగులో అశోకధర్మ చక్రం ఉంటుంది. ఈ అశోక చక్రంలో 24 గీతలుంటాయి. ఈ చక్రం ప్రాచీన సంస్కృతికి, ప్రశాంతతకు, ధర్మానికి, త్యాగానికి, ప్రతీక.

✶ సూర్యోదయానంతరం మాత్రమే పతాకం ఎగరవేయాలి. అలాగే సూర్యాస్తమయం కాగానే జెండాను దించాలి. అంతేకాదు, జాతీయ జెండాను అలంకరణ కోసం వాడకూడదు. అలాగే జెండా ఎగురవేసేటప్పుడు ఎట్టిపరిస్థితుల్లో నేలను తాకకూడదు. పతాకంపై పతాక స్థంభంపైన ప్రకటనలు రాయకూడదు. అంటించకూడదు. ప్రముఖ నాయకులు, పెద్దలు మంరణించిన సమయాల్లో సంతాప సూచకంగా జాతీయ పతాకాన్ని కప్పుతారు.

✶ త్రివర్ణపతకాన్ని జులై 22, 1947లో జాతీయ పతాకంగా ఆమోదించారు. అధికారికంగా మన జాతీయ జెండాను 1947, ఆగస్టు 14 అర్ధరాత్రి పార్లమెంటుపై ఎగంరవేశారు. దీన్ని రూపొందించింది మన తెలుగువాడైన పింగళి వెంకయ్య. పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకంలో తెలుపురంగు లేదు. మహాత్మా గాంధీ తెలుపు రంగును చేర్చారు. అంతేకాదు, తెలుపు రంగు మధ్యలో చరఖా ఉండేది. తర్వాత దానిస్థానంలో అశోక ధర్మ చక్రాన్ని పెట్టారు.

బిర్యాని ఎలా వచ్చింది?



♦ పశ్చిమాసియాలోని సంచార జాతులు బియ్యం, మాంసం, మసాలాదినుసులు మట్టికుండల్లో నింపి, మట్టిల్లో పూడ్చి ఉడికించి ఆ తర్వాత దాన్ని రుచికరమైన వంటకంగా వెలుపలికి తీసేవాళ్లు! బిర్యాని ఆవిర్భావానికి సంబంధించిన అతి ప్రాచీనమైన ఆధారంగా దీనిని చెబుతారు.

♦ బిరియన్ అనే పర్షియన్ పదం నుంచే బిర్యాని అనేమాట ఏర్పడింది. బిరియన్ అంటే వండడానికి ముందు వేయించడం అని అర్థం. తైమూర్ లాంగ్ ఈ వంటకాన్ని 14 శతాబ్దంలో భారతదేశానికి తీసుకవచ్చినట్టు చెబుతారు.

♦ ఒకసారి సైనిక శిబిరానికి వెళ్లిన ముంతాజ్ మహల్ సైనికులు ఆహారలోపం వల్ల బకచిక్కి ఉండడం గమనించిందనీ, వాళ్లకోసం పరిపూర్ణమైన ఆహారంగా బిర్యాని తయారు చేయబడిందని చెబుతారు.

♦ నిజామ్ నవాబులకు రాజభోజనంగా బిర్యాని ఉండేదే తప్ప, దీన్నెప్పుడుగాని అతిథులకు వడ్డించేవారు కాదు.

♦ పంజాబ్ నవాబు బిర్యాని రకానికి మ్యాచ్ అయ్యే విధంగా రకరకాల రంగుల తలపాగాలు ధరించేవాడట. ఆయన వంటశాలలో దాదాపు 49 రకాల బిర్యానీలు తయారు చేసేవారట.

♦ నవాబుల కోశాధికారులుగా ఉద్యోగాలు చేసే హిందువుల కోసం తయారు చేసే శాకాహార బిర్యానిని 'టెహ్రీ బిర్యాని' అని చెప్పేవారు.

♦ ఔరంగజేబు దక్షిణాదిని ఆక్రమించుకున్నప్పుడు నిజామ్ ఉల్ ముల్క్‌ను హైదరాబాద్ గవర్నర్‌గా నియమించాడు. ఆ విధంగా బిర్యాని దక్షిణాదికి వచ్చింది. నిజాం వంటశాలలోనే రుచికరమైన హైదరాబాద్ బిర్యాని పుట్టింది.

- అసంఖ్యాకుల అభిమాన వంటకం హైదరాబాదీ బిర్యాని! హైదరాబాద్‌లోని వంటవాళ్లు సంప్రదాయంగా తయారు చేసే బిర్యానికి ప్రత్యేకమైన తమ చేతి నైపుణ్యంతో మరింత రుచిని సమకూర్చేవారు. కొనసాగే నాణ్యతను పరీక్షించడానికి దాన్ని నేలమీద చల్లి మరీ చూసేవారు!

♦ బ్రిటీష్ వాళ్లు నవాబ్ వజీద్ అలీషాను కొల్‌కతాకు పంపినప్పుడు, ఆయన వెంట వంటవాళ్ల బృందం వెళ్లింది. ఆ విధంగా బిర్యాని కూడా అక్కడికి చేరింది. త్వరలోనే సరికొత్త వంటకం కొలకతా బిర్యాని సుప్రసిద్ధమైపోయింది.

♦ కాలికట్ బిర్యాని అరేబియా సముద్రం మీదుగా అరేబియా వర్తకుల ద్వారా కేరళ తీరం చేరింది. హండీ అనే మట్టి పాత్రలో కొబ్బరి చిప్పల మంటల మీదుగా ఈ బిర్యాని వండుతారు.

పకపక



నాణెం అలాగే నిలబడితె




మొదటి విద్యార్థి: ఎక్కడికి వెళదాం? బీచ్‌కా? సినిమాకా?
రెండో విద్యార్థి: గ్రూప్ స్టడీకి వెళదాం. చదువు ముఖ్యంకదా?
మొదటి విద్యార్థి: అలాగా! సరే, ఇలా చేద్దాం మరి. నాణెం టాస్ వేసి చూద్దాం. బొమ్మ పడితే బీచ్, బొరుసైతే సినిమా. నాణెం అలాగే నిలబడితే గ్రూప్ స్టడీకి వెళదాం!



నమ్మకం

రోగి: నాకు సుస్తీ చేసినప్పుడల్లా మీ దగ్గరికే వస్తాను డాక్టర్.
డాక్టర్: చాలా సంతోషం. నా మీద అంత నమ్మకం అన్నమాట!
రోగి: మీకున్న ఒకే ఒక రోగిని చంపరన్న గట్టినమ్మకం!

ఇంటిదగ్గర



టీచర్: నేను నీకు రెండు కుక్కలు, మరి రెండు కుక్కలు ఇచ్చాననుకో. నీ దగ్గర మొత్తం ఎన్ని కుక్కలు ఉంటాయి?
సంతోష్: ఏడు.
టీచర్: కాదు ఇప్పుడు చెప్పు నీకు నేను మొదట రెండు నారింజపళ్లు, మరి రెండు నారింజ పళ్లు, మళ్లీ రెండు నారింజ పళ్లు ఇచ్చాననుకో. మొత్తం నీ దగ్గర ఎన్ని నారింజపళ్లు ఉయాయి?
సంతోష్: ఆరు!
టీచర్: గుడ్. ఇప్పుడు చెప్పు. నేను నీకు రెండు కుక్కలు, మరి రెండు కుక్కలు, ఇంకా రెండు కుక్కలు ఇచ్చాననుకో. మొత్తం నీ దగ్గర ఎన్ని కుక్కలు ఉంటాయి?
సంతోష్: ఏడు
టీచర్: రెండేసి కుక్కలు మూడు ఒకటిగా కలిపితే ఏడెలా అవుతాయి బాబూ?
సంతోష్: ఇప్పటికే ఇంటి దగ్గర నాకు ఒక కుక్క ఉంది కదా టీచర్!

సూర్యుడు దగ్గర

తండ్రి: మనకు దగ్గరగా సూర్యుడా? ఆస్ట్రేలియానా?
కొడుకు: సూర్యుడు
తండ్రి: అదెలా?
కొడుకు: మనం సూర్యుడిని అన్ని సమయాల్లో చూడగలుగుతున్నాం. కానీ ఆస్ట్రేలియాను మాత్రం చూడలేకపోతున్నాం.



బంగారు పలుకు

అద్భుతాలను సాధించడానికి మూలం ధృఢమైన నమ్మకం

- స్వామి వివేకానంద





రవితేజ సినిమాకు శ్రీకారం

మాస్ మహరాజా రవితేజ కొత్త సినిమా మొదలైంది. సోగ్గాడే చిన్నినాయన, రారండోయ్ వేడుక చూద్దాం ఫేమ్ కల్యాణకృష్ణ ఈ చిత్రానికి దర్శకుడు. ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్ళూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. పేరు నిర్ణయించని ఈ చిత్రం షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో మొదలైంది. నిర్మాత మాట్లాడుతూ తొలి ప్రయత్నంలోనే భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. కుటుంబ ప్రేక్షకులు లక్ష్యంగా కల్యాణ్‌కృష్ణ సినిమాలు తీశారు. మాస్ ఇమేజ్ ఉన్న రవితేజ సినిమా అనగానే అన్ని వర్గాల ప్రేక్షకులకు ఇష్టమే. వీరిద్దరి కలయికలో సినిమా అంటే క్రేజీ కాంబినేషన్‌గా భావిస్తున్నాను. ముకేశ్ ఛాయాగ్రహణ బాధ్యతలు వహిస్తున్నారు. ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం అని అన్నారు.

ముగ్గురు వారసులు.. ఒక సినిమా



రానా



అఖిల్

త్వరలో టాలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన చిత్రం రానుంది. ఓ అగ్ర కథానాయకుడి వారసుడు, ఓ పెద్ద నిర్మాత కొడుకు, పేరున్న దర్శకుడి తనయుడు కలిసి సినిమా చేయబోతున్నారు. అక్కినేని అఖిల్, దగ్గుబాటి రానా, సత్య పినిశెట్టి ముగ్గురు ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అఖిల్‌కిది మూడో చిత్రం కానుంది. రానా నిర్మాణ బాధ్యతలు తీసుకుంటున్నారు. దర్శకుడు రవిరాజా పినిశెట్టి వారసుడు సత్య పినిశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. సత్య పినిశెట్టి గతంలో తన సోదరుడు ఆది పినిశెట్టి కథానాయకుడిగా మలుపు అనే చిత్రాన్ని రూపొందించారు. థ్రిల్లర్ కథతో సాగే ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇటీవలే హలో చిత్రంతో తెరపైకి వచ్చిన అఖిల్...తన మూడో సినిమా సిద్ధం కాబోతున్నారు. తెలుగు, తమిళం, హిందీలో నటుడిగా తీరిక లేకుండా సినిమాలు చేస్తున్న రానా...నిర్మాతగా మారడమే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇక గత రెండు చిత్రాలకు ప్రేమ కథలను ఎంచుకున్న అఖిల్...కొత్త సినిమాలో భిన్నమైన సినిమా చేయబోతున్నట్లు తెలుస్తోంది.

బాధ్యతలు తెలిసిన ప్రేమికులు



రాజ్ తరుణ్

రాజ్ తరుణ్, చిత్ర శుక్ల జంటగా నటిస్తున్న చిత్రం రంగులరాట్నం. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తోంది. ప్రేమ, కుటుంబ విలువల వంటి అంశాల నేపథ్యంలో రంగులరాట్నం చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకురాలు శ్రీరంజని. నిర్మాణాంతర కార్యక్రమాల తుది దశలో ఉన్న ఈ చిత్రం...సంక్రాంతి విడుదలకు సిద్ధమవుతోంది. జనవరి 14న రంగులరాట్నం తెరపైకి రాబోతోంది. ఈ సందర్భంగా కథానాయకుడు రాజ్ తరుణ్ చిత్ర విశేషాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ...ఇదొక స్వచ్ఛమైన ప్రేమ కథ. కుటుంబమంతా చూసేలా ఉంటుంది. రెండు గంటలు నవ్విస్తుంది. సంక్రాంతికి మీ ముందుకొస్తున్నాం. మంచి చిత్రాలు ఎన్ని వచ్చినా పండక్కి చూస్తారు. అన్ని సినిమాలు బాగా ఆడాలి. అందులో మా రంగులరాట్నం ఉండాలని కోరుకుంటున్నా. ఈ చిత్రంలో నేను చేసిన పాత్రకు మంచి పేరొస్తుందని అనుకుంటున్నాను. సాదారణ యువకుడిలా కనిపిస్తాను. ప్రతి విషయంలో జాగ్రత్తగా వ్యవహరించే పాత్ర. నాకు జోడీగా చిత్ర శుక్లా నటించింది. ఆమె పాత్ర బాధ్యతాయుతంగా ఉంటుంది. అల్లరిగా తిరిగే అబ్బాయి...తన బాధ్యతలు తెలుసుకుని జీవితంలో స్థిరపడతాడు. వీళ్ల మధ్య ప్రేమ ఎలా సాగిందన్నది కథాంశం. వినోదంతో పాటు భావోద్వేగాలు ఉంటాయి. సినిమా చూశాను. బాగుంది. ప్రేక్షకులకూ ఇలాంటి అనుభూతినే ఇస్తుందనుకుంటున్నాను. అంతా కొత్తవాళ్లమైనా జాగ్రత్తగా కష్టపడి పనిచేశాం. ఉయ్యాల జంపాల సమయంలో నేను దర్శకత్వ శాఖలో ఉన్నాను. ఇప్పుడు కథానాయకుడిగా ఈ సంస్థలో నటించడం సంతోషంగా ఉంది. అన్నారు.సితార, ప్రియదర్శి ఇతర ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం - శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ - ఎల్ కే విజయ్, ఎడిటింగ్ - శ్రీకర్ ప్రసాద్, ఆర్ట్ - పురుషోత్తం

మెహరీన్ జోడీగా



మెగా కంపౌండ్ కథానాయకుడు వరుణ్‌తేజ్‌తో మెహరిన్ జోడీ కట్టనుంది. ఫిదా సినిమా సూపర్‌హిట్‌తో మంచి ఫామ్‌లో ఉన్న వరుణ్ మరో కొత్త సినిమా కమిటయ్యారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఎఫ్ 2 అనే సినిమా చేస్తున్నాడు. సెట్స్‌పైకి వెళ్ళడానికి ఇంకా సమయం ఉంది. ప్రస్తుతం స్క్రిప్ట్ డెవలప్‌మెంట్ దశలో ఉంది. ఇది మల్టీస్టారర్ సినిమా అని ప్రచారం జరుగుతోంది. వరుణ్‌తో పాటు నటించే మరో హీరో ఎవరనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. వెంకటేష్ నటించే అవకాశం ఉందని మాత్రం తెలిసింది. అధికారికంగా మాత్రం ఇంకా ప్రకటించలేదు. ఇకపోతే ఇందులో హీరోయిన్ మెహరిన్‌ను ఎంపికచేసినట్టు సమాచారం. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఇటీవలే రాజా ది గ్రేట్ సినిమా వచ్చింది. రవితేజ నటించిన ఈ చిత్రంలో మెహరిన్ నాయికగా నటించింది. ఈ చిత్రం కమర్షియల్ విజయం సాధించి దర్శకుడికి మంచి పేరు తెచ్చిపెట్టింది.

తారామణి వస్తోంది



ఆండ్రియా, అంజలి ప్రధాన పాత్రల్లో నటించిన ఓ తమిళ చిత్రం తారామణి పేరుతో తెలుగులో వస్తోంది. డి.వి.సినీ క్రియేషన్స్ పతాకంపై యశ్వంత్ మూవీస్ సమర్పణలో నిర్మించారు. తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రాన్ని డి.వెంకటేష్ తెలుగులో అందిస్తున్నారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి నెలాఖరున ప్రేక్షకుల ముందుకురానుంది. నిర్మాత డి.వెంకటేష్ మాట్లాడుతూ తమిళంలో తారామణి అత్యధిక వసూళ్ళు వసూలు చేసింది. నేటి యువత ప్రవర్తనకు అద్దం పట్టేలా ఈ చిత్ర కథాంశం ఉంది. అందుకే మంచి సందేశం ఉన్న సినిమాగా ఆదరణ పొందింది. తమిళ్ కంటే తెలుగులో ఇంకా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందిఅని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం యువన్ శంకర్‌రాజా, ఛాయాగ్రహణం తేని ఈశ్వర్, కథ, దర్శకత్వం రామ్.

నయనతార కర్తవ్యం



దక్షిణాది భాషా చిత్రాల్లో పాపులర్ నటి నయనతార. ఆమె తమిళ, మళయాలంలో నటించిన పలు చిత్రాలు తెలుగులో అనువాదం అవుతున్నాయి. తాజాగా గోపి నైనర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆరమ్ చిత్రం కర్తవ్యం పేరుతో రిలీజ్ చేస్తున్నారు. పంపిణీదారు ఆర్. రవీంద్రన్, శరత్ మరార్ సంయుక్తంగా ట్రైమండ్ ఆర్ట్స్ పతాకంపై తెలుగులో అందిస్తున్నారు. కర్తవ్యం చిత్రంలో నయనతార జిల్లా కలెక్టర్‌గా నటించింది.

తెలుగు అనువాద పనులు పూర్తయ్యాయి. సెన్సార్ కూడా జరిగింది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తారు. ఈ చిత్రం తమిళంలో నయనతారకు మంచి పేరు తెచ్చిపెట్టడమే కాకుండా సినిమా భారీ విజయాన్ని నమోదు చేసింది.

నిర్మాతల్లో ఒకరైన ఆర్. రవీంద్రన్ మాట్లాడుతూ తమిళనాట సూపర్‌హిట్‌గా నిలిచి, నయనతార కెరీర్‌లోనే పెద్ద విజయం సాధించిన సినిమా ఇది. తెలుగులో కూడా ఆ స్థాయి సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది. పవన్‌కల్యాణ్‌తో గబ్బర్‌సింగ్, సర్దార్ గబ్బర్‌సింగ్ వంటి చిత్రాలు నిర్మంచిన శరత్‌మరార్‌తో ఈ సినిమా చేయడం సంతోషంగా ఉంది అని చెప్పారు. ఈ చిత్రానికి జిబ్రాని సంగీతం అందిస్తున్నారు.

నేనేం మారలేదు


నాయిక ప్రధాన చిత్రాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందంటోంది బాలీవుడ్ నాయిక సోనమ్ కపూర్. ఈ విషయంలో హాలీవుడ్ కంటే మనం ఇరవై ఏళ్ల వెనకున్నాం అని బాధపడుతోంది. మసాలా సినిమాలు మాత్రమే చూసే రోజులు మారతాయనే ఆశాభావం వ్యక్తంచేసింది. సోనమ్ కపూర్ మాట్లాడుతూ....నేను నటించిన నీర్జాకు గొప్ప ఆదరణ దక్కింది. వంద కోట్ల రూపాయల వసూళ్లు దక్కాయి. ఇప్పుడు ప్యాడ్‌మ్యాన్ చిత్రం పట్ల చాలా ఆసక్తి చూపిస్తున్నారు. ఇవన్నీ సాధారణ ఆటపాటల చిత్రాలు భిన్నమైనవి. అయినా ప్రేక్షకులు ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారు. మన ఊహకంటే ప్రేక్షకులు ఇంకా తెలివైన వాళ్లు. ప్రస్తుతం వీర్ దే వెడ్డింగ్ అనే చిత్రంలో నటిస్తున్నాను. ఇది ముగ్గురు అమ్మాయిల మధ్య నడిచే కథ. కరీనా కపూర్ పెళ్లి కూతురి పాత్రలో నటిస్తోంది. మేముగ్గరం మంచి స్నేహితులం కాబట్టి చిత్రీకరణ మొత్తాన్ని ఆస్వాదించాం. పదేళ్ల తర్వాత రణ్‌బీర్ కపూర్‌తో కలిసి సంజయ్ దత్ జీవిత కథలో నటిస్తున్నాను. మేమిద్దరం సావరియా అనే చిత్రంతో అరంగేట్రం చేశాం. ఈ పదేళ్లలో నేనేమీ మారానని అనుకోవట్లేదు. రణ్‌బీర్ నటుడిగా ఎదిగాడు. సావరియాలో తొలిసారి ఎక్కడైతే కలిసి చిత్రీకరణ చేశామో...అదే ప్రదేశంలో కొత్త సినిమా కోసం నటించడం ఆ రోజులను గుర్తు చేస్తోంది. అని చెప్పింది.



సోనమ్ కపూర్

ప్రతిభను ప్రోత్సహిస్తా

వారసులకే అవకాశాలు వస్తున్నాయంటూ బాలీవుడ్‌లో వివాదాస్పద చర్చ జరుగుతోంది. ఇందులో వాస్తవాలు ఉన్నా...కొందరు ఏ అండా లేకుండా ఎదిగామంటూ చెబుతున్నారు. అయితే నేపథ్యం లేని వాళ్లకు అవకాశాలు అంత సులువు కాదన్నది ఒప్పుకోవాల్సిందే. ఇలా ప్రతిభ ఉండీ అవకాశాలు లేని వాళ్ల కోసం చేయూతనిస్తానంటున్నాడు ఖాన్ స్టార్ సల్మాన్ ఖాన్. కొత్త వాళ్ల ప్రతిభను ప్రోత్సహిస్తానని చెబుతున్నాడు. సల్మాన్ గత కొన్ని రోజులుగా ఈ ప్రయత్నం చేస్తున్నారు. ఆరు నెలల కిందట టాలెంట్ మేనేజ్‌మెంట్ సంస్థను ఒకదాన్ని స్థాపిస్తానని చెప్పాడు. ఇప్పటికి సల్మాన్ దీనిపై ఒక అడుగు ముందుకు వేశారు. తన కుటుంబం నుంచి కథానాయకుడిగా అరంగేట్రం చేస్తున్న ఆయూష్ శర్మకు జోడీగా ఓ కొత్త నాయికను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలిచ్చే ప్రక్రియ కొనసాగుతుందని సల్మాన్ ప్రకటించారు. సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ...కొత్త నటీనటులను తీసుకోవడం తప్పనిసరి. ప్రతి రోజూ ఎంతోమంది యువతీ యువకులు చిత్ర పరిశ్రమలో పనిచేయాలని నగరానికి వస్తున్నారు. వాళ్లలో ప్రతిభావంతులకు కూడా అవకాశాలు దొరకడం లేదు. ఒక వేళ ఏదైనా సినిమా దక్కినా...గుర్తింపు రావట్లేదు. ఎలాంటి ప్రలోభాలు లేకుండా అవకాశాలు ఇవ్వాలన్నదే మా ప్రయత్నం. ప్రతిభ గల నటీనటులకు గొప్ప భవిష్యత్ చూపించాలనుకుంటున్నాను.అన్నారు.



సల్మాన్

యుద్ధ నేపథ్యంలో



అక్షయ్ కుమార్

బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ చాలా వేగంగా సినిమాలు పూర్తిచేస్తుంటారు. ఏడాదిలో కనీసం మూడు సినిమాలు ఆయనవి రిలీజ్ అవుతుంటాయి. ఇతర స్టార్స్‌తో పోలిస్తే అక్షయ్‌కి స్పీడ్ ఎక్కువ. ఆయన నటించిన ప్యాడ్‌మ్యాన్ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. తన తదుపరి చిత్రం కేసరి అని కొత్త సంవత్సరం సందర్భంగా సోషల్ మీడియాలో ట్వీట్ చేస్తూ ఫస్ట్‌లుక్ షేర్ చేశారు. కేసరిలో సిక్కుగా ఆయన కనిపించనున్నారు. గతంలో కూడా అక్షయ్ పలు చిత్రాల్లో సింగ్‌గా నటించిన విషయం తెలిసిందే.

కేసరి సినిమా ఫస్ట్‌లుక్‌పై మంచి స్పందనలు వస్తున్నాయి. నిర్మాత కరణ్ జోహార్ సైతం అభినందించారు. బ్రిటీష్, ఇండియన్ బృందాలకు, అఫ్గనిస్తాన్ బృందాలకు మధ్య జరిగిన యుద్ధ నేపథ్యంలో కేసరి చిత్ర కథ సాగుతుందని తెలిసింది. వచ్చే ఏడాది హోలికి రిలీజ్ చేస్తారు. ఈ చిత్రానికి అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు.